తంజావూరు సరస్వతీ మహల్ ప్రచురణము - 23

ద్విపదభాగవతము.

మడికి సింగనార్య విరచిత

ద్విపద కావ్యము.

పరిష్కర్త
శ్రీ వాసిష్ఠ అ. మహాదేవశాస్త్రి
పండితుఁడు, సరస్వతీమహాల్ గ్రంథాలయము తంజావూరు.

తంజావూరు సరస్వతీమహాల్ గ్రంథాలయ నిర్వాహక సంఘము తరపున
గౌరవ కార్యదర్శి
శ్రీ S. గోపాలన్, B.A.,B.L, గారిచే
ప్రచురింపఁబడినది.

మూల్యము) 1950 (రూ 3-0-0

Printed at
THE NATIONAL ART PRESS
91, Mount Road, Madras-18

PREFACE

This publication contains the earliest Telugu version available of SRI BHAGAVATA 10th Skanda, dealing with Sri KRISHNA'S life in MADHURA and in DWARAKA. The author Madiki Singanaraya lived in the early part of the fifteenth century. He was therefore an elder contemporary of POTHANNA the celebrated author of ANDHRA BHAGAVATAMU.

The present work which is in Dvipada is anterior to POTHANNA'S work. The merits of the Author's poetry can be gathered from the fact that his verses are cited as models in standard works on Grammar and Rhetoric. The author has also written three other works in Telugu namely :—

1. VASISHTA RAMAYANA
   The well known philosophical work,
2. PADMA PURANA
   and
3. SAKALA NITI SAMMATAMU
   a work in politics,

The present work has three Kandas in it:—(1) Madura Kanda (2) Kalyana Kanda and (3) Jagadhabiraksha Kanda. The Kandas dealing with the Balaleela in the beginning and the Bhaktanugraha in the end are missing.

The portion that is now published is complete so far as it goes and has been selected for its value as a high class Dvipada Kavya of the early classical age in Telugu literature. For a fuller account ot the Author and the diverse merits of the work the reader is referred to the Telugu introduction of the learned Editor who has spared no pains in editing this work.

Our thanks are due to him for his valuable services.

Our grateful thanks are due to the Government of Madras for the liberal grants which have enabled us to publish this and other valuable manuscripts of this Library.

Saraswathi Mahal,
Tanjore.
15—1—1951.

S. Gopalan,
Honorary Secretary
T.M.S.S.M. Library Committee.

శ్రీ

రమణమహర్షయే నమః

ఉపోద్ఘాతము.

—: గ్రంథకర్త - మడికి సింగనార్యుఁడు :—

శ్రీపతియొక్క యెనిమిదియవ యవతారమగు శ్రీకృష్ణ భగవానుని చరిత్రగలది భాగవతమందు దశమస్కంధము. భాగవతమహాగ్రంథమును తెనుఁగు భాషలో విలసిల్లఁజేసిన మహాకవి బమ్మెరపోతరాజు. ఈ బమ్మెరపోతనార్యుఁడు హూణశకము 1400 మొదలు 1470ల ప్రాంతమందుండినట్లు, ఆంధ్ర కవుల చరిత్రలో శ్రీ కందుకూరి వీరేశలింగము పంతులుగారు చర్చించియున్నారు. వాసిష్ఠరామాయణ, పద్మపురాణ, భాగవతదశమస్కంధముల కర్తయగు మడికి సింగనార్యుఁడు హూణశకము 1430వ ప్రాంతము వఱకునైనను జీవించి యుండవలయునని వారు నిర్ధరించిరి. పోతనార్యుని భోగినీదండకము తన 25వ వత్సరమున అనగా 1425వ సంవత్సరమున విరచించినట్లు తెలియుచున్నది. మడికి సింగనార్యుఁడు పద్మపురాణమును తెనిఁగించి ముగించిన వత్సరము దాని కృత్యంత పద్యమువలన స్పష్టమగుచున్నది.

మంగళమహాశ్రీ :—

"ఆకరయుగానల మృగాంకశకవత్సరములై పరఁగుశార్వరిని
బుణ్య
ప్రాకటితమార్గశిర పంచమిని బొల్చు నదుపాలసుతవాసరము
నందున్
శ్రీకరముగా మడికి సింగన తెనుంగున రచించెఁ దగఁ బద్మ
పురాణం
బాకమల మిత్ర శశిరాంశువుగఁ గందసచివాగ్రణికిన్ మంగళ
మహాశ్రీ,"

(కర=2 యుగ=4 అనల=3 మృగాంక=1 అంకానాం వామతో గతిః. కాబట్టి శాలివాహన శకము 1342. హూణశకము 1420 శార్వరి సంవత్సరమున మార్గశీర్ష శుద్ధ పంచమీ బుధ వారమునాఁడు పద్మపురాణము ముగింపఁ బడెను.)

దీనిని బట్టి పర్యాలోచించి చూచిన మడికి సింగనార్యుఁడు ప్రౌఢావస్థయందున్న సమయమందు పోతనార్యుని భోగినీదండకము పుట్టినదని నిర్ణయించుటకు వీలున్నది. అప్పటి కింకను పోతనార్యుఁడు భాగవతమును దెనిఁగించుటకుఁ బూనుకొని యుండలేదు.

"వాసిష్ఠ రామాయణము పద్మపురాణమునకుఁ దరువాత రచియింపఁ బడిన దగుటచే నది 1420కిఁ దరువాతఁ జేయఁబడినది. ఈ రెండు కావ్యములకు నడుమ సింగన్న భాగవత దశమ స్కంధమునుఁ గూడఁ దెనిఁగించి కందనామాత్యునకే యంకిత మొనరించెను. సింగన కృత భాగవత దశమ స్కంధము నాకు లభింప లేదు. అటుతరువాత నీకవి సకలనీతిసమ్మతమను నీతి గ్రంథమును సమకూర్చెనని రామకృష్ణ కవిగారు చెప్పుచున్నారు

వీనినన్నిటిని విచారించి చూడఁగా మడికి సింగన్న 1430వ సంవత్సరము వఱకైనను జీవించి యుండును. [ఆంధ్ర॥ కవు॥ చరి॥ ప్ర॥ భా॥ 378 పుట]

మడికి సింగనార్యుఁడు 1420కిఁ బూర్వమే భాగవత దశమ స్కంధమును రచించినట్లు తెలియుచున్నది. కాఁబట్టి పోతనామాత్యుని భాగవతమునకు ముందుగా రచింపఁ బడినది మడికి సింగనార్యుని భాగవత దశమస్కంధ మనుటలో సందేహముండదు.

సింగన్న నియోగి బ్రాహ్మణుఁడు భారద్వాజ గోత్రుఁడు. అయ్యల మంత్రివరునకును సింగాంబికకును జన్మించినవాఁడు. సింగన్నకృతమగు వాసిష్ఠ రామాయణములోని యీ క్రింది పద్యములను గమనింపుడు.

సీ॥ "అతఁడు తిక్కనసోమయాజుల పుత్త్రుఁడై
 కొమరారు గుంటూరి కొమ్మవిభుని
పుత్త్రి చిట్టాంబిక బుధలోక కల్పక
 వల్లి వివాహమై వైభవమున
భూసారమగు కోటభూమిఁ గృష్ణానది
 దక్షిణ తటమున ధన్యలీల
నలరు రావెల యను నగ్రహారము తన
 కేళ భోగంబుగా నేలుచుండి

యందుఁ గోవెల గట్టి గోవిందు నెన్న
గోపినాథుఁ బ్రతిష్ఠయుఁ గోరి చేసి
యఖిల విభవములందును నతిశయిల్లె
మనుజమందారుఁ డల్లాడ మంత్రివిభుఁడు.

క॥ "అయ్యవతీరమణులకును
నయ్యల మంత్రీంద్రుఁ డుదితుఁడై ధారుణిలో
నెయ్యెడ నర్థార్థులు మా
యయ్య యని పొగడఁగ నెగడె సౌదార్యమునన్.

సీ॥ ఆత్రేయ గోత్రపవిత్ర పేరయమంత్రి
పుత్రి సింగాంబికఁ బుణ్యసాధ్వి
వెలయ వివాహమై వేఁగి దేశంబులో
నేపారు రాజమహేంద్ర పురికి
నధిపతి తొయ్యేటి యనపోత భూపాలు
మంత్రియై రాజ్యసంపదఁ బొదలి
యొప్పారు గౌతమి యుత్తర తటమున
మహనీయమగు పెద్దమడికి యందు
స్థిరతరారామతతులు సుక్షేత్రములును
నెక్కు లార్జించి సితకీర్తి నెంపు మిగిలి
యఖిలజగదన్నదాతనా నవనిఁ బరఁగె
మధురగుణధుర్యుఁ డయ్యలమంత్రివరుఁడు.

చ॥ ఒనరఁగఁ దద్వధూవరులహోబల దేవునిఁ గొల్చి తద్వరం
బున నొగి సింగనార్యుని నమోఘ గుణాఢ్యు ననంతుని స్మహీ
జనసుతు నబ్బయాంకు బుధసన్నుతి పాత్రుని నారయాహ్వయున్
గని నరసింహనామములు గారవ మారఁగఁ బెట్టిరండఱున్.

క॥ వారలలో నగ్రజుఁడను
వారిజదళనయనచరణవారిజసేవా

సారమతి నతులవాక్య
శ్రీరచనాచతురమతిని సింగ ..హ్వాయుఁడన్.

పై పద్యముల వలన నీకవి తిక్కనసోమయాజుల మనుమరాలి మనుమఁడనియు, గోదావరి మండలములోని పెద్దమడికి నివాసుఁడనియు, స్పష్టమగుచున్నది. ఈ విధముగాఁ దర్కించి చూచి నప్పుడు మడికి సింగనార్యుఁడు 15వ శతాబ్దపు కవియని నిర్ణయించుటలో సందేహమునకుఁ దావు లేదు.

ప్రస్తుత పరిష్కరణమైన భాగవత దశమస్కంధము మడికి సింగనార్యుని కృతమా కాదా యనునది చర్చింప వలసియున్నది. అనేక ప్రబల నిదర్శనములపై నేను ద్విపద బద్ధమైన యీ భాగవత దశమ స్కంధము మడికి సింగనార్య కృతమను నిశ్చితాభిప్రాయమునకు వచ్చితిని. కాండాంతద్విపదలను గమనింపుడు.

ద్విపద. “ అని యిట్లు నయనిర్జరామాత్యుపేర
ధన ధాన్య మణిమయ దానాఢ్యు పేర
భూభరణక్షమ భుజసారుపేర
నాభళ మంత్రి కందామాత్యు పేరఁ
గోరి భరద్వాజ గోత్ర సంజాతుఁ
డారూఢ మతి . య్యలార్యనందనుఁడు
శృంగార రసకళా శ్రితివచోధనుఁడు
సింగయామాత్యుఁడు చెలువగ్గలింప
సలలితరసభావ శబ్దగుంభనల
మహనీయమగు దశమస్కంధ సరణి
విహితలీలలనొప్పు విష్ణుచరిత్ర

పాత్రికటంబగు మధురాకాండమనిన
నాకల్ప మాకల్పమగు భంగిఁజెప్పె."

భరద్వాజగోత్రసంజాతుఁడును, ఆరూఢమతి యయ్యలార్య నందనుఁడును నగు సింగయామాత్యుఁడు ఔబళమంత్రి కందామాత్యున కంకితముగా శ్రీభాగవతదశమస్కంధమును రచించినట్లు స్పష్టము: మఱికి సింగనామాత్యుఁడు రచించిన వాసిష్ఠరామాయణము యొక్క ప్రారంభమున నొక వచన భాగమును దిలకింపుడు.

"అని సకలజన సమ్మతంబుగా నుపక్రమించి భాగవత దశమస్కంధంబును దెనుంగున రచియించి యిచ్చి, అప్పణ్యపురాణంబులకుఁ గృతిపతిగా నేపుణ్యునిఁ బ్రార్థింతునోయని విచారించి, గజగంధవారణగంధ గోవాళ చలమర్తి గండగండరాయ గజశేఖరదొంతి మన్యవిభాళాది నానా బిరుదవిఖ్యాతులఁ బ్రసిద్ధుండగు రామగిరి పట్టణాధీశ్వరుండైన కుమారముప్ప భూపాలు మాన్యమంత్రి పదదురంధరుండగు నమ్మహారాజు దిగంతవ్యావృత కీర్తిలతాలవాలుండును, ధర్మచారిత్రుండును, నీతిచాతుర్య విశేషగుణగణాలంకారుండును, అనవరతదాన శీలుండును, అఖిల దిక్పరీత విశాలుండును, వారణ వంశాబ్ధిసుధాకర కాశ్యప గోత్ర పవిత్ర అబ్బనాచార్య తనూభవ కందనామాత్యుండు నాకు నతిస్నేహ బాంధవుండును నభీష్ట ఫలప్రదుండును నపూర్వ వచనరచనానుబంధబంధుర కావ్య రసాభిజ్ఞుండును, అర్థిజన పారిజాతంబును గావున నమ్మంత్రి యుగంధరుం గృతిపతింగావించి, వెండియు కవిత్వతత్త్వ రచనా కౌతుకంబున

జిత్తంబు జొత్తిల్ల నొక్కకృతిఁ జెప్పంబూనితి............"

రాచగిరి పట్టణాధీశ్వరుఁడగు కుమార ముప్పభూపాలుని మాన్య మంత్రియైన కందామాత్యునకుఁ గవి భాగవత దశమస్కంధమును దెనిఁగించి యంకితమొనర్చినట్లు ఈ వచన భాగమునుండి స్పష్టమగుచున్నది. ప్రస్తుత పరిష్కరణము యొక్క కాండాంత పద్యములందు కననగు కృతికర్త కృతిభర్తల నామగోత్రాది వివరములును, వాసిష్ఠరామాయణ పద్మపురాణములయొక్క కృతికర్త కృతిభర్తల నామగోత్రాది వివరములును నచ్చొత్తినట్లు సరిపోయి యున్నందున భాగవతదశమస్కంధము (ప్రతస్తుపరిష్కరణము) మడికి సింగనార్య కృతమనుటలో సందేహముండదు. తెనుఁగు జాతీయతను బోషించు శైలిని బట్టి చూచినప్పుడును భాగవత దశమస్కంధము, వాసిష్ఠ రామాయణము, పద్మపురాణము ఈ మూఁడును నేకకవికృతములను సత్యము నుద్ఘాటించుచున్నవి.

వాసిష్ఠరామాయణ పద్మపురాణములను బద్యకావ్యములుగా రచించిన మడికి సింగన్న భాగవత దశమస్కంధమును మాత్రమేల ద్విపదకావ్యముగా విరచించెను? శ్రీకృష్ణభగవానుని లీలలను వీనుల విందుగాఁ బండిత పామరులందఱును, ఆబాలగోపాలము పాడుకొని యానందించుటకు వీలగునట్లు సరళమైన జాతీయగీతమగు ద్విపదలలో నిమడ్చి రచియించుట మంచిదని యుచితజ్ఞుఁడగు కవి తలంచి యట్లొనరించెనని తలంచెదను. అదియునుగాక క్రీ.శ.1240వ ప్రాంతమున రచింపఁబడిన రంగనాథరామాయణముయొక్క సకల జనాదరణమును విచారించి కవి తాను కూడ నట్టి కావ్యమును రచింప నుత్సహించి భాగవత దశమస్కంధమును ద్విపదబద్ధముగావించెనేమో!

—: కృతిభర్త - కందామాత్యుఁడు :—

మడికి సింగనార్యుఁడు భాగవతదశమస్కంధమును, పద్మ పురాణమును దెనిఁగించి ఔబళ కందామాత్యునకుఁ గృతిగా నిచ్చి యున్నాఁడు. పద్మపురాణమందుఁ గృతిపతిని వర్ణించు పద్యము లీక్రింది విధముగానున్నవి.

సీ॥ స్వామి భక్తుఁడు కార్యచతురుఁడు బహుకళా
వేది నీతిజ్ఞుఁడు విప్రహితుఁడు
సరస సల్లాపుఁడు సప్తాంగరక్షణ
క్షముఁడు భావజ్ఞుఁడు సర్వజనులకుఁ
దరి మంత్రభేదన పరుఁడు ధర్మాత్ముఁడు
సుందరాకారుండు సుజనవినుతుఁ
డురుదయా పరుఁడు నిత్యోత్సవా సక్తుండు
సద్గుణాధారుండు సౌమ్యమూర్తి

సతత గురుదేవతా పరిచారరతుఁడు
గుణసముద్రుండు కాశ్యప గోత్రజనితుఁ
డనఁగ నుతికెక్కె పెంపున నతిశయిల్లు
మదన సదృశుండు కందన మంత్రివరుఁడు.

సీ॥ ఈ ధర్మచారిత్రనేధాత్రిపతి యేలు
నాధాత్రిపతి యేలు నఖిల జగము
నీకామినీకాము నేకామినులు చూతు
రాకామినులు చూడ రన్యపురుషు
నీయర్కసుతతుల్యు నేయర్థి గొనియాడు
నాయర్థి యొరు వేఁడ నాస సేయఁ

ఢీమంత్రి కులచంద్రు నేమంత్రి పురణించు
నామంత్రి విముఖామాత్యుఁడఖిలమునకు
ననఁ బ్రగల్భరూపఘనదాననయమార్గ
ముల నుతింప నొప్పు ముజ్జగములఁ
తారహారహీరధవళాంశుసమకీర్తి
కలితుఁ డౌబళ కందవిభుఁడు.

కందన మంత్రికిఁ దాతకుఁ దాతయైన గన్నయ మంత్రి కాకతీయ గణపతి దేవుని కాలములో నుండినట్లు పద్మపురాణములోని యీ క్రింది పద్యము చెప్పుచున్నది.

చ॥ "పరువడిఁ గాకతీయ గణపక్షితినాయకు నొద్ద మాన్యుఁడై
ధరణిఁ బ్రశస్తుఁడై నెగడి దానములెల్లను జేసి భక్తి పెం
పిరవుగ గుళ్ళు గట్టి గణపేశ్వర దేవుని గోపికాధిపున్
దిరముగుచున్న లక్ష్మిని బ్రతిష్ఠలు చేసెఁ బ్రభుత్వమేర్ప
డన్."

కృతిపతి కందామాత్యుని వంశవృక్షము నిచ్చుచున్నాను.

గన్నయమంత్రి
|
మల్లన
|
గణపతి
|
అప్పయామాత్యుఁడు (ద్వితీయ పుత్రుఁడు)
|
కందనమంత్రి
(మూఁడవ కుమారుఁడు కృతిభర్త)

కాకతీయ గణపతిరాజు క్రీ.శ.1200 మొదలు 1260 వఱకును రాజ్య పరిపాలన జేసెను. దీనినిఁ బట్టి శ్రీ వీరేశలింగము పంతులుగారు తరమునకు నలుబదేసి సంవత్సరముల చొప్పున నేర్పఱచి కందన మంత్రికాలమును 1420గా లెక్క వేసిరి. 1420వ సంవత్సరమునఁ బద్మపురాణమును గందనమంత్రి కృతినందుట దీనికి సరిపోయినది.

మడికి సింగనార్యుఁడు తాను మొదట రచించిన పద్మపురాణ భాగవతదశమ స్కంధములను నరాంకితము చేసెను. కాలక్రమమున నతని చిత్తవృత్తి దైవపరాధీనమగుట బట్టి కాఁబోలును దన మూఁడవ కృతియగు వాసిష్ఠరామాయణమును అహోబలస్వామి కంకితమొనర్చెను. తనకు ముందుండిన నన్నయాది యాదిమ కవీశ్వరుల యాచారము ననుసరించి కృత్యాదిని గీర్వాణభాషాబద్ధమగు శ్లోకమును వేసుకొనెను. వాసిష్ఠరామాయణము యొక్క ఆదిమ శ్లోకమును జూడుడు.

"శ్రీమద్దివ్యమునీంద్రచిత్తనిలయం సీతామనోనాయకం
వల్మీకోద్భవ వాక్పయోధిశశినం స్మేరాననం చిన్మయం
నిత్యం నీరదనీలకాయ మమలం నిర్వాణ సంధాయినం
శాంతం నిత్యమనామయం శివకరం శ్రీరామచంద్రంభజే."

ఇవి గాక మడికి సింగనార్యుఁడు "సకలనీతిసమ్మత" మను నీతిశాస్త్రమును రచియించెను. సకలనీతిసమ్మతమును శ్రీమానవల్లి రామకృష్ణకవిగారు ప్రచురించినట్లు తెలియుచున్నది. దీనిలోనికొన్ని పద్యములను కీర్తిశేషులైన శ్రీవేటూరి ప్రభాకర శాస్త్రిగారు, ఈగ్రంథాలయపు తరపున మద్రాసు ప్రభుత్వసహాయముచేఁ బ్రచురింపఁబడిన "ఆంధ్రశాసమందుకము" యొక్క పీఠికలో నుదహరించి యున్నారు.

ఈ విధముగా సంస్కృతాంధ్రములందసాధారణ పాండిత్యము కలవాఁడును, నీతి వేదాంతశాస్త్రములందభిరుచి కలవాఁడును, మహాకవియునగు మడికి సింగనార్యుని ప్రభావంతమైన అమృతవాహినియగు లేఖిని పండిత పామర రంజకమగు ద్విపదలచే భక్తజనమందారమగు భాగవత దశమస్కంధమును రచించి, ఆంధ్ర సారస్వతమునకు మహత్తరమగు సేవ యొనరించినది !

—: పరిష్కరణ — కథాభాగము :—

తంజావూరు సరస్వతీమహల్ లైబ్రరి నం 150 తాళపత్రప్రతి, ఈ పరిష్కరణకు మాతృకయై యున్నది. ఇట్టి ప్రతిగాని, ఇతోధికప్రతిగాని వేఱె యెచ్చటను లేనందున నేను గావించిన సంస్కరణము పూర్తిగా నీతాళపత్ర ప్రతిపైననే యాధారపడి యున్నది. దీనియందు 180 తాళపత్రములున్నవి. వ్రాత సుమారుగా నున్నను, తప్పులు విశేషములుగా దొర్లియున్నవి. అక్రూరుఁడు శ్రీకృష్ణభగవానుని స్తుతించు ఘట్టమునుండి యారంభమగుచున్నది. మొదటి నాలుగు పత్రములు కీట దష్టములు: అక్షరముల యాకారము బొత్తిగానశించియున్నది.

కవి భాగవత దశమస్కంధము యొక్క పూర్వోత్తర భాగములను కాండ సంజ్ఞలతో విభజించుకొని యున్నాఁడు. దశమస్కంధపూర్వభాగము కంసుఁడు తన చెల్లెలు దేవకిని వసుదేవునితోఁ గలిపి రథారూఢులఁజేసి మంగళతూర్యనినాదవైభవములతో భర్తృగృహమునకుఁ దానే సారథియై రథమును నడుపుటతో నారంభించుచున్నది. తరువాతి కథయగు నాకాశవాణి కథనము, శ్రీకృష్ణావతార ఘట్టము, నందగోపుని యింట శ్రీకృష్ణుని

బాల్యము, పూతనాదిరాక్షసమథనము మొదలగు వాని నన్నిటిని నొక కాండములో కవి రచించి యుండునని నాయూహ. ఆ కాండము దురదృష్టవశముచే ఖిలమైపోయి యుండునని తలంచెదను. ప్రస్తుత పరిష్కరణ ప్రతి రెండవకాండమగు మధురాకాండముతో ప్రారంభమగుచున్నది. ఇది జరాసంధుని రెండవమారు దండ యాత్ర కథతో నంతమొందుచున్నది. ఈ కాండము యొక్క మొదటిభాగము కొంతలుప్తమై పోయినది.

కల్యాణ జగదభిరక్షకాండములలో నుత్తరభాగ కథలు చెప్పఁ బడినవి. శ్రీకృష్ణుని వివాహములు, ఈ కాండలయందు వర్ణింపఁ బడినవి. జగదభిరక్షకాండము శిశుపాల వధతో నిలిచిపోయినది. ఇఁక నుత్తర భాగకథలగు సాల్వమథనము, దంతవక్త్రసంహారము, కుచేలోపాఖ్యానము, సుభద్రా పరిణయము మొదలగునవి వివరిం చుచు మఱియొక కాండమును గూడ కవి రచియించియే యున్నాఁడని నాదృఢాభిప్రాయము. దుర్భాగ్యవశముచే నదియు మనకులభింపలేదు. "అని సకలజన సమ్మతంబుగా నుపక్రమించి భాగవత దశమ స్కంధంబును దెనుఁగున రచియించి యిచ్చి......అని వాసిష్ఠ రామాయణములో వ్రాసి, యుద్ఘాటించిన మడికి సింగనార్యుఁడు కొంతభాగమునే వ్రాసినాఁడని చెప్పుట యుక్తమగునా!

కొన్నిచోట్ల గ్రంథాంతరమందు ద్విపదలలో నేకపాదము లున్నవి. ఇవి గ్రంథపాతములేమో యని మొదట నేను శంకించితిని. కాని పరిశీలించి చూచినప్పుడు అన్వయము చెడకుండ కథాభాగము నడుచుచున్నందున నా యేకపాద ద్విపదలనట్లే పూర్తి ద్విపదల క్రిందనే లెక్కించి వేసితిని. ఇట్టి లుప్తపాదములు కల శ్లోక భాగ ములు పూర్వగ్రంథములలోఁ బెక్కులుండుట సహజమే.

విజ్ఞాననిధియగు మహాకవి సింగనార్యుని విరచితమైన దీనిని పరిష్కరించుటలో నాయల్పీయమగు బుద్ధిని సాధ్యమైనంతవఱకు నరికట్టి మిక్కిలి శ్రద్ధగానే యుపయోగించితిని. యుక్తికందు బాటులో నున్నట్టి కొన్నిలుప్తభాగములను బూరించి కుండలీ కరణముగావించి పాఠకులకుఁ జూపి యున్నాను. వ్రాయసకాని ప్రమాదముచే నేర్పడిన గణభంగములను సవరించితిని. ఈ సవరణ కవిహృదయమునకు భంగముండదని విమర్శన జ్ఞానముతోనే చేయఁ బడినదని మనవి చేసుకొనుచున్నాను. అన్వయము సరిగా కాని కొన్ని ద్విపదభాగములను సరిదిద్దిన పూర్తిగా క్రొత్తరూపము సిద్ధించునని తోచిన చోట్ల యథా మాతృకముగానే విడిచి వేసితిని.

బురదలో మాణిక్యమువలె, గుణగ్రాహకుల దృష్టికి మఱుఁగుపడి, ఈ ద్విపదకావ్యము సరస్వతీమహాల్ లైబ్రరి అల మారలలోఁ బడియుండినది. దాని యునికిని, శ్రేష్ఠతను నాకెఱుక పఱచినవారు మన్మిత్రులును, బహుగ్రంథ దర్శులును, విద్యా నిధులును నగు బ్రహ్మశ్రీ నిడదవోలు వెంకటరావుగారు M. A. (Head of the Telugu Department Madras University) వారికి నా మనఃపూర్వకమైన కృతజ్ఞతాభివందనము లర్పించు కొనుచున్నాఁడను.

—: రచన :—

శ్రీమద్భాగవతములో రసవంతమైనభాగము దశమస్కంధము. దీనిని సంగ్రహించి తెనుఁగు చేయుటలో మడికి సింగనార్యుఁడు కవితాశక్తితో పాటు విషయములను బెంచియో, క్లుప్తపఱచియో ఘట్టములను బ్రతిపాదించుటలోఁ దన విమర్శనా జ్ఞానమును జూపి యున్నాఁడు.

తెనుఁగు సారస్వతరథ మొక్కొక్క శతాబ్దము. నం దొక్కొక్క పోకడను గల్గి సాగినది. నన్నయాదుల కాలము ప్రాయికముగా సంస్కృతములోని పురాణేతి హాసములను దెనుంగు భాషలో ప్రచారమునకుఁ దీసుకొని వచ్చునదిగానుండెను. పెద్దనా దుల కాలమందు దెనుఁగు సారస్వతముయొక్క పోకడ మారినది. ఒక చిన్న కథా వస్తువును దీసుకొని పెంచి పన్నెలు చిన్నెలు దిద్ది స్వతంత్రముగాఁ బ్రబంధ రచన యాకాలమందు సాగినది. తరువాతికాలపు కవులు రెండువిధములైన పోకడలను ననుసరించుట లోనే నిమగ్నులై యుండిరి. ప్రతిభావంతులగు మహాకవులందఱును భాషాంతరీకరణము నందును, శృంగారాది వర్ణనలయందును నిమగ్నులై తమ యమూల్యమైన భాషాజ్ఞానమును గవితాశక్తిని చెక్కడపు పనులతో నగిషీకూర్చిన చక్కని పెట్టెలలో నిమడ్చి బంధించిరేకాని స్వేచ్ఛగా నడుచుటకవకాశమిచ్చినవారు కారైరి! వారు తమతమ నాయకానాయికల వర్ణనలయందు చాతుర్యమును జూపుటలోఁ గన్పఱచిన కవితా శక్తిని ఆయాయాకాలములందుం డిన దేశీయ జీవన ప్రతిపాదకములగు విషయములందుఁ గన్పఱచి యుండినచో నాంధ్రభాషాయోష సర్వాంగ సుందరియై యుండును గదా! ఈ విషయములో నన్నయాదుల భాషాయుగమే కొంత మెఱుఁగని నాస్వాభిప్రాయము. ఏలనన భారతభాషాంతరీకరణము తెనుఁగు జాతీయ కవిత్వమును బోషించుటయే గాక మానవ జీవిత మున కావశ్యకములగు యనేక యుపాఖ్యానములతోఁ జదువుచున్న కొలఁది చదువ వలయునని యాశక్తిని గల్గించునదిగానున్నది.

మడికి సింగనార్యుఁడు నన్నయాదులయొక్క పోకడ ప్రధాన ముగాఁ గల్గినకవిసత్తముఁడు. ఇతఁడు నన్నయ తిక్కనలఁ దక్క నెవరిని స్తుతి యొనరించినవాఁడు కాఁడు.

గీ॥ వ్యాసవాల్మీకశుకకాళిదాసబాణ
హర్షణాదుల నాఢ్యుల నాత్మనిలిపి
సకలభాషారసజ్ఞుల సముల నన్న
పార్య తిక్కన కవీంద్రుల నభినుతింతు.

(వాసిష్ఠ రామాయణము)

తెనుఁగు జాతీయ కవిత్వమును బాగుగాఁ బోషించి, దీర్ఘములగు సంస్కృత సమాసములను దొర్లించి విసువుఁ బుట్టించక భాగవత దశమస్కంధ రచన యింపుఁ గల్గించునదై యున్నదన్నచో సత్య దూరము కాదు. కవి స్వాభిమానము కలవాఁడు. తన శక్తిని బాగుగాఁ గుర్తెఱిఁగిన వాఁడు.

క॥ అపరమేశ్వర మకుట
వ్యాపిత గంగాప్రవాహ కవితా స
ల్లాపుఁడగు మడికి సింగనఁ
జేపట్టక కీర్తిగలదె శ్రీమంతునకున్.

(పద్మపురాణము)

కవి గొప్ప భక్తుఁడు. వేదాంత శాస్త్రమందభిరుచి కలవాఁడు. కాఁబట్టి సాక్షాత్ లక్ష్మీదేవి యవతారమగు రుక్మిణిని వర్ణించు సందర్భమునందు స్తోత్రసాహిత్య ఫక్కిని పాదాదికేశాంత వర్ణన జేసి యున్నాఁడు

ద్వి॥ "ఉచ్చిత పండ్లతో నుల్లసంబాడు
నచ్ఛపలాక్షికి నంగుష్ఠచయము ;
పదనఖద్యుతుల నుపచరించు నెలవుఁ
గదియ మౌక్తికములుఁ గట్టి నట్లుండు ;

తనరు గచ్ఛప నిధిద్వయ మింతి పాద
వనజాతముల మీఁద వా ్రిలెనో యనఁగ;
గమనజాడ్యము శుభాకరమును నగుచుఁ
గమనీయలీల మీఁగాళ్లొప్పు సతికి;
పగడంపుఁ దీగల పంక్తులో యనఁగ
మగువకు నొప్పారు మడిమల తీరు;
..............................."

(ద్వి॥ భా॥ పుట 72)

విష్ణు శక్తియగు రుక్మిణీదేవి వర్ణనము శ్రీకృష్ణుని వద్దకు దూతగా వెళ్ళిన బ్రాహ్మణుని నోట నుండి వచ్చునప్పుడుచితజ్ఞుఁడగు కవి చూపిన మర్యాదను, బ్రాహ్మణుఁడు రుక్మిణీదేవి యొక్క యభిప్రాయమును రసికాగ్రేశరుఁడగు శ్రీకృష్ణుని యెదుట ప్రతిపాదించిన నేర్పును గమనింపుడు.

ద్వి॥ "అనఘాత్మ! భీష్మకుండను విదర్భేశు
తనయ రుక్మిణియను ధవళాయతాక్షి
తనుమధ్య యుత్ఫుల్ల తామరసాక్షి
గరుడ కిన్నర యక్షగంధర్వసతులు
దొరయలేరా యింతితో నీదుఁబోల్ప;
దేవర సౌభాగ్య దివ్యవర్తనలు
వావిరి జనులెల్ల వర్ణింపుచుండ
విని పుష్పధన్వుని విషమబాణములు
యనవొందఁ దనువున నట నాటుటయును
చిత్తంబులో నీదు చెలువైన మూర్తి
చిత్తరు వొత్తిన చెలువంబుఁదోఁపఁ
జింతించు వెఱఁగందు చేష్టలు మఱచు

సంతతకంతకు నిన్ను నభిమతి సేయు
విరహాగ్ని శిఖఁ గ్రాఁగు వెలవెల నగుచు
మరులెత్తినట్లు పల్మరు చిన్నఁబోవు
నీభంగి నున్న యీ యిభరాజగమనఁ
బ్రాభవంబునఁ జైద్యపతి పెండ్లియాడ
నెల్లుండి చనుదెంచు టెఱిఁగి యీయింతి
యెల్ల విధంబుల నిది నీకుఁ జెప్పి
పుత్తెర వచ్చితిఁ బుండరీకాక్ష!
చిత్తంబులో నొండు చింతింప నేల
ఆభామ నిజభార్యయై యుండునట్టి
సౌభాగ్య మెవరికి సమకూరు! నీవు
నారుక్మిణిబ్బంగి నాసలు సేయు
కారుణ్యమూర్తివి కమలాక్ష! నిన్నుఁ
గదసి నీదరహాస కౌముదిఁ గ్రోల
ముదిత నేత్ర చకోరములు చేరఁగోరు
నలవడి నీప్రియాణాంబువులోవఁ
గలకంఠి చాతకి కడువేడ్క సేయు
నీవెటులైన నను నేచిన వేడ్క
నావెలందుక నేలుటది నీకు నొప్పు;
నిను నమ్మియుండిన నెలఁతుక నొకఁడు
కొనిపోవగాఁ జూడఁగూడునే నీకు?"

మొదట శ్రీరుక్మిణి యొక్క నామ వంశాదికమును జెప్పి యాదవాన్వయవంశమణియగు శ్రీకృష్ణుని వరించుటకుఁ దగిన యోగ్యతను నిరూపించెను. తరువాత దక్షిణనాయకుఁడైన శ్రీకృష్ణుని చిత్తము నాకర్షించుటకై యువజనాకర్షకములైన తను

మధ్యత్వము, యుత్ఫుల్ల తామరసాక్షులు, 'దేవకన్యలతో గూడ నీడుఁ బోల్పగారాని లావణ్యము మృదువుగాను క్లుప్తముగాను నాటు నట్లు వ్రాసిచ్చెను. పిమ్మట సమస్తగుణగణములతో విరాజిల్లు శ్రీకృష్ణునియందు ఆమెకున్న మోహపాశమును వివరించెను. శ్రీకృష్ణుని విరోధి యామెను బెండ్లాడ నిశ్చయమైనందున దన రాకకు ముఖ్యకారణమని నొక్కి చెప్పెను. కొసకు "ఆభామ నిజభార్యయై యుండునట్టి సౌభాగ్య మెవరికి సమకూరు"? అని ప్రశ్నించి శ్రీకృష్ణుని యుత్సాహమును రేకెత్తించెను. చూచితిరా కవి చాతుర్యము! చాతుర్యముతోపాటు కవితాధార మిట్ట పల్లములులేని నడకతో సొంపుగా సాగెడు తీరును గమనింపుడు!

అదే సందర్భమందుఁ బోతనార్యుని వర్ణన యించుక గమనింపుడు.

సీ॥ "పల్లవవైభవాస్పదములగు పదములు
కనకరంభాతిరస్కారు లూరు
లరుణప్రభా మనోహరములు గరములు
కంబు సౌందర్యమంగళము గళము
మహితభావాభావ మధ్యంబు మధ్యంబు
చక్షురుత్సవదాయి చన్నుదోయి
పరిహసితార్ధేందు పటలంబు నిటలంబు
జితమత్త మధుకర శ్రేణి వేణి

భావజాశుగముల ప్రాపులు చూపులు
గుసుమశరుని వింటి కొమలు బొమలు
చిత్తతోషణములు చెలువ భాషణములు
జలజనయనముఖము చంద్రసఖము."

వెలలేని యీపద్యరత్నము నెంతకొనియాడినను దనివి తీరనిది. కాని స్థానము చెడి శోభింప లేకున్నది. దూత్యముఁ జేయఁబోయిన బ్రాహ్మణుఁడిట్లు వర్ణించుట సందర్భోచితము కాఁజాలదు. ఈ సందర్భమునందు సింగనార్యుని రచనయే స్వాభావికమై యింపును గూర్చునదిగా నున్నది

సౌధవర్ణన, ఋతువర్ణన, యుద్ధవర్ణన మొదలగునవి కవి చాలచోట్ల చేసియున్నాఁడు. ప్రబంధములలో విసుగు పుట్టించు ఘట్టములిట్టి వర్ణనాడంబరములే యగును. అయినను జతురుఁడగు నీకవి పాఠకులకా భాగములందు వినోదమునే కలిగించి చరితార్థుఁడయ్యెను. మచ్చునకు కొన్ని యెత్తి చూపించుచున్నాను.

పురస్త్రీలు శ్రీకృష్ణబలరాములను జూచి వారిలో వారు మాట్లాడుకొనుటను దిలకింపుడు.

"ఈతఁడే, ఎలనాగ! ఇసుమంత నాఁడు
పూతన (పాల్ దాగివి) పొరిఁగొన్నవాఁడ,
"సకియరో! ఈతఁడే శకటమై వచ్చు
ప్రకట దానవుఁ దుగ్రిళ్ళిపడఁ దన్నినాఁడు.
ముద్దియ! ఈతఁడే మొగి ఱోలుఁ ద్రోచి
(మద్దియలు) ఁ జీపిన మహానీయ యశుఁడు
అక్కరో! ఈతఁడే యఘదైత్యుఁ జీరి
కొక్కెర రక్కసుఁ గూల్చినవాఁడు.
గోవర్ధనముఁ గేల గొడుగుగాఁబట్టి
(గోవులదే)ర్చిన గోవిందుఁ డితఁడె.
కొమ్మ! ఈతఁడే పిల్లగ్రోవూది త్రేతఁ
గొమ్మల గడువెట్టిఁ గొలిపిన వాఁడు."

కవి శ్రీకృష్ణుఁడు బలరామునితోఁ గలసి కంసుని కొలువు కూట ములో ప్రవేశించు సందర్భమున, శ్రీకృష్ణుని స్వరూపమును గుణగణములతో సహా పాఠకుల కంటిముందఱ నెంత మనోహరముగాఁ జిత్రించుచున్నాఁడో చూడుడు !

"కరిమదరక్త పంకములచే మేన
దొరగెడు ఘర్మ బిందువులును నరయ
హరిమేను చిత్రవనాంబుద మనఁగ
నరుదారఁ జూపట్టె నందంద చూడ ;
గజదంతములుఁదాను కామపాలుండు
భుజశిఖరంబులఁ బొలుపొందఁ దాల్చి
దారుణతర దండధరయుగ్మమనఁగ
గారత మల్లరంగము సొచ్చి నిలువఁ
గోరి మల్లులకెల్ల కులిశమై, ప్రజకు
ధారుణీ నాథుఁడై, తల్లిదండ్రులకుఁ
బసి బాలుఁడై యొప్ప, పంకజాక్షులకు
నసమాస్త్రుఁడై, వల్లవాళికి నెల్లఁ
బరమాప్తుఁడై, యతిప్రతతికి నెల్లఁ
బరతత్త్వమూర్తియై, బంధు సంతతికి
దైవమై, రోహిణీతనయుఁడు దాను
నావిష్ణుఁడరుదెంచె నందఱుఁజూడ."

శ్రీకృష్ణుని రూపును వర్ణించు కొన్ని ద్విపదలు చిత్రకారుల కుంచెకు రసాయనమై ప్రోత్సాహమును గల్గించునదిగా నుండుట జూడుడు !

"నల్లని మేనున్నతమైన యురము
దెల్లదమ్ముల మించు తెలి గన్నుగవయు
నెరిజడ చొల్లెము నిటల రేఖయును
జిరునవ్వు మోమును జేత వేణువును
పాయక జగిఘించు పసిఁడి చేలయును
దలఁబురి పెనవు కదంబ మంజరియు
ధళధళ వెలిఁగెడు దంతదీధితియుఁ
గలరూపు మోమున గట్టినట్లుండు."

ఈ విధముగా వివిధమైన మనోహరవర్ణనలతోను, ఇంపును గూర్చు స్వభావోక్తులతోను, చక్కని తెనుఁగు నడకతోను, నాతిదీర్ఘములగు మధురమైన సమాసములతోను శ్రీకృష్ణుని చరిత్ర ద్విపద బద్ధముఁ గావించి మహాకవియగు మడికి సింగనార్యుఁడు భాగవత దశమ స్కంధమును మాట్లాడు చలన చిత్రముభంగి పాఠకుల దృష్టి పథమునకుఁ బ్రదర్శించి ధన్యుఁడయ్యెను!

—: కొన్ని వ్యాకరణాంశములు :—

1. సంధి :—"పరిమార్చినతఁడు" "రుక్మిణిబ్బంగి" ఇత్యాది సంధిరూపములక్కడక్కడ కన్పడుచున్నవి. ఇట్టిసంధులు భాషలోవిరళములు. మహాకవుల సమ్మతములే. "తామర సనేత్రలిండ్లు" "మా భక్తులొద్ద" "ఇతరులిండ్లు" ఇట్టి ప్రయోగముల నేకములున్నవి.

2. "హరుషనిర్భర చిత్తుఁడై పలికె నతఁడు" ఇచ్చట "హర్ష" అనుపదమును విడదేసి "హరుష" అని ప్రాసకొఱకు ప్రయోగింపఁ బడియున్నది.

అప్పకవివంటి లాక్షణికుఁడు మడికి సింగనార్య కృతమగు వాసిష్ఠరామాయణములోని రెండు పద్యములను "అప్పకవీయ" ములో నుదహరించి యున్నాఁడు.

—: ముగింపు :—

సరస్వతీమహాల్ లైబ్రరిలోని తెనుఁగు వ్రాతప్రతుల సంఖ్య సుమారు 816 ఉన్నవి. ఇవి తంజావూరాంధ్ర నాయక రాజుల కాలమునుండి వచ్చుచున్నవి. నాయకుల పరిపాలన మామణశకము 1535—1675 వఱకు సాగినది. తరువాత మహా రాష్ట్ర రాజులు తంజావూరును బరిపాలించిరి. నాయక రాజులలో "రఘునాథ నాయకుఁడు", అతని కుమారుఁడు "విజయరాఘవ నాయకుఁడు" ఈ యిద్దఱును తంజావూరాంధ్ర సాహిత్యమునకు జీవగఱ్ఱలై యుండిరి. స్వయముగా గూడ అనేక గ్రంథములను విరచించిన ప్రజ్ఞానిధులు వారు. మహారాష్ట్ర రాజులలో గూడ తెనుఁగు సాహిత్యము కొనసాగినదే కాని మొరడు పోలేదు. మహారాష్ట్ర రాజులైన ఏకోజి, శాహ మహారాజులు స్వయముగా తెనుఁగు ప్రబంధములను వ్రాసిన మేధావులు. లైబ్రరిలోని తెనుఁగు గ్రంథములను ఈక్రింది విధముగా విభజింపవచ్చును.

(1) పద్యకావ్యములు
(2) ద్విపదకావ్యములు
(3) శతకములు
(4) దండకములు
(5) గానములు
(6) నాటకములు (యక్షగానములు)

(7) వచన కావ్యములు
(8) శాస్త్రసాహిత్యము
(9) వివిధగ్రంథములు.

మద్రాసు ప్రభుత్వము వారు స్వతంత్రమును బొందిన హిందూదేశ పురోభివృద్ధికి విజ్ఞానము ప్రధానాంశముగా గమనించి పైలైబ్రరి లోని తెనుఁగు శాఖకు సంబంధించిన పుస్తకములను గొన్నింటిని బ్రచురించి, ఆంధ్రసాహిత్యమునకు మహోపకారమును జేయుటకు పూనుకొని యున్నారు. ఈ విషయమందు మద్రాసు ప్రభుత్వము వారు చూపిన శ్రద్ధకు ఆంధ్రలోకము మనఃపూర్వకమైన ధన్యవాదములు సమర్పించుకొనుటలో వెనుకంజ వేయదు. ఈ చిన్న సేవను జేయు సందర్భమును నాకిచ్చి భాగవతదశమ స్కంధము యొక్క పరిష్కరణ భారమును నాకొసంగిన సరస్వతీమహాల్ లైబ్రరి గౌరవకార్యదర్శి శ్రీయుతులు యన్. గోపాలన్ బి.ఏ., బి.ఎల్., గారికి నాకృతజ్ఞతాభివందనములను సమర్పించుకొనుచున్నాను.

మా సరస్వతీమహాల్ లైబ్రరి విమర్శనశాఖా నిర్వాహకులును, బహుగ్రంథ ద్రష్టలును, సర్వతోముఖ పాండిత్యమును గల శ్రీయుతులు కే. వాసుదేవ శాస్త్రిగారు నాకన్నివిధములుగా ప్రోత్సాహము నొసంగి నాయుద్యమము కొనసాగుటకు సహాయ మొనరించిరి. వారికి నా మనఃపూర్వకమైన కృతజ్ఞతాభి వందనము లర్పించుకొనుచున్నాను.

నాకన్ని విధములను జేదోడు వాదోడుగానుండి సహాయ మొనర్చిన మన్మిత్రులు శ్రీయుతులు విఠలదేవుని సుందరశర్మగారికి నాకృతజ్ఞతాభివందనములను నివేదించు కొనుచున్నాను. తాళపత్ర

ప్రతి గ్రంథమును శ్రమను పాటించక శ్రద్ధగా వ్రాసి యిచ్చిన లైబ్రరి తెనుఁగు లేఖకుఁడు చిరంజీవి యస్. విశ్వనాథునకు నా యాశీర్వాదపూర్వకమైన ధన్యవాదములు. ఈ చిన్న పొత్తమును సకాలమందు తగువిధముగా ముద్రణ చేసిన "అముదనిలయం" ముద్రణాలయమువారికి నా ధన్యవాదములను సమర్పించుకొనుచున్నాను.

ఈ యుపోద్ఘాతారంభము మా కులమునకు పరమగురువులగు శ్రీరమణ మహర్షులవారికి నమస్కృతులతో ప్రారంభించినది. నాజనకులును, గురువును దైవమునగు శ్రీ వాసిష్ఠ కావ్యకంఠ గణపతి మునులవారిని స్మరించుటతోపాటు శ్రీకృష్ణభగవానుని పై వారు సెలవిచ్చిన శ్లోకముతో నీ యుపోద్ఘాతమును ముగించుచున్నాను.

శ్లో॥ భూమిభార వారణాయ యోయదుష్వభూ ద్విభు
ర్విస్మయం శిశోశ్చ యస్య చేష్టితాని తేనిరే
శర్మవః స పూరుషో రథాంగమాయుధం దధ
త్కర్మయోగదేశికః కరోతు పార్థసారథిః.

సరస్వతీమహాల్ లైబ్రరి
తంజావూరు. 7-12-50.

వాసిష్ఠ, అ. మహాదేవశాస్త్రి.

ఉపోద్ఘాతానుబంధము.

క్రీ. శ. 1948 వ వత్సరమునందు జరిగిన భాగవత ముద్రణమునకు విద్యారత్న శ్రీ నిడదవోలు వెంకటరావుగారు M. A (Senior Lecturer and the Head of the Telugu Department, Madras University.) వ్రాసిన పీఠికలో "భాగవతానువాదములు" అను శీర్షికలో నుదాహరింపఁబడిన ద్విపదభాగవతముల పట్టిక నీక్రింద నుదాహరించుచున్నాను. చిత్తగింపుడు.

1. పండ్రెండు స్కంధములు (సంపూర్ణము) తరిగొండ వెంగమాంబ (అముద్రి)

2. మొదటి నాలుగు స్కంధములు – తేకుమళ్ళ రంగశాయి (అము)

3. దశమ స్కంధము (ప్రస్తుతపరిష్కరణము) – మడికి సింగన.

4. ,, రత్నాకరము గోపాలకృష్ణకవి (అము)

5. రుక్మిణీకల్యాణము – చెన్నయ (అము)

పరిష్కర్త

ద్వా॥ భా॥

విషయ సూచిక.

—: మధురాకాండము :—

పుట.

అక్రూరుఁడు శ్రీకృష్ణుని స్తుతియించుట 1

శ్రీహరి అక్రూరుని కంసునికడకుఁ బంపుట 2

శ్రీకృష్ణుఁడును బలరాముఁడును మధురాపురికే తెంచుట ... 2

పురస్త్రీలు శ్రీకృష్ణ బలరాములఁజూచి వర్ణించుట ... 3

శ్రీకృష్ణుఁడు రజకుని రూపుమాపుట 4

శ్రీకృష్ణుఁడు అన్నుపచరించిన పట్టుశాలిననుగ్రహించుట ... 5

శ్రీకృష్ణుఁడు సుదాముఁడను పుష్పలావికుని యనుగ్రహించుట 6

శ్రీకృష్ణుఁడు కుబ్జకు మంచిరూపమునిచ్చి యనుగ్రహించుట 7

శ్రీకృష్ణుఁడు కంసుని మహాధనువును విఱుచుట ... 8

కంసుఁడు శ్రీకృష్ణునిచేఁ దన ధనుర్భంగమును విని విచారించుట 9

శ్రీకృష్ణుఁడు కంసుని పంపున నేతెంచిన రక్కసుల రూపడరించుట 9

కంసుఁడు దుర్నిమిత్తములను జూచి బెగడుట ... 10

కంసుఁడు కొలువుకూటమందు శ్రీకృష్ణబలరాముల రాకను ఎదుఱు చూచుట 11

కొలువునకు ముష్టికచాణూరు లేతెంచుట 12

శ్రీకృష్ణునిపై మావటీఁడు మదగజమును బురికొల్పుట ... 12

పుట.

శ్రీకృష్ణుఁడు మదగజమును సంహరించుట ... 13
శ్రీకృష్ణుడు కొల్వుకూటమును బ్రవేశించుట ... 15
కంసుఁడు చాణూర ముష్టికులను శ్రీకృష్ణునిపైఁ బోరఁబంపుట 16
ముష్టికచాణూరులు బలరామకృష్ణుల నధిక్షేపించుట ... 17
శ్రీకృష్ణుఁడు హేళనగా జాణూరునకు బదులు చెప్పుట ... 18
శ్రీకృష్ణుఁడు చాణూరునితోఁ మల్లయుద్ధముఁ జేయుట ... 18
బలరాముఁడు ముష్టికునితోఁ మల్లయుద్ధముఁ జేయుట ... 19
శ్రీకృష్ణబలరాములఁగాంచి పౌరులు శోకించుట ... 20
శ్రీకృష్ణుఁడు చాణూరుని జంపుట 20
బలరాముఁడు ముష్టికుని జంపుట 21
కంసుఁడు ముష్టికచాణూరులు మడియుటఁజూచి తన సేనా
పతులతోఁ బలుకుట 22
శ్రీకృష్ణుఁడు కోపించి కంసునిపై లంఘించి యీడ్చి చంపుట 22
కంసుని మరణముఁ గని దేవతలు హర్షించుట ... 23
కంసుని స్త్రీలు తమపతి మరణమునకు విలపించుట ... 23
శ్రీకృష్ణుఁడు కారాగృహమునుండి దేవకీవసుదేవులను
విడిపించుట 24
శ్రీకృష్ణుఁడు తల్లిదండ్రులఁజూచి చింతించుట ... 25
శ్రీకృష్ణుఁడు ఉగ్రసేనుని రాజ్యభారమును వహింపఁజెప్పుట ... 26
శ్రీకృష్ణుఁడు నందునికడకు వచ్చుట 27
శ్రీకృష్ణుఁడు తనగురువగు గర్గ్యునివద్ద విద్యల నభ్యసించుట ... 28
శ్రీకృష్ణుఁడు గర్గ్యుని గురుదక్షిణఁ గోరుమనుట ... 28
ప్రభాసతీర్థమందు మునిఁగి చనిపోయిన కుమారుని తెచ్చి
పెట్టుమని శ్రీకృష్ణుని గర్గ్యుఁడు కోరుట 29

పుట.

శ్రీకృష్ణుని సముద్రుఁడు పూజించి వచ్చినపనిఁ దెలియఁ జెప్పుమనుట 29

శ్రీకృష్ణుఁడు యమలోకమునకు వెళ్ళి గురుపుత్రుని యసువులను దెచ్చుట 30

శ్రీకృష్ణుఁడు ఉద్ధవుని మందకుఁ బుచ్చుట 31

నందుఁడు ఉద్ధవుని పూజించి శ్రీకృష్ణుని వృత్తాంతము నడుగుట 32

ఉద్ధవుఁడు శ్రీకృష్ణుని గుఱించి యశోదానందులకుఁ జెప్పుట ... 33

ఉద్ధవుఁడు వ్రేతలఁ గన్గొనుట 34

విరహార్తలగు గోపభామినులు ఉద్ధవునిఁ జూచి పలుకుట ... 35

గోపికల విరహము 35

ఉద్ధవుఁడు గోపికల నూరార్చుట 36

గోపికలు శ్రీకృష్ణుని రూపును జేష్టలును వర్ణించుట ... 37

ఉద్ధవుఁడు గోపికల మాటలను విని వారిపుణ్యమునకై మెచ్చుకొనుట 39

ఉద్ధవుఁడు మథురా నగరికి మరలుట 39

శ్రీకృష్ణుఁడు కుబ్జ యభీష్టమును నెరవేర్చుట ... 40

శ్రీకృష్ణుఁడు అక్రూరుని మందిరమునకు జనుట ... 40

అక్రూరుఁడు శ్రీకృష్ణుని స్తుతియించుట 40

శ్రీకృష్ణుఁడు అక్రూరుని పాండవుల సేమము నరయుటకై హస్తినాపురికిఁ బుత్తెంచుట 41

అక్రూరుఁడు హస్తినాపురిఁ బ్రవేశించుట 43

అక్రూరుఁడు విదురునియింట విడియుట 43

అక్రూరుఁడు కుంతీదేవిని గాంచి కుశలప్రశ్న గావించుట ... 44

		పుట.
అక్రూరునితోఁ గుంతి తన కష్టములను జెప్పుట	...	45
అక్రూరుఁడు కుంభజాదుల యిండ్లకుఁ జనుట	...	46
అక్రూరుఁడు ధృతరాష్ట్రునకు హితోక్తులనుడువుట	...	46
కంసునిభార్యలు మగధేశుని వద్ద మొఱయిడుట	...	47
మగధేశుఁడు యాదవులపై దండెత్తుట ...	...	48
యాదవమాగధుల యుద్ధము ...	...	48
శ్రీకృష్ణబలరాముల యుద్ధవర్ణన ...	...	51
తనసైన్యముయొక్క పాటును జూచి జరాసంధుఁడు విజృంభించుట	...	52
కట్టువడిన జరాసంధుని శ్రీకృష్ణుఁడు దయచే విదిలి పుచ్చుట	...	53
నారదుని ప్రోత్సాహముచే కాలయవనుఁడు సైన్యముతో జరాసంధునకు సహాయుఁడై వచ్చుట ...	...	54
జరాసంధ కాలయవనుల దాడినిఁజూచి శ్రీకృష్ణుఁడు క్రొత్త పట్టణమును నిర్మించుట ...	...	55
శ్రీకృష్ణుఁడొంటరిగా కాలయవనుని కడకుఁ జనుట	...	56
శ్రీకృష్ణుఁడు వెంటఁ దఱుముచున్న కాలయవనుఁడు చూచుచుండగా నొక కొండగుహను బ్రవేశించుట	...	56
శ్రీకృష్ణుఁడను భ్రాంతిచే కాలయవనుఁడు ముచికుందుని లేపుట	...	57
ముచికుందుని వృత్తాంతము	....	57
ముచికుందుఁడు శ్రీకృష్ణునిఁ గాంచుట ...	...	58
శ్రీకృష్ణుఁడు ముచికుందునకుఁ దన వృత్తాంతము నెఱుఁగఁ జెప్పుట	...	59
శ్రీకృష్ణుఁడు ముచికుందునకు వరము ప్రసాదించుట	...	60

పుట.

మరల జరాసంధుఁడు శ్రీకృష్ణునిపై దండెత్తుట 61

హర్షాచలముపై నెక్కిన బలరామకృష్ణులను జూచి జరాసంధుఁడు కొండకు నిప్పంటించుట 61

బలరామకృష్ణులు నిప్పులో మాడిరని తలంచి జరాసంధుఁడు మఱలిపోవుట 62

—: కల్యాణకాండము :—

విదర్భరాజు తనకుమార్తె రుక్మిణిని శిశుపాలునకిచ్చుటకుఁ దీర్మానించుట 64

రుక్మిణీదేవి తనపురోహితుని శ్రీకృష్ణుని వద్దకు పంపుట ... 64

పురోహితుఁడు శ్రీకృష్ణుని వద్దకు వెళ్లి రుక్మిణి ప్రేమను రూపును వర్ణించుట 66

శ్రీకృష్ణుఁడు రుక్మిణినిఁగాపాడి వరించుట కొప్పుకొనుట ... 68

శ్రీకృష్ణుఁడు కుండినపురికిఁ బయనమగుట 68

పౌండ్రకదంతవక్త్రాదులు కుండినపురి కేతెంచుట ... 69

రుక్మిణి శిశుపాలాదులు వచ్చుట విని హరిరాకకై పరితపించుట 70

రుక్మిణి గౌరియాలయమునకు వెడలుట 71

రుక్మిణి కృష్ణుని బతినిగాఁజేయుమని గౌరిని బ్రార్థించుట ... 75

చండికాగారము వదలి వచ్చుచు కృష్ణునిఁగానక రుక్మిణి కలఁగుట 76

శ్రీకృష్ణుఁడు రుక్మిణిని దనరథముపై నెక్కించుకొని చనుట ... 77

పౌండ్రకాదులు శ్రీకృష్ణునిఁ దాఁకుట 77

బలరాముఁడు యుద్ధము చేయుట 78

	పుట.
శిశుపాలుఁడు క్రోధముతో హరిపైఁగవయుట ...	81
రుక్మికృష్ణుని తూలనాడుచుఁ గవియుట	82
శ్రీకృష్ణుఁడు రుక్మిని ధ్వజస్తంభమునకుఁగట్టి తలగొరుగుట ...	83
రుక్మిణి తనయన్నను విడిచిపుచ్చుమని శ్రీకృష్ణునిఁ బ్రార్థించుట	84
బలరాముఁడు రుక్మిని విడిపించుట	84
శ్రీరుక్మిణీదేవి వివాహము	85
ప్రద్యుమ్నుని జననము	87
పురిటింటిలోనుండి ప్రద్యుమ్నుని శంబరుఁడపహరించుట ...	88
సముద్రములో వేయఁబడిన బాలకుని మత్స్యమొకటి మ్రింగుట	88
మాయావతి ప్రద్యుమ్నకుమారుని ముక్కువతోఁ బెంచుట ...	89
మాయావతి ఆరూఢయౌవనుఁడగు ప్రద్యుమ్నుని గాంచి మోహించుట	89
శంబరప్రద్యుమ్నుల యుద్ధము	90
ప్రద్యుమ్నుఁడు సతితోఁగూడ ద్వారవతికి వచ్చుట ...	91
సత్రాజిత్తుని వృత్తాంతము	93
శ్రీకృష్ణుఁడు సత్రాజిత్తుని స్యమంతకమణిని యాచించుట ...	94
సత్రాజిత్తు ప్రసేనునకు మణినిచ్చుటయు, వాఁడు వేటకు బోవుటయు	94
సత్రాజిత్తు శ్రీకృష్ణుఁడు మణి నపహరించెనని సందేహించుట	95
శ్రీకృష్ణుఁడపవాదమును సహింపక మణిని వెతుకుటకై యడవికిఁబోవుట	96
శ్రీకృష్ణ జాంబవంతుల సమావేశము	96
శ్రీకృష్ణజాంబవంతుల యుద్ధము	96

	పుట.
శ్రీకృష్ణుఁడు జాంబవతీకన్యను బరిగ్రహించుట ...	98
బిలద్వారమందుండిన పౌరులు పురమునుజేరి శ్రీకృష్ణుఁడు మడిసెనని చెప్పుట	98
సత్రాజిత్తు సత్యభామను శ్రీకృష్ణునకు భార్యగా నర్పించుట ...	100
శ్రీకృష్ణబలభద్రులు కరిపురంబునకు వెడలుట ...	100
శతధన్వుఁడు సత్రాజిత్తుని వధించి మణిని హరించుట ...	101
శ్రీకృష్ణుఁడు శతధన్వునిఁ జంపుట	101
బలరాముఁడు మిధిలానగరమునకు వెళ్లుట; అచ్చట దుర్యోధనుండతని వద్ద గదాయుద్ధ మభ్యసించుట ...	102
అక్రూరుని వృత్తాంతము	103
అక్రూరుని శ్రీకృష్ణుఁడు పిలిపించి బుద్ధులు చెప్పి మఱల వానికే మణిని ప్రసాదించుట	104
శ్రీకృష్ణుఁడు ఇంద్రప్రస్థపురమునకు వెడలుట	105
శ్రీకృష్ణుఁడు పాండవుల క్షేమవార్త్తల నరయుట ...	106
శ్రీకృష్ణుఁడును ఫాల్గుఁడును వేఁటకై వెడలుట ...	106
కాళిందీపరిణయము	108
మిత్రవిందాపరిణయము	109
సత్యాపరిణయము	110
శ్రీకృష్ణుఁడు భద్రలక్షణలను వివాహమాడుట ...	112
నరకాసురుని వృత్తాంతము	112
దేవేంద్రాదులచేఁ బ్రార్థింపఁబడి శ్రీకృష్ణుఁడు నరకునిపై దండెత్తుట	113
మురాసుర సంహారము	114
మురాసురుని పుత్రులు తామ్రాదుల యుద్ధము ...	115

	పుట.
నరకాసురుని యుద్ధము	... 116
భూదేవి తనకుమారుఁడు నరకుని చావునకై దుఃఖించుట	... 117
భూదేవి శ్రీకృష్ణుని బ్రార్థించుట ...	... 117
పదియాఱువేల గోపికలను శ్రీకృష్ణుఁడు పెండ్లియాడుట	... 118
శ్రీకృష్ణుని యమరావతీ ప్రవేశము ...	... 119
పారిజాతాపహరణము	... 120
ఇంద్రుఁడు శ్రీకృష్ణునితోఁ యుద్ధముఁ జేయుట	... 121
శ్రీకృష్ణుని లీలావిహారములు	... 122
రుక్మిణీదేవి సౌధవర్ణనము	... 122
శ్రీకృష్ణునికి రుక్మిణి రాజోపచారములు గావించుట	... 123
శ్రీకృష్ణుఁడు రుక్మిణి చిత్తమును శోధించుట ...	... 124
మూర్ఛపోయిన రుక్మిణిని శ్రీకృష్ణుఁడోదార్చుట	... 125
ప్రద్యుమ్నాది కుమార జననవృత్తాంతము ...	... 126
అనిరుద్ధుని వివాహము కలహము ...	... 128
బలరాముఁడు రుక్మిని జూదపుపలకనెత్తికొట్టి చంపుట	... 130
బాణాసుర వృత్తాంతము	... 130
బాణాసురుఁడు శ్రీశంకరునికిఁ దనయుద్ధకాంక్షఁ దెలిపి ప్రార్థించుట	... 131
బాణాసురపుత్రి ఉషాకన్య స్వప్నములో ననిరుద్ధునిఁగూడుట	133
ఉషాకన్య విరహము	... 133
చిత్రరేఖ ఉషాకన్యను నూరార్చుట	... 135
ఉషాకన్య చిత్రరేఖతోఁ దనస్వప్న వృత్తాంతముఁ జెప్పుట	... 136
చిత్రరేఖ చిత్రపటము వ్రాసి ఉషాకన్యకకుఁ జూపుట	... 136
చిత్రరేఖ తనమాయచే ననిరుద్ధుని యపహరించుట	... 138

పుట.

అనిరుద్ధుఁడు ఉషాకన్యతోఁ గ్రీడించుట 139
అంతఃపురవాసులు బాణాసురునకు ననిరుద్ధుని గుఱించి తెలియపఱ్చుట 140
అనిరుద్ధుని నాగపాశములచే బాణాసురుఁడు బంధించుట ... 141
నారదుని చేననిరుద్ధుని యునికిఁ దెలిసి శ్రీకృష్ణుఁడు సైన్యముతో శోణితపురిని చుట్టుముట్టుట 141
దోర్మిథ్యుద్ధము 143
ప్రద్యుమ్నగుహుల ద్వంద్వయుద్ధము 145
హాలిపుష్పదత్తుల ద్వంద్వయుద్ధము 145
బాణపుత్రుఁడు సాంబునిపైఁ గవియుట 146
శ్రీకృష్ణబాణాసురుల ద్వంద్వయుద్ధము 147
పినాకి శ్రీకృష్ణునితోఁ బోరాడుట 148
శీతజ్వరపీడితమై తాపజ్వరము శ్రీకృష్ణుని శరణు వేఁడుట.... 150
అంబిక శ్రీకృష్ణుని ప్రార్థించుట 151
బాణుని రెండవ యుద్ధము 152
ఉషాకల్యాణము 154

—. జగదభిరక్షకాండము :—

నృగుని శాపవృత్తాంతము 157
వసంతఋతు వర్ణనము 161
బలరాముఁడు వ్రేపల్లెకు నరుదెంచుట 164
బలరాముఁడు వ్రేతలతో యమునాతీరమందు క్రీడించుట 165
బలరాముఁడు యమునను నాగలిచే నెత్తుట 167
యమున బలరాముని ప్రార్థించుట 167
పౌండ్రక వాసుదేవుని వృత్తాంతము 168

పుట.

పౌండ్రుఁడు దూతను శ్రీకృష్ణుని వద్దకుఁబనుచుట 169

పౌండ్రుఁడు హరిన్ని దాఁకుట.... 170

పౌండ్రుని మరణమును గాంచి కాశిరాజు శ్రీకృష్ణునిపైఁ
గవిసి మడియుట 171

కాశిరాజకుమారుఁడు రుద్రుని వరమును బొంది కృత్తిని
బుట్టించుట 172

అగ్నిలోనుండి పుట్టిన కృత్తి శ్రీకృష్ణునిపై వెడలుట 173

శ్రీకృష్ణుఁడు సుదర్శనమును కృత్తిపై పనుచుట 174

ద్వివిదుఁడను వానరుఁడు తన చెలికాఁడగు నరకుని జంపి
నందులకుఁ బగఁబూని చెలరేఁగుట 176

బలరామ ద్వివిదుల ద్వంద్వయుద్ధము 177

సాంబుఁడు దుర్యోధనుని కుమార్తె లక్షణ నపహరించుట 179

కురువీరులందఱుఁ గూడి సాంబుని విరథునిగాఁ జేసి పట్టు
కొనుట 180

బలరాముఁడు యాదవుల కోపమును జల్లార్చి స్వయముగా
హస్తినాపురికి వెడలుట 181

హేళన జేయు సుయోధనునిపై నాగ్రహముచే సీరి
హస్తినాపురిని నాగటికొమ్మునచే పెకలెత్తుట 182

కురుపతి బలరాముని ప్రార్థించుట 184

నారదుఁడు శ్రీకృష్ణుని లీలలను జూడ నేతెంచుట 186

శ్రీకృష్ణ లీలలు 188

సాయంకాల వర్ణనము 191

శ్రీకృష్ణుఁడు మేల్కని ప్రాతఃకాల కృత్యములఁ దీర్చుకొనుట 192

రాజులచేఁ బంపఁబడిన దూత శ్రీకృష్ణుని యెదుట
మొరపెట్టుట 195

	పుట.
నారదుని యాగమనము	 195
నారదుని మాటలను విని శ్రీకృష్ణుం డుద్ధవాచార్యుని యభిప్రాయము నడుగుట	 197
శ్రీకృష్ణుని ఇంద్రప్రస్థ ప్రయాణము	 198
ధర్మజాదులు శ్రీకృష్ణుని సమ్మానించుట	 199
ధర్మరాజు రాజసూయయాగ విషయమై శ్రీకృష్ణుని యెదుట ప్రస్తావించుట	 200
శ్రీకృష్ణుడు రాజసూయయాగము నాచరింపవలసి నదిగా ధర్మపుత్రుని ప్రోత్సహించుట	 201
పాండవులు దిగ్విజయ యాత్రకై వెడలుట	 202
శ్రీకృష్ణుండు జరాసంధుని మాయించెదనని చెప్పుట	 202
శ్రీకృష్ణుండు భీమార్జునులతో బ్రాహ్మణ వేషములను ధరించి గిరివ్రజము ప్రవేశించుట	 203
శ్రీకృష్ణుండు జరాసంధుని యుద్ధభిక్ష వేడుట	 203
భీమజరాసంధుల మల్లయుద్ధము	 205
జరాసంధవధ	 206
శ్రీకృష్ణుండు జరాసంధుని కుమారుడు సహదేవుని రాజ్యమునందునిచి, కారాగృహవాసులగు రాజులను విడిచిపుచ్చుట	 207
శ్రీకృష్ణుండు భీమార్జునులతో నింద్రప్రస్థ పురికి మఱలి వచ్చుట	 290
శ్రీకృష్ణుని ప్రోత్సాహముచే ధర్మరాజు రాజసూయ మునకు గడంగుట	 210
యుధిష్ఠిరుడు శ్రీకృష్ణున కగ్రపూజ నొసంగుట	 211
శిశుపాలుడు శ్రీకృష్ణుని నిందించుట	 212
శిశుపాలవధ	 213

శ్రీరస్తు

ద్విపదభాగవతము.

(దశమస్కంధము)

మధురకాండము.

—: అక్రూరుఁడు శ్రీకృష్ణుని స్తుతియించుట :—

.... లబ్ధిచయము
లన్నగంబులు, గుహ్యామ ప్రజాపతియు
నగు, విశ్వరూపాత్మ! అధ్యాత్మరహిత!
నిగమార్థగోచర! నినుఁగొల్తుఁగృష్ణ!
విద్యా (ధరస్తుత్య) విశ్వలోకేశ!
ప్రద్యుమ్న! యనిరుద్ధ! బలవాసుదేవ!
సంకర్షణాభీమ సర్వసర్వాత్మ!
పంకజోదర! శుభప్రద! హృషీకేశ!
[1]జలధిలోపల నున్న జలచరములును
[2](చెలఁగ) నవని సర్వజీవులు నినుఁడు
సరసిజాననరుద్రమణ్ముఖభోగి
వరులును, నీలీల వర్ణింపలేరు.
ఏనొక్క మనుజుండ హీనమానుసుఁడ

---

[1] జలధిలోపల జలచరము. [2] ....నిలో సర్వజీవులునుడు.

...........మూర్తిఁ బొగడంగ గలనె?"
(అనియిట్లు) కొనియాడు నక్రూరుఁజూచి,
తనరార శౌరి యంతర్ధానమయ్యె.
ఆతతసుస్నాతుఁడైన యక్రూరు
(నీతరిముర)హరి యీక్షించిపలికె.

* * * * *
* * * * *
* * * * *
* * * * *
* * * * *
* * * * *
* * * * *
* * * * *

—: శ్రీహరి అక్రూరుని కంసునికడకుఁ బంపుట :—

"కావున నీవు నక్కంసుతోఁ జెప్పు,
వేవేగ మేము నీవెంటనే వత్తు
మనవుండు నక్రూరుఁ డరదంబునెక్కి
.... నచ్చటి వార్తఁజెప్పె.
తనయింటికేఁగినంతట రామకృష్ణు
లనుపమంబగు వేడ్క ననుఁగులుఁదారు,

—: శ్రీకృష్ణుఁడును, బలరాముఁడును మధురాపురికేతెంచుట :—

తొడివ్రాసి కట్టి సంతోషంబుతోడ,
.............దెంచికనిరంతమ్రోల ;

పసిడిగోపురములుఁ బసిడికోటలును
బసిడి మాడవులను బసిడిమేడలును
హేమకుంభంబుల నెంతయునొప్పి
హేమ (మయముగ) సొంపెసలారి యుండఁ
గని వానిమహిమకుఁ గడుసోద్యమంది
తనరార తత్పురద్వారంబు సొచ్చి
రమణీయ (శోభపుర) మునసే తెంచుఁ
గమలాయతాక్షులఁగని చాలవేడ్కఁ
బౌరకామినులెల్ల భావకోల్లాస
పారవశ్యంబునఁ బరతెంచి పేర్చి

—: పురస్త్రీలు శ్రీకృష్ణ బలరాములఁజూచి వర్ణించుట :—

సౌధాగ్రములయందు సదనంబు(లందు)
(వీథు)లయందును వెఱవొప్ప నిలిచి
కరపల్లవంబులఁ గరమొప్పఁజూపి
సారిది వారందఱుఁ జూపులు వఱపి ;
" ఈతఁడే, చెలనాగ ! ఇనుమంతనాఁడు
పూతన (పాల్ద్రావి) పొరిఁగొన్నవాఁడు,
సకియరో ! ఈతఁడే శకటమైవచ్చు
ప్రకట దానవుఁ ద్రుళ్లిపడఁదన్నినాఁడు.
ముగ్ధియ ! ఈతఁడే మొగిఱోలుఁద్రోచి
(మద్దియలు)డిపిన మహనీయ యశుఁడు.
అక్కరో ! ఈతఁడే యఘదైత్యుఁజీరి
కొక్కెరరక్కసుఁ గూల్చినవాఁడు.
గోవర్ధనముఁగేల గొడుగుగాఁబట్టి

(గోవులఁ దే)ర్చిన గోవిందుఁ డితఁడె.
కొమ్మ! ఈతఁడె పిల్లగ్రోవూది వ్రేతఁ
గొమ్మలఁ గనువెట్టఁ గొలిపినవాఁడు.
కాళీయుపడగలు గ్రతఁ ద్రొక్కి వాని
కాళి............న పుణ్యుఁడితఁడె.

* * * * *

* * * * *

* * * * *

[1](పదవిని దండ్రిచేఁ బలమినిఁ గొన్న)
మొదిరిక కంసుని యేపుమాయించి
యీతఁడే రాజైన నిలయెల్లఁ బ్రతుకు ;

* * * * *

నెలఁత యీతఁడు రోహిణీదేవికొడుకు
బలుఁడను రక్కసుఁ బరిమార్చినతఁడు ;''

* * * * *

మలసి యిద్దఱి విక్రమంబులఁ జూడ
నారామకృష్ణులు నాపట్టణంబు,
భూరిసౌఖ్యములనుబ్బుచుఁ బోయి

—: శ్రీకృష్ణుఁడు రజకుని రూపుమాపుట :—

(రాచ)చీరలఁ దెచ్చు రజకుని శౌరి
చూచి యల్లన నవ్వుచుఁ జేరి పలికె.
" మడివాల! మాకైన మణుఁగుఁబుట్టములు

1......తండ్రిచేకొన్న.

కడు వేగఁదెమ్మన్న" కనలి (వాఁడనియె).
"అద్దిరా! లెస్సవో యగునగు మీకు
దిద్దంగవచ్చునే తివిరి మీగుణము
నిను విచారించవు, నినుఁజూచు కొనవు
చనునె యీరాచ (వసనము)లడుగ
నడవులలో మందలాఁగి రానేల?
పొరలు పెట్టెడు పుట్టుభోగులు మీరు
పరిఘమ్ములును గోరుపడము గొంగళ్లు
(కరకంచు)కోకలు కట్టుడు మీరు,
(ఈరాచ)కోకలు యిమ్మన్న నెట్లు,
నోరాడె? నొంచితి, నొవ్వకుండనిన,
శౌరి కోపించి యాచాకలిఁబట్టి
*   *   *   *   *
పిడికిటఁబొడిచినఁ బెల్లుగానేలఁ
బడి తన్నుకొని వాఁడు ప్రాణముల్ విడిచె;
వడి వాఁడుఁగూలిన వానితోవచ్చు
మడివాళ్లు బెగ్గలి మడుఁగు(లువీడి)
కనుఁగొని పారినఁగన్నిచ్చ వచ్చు
తనుపారు చీరలు ధరయించి శౌరి
బలరామునకును గోపాలసంతతికి
వలయు వస్త్రములిచ్చి వారును దాను

—: శ్రీకృష్ణుఁడు తన్నుపచరించిన పట్టుశాలికనుగ్రహించుట —

జ(నుచున్నచోఁ) బట్టుశాలి యొక్కరుఁడు
తననేర్పు మెఱసి వస్త్రము నేసి వేడ్క

మనుజేంద్రునకు నిచ్చి మన్నన వడయఁ
గొనిపోవుచు బ్రోల గోవిందుఁగాంచి
(యనుపమ) భక్తితో నడుగుల కెఱఁగి
తనచేతి చీర ముందట బెట్టి నిలిచి ;
"యవధరింపుము కృష్ణ ! అంభోజనయన !
తవిలి పుణ్యుఁడనైతి ధన్యుఁడనైతి
(నాపద్మ) జాదుల కందగరాని
నీపాదము (లభించె) నిఖిలలోకేశ !
మునిలోకనుతపాద ! మురవైరికృష్ణ !
(కొనుము యీపుట్టంబు గోవింద ! యనినఁ)
గనిశౌరి కరుణ (సకలకామ్యములును)
తనలోకమును నిచ్చి ధన్యునిఁజేసె

—: శ్రీకృష్ణుఁడు సుదాముఁడను పుష్పలావికుని యనుగ్రహించుట :—

అరుగుదేర సుదాముఁడను పుష్పలావుఁ
డరిగి యెదుర్కొనె నత్యంతభక్తి
బలరామ కృష్ణుల పాదాబ్జములఁ
జెలువారఁ బూజించి చెంగల్వదండ
లిరువురకునునిచ్చి యింపుసొంపార
విరు(లమాలి)కలిచ్చి వెనవేయుగతులఁ
గీర్తింపఁగని హృషీకేశుండుశౌరి
యార్తరక్షణశీలి యతనిమన్నించి
వరము వేడుమటన్న వాఁడు "మీపాద
సరసిజంబులుఁగొల్చు సద్భక్తి నాకు

దయసేయుమనుచు నాతనిఁదన్పు సేసి
నయమైన తత్ప్రసూనములర్థిఁదాల్చి
ఘనమున హర్షించి మరలిపోవంగ

— శ్రీకృష్ణుఁడు కుబ్జను మంచిరూపమునిచ్చి యనుగ్రహించుట :—

కనియెఁగృష్ణుఁడు రహిగంధపుచిప్ప
వలచేతఁబూని త్రివక్రయై నడచు
జలరుహాక్షుఁడు కుబ్జ చపలాక్షి(నొరసి)
(కని)చల్లననగుచు కలకంఠి యెందుఁ
(జనియెదు)గంధభాజనమెవ్వరికిని
గొనిపో(వుచున్నావు కొమరొప్ప నీవి!)
(అనవుఁడు) హరిఁజూచి యాకుబ్జ పలికె.
"వనజాక్ష యేను............త్రివక్ర
యనుదాన రాజు నన్నర్థి మన్నించు
గంధంబు వాసించి కలపంబుఁగూర్చి
యందంబుగా మేన నలఁదఁగా నేర్తు
నిదె, దేవరకు యోగ్యమీగంధ, మలఁది
పదివేలుభూములు పాలింపు" మనుచు
మ్రొక్కి గంధపుచిప్ప ముంగల నిడిన
నక్కజంబుగ శౌరి హాలియునుఁదాను
చందనంబలఁది యాచపలాక్షి మేని
చందంబుఁజూచి యాచతురుఁడు దాని
కాలుకాలున మెట్టి కందువకేలఁ
గీలించినంత మైకిటుకును మాని

వెలఁతుక క్రొవ్వాఁడి మెఱుఁగకోయనఁగఁ
గలికి కన్నులసోయగము నివ్వటిల్ల
మురిపంబు చిరునవ్వు మోమున మెఱయ,
హరిఁజేరి సరసోక్తి నల్లనే పలికె.
“నాకాలుఁద్రొక్కితి నన్ను మన్నించి
నాకోర్కెఁదీర్చుట నెయ్యంబు నీకు
నాయింటికే తెమ్ము నలినాక్ష!” అనుఁడు,
ఆయింతిఁగనుఁగొని “యటఁబోయి మఱలి,
చనుదెంచెదముగాన చనియెద” ననుచు
వనిత వీడ్కొలిపి, యావసుదేవసుతుఁడు
చని వణిక్పథమున సకల (బేహార్లు)
అనుపమదివ్య గంధాంబరాభరణ
ములు కానుకలు చేసిమ్రొక్కిదీవింప ;
చెలువల మనములఁజిత్తజానలము

—: శ్రీకృష్ణుఁడు కంసుని మహాధనువును విరచుట :—

మురిసొని చూడఁగ మొగశాల కడకు
సరుదెంచుచో మందరాంతంబునందుఁ
బొలుచు మహాభోగిభోగమో యనఁగఁ
జలనన మొందనియట్టి చాపమో యనఁగఁ
బ్రకటారిజలరాసిపటుశేతువనఁగఁ
గకుటివారణ కరకాండమో యనఁగఁ
నారూఢ గంధపుష్పార్చితంబగుచు
మేరుశైలాకృతి మెఱయు కార్ముకముఁ
గని, దాని చాపకర్కశలు వారింప

దనుజారి యమ్మహాధనువెక్కుఁ ద్రోచి
వడిగుణధ్వని సేసి వారక తివిసి
పిడికిలి వదలిన ఫెళఫెళధ్వనులు
దిక్కులు వ్రయ్యంగ దిగిభంబులగలఁ
చుక్కలు డుల్లంగ సురలోకమదర
ధారుణి వణఁక పాతాళంబువగుల
వారాసి పిండలివండుగాఁగలఁగ
పిడుగులు పదివేలుపెట్టి యొక్కెడను
పడియనోయన విల్లు బ్రల్లన విఱిగె
అట మహాధ్వని విని యాంపౌరులెల్లఁ
బటుగతిఁ దూలఁగ భూపతి బెట్టుకలఁగి

—: కంసుఁడు శ్రీకృష్ణునిచేఁదన ధనుర్భంగమును విని విచారించుట :—

తన కలంకలనున్న దానవాధిపులఁ
గనుఁగొని పలికె నుత్కట కోపమెసఁగ.
కోపించి "వసుదేవుఁగొడుకులు నేఁడు
నా పట్టణముఁ జొచ్చి నావిల్లువిఱిచి
చలముచేకొని ధనుశ్శాల నున్నారు.
బలసి మీరందఱు బలశక్తిమెఱసి
వారలసిద్దఱ వధియింపు డొండె
కారాగృహాన నుక్కరఁబెట్టుడొండె".

—: శ్రీకృష్ణుఁడు కంసుని పంపున నేతెంచిన రక్కసుఁ రూపడరించుట :—

అని పుచ్చుటయు దైత్యులసమసాహసులు,

చనుదెంచి వారితో సమరంబు సేయ
నా రామకృష్ణులు నవ్వీరవరులఁ
దోరంబుగల వింటితునుకల నడచి
మెఱసి కంసునియింటిభృత్యుని బలునిఁ
బరిమార్చి యందఱఁ బఱపి యాలోన
గమ్మన నాయుధాగారంబు వెడలి
యిమ్ములఁ బురలక్ష్మి నెలమిఁ జూచుచును
నొప్పార నందాదులున్న యయ్యెడకుఁ
దప్పకఁ జనిరంతఁ దపసుండుఁ గ్రుంకె.

—: కంసుఁడు దుర్నిమిత్తములను జూచి బెగడుట :—

తనరార కోలోచితమ్ములుఁ దీర్చి
యనుపమసుఖలీల నారాత్రియందు
నంతనంతయువిని యాభోజనృపతి
చింతించి బెగ్గలి చేష్టలు నడలి
దారుణంబైన వేదనఁబొంది కంది
కూరుకుఁగానకఁ గొందలంబంది
యద్దంపు నీడలో నాతతంబునను
నిద్దంబుగాఁ దననీడఁ జూడఁగను
తలలు రెండైయుంట.........
గలవెత నగ్నులు గానంగ బడుట
ఖరలులాయోష్ట్రాదికములును గనుట
యరుదార తలనూనె లంటుకొంచుంట
బిసములుఁదినుచుంట ప్రీతిదాసనపు
కుసుమధామంబులఁ గొనధరించుటయు

ధూళిలో రొంపిలోఁ ద్రొక్కినయపుడు
కాలుమోవక పాదఖండమై యుంటఁ
చెవులు మూసినయెడ సింధుఘోషంబుఁ
బ్రవిమలంబుగ వినఁబడకుండుటయును
నివియాదిగాఁ బెక్కు లీక్షించి తనకు
నవసానకాల మానని యాత్మనెఱిఁగి
పురపురఁ బొక్కుచుఁబొగిలి లోఁగంది
మరణభయంబున మదిఁదప్పినంత;
నెట్టకేలకు వేఁగ నినుఁడు పూర్వాద్రి
దట్టుఁడై పొడతెంచెఁ దమ్ములింపలర.

—: కంసుఁడు కొలువుకూటమందు శ్రీకృష్ణబలరాముల రాకను ఎదురుచూచుట :—

అంతఁ గంసుఁడు పూర్వాహ్ణక్రియలు
సంతసంబునఁ దీర్చి సకలభూపతులుఁ
గొలిచియుండఁగఁ బెద్దకొలువుండి వేడ్క
బలరామకృష్ణుల బవరంబుఁ జూడఁ
దలఁచి పెంపెసలారు తమకంబులందు
వలయువారును దాను వసియించెనంత;
మఱియును బహువిధమంచియలందు
వరులు సద్విజరాజవైశ్యశూద్రులను
బ్రవిమలంబుగనుండి, రంగమధ్యమున
వివిధపుష్పసుగంధవిధులు వాసించి
పరగనవ్వేళ గోపాలురుఁదాను
నరుదెంచి నందుండు నాభోజపతికిఁ

బాడఁజూపి తమ తెచ్చు భూరివస్తువులు
కడఁకతో నిచ్చినఁ గరము మన్నించి
తనచేరువనె యొక్క తమకంబుమీఁద
ననిచివారును దాను నొగిఁజూచుచుండె.
కరియూథమే తెంచుగతిమల్లవర్గ
మరుదెంచ వందిబృందారవం బెసఁగఁ

—: కొలువునకు ముష్టికచాణూరులేతెంచుట :—

జనుదెంచి ముష్టికచాణూరముఖ్యు
లెనయ రంగస్థలం బెల్లఁదారగుచు
భుజమప్ఫళింపుచుఁ బోరి విజృంభించి
గజభజింపుచునుండఁగా నంతలోన;

—: శ్రీకృష్ణునిపై మాపటీఁడు మదగజమును బురికొల్పుట :—

వికసితపుష్కరవిభవంబుఁ జెంది
యకుటిలదీర్ఘశృంగారూఢి నొప్పి
మానుగా వంశాఢ్యమహిమఁ జెన్నొంది
దాన నిర్జరలీలఁ దనుపారఁ బేర్చి
పొడవు తక్కువగాని భూధరేంద్రంబు
వడువునఁ జెలువారు వరశక్తిచేత
నష్టదిగ్గజముల నాపంగనోపు
నష్టమదాపూర్ణమై పేర్చుకరిణి 120
కువలయపీడంబు కోరియాశాల
నవిరళంబుగ నిల్చి యతికౌతుకమున

నెదరుచూచుచునుండె నెంతయు వేడ్క.
యదుకులోత్తంసులు హలియును హరియు
రమణీయజలజాకరమునఁ గ్రీడింప
గమనోగ్రగతివచ్చు గజయుగ్మమనఁగఁ
గరియూథముల మీఁద కలుషించివచ్చు
హరికిశోరద్వయమనఁ బెంపు మిగిలి
పౌరులుఁదముఁ జూచి బహుభంగిఁ బొగడ
నారూఢరంగము నటు డాసి శౌరి
యరుదారఁ దెరువున కడ్డంబు వేర్చు
కరిఁజూచి మావంతుఁగనియు నిట్లనియె.
" ఈకరిఁ దొలగించి యిటుఁద్రోవఁ జూపు
మాకంసుకడకు మాకరుగఁగావలయుఁ
బోవనీకుండినఁ బొరిపుత్తు" ననిన;
మావంతుఁడంతనగ్రరుషంబుతోడఁ
గరిపతి హరిమీఁదఁ గదియింప నదియుఁ
దిరిగి మహోదండతీవ్రతుండంబుఁ
బ్రసరింపుచును గృష్ణుఁబట్టుశక్తి నొడియ
నసమసత్త్వుఁడు కృష్ణుఁడటుఁ దప్పఁ గ్రుంకి

—: శ్రీకృష్ణుఁడు మదగజమును సంహరించుట .—

చరణమధ్యములకుఁ జనిబాహులెత్తి
యరుముష్టి బొడిచిన యురమూరదాఁకి
హుంకారరవమున నోడించి మొరగ
నంకుశంబున నూది హస్తిపుండార్వఁ,
బుదికొని కరటి యాపుండరీకాక్షుఁ

గరకాండమెత్తి యొక్కటఁ మేనుఁజుట్టి
తివిచినఁ దనమేనుఁ దివియక శౌరి
యవిరల భోగిభోగావృతంబగుచు
దిరిగెడి మందరాద్రియుఁబోలెఁ దిరిగి
కరమొప్ప శక్తిఁబుష్కర మొప్పఁబట్టి
వెనకకుఁ ద్రోచిన వివశమై యొరగి
ఘనరౌద్రమున లేచి కఠినదంతముల
శౌరిమేను బొడవంగ నతఁడుమైఁదప్పె.
కరముగ్రమగు ముష్టిఘాతలఁ జనుప
మావంతుఁడలిగి తోమరములు మాఁట
నావిశ్వవిభుఁడైన నతఁడు కోపించి
కడఁగి హస్తిపకుని కడకాలుఁబట్టి
పుడమిపైఁబడ నీడ్చి పొరిఁద్రొక్కిచంపె.
మావంతుఁడీల్గిన మత్తేభమదరి
గోవిందుపై నాఁకఁ గొనకఁబెల్లురకఁ
బడతాడనంబులఁ బరుషఘాతములఁ
బ్రిదులంబులును బోని పిడికిళ్ళఁ బొడువ
ముక్కునవాతను మొగికర్ణములను
నక్కజంబుగ నెత్తురందందనొలుక
పవిఁబాఁకి కూలిన పర్వతంబనఁగఁ
బవనుచేఁబడు మహావృక్షమో యనఁగ
గజము నిశ్చేష్టమై గజభములుడిగి
గజగజ వడఁకి యక్కజముగాఁ ద్రెళ్లె,
కడువడిమెడఁ ద్రొక్కి (గజదంతములను)
బెదిరంపు లావునఁ జెఱికి మురారి
దానవకుంభనిర్దళనంబు సేసి

మేను వ్రేయఁగ వేఁగి మిడమిడ మిడికి
గైరికనిర్ఝరకలితాద్రి వోలె
భూరిరక్తంబులఁ బొలిచెనగ్గజము.

—: శ్రీకృష్ణుఁడు కొల్వుకూటమును బ్రవేశించుట :—

కరిమదరక్తపంపకములచే మేనఁ
దొరగెడు ఘర్మబిందువులును నరయ
వారిమేను చిత్రవనాంబుద మనఁగ,
నరుదారఁ జూపట్టె నందంబుఁజూడ;
గజదంతములుఁ దాను కామపాలుండు
భుజశిఖరంబులఁ బొలుపొందఁ దాల్చి
దారుణతరదండధరయుగ్మ మనఁగ
గారత మల్లరంగము సొచ్చినిలువఁ
గోరిమల్లులకెల్ల కులిశమై, ప్రజకు
ధారుణి నాథుఁడై, తల్లిదండ్రులకుఁ
బసిబాలుఁడై యొప్పి, పంకజాక్షులకు
నసమాస్త్రుఁడై, వల్లవావళికెల్లఁ
బరమాప్తుఁడై, యతిప్రతతికి నెల్లఁ
బరతత్త్వమూర్తియై, బంధుసంతతికి
దైవమై, రోహిణీతనయుఁడుఁ దాను
నావిష్ణుఁ డరుదెంచె నందఱుఁజూడ.
అతులితగంధపుష్పామోదితులును
సతతసౌఖ్యాఢ్యులఁ జారుభూషణుల
శ్రితకీర్తియుతుల, నాశ్రితకల్పతరులఁ
బ్రతిభటవనదావపావకసముల

ఘనదీర్ఘబాహుల, కఠినవిక్రముల
వనజాతనేత్రుల, వసుదేవసుతుల,
నారామకృష్ణుల, నతులవిక్రముల,
నారూఢనవయౌవనాంగులఁజూచి
ఘోరున జనులెల్లఁ బొగడఁగఁగంసు
డారవ మాలించి యటఁజూచునంత ;
కువలయాపీడంబుఁగూల్చి తన్నర్థి
కువలయంబంతయుఁ గొనియాడవచ్చు
హరికామపాలుర నందందఁగాంచి
తిరుగుడువడి గుండె దిగులొంది తాల్మి

—: కంసుడు చాణూరముష్టికులను శ్రీకృష్ణునిపైఁ బోరఁబంపుట :—

డింది చాణూరముష్టికులరప్పించి
దండడిఁ బెదవులు దడవుచుఁబలికె,
"మనమంటపము సొచ్చి మనవిల్లు విఱిచి
మనపట్టపేనుఁగ మడియించి వీరు
మనమీఁద వచ్చిరి మహితవిక్రములు.
తనరార మల్లయుద్ధము నేర్పు మెఱసి
పోర మీరరువురుఁ బొలియించి వేగ
నారాజ్యమును నన్ను నాబంధుజనుల
రక్షించి నాదుసామ్రాజ్యమెంతయును
నక్షయంబుగ నేలుమ''ని పల్కుటయును ;
తివిరి యుక్కున దాత తీర్చినయట్ల
ప్రవిమలంబగు మహాప్రతిమలో యనఁగ

నవయలంబులుగల యద్రులో యనఁగ
[1]పవివ్రేయ నాపెడు బలుదిట్టలనఁగ
ముష్టికచాణూరముఖ్యులు నృపతి
యిష్టంబుఁగని రంగమెల్లఁదారగుచుఁ
గినుకమై బలరామకృష్ణులఁ జేరఁ
జనిమహాధ్వని మల్లచఱచి యిట్లనిరి.

—: ముష్టికచాణూరులు బలరామకృష్ణుల నధిక్షేపించుట :—

"వసుదేవసుతులార ! వసుధలో మిమ్ము
లసమానసత్త్వాఢ్యులండ్రెల్లవారు
పెక్కండ్రదనుజులవీచంబులణఁచి
యక్కజంబుగ మెఱసినయట్టి సాహసులు ;
భోజభూవిభుఁడు మీపేరు నీక్షించి
రాజిల్ల మమ్మిట రప్పించినాఁడు ;
మందలోపల గొల్లమగనాండ్లఁ దిరిగి
సందింపుచును నాడ సానురాగములఁ
బిల్లగ్రోలూఁదుచుఁ బెరయుటగాదు
మల్లయుద్ధములకు మమ్ము డగ్గరుట ;
యేను చాణూరుండ యితఁడు ముష్టికుఁడు
పూని నీవును నేను బోరుదమెలమి
ముష్టికుతోడ రాముఁడు మల్లయుద్ధ
మిష్టలీలల నొప్పఁడిదిసాటి" యనుఁడు.
అల్లన నవ్వుచు నంబుజోదరుఁడు

వవివ్రెయ్యవాపిన బలుచాగలనంగ

—: శ్రీకృష్ణుడు హేళనగాఁ జాణూరునకు బదులు చెప్పుట :—

" పల్లవులము చిన్నపాపలు మేము
తగిన జెట్లును మీరు ధరణీశునొద్ద
జగతిపైఁ బోరుల నడిగన్నవారు
మీతోడ రణవీధి మెఱసి సేయంగ
నాతరంబులవారమగుదుమే మేము?
చేసి భూపతి వేడ్కఁ జెడకుండ కొంత
పెనఁగెద"మని పల్కి ప్రీతి మైపెంచి

—: శ్రీకృష్ణుడు చాణూరునితో మల్లయుద్ధముఁ జేయుట :—

వడిమల్లచఱచి భూవలయంబు వగుల
బెడిదంబుగా నార్చి పిడికిళ్లు చాఁచి
వానిపై కదియు ముష్టాముష్టి గవియఁ
జాణూరుఁడును మల్లచఱచి యుట్లొరసి
యురువుర భుజమప్పళించు చప్పుళ్లు
శరనిధి కలఁగె నాశాచక్రమగిలె
నంతకుఁ దెసఁజేరి యవనిపరాగ,
మింతింతఁగొన మేన నిరవారఁజల్లి
కొనిపదఘాతల కూర్మంబు వగులఁ
దనరు మహాభద్రదంతుల రీతిఁ
జేతికి నొడిసినఁ జేయూఁక తివిసి
ఘాతసేయంగ దగ్గతి మేనుదొలఁగి
పొడిచిన నది వెలిపుచ్చిమైవంచి
యొడిసి తొడలఁదట్టి యార్చి పెల్లురికి

లాగంబుఁ గొంచును మేలనఁదలఁగ్రుంకి
బాగుఁదప్పకఁ దలప్రహతుల నొంచి
నడుముఁ బీడింప విజ్ఞానుదున మలఁగి
విడిపించుకొని ముష్టి విసరమై పొడిచి
పట్టుచు విడుచుచుఁ బరుషఘాతముల
దట్టించి కూర్పరోద్ధతుల నొప్పించి
కరవశంబుఁగొనకాభీరుశోక
దరకాండములు లోనుగానీక తొలఁగి
శిసకంబొనరింప శిరమూన్చి పెట్టు
గాసిల్లి కేలడొక్కరమున నొత్తి
రంకెలువైచు గోరాజుల భంగి
ఝుంకించి బింకంబు సరిగాఁగఁబెనఁగి
ముంగలు బలసింగములభంగిఁబొంగి
నింగిమోవంగనార్చి నిడుగుడిపై కుటికి
మెడయుగాళ్లును బట్టి మీఁదికి నెత్తి
పుడమి మోవంగ వ్రేయ భోరున నెగసి
యడపకరాఁగేల నిరియ బిగించి
వడినుగ్రమగు ముష్టి వక్షంబుఁబొడువఁ
దడబడ ముష్టిఘాతల మోములవసి
దొడిదొడి పన్నెత్తురులు వఱ్ఱుగాఁగ
హరియు చాణూరుఁడు నటమల్లయుద్ధ
పరుషతఁదుల్యులై బవరంబు సేయ ;

—: బలరాముఁడు ముష్టికునితో మల్లయుద్ధముఁ జేయుట :—

సీరితోఁ దొడరి ముష్టికుఁడుగ్రవృత్తిఁ
బోరెఁ జూపరకు సభ్యులు చూచి పొగడ ;

హరిరాములకు జయంబయ్యెడుననుచు
సురలు దీవించిరి, శోకించి పౌరు

—: శ్రీకృష్ణబలరాములఁగాంచి పౌరులు శోకించుట :—

"అక్కటా! ఈకంసుఁడతి పాపకర్ముఁ
డెక్కడి యీబాలు రెక్కడి వీర
లెక్కడననిఁ జూడకెట్లుగావించె
నక్కటా! వారించరైరి యెవ్వరును.
ఈసుకుమారుల నిటుసేయఁదనకు
దోసంబుఁ దిట్టును దూఱును గాదె!
పరుషత రిపులతో బవరంబు సేయ
హరిమేను ఘర్మకణాంచితంబగుచు
[1]వివశితాంభోజంబువిధమొందెఁజూడు
డీవాసుదేవులకీబారిగడపు
దైవమాయని" మ్రొక్కి తరుణులు వగవ;
దేవకియును వసుదేవుఁడుఁ బ్రీతి
గోవిందబలులఁ గనుఁగొని వంతనొంది

—: శ్రీకృష్ణుఁడు చాణూరుని జంపుట :—

రప్పుడు దనుజారి యామహాజట్టిఁ
దప్పకఁ జూచి యుద్ధత శక్తి మెఱసి
పిడికిటఁ బొడిచినఁ బెంపేది వాఁడు
పడియొడ్డ నిల్చి యాపంకజోదరుని
వక్షంబు శిరమున వడిదాఁకుటయును ;

[1] ఈ పద్యపాద మొక్కటియే కన్పడుచున్నది.

ఈక్షించి హరివాని వెనుకకుఁ ద్రోచి
కుడిరెట్టవట్టి పెలుకుఱుఁ ద్రిప్పి నేలఁ
బడవైచి తన్ని గొబ్బున మీఁదికుఱికి
మెడఁద్రొక్కి యినుమునమ్మోట మోదినట్లు
తడబడ ముష్టిఘాతల మేను నొంప;
వెగడొంది (ప)ట్టెమ్ము విఱిగి గుండియలు
పగిలి చాణూరుండు ప్రాణముల్ విడిచె.

—: బలరాముఁడు ముష్టికుని జంపుట :—

అప్పుడు ముష్టికుండమరులీక్షింపఁ
జెప్పబెట్టులుగాఁగ సిరితోడఁదొడరి
పులులచందమున సుబ్బుచుఁ బొంగిపొంగి
బలులులాయంబులపగిది దాఁటుచును
పాయుచు డాయుచు బాహాస్ఫాళముల
వ్రేయుచు నొగిఁబెక్కు విధములఁ బోర;
ద్రిష్టించి చూపర దిగులొంద నిలిచి
ముష్టికుండడరి రాముని బెట్టుఁ బొడువ
ఫాలంబు వగిలి తప్పక నెత్తురొలుక
నేలపైఁబడి లేచి నీలాంబరుండు
పిడుగు వ్రేసిన భంగిఁబిడికిటఁబొడువఁ
బడితన్నుకొని జెట్టిప్రాణముల్ విడిచె;
గలఁడైన ముష్టికుఁగని వానితమ్ముఁ
డతిబలాఢ్యుఁడు కూటుఁడను వాఁడు సీరిఁ
జోకుఁబోకని దాఁకి పోరిముష్టిఁబొడువ
యాకూటుఁ దెకటార్చి యార్చె మిన్నద్రువఁ
గోసలప్రభృతులొక్కొట యెడుగురను

వాసుదేవుఁడు వారివధియించె నంతఁ
గనుఁగొని మల్లవర్గమువారు పారుటయును
యనిమిషావలిఁ జూచి యచ్చెరువందె.

—: కంసుఁడు ముష్టికచాణూరులు మడియుటఁజూచితన సేనాపతులతోఁ బలుకుట :—

భోజభూపతి వారు పొలియుటఁజూచి
రాజసంబెడలి బోరన నశ్రులొలుక
వడివాద్యముల మ్రోఁత వారించితనదు
పడవాళ్ళఁబిలిచి నిర్భయవృత్తిఁబలికె.
" ఈ పాపకర్ముల నిరువురనీల్ల
ద్రాపించి, వసుదేవుఁదునుమాడి, నంద
గోపునియిల్లు ముట్టుకొని చెఱఁబెట్టి
గోపాలకులఁబట్టికొని, యుగ్రసేను
దండించు"డని భోజధరణీశుఁడాడు
దండిమాటలకల్గి దానవాంతకుఁడు

-: శ్రీకృష్ణుఁడు కోపించి కంసునిపై లంఘించి యీడ్చి చంపుట :-

గిరిశృంగమునకు లంఘించు సింహంబు
కరణి దగ్గన దనుకలిమీఁది కెగయ,
కనిభోజపతి కేలఖడ్గమంకించి
కొని యాజికెదుఱంగఁ గోరనవ్వ వెలయ
నురగంబు పక్షీంద్రుఁడొడియు చందమున
కరవాలుఁగేలునుగ్రతశక్తిఁబట్టి
కొసవెంట్రుకలు వట్టి గొరగొరనీడ్చి
వసుమతిఁబడఁద్రోచి వడి మీఁదికుఱికి

పిడికిళ్ళనొప్పింపఁ భిరికిప్రాణములు
యొడలికిఁబెడఁబాయ నొప్పార కంసు
ఘనకళేబరము రంగము వాయనీడ్చి
యనుపమధ్వనిఁబేర్చి యార్చి మురారి
యతనితమ్ములు సునాభక్రోధనాధు
లతిసత్వులెనమండ్రమలపాణి చంపె;
నప్పుడు పౌరులయార్పులు నింగి
నుప్పొంగి బహుపాశకోక్తులఁజెలంగె.

-: కంసుని మరణముఁగని దేవతలు హర్షించుట :-

భవకమలాసనప్రముఖదేవతలు
ప్రవిమలంబుగఁ బ్రణుతించిరెలమి
దివిబీఁటకొనిమ్రోసె దేవధుందుభులు
దివిజకామినులు నర్తించిరింపార ;
పొరిఁబొరి మందారపుష్పవర్షములు
సురకోటి దేవకీసుతుమీఁదఁగురిసి
రంతట, కంసుండు హతుఁడౌట యెఱిఁగి
యంతఃపురాంగనలడలుదీపింప
నడుగులు తడబడ నాత్మలు కలఁగ
నుడివడి లోఁగుంది స్రుక్కి బల్వడిని,
నురములశిరముల నొరిమ్రోదుకొనుచు
పరిపరివిధముల పలవించి మిగుల
నార్తనాదంబుల నంతందఁబొగిలి

—: కంసునిస్త్రీలు తమపతి మరణమునకు విలపించుట :—

భర్తపై వ్రాలుచు బహుభంగి నొగిలి
హా! యని యేడ్చుచు హా నాథ! యనుచు

పోయితే! మము బాసి భోజవంశాఢ్య!
కటకటా! శోకానలగ్రాలంగ మమ్ము
నిటఁజూడవించుక యేలఁగైకొనవు?
ఇనుఁడు నీమీఁదట మెండరానోఁడు;
వనిలుండు నీమీఁద నటువీవ వెఱచు;
ననలుండు తీవ్రార్చులడరింపనోఁడు;
ననిమిషాదులు మీకు నడకుదురెపుడు;
నీయాజ్ఞ నీలావు నీరాజసంబు
నీయొప్పు నీనేర్పు నీమంచితనము
ప్రేయవారలచేత వేల్మిడినడఁగి
మాయమైపోయితే మనుజదేవేంద్ర!"
అని బహుభంగుల నార్తులైపొగుల
వనితలనూరార్చి వాసుదేవుండు

-: శ్రీకృష్ణుఁడు కారాగృహమునుండి దేవకీవసుదేవులను విడిపించుట:-

కారాగృహంబునఁ గడునొచ్చియున్న
వీరుని వసుదేవు, వెలఁది దేవకిని,
గనివారికాలి సంకిలియలూడ్పించి
వినయంబుతో మ్రొక్కి వెఱఁగందివారు
గోవిందహలులఁ గన్గొని తమపాలి
దైవంబులని, యాత్మఁదలఁచిరిగాని
తనయభావంబుగాఁదలఁచకయున్నఁ
తనమాయ హరి మోహతమముఁగారించ
చన్నులఁ బాలును సమ్మదాశ్రువులు
కన్నులఁ దొరల నక్కాంతాలలామ

సుతులఁ గాఁగిటఁ జేర్చి శోకంబుఁ దక్కి
యతులితంబగు ప్రేమ నందఁదఁ జూడ
వసుదేవుఁడును బుత్రవరుల నీక్షించి
యసమానమగు ప్రేమ నక్కునఁ జేర్చి
పుణ్యాత్మ! మీ యట్టి పుత్రులఁ గాంచి
పుణ్యకీర్తులఁ గంటి పుణ్యుఁడ నైతి;
నింతగాలము మిమ్ము నీక్షింపలేక
సంతాపమందుచు శత్రులచేతఁ
బడని బాధలఁ బడి పసువుచుండితిమి ;
కడపట! నినుఁ జూడ గంటిమి నేఁడు;
జన్మజన్మాంతర సంచితౌఘములు
చిన్మయ! నినుఁ దలఁచిన మాత్ర మేఁగు.
మహనీయ! నీవు కుమారుఁడవైతి
విహపరంబుల మాకు నేమిటఁ గొఱత?
అని యున్న గురుల సత్యాదరలీలఁ
గనుఁగొని శౌరి యుత్కటబాష్పుఁడగుచు

—: శ్రీకృష్ణుఁడు తల్లిదండ్రులఁ జూచి చింతించుట :—

“ మానిమిత్తముల దుర్మనుజులచేతఁ
బూని బహుక్లేశములు మీకుఁ గలిగె;
జనియించినపుడే యిచ్చటనున్న వెఱచి
యనఘ! నందుని యింటికనిచిన, వారు
బాల్యంబు మొదలుగా భక్తిఁ బోషింపఁ
గౌల్యవర్తనల మెలఁగి కాంచితిఁ గాని
యప్పటప్పటికి మమ్మరసి మీ రర్థిఁ
జెప్పిన పని సేయ సిద్ధించదయ్యె;

తనయుఁడు జనియించి తల్లిదండ్రులకు
ననుపమంబగుభక్తి నరయకుండినను
దనయుండె? ఆతఁడు తల్లి యవ్వనముఁ
గొనకొని తెగఁజూచు గొడ్డలిగాక!"

-:శ్రీకృష్ణుఁడు ఉగ్రసేనుని రాజ్యభారమును వహింపఁజెప్పుట:-

అనిభక్తిసూరార్చి యయ్యుగ్రసేనుఁ
గనుఁగొని కౌఁగిటఁగదియించి, శౌరి
"నీరాజ్యమంతయు నిర్దయవృత్తిఁ
గ్రూరుఁడై తానె కైకొని యంతఁబోక
యూకలఁబెట్టి మిమ్మలఁచినయాతఁడు
కాకున్న పనియట్లుగాక పోరాదు
హీనమానసులైన యీదురాత్ములకుఁ
గానఁజింతింపకఁ గంసాదిసుతుల
కగ్ని సంస్కారాదులర్థిఁ జేయింపు
ప్రాజ్ఞులవిప్రులఁ బనిచి వేవేగ
రాజ్యభారముఁ దాల్చిరమణ మాకెల్ల
పూజ్యుఁడవై లీల భూమిపాలింపు",
మనుటయు హరిఁజూచి యయ్యుగ్రసేనుఁ
"డనఘ! నన్నిమ్మాటలాడంగఁదగునె?
హీనుఁడనతివృద్ధ నీరాజ్యభరము
పూననాకర్హంబె? పుండరీకాక్ష!
వసుదేవుఁబట్టంబు వలనొప్పఁగట్టి
యసమానగతిని రాజ్యము నీవెతీర్పు;
కన్నులు చల్లఁగాఁగలకాలమెల్ల

నిన్నుఁజూచుచుఁ బ్రీతి నెగడెద కృష్ణ!''
అనుచుఁబల్కిన శౌరి యారాజుఁజూచి
వినయంబు నీతియు వెలయ నిట్లనియె.
'' యాదవులకు రాజ్యమర్హ కృత్యములు
గాదు యయాతి వాక్యముఁద్రోయరాదు;
కావున సామ్రాజ్య కమనీయలక్ష్మి
నీవె పాలించిమన్నించు, బాంధవుల
రప్పించి వారికి రాజ్యంబులిచ్చి
తప్పక మమ్మెల్ల దయ నేలుకొనుము.
నిఖిలభూపతులును నింపు సేయంగ
సుఖలీలనుండు; కంసుని వంతమాను''.
మనిపల్కి యాతని నవనీభరంబుఁ
గొనకొనుమని నియకొలిపి మురారి

—: శ్రీకృష్ణుఁడు నందుని కడకు వచ్చుట :—

బలుఁడుఁదానును నందుపాలికే తెంచి
కలిసి యాతనిఁ జిక్క కౌఁగిటఁ జేర్చి
భోజాధిపతియింటఁ బొలుచు వస్తువులు
రాజ్యయోగ్యములైన రవణంబులిచ్చి
యతని మన్నించి నెయ్యము తియ్యదనము
నతిగారవంబున నమర నిట్లనియె. 290
'' నీవు నీసతియును నెమ్మిఁ బోషించి
ప్రోవఁగఁ బ్రతికిన ప్రోఢలమేము
తల్లియుఁదండ్రియు ధనములియ్యమును
నెల్లబంధువులును నిటమాకు నీవ ;
మండలోపలికి నెమ్మది నేఁగి మీర

లందఱిక్షేమంబులడిగితిమనుఁడు;
యేనాఁటిదినముల యీలోన నచటి
కే నేఁగుదెంచెద నీవంతమాను".
మనివారి నూరార్చి యనుప నందుండుఁ
జనియె గోపాలకసమితియుఁదాను.
అంతట నిశ్శంక నారాత్రి సౌఖ్య
సంతోషలీలలు సలిపిరింపొంద.
మఱునాఁడు శౌరి కుమారులఁజూచి

—: శ్రీకృష్ణుఁడు తనగురువగు గర్గ్యునివద్ద విద్యలనభ్యసించుట :—

తెఱగొప్ప సద్గురుద్విజుల రప్పించి
కాలోపనయనసంస్కారాదివిధులుఁ
గాలోచితక్రియగతులుఁ జెప్పింప
యదుకులాగతగురుఁడగు గర్గ్యువలనఁ
జదువొప్ప వేదశాస్త్రములభ్యసించి
యెఱుక సాధింపుడంచను విప్రునింట
యఱువదినాల్గువిద్యలు నభ్యసించి 310

—: శ్రీకృష్ణుఁడు గర్గ్యుని గురుదక్షిణఁ గోరుమనుట :—

గురువులఁబూజించి కొలిచి మన్నించి
"గురులార! యేనీకు గురుదక్షిణార్థ
మిరవార మదినున్నయీప్సితార్థములఁ
దరమిడికొనివత్తు దయ వేఁడు" మనిన
నతఁడు భార్యయుఁదాను నటవిచారించి
హితబలాఢ్యునిఁ గృష్ణు నెఱిఁగి యిట్లనియె.

—: ప్రభాసతీర్థమందు మునిఁగి చనిపోయిన కుమారుని
తెచ్చిపెట్టుమని శ్రీకృష్ణుని గర్గ్యుఁడు కోరుట :—

" తనర ప్రభాసతీర్థములోనఁదొల్లి
మునిగిపోయినపుత్రు మొగిఁదెచ్చియిమ్ము
[1]డిదిదుష్కరపుకార్యమిటు సేయుఁ"డనిన
యగుఁగాకయని ప్రీతి హలియునుదాను
నగణితాయుధపూర్ణమగురథంబెక్కి

—: శ్రీకృష్ణుని సముద్రుఁడు పూజించి వచ్చినపనిఁ దెలియఁ
జెప్పుమనుట :—

చనుదేర; నెదురేఁగి జలరాశి ప్రొక్కి
యనుపమదివ్యరత్నాళిఁబూజించి
" తామరసాక్ష! మానవ! లోకవంద్య!
ఏమి విచ్చేసితిరెఱిఁగింపు"మనుఁడు;
" తొడరి మాగురుపుత్రుని మ్రింగినాఁడ
వుడుకకఁదెచ్చి మాకొప్పించు" మనిన;
" నాకేమిపని యిది! నాలోననుండి
భీకరాకారుండు పృథుకంపురూపుఁ
డగురాక్షసుఁడుమ్రింగె" నని చెప్ప శౌరి
యగణితశక్తిని యంబోధినుఱికి
వేదచోరునిఁదొల్లి విదళించుభంగి
నాదుష్టదనుజుని యడగించి వాని
కడుపులోనున్న శంఖము పుచ్చుకొనుచు
తడయక వెడలి రథంబెక్కికదలి

---

[1] "డిది మాకు భిష్టమిది దుష్కరపుకార్యమిటు శేయుండనిన" అని వ్రాతము, దీనిని రెండు పాదములుగా విభజింప వీలులేనందున పైవిధముగా సరిదిద్ది యొక పాదముమాత్రమివ్వబడినది.

—: శ్రీకృష్ణుఁడు యమలోకమునకు వెళ్ళి గురుపుత్రుని యసువులను దెచ్చుట :—

కాలుని పురము దగ్గర వచ్చి శౌరి
కాలమేఘధ్వనిగతి శంఖరవము
సేసిన, యముఁడుగాసిల్లి యేతెంచి
యా శౌరి బొడగాంచి యర్థిపూజించి
"యేమి వేంచేసితిరిందిరాధీశ !
నామీఁద కృపఁ జేసి నాకెఱింగింపు"
మనవుఁడు "గురుపుత్రు నక్కటా! యేల
కొనివచ్చినాఁడవు? కోరి నాకొనఁగు"
మనవుఁడు సమవర్తి యావిప్రతనయుఁ
గొనివచ్చి వెసలోకగురునకు నిచ్చె.
ఏపార జమునింటి కేఁగిన సుతుని
కోపించి లావునఁ గొనివచ్చి శౌరి
గురులముందటఁ బెట్ట గోవిందుఁ జూచి
హరుషనిర్భరచిత్తుఁడై పలికెనతఁడు
"భూరిసత్త్వాఢ్యులు పుణ్యమానసులు
కారణపురుషులుగారె? ఎవ్వరికిఁ
జమునిల్లుఁ జొచ్చినఁ జత్తువుఁ దెచ్చు
నమితసత్త్వాఢ్యులీయవనిలోఁ గలరె?
నాకోర్కిఁ దీర్చితి నాపుత్రునిచ్చి
యాకల్పసుఖలీల యవుఁగాక మీకు".
అనియర్థి దీవించి యవ్విప్రవరుఁడు
తనర వీడ్కొల్ప నిద్దఱు రథంబెక్కి
యమరపట్టణతుల్యమై పొల్చు మధుర
కమరలోకార్చితులరుదెంచిరెలమి.

తల్లిదండ్రులకును దగునగ్రసేన
వల్లభునకు మ్రొక్కి వారిజోదరుఁడు
మతిసురాచార్యుఁడై మాన్యుఁడై పొల్చు
నతని నుద్ధవుఁడను యాదవుఁ జూచి

—: శ్రీకృష్ణుఁడు ఉద్ధవుని మందకుఁబుచ్చుట :—

తనరార మన్నించి తగఁ గౌఁగిలించి
కొని బుజ్జగించి మ్రొక్కుచు సిరివలికె.
“ ఏపార వ్రేపల్లెకేఁగి యానంద
గోపయశోదలఁ గోమరారఁగాంచి
మక్కువ వారినేమములెల్ల నడిగి
మ్రొక్కితినను, నేము మొగి తమ్ముఁజూడ
వచ్చెదమను, వేగ వసుదేవు దొంటి
యిచ్చటిచుట్టాలు యేమును గలసి
యున్నారమను, మమ్ము నగ్రసేనుండు
మన్నించునని చెప్పు, మందలోఁగల్గు
గోపాలకులనెల్లఁ గోరి వేర్వేర
నేపార నక్కునవిడినంటి ననుము;
ననుఁబాసి మదనబాణములలోఁ దారి
ఘనమైన విరహాగ్నిఁ గ్రాఁగుచునున్న
వల్లవసతుల నెవ్వగలెల్లఁ దీర్చ
నెల్లుటిలోననే నేతెంతుననుము
పొమ్మన్న” నయ్యదుపుంగవుఁడెలమి
క్రమ్మర రథమెక్కి కదలి మాపటికిఁ
గర మొప్ప రవికన్యకాతీరభూమి
బారి గిన్నరేశునిపురి గ్రేణిసేసి

సకలసంపదలకు సదనమై పొలుచు
నకలంకగతి మందకరిగె నుద్ధవుఁడు
తనరాక నెరిగింపఁ దగ నందుఁ డెదురు

—: నందుఁడు ఉద్ధవుని పూజించి శ్రీకృష్ణునివృత్తాంత మడుగుట :—

చనుదెంచి యతనికి సాష్టాంగమెఱఁగి
కొనిపోయి పెక్కుభంగులఁ బూజసేసి
యనుపమప్రీతిమై నర్ఘ్యాధనుని
యలవడ మజ్జనయాహారవిధుల,
నలయికఁ దీర్పించి యతనికిట్లనియె.
"దేవకియును వసుదేవుఁడు సుఖులె?
కోవిదగ్రామణి కొడుకులుఁ దాను
సురచిరప్రీతిమై సుఖమున్నవాఁడె?
హరిమమ్ముఁ దలఁచునే యప్పటప్పటికి?
సురలోకవైరిఁ గంసుని నేలఁగూల్చి
ధరణిరాజ్యము వానితండ్రికి నొసఁగి
యన్నయుఁ దమ్ముఁడు నతులితప్రేమ
నున్నారె సౌఖ్యులై, యుద్ధవాచార్య?
బలురక్కసులబారిఁబడి చావనీక
చెలఁగు మహాదావశిఖఁ గ్రాఁగనీక
యహివిషానలవహ్ని నడగంగనీక
మహనీయమగువాన మడియంగనీక
యప్పటప్పటికి మమ్మరసి గండములు
దప్పించి రక్షించె దానవారాతి.

కడపటఁ దనుఁజూడఁ గానక యేముఁ
బొడవడఁ బొక్కకఁబోలు రాఁడాయె;
నతనివిక్రమలీల లాత్మలయందు
సతతంబు దలఁచి నిశ్చలవృత్తులగుచు
ప్రేపల్లె విహరించు వెలఁదులుపతులు
నాపూర్ణధన్యులు యగుదురేప్రొద్దు
మాయింటఁబెరిగిన మందెమేలమున
నాయన్నదమ్ముల నాత్మజులనుచుఁ
దలఁతుము దేవతాతనువులు గాక
యిలనిట్టి విక్రమంబెవరికి గలదు?"

-: ఉద్ధవుఁడు శ్రీకృష్ణుని గుఱించి యశోదానందులకుఁ జెప్పుట :-

అనిపల్క నందుండు నయ్యశోదయును
మనమున హర్షించి ప్రమాన్పడి మేను
గదుపార హర్షాశ్రుకణములు దొరుగఁ
బొరిఁబొరిఁ జిత్రరూపులుభంగి నున్న
యాదంపతులఁ జూచి యనియె నుద్ధవుఁడు.
"వేదాంతవిదుఁడైన విష్ణునియందుఁ
బూని మీచిత్తాబ్జములుఁ బెట్టినారు
కాన యెందును బుణ్యకర్ములు మీరు.
కృష్ణ! జనార్దన! కేశవ! శౌరి!
విష్ణు! నారాయణ! వేదాంతవేద్య!
అని తలంచిన వారికఘములు వొలియుఁ
బెనుపార వారలఁ బెంచి పోషింప
మీభాగ్యమహిమకు మితి వేరె కలదె!

శోభనాఢ్యులమిమ్ముఁ జూడంగఁగలిగె;
హరికిని మీమీఁది యర్మిలి ఘనము
సారిది మిమ్మందఱిఁ జూడంగ వచ్చు
జననంబు మరణంబు శత్రులు హితులు
తనువులింద్రియములు తల్లిదండ్రులును
నతనికెవ్వరు లేరు యతఁడె యందఱికిఁ
బతి, జగత్పతి, రామపతి, సర్వసముఁడు,
నిర్గుణుండయ్యును నిఖిలంబుఁ ద్రావ
స్వర్గాదులకు వచ్చు సర్వాత్ముఁడతఁడు;
అతఁడు సర్వాత్ములయందె కాపుండు
నతనివ్యతిరిక్తమది లేదు దలఁప".
అనియిట్లు బోధించి నవ్విభావరియుఁ
జనియె నంతట గోపసతులొప్ప పెరుగు

-: ఉద్ధవుఁడు వ్రేతలఁ గన్గొనుట :-

ద్రచ్చుచు ఘుమఘుమధ్వనులతోఁగృష్ణు
సచ్చరిత్రముఁ బాడు సామగానములు
ఘోషింప నంతనర్కుఁడుదోఁప వినయ
భాషణుఁడగు నెదుప్రవరుఁడు వెడలి
యరదంబు వెస నెక్కి యమునకు నరిగి
తరమిడి కాలోచితంబులుఁ దీర్చి
చనుదెంచి వల్లవసతుల నీక్షించి
యనునయోక్తుల వారినందఱఁ బిలిచి
తప్పక కృష్ణుఁడు తమతోడ మున్ను
చెప్పినమాటలు నేర్పుగాఁ జెప్ప

విని గోపరమణులు వెఱఁగంది యతనిఁ
గనుఁగొని పలికిరుద్ధత బాష్పులగుచు.

—. విరహార్తలగు గోపభామినులు ఉద్ధవునిఁజూచి పలుకుట :—

"హరి నిన్నుఁబుత్తేర నరుదెంచి యంత
వరయశోదకును నవ్వార్తలుఁజెప్పి
యూరకే పోవేల? ఒగిమమ్ముఁ జూచి
చేరి స్వామిహితంబుఁ జెప్పెదుగాక!
ఇట నింక నెనరువారెవ్వరు గలరు?
కటకటా! మమ్మేల కమలాక్షుఁడడుగు?
అడిగెడివాఁడైన నరుదేఁడె యిట్లు
విడుచునే మమ్ము నీవిరహాగ్నినడుమ?"
అని పల్కి కృష్ణుని యంగంబుసోబగుఁ
దనుబారులీలలు, తనువుచిత్తమునఁ
గ్రొత్తైన విరహాగ్ని గురుసులు వార
నత్తలోదరులు సిగ్గరి యాడిపాడి
యొకయింతి కుసుమగుచ్ఛోద్ధూతమధువుఁ
బ్రకటితంబుగఁ గ్రోలి పాడుచున్న
మధుపంబుఁ జూపి నెమ్మది మాటువెట్టి
మధురగర్వోక్తి నున్మాదియై పలికె. 380

—: గోపికల విరహము :—

'చంచరీకమ! నీవు చంచలాత్ముఁడవు
వంచకుండవు పుష్పవతులఁ గీలింతు
నిలిచినకాలున నిలువవేప్రొద్దు

మలినాంగుఁడవు దానమహిమ కాసింతు
వెచ్చోటికైనను నేఁగుదుగాని
మచ్చిక కల్గునా? మరియొల్ల; నీవు
పక్షపాతివి నీవు బహుచుంబకుఁడవు
వీక్షింప నివి నైజవిద్యలు నీకు!
ఏలయ్య! మధుకర! ఈపుష్పరసముఁ
గ్రోలెడు వేడుకఁ గులకాంత మీఁద
నెయ్యంబు వదలెడు నినుఁబాసియంత
దయ్యదే నొవ్వదే దర్పకుఁజేత?''
అని పెక్కుభంగుల నన్యాపదేశ
మునఁ బల్కుచున్న యప్పొలఁతులఁ జూచి
యల్లన నుద్ధవుండాకృష్ణు మాట
లెల్లను బల్కుట యెఱిఁగి యిట్లనియె.

—: ఉద్ధవుఁడు గోపికల నూరార్చుట :—

'' దానతపోధ్యానధర్మవర్తనల
కైనను గలుగదీహరిభక్తి పెంపు
తనయులఁబతులను దల్లిదండ్రులను
యనుగులఁజుట్టాలనందఱి విడిచి
హరియందు మగ్నలు నై తిరిగాన
నిరవార మీభాగ్య మేమని చెప్ప!
హరి వేడ్క మీతోడ ననుమన్నపలుకు
వెరవేది చెప్పద వినుఁడు యింతటను
సర్వేంద్రియంబులు సమతఁ బోషించు
నిర్వికల్పజ్ఞానధియైన నన్ను

విరహాగ్ని నెపమున వెలుపల మఱచి
పరమయోగధ్యానపరులచందమున
పరమానురక్తి హృత్పద్మంబులందు
చిరలీల నిలిచి భజింపుటఁజేసి
మీతలంపులయందు మెలఁగుదుఁగాని
మీతో వియోగమేమియు లేదు మాకు
నిచ్చట పనిఁజూడ నెఱిఁగి మీకడకు
వచ్చెదనని యె నవ్వాసుదేవతనయుఁ"
డని చెప్ప, నుద్ధవాచార్యునిఁ జూచి
మనసిజోన్మాదులై మగువలిట్లనిరి.

—: గోపికలు శ్రీకృష్ణుని రూపును జేష్టలును వర్ణించుట :—

"నల్లని మేనున్నతమైన యురముఁ
దెల్లదమ్ముల మించు తెలిగన్నుఁగవయు
నెరిజడ చొల్లెము నిటలరేఖయును
జిరునవ్వుమోమును జేత వేణువును
నాయతబాహులు నధరంపుకెంపు
పాయక జగిమించు పసిఁడి చేలయును
[1]దలఁబురి పెనపు కదంబమంజరియు
ధళధళ వెలుఁగెడు దంతదీధితియుఁ
గలరూపు మోమున గట్టినట్లుండ
తలఁచకుండిన నుండు తలఁచిన నుండు
[2]కలలందు మాతోడఁ గవయుచు నుండు
నెన్నడు వచ్చునో యిందిరావిభుఁడు

[1] తలబిరి పెనపు. [2] ఈ పద్యపాద మొక్కటే కన్పడుచున్నది.

కన్నులాకలి తీర్పఁగలుగునో?" అనుచుఁ
తరుణులు ప్రేమనుద్ధవుఁ జూచి "మమ్ము
నెరవుగాఁ జూడక నిందు రమ్మనుచు
నిక్కడఁ గృష్ణుఁడు, ఇందఱుఁ జూడ
గొక్కరరక్కసుఁ గూల్చిన చోటు;
గిరికొని యున్నది కేళిమైఁజూడ
హరిచేత [1]గతజన్ముఁడఘదైత్యు డొక్క;
యాపులఁ గృపను మమ్మందఱిఁ గాచి
గోవిందుఁడెత్తిన గోవర్ధనాద్రి;
సఖులుఁ దానును శౌరి చల్దులు గుడిచి
సుఖలీల నుండిరి సురపొన్న నీడ;
నీసైకతస్థలి నిందిరావిభుఁడు
రాసకేళిఁ జరించు రమణులుఁ దాను;
జల్లని యీరూపచాయ మురారి
పిల్లగ్రోలూదు గోపికలాత్మ మెచ్చ;
నాపొన్నక్రిందఁబో హరి వేడ్క లెల్ల
గోపికలలుక గ్రక్కున మ్రొక్కి తీర్చె;
బలభద్రుఁడును దాను బసుల మేపుచును
యలమి చిమ్మనబంతు లిచ్చట నాడు;
పొలుచు నీగురివింద పొదరిండ్లలోన
జలజలోచనఁ గ్రీడ సలిపి మాధవుఁడు
అమ్మాని నీడ నాకిటిఁ గౌఁగిలించి
తమ్ముఁబ్రసాదించె తామరసాక్షుఁ"
డని పెక్కుభంగుల హరి విచారములు

[1] గతజన్మయఘదైత్యు డొక్క.

—: ఉద్ధవుఁడు గోపికల మాటలను విని వారి పుణ్యమునకై మెచ్చుకొనుట :—

తనరారఁజెప్ప నుద్ధవుఁడు చిత్తమున;
"వీరు ధన్యాత్ములు వీరు పావనులు
వీరికి శౌరికి వేరు లేదెందు
వీరలఁ గనుఁగొంట విష్ణునిఁగంట
వీరికై హరివచ్చి వ్రేపల్లెఁ జేరెగ
నిన్ని చందంబుల నీమందవారి
మన్నించి కృష్ణుఁడు మమత వాపించి 420
నామీఁదఁ గృపఁగల్గి నన్ను మన్నించి
యీమహాకార్యార్థ మిటు వచ్చె శౌరి
యిది జన్మఫలసార మిదిదోషమూర
మిదగదా సౌభాగ్య మిదిగదా యోగ్య',
మని సంతసిల్లుచు, నతివలుఁదాను
జనుదెంచి ప్రేమ మజ్జనభోజనములు
సలిపి, గోపికలు నిచ్చలు మానసములఁ
గలిసి చెప్పక విష్ణుకథలెల్ల వినుచు;
నందయశోదలున్నతిఁ గారవింప
మందవారెల్ల సమ్మతి విందులిడఁగ
నొకకొన్ని నెలలుండి యుద్ధవుఁడంత;

—: ఉద్ధవుఁడు మధురానగరికి మరలుట :—

యాకలంకగతి వారలనుపంగఁ గదలి
మధురకుఁ జనుదెంచి మాధవుఁగాంచి

మధురోక్తి నచ్చటి మాటలు చెప్ప ;
నందంద నడుగుచు నప్పటప్పటికి
మందలోఁగలుగు సేమములెల్ల వినుచు
ననుపమయోగవిద్యాలీల శౌరి
తనుఁబొందఁగోరిన తరుణి నెంతయును

—: శ్రీకృష్ణుడు కుబ్జయభీష్టమును నెరవేర్చుట :—

కరిగామియగు గంధకారకి యింటి
కరుదేర నది శౌరియడుగుల కెఱఁగి
మజ్జనభోజన మహితసౌఖ్యముల
నజ్జగన్నాథున కతిభక్తిఁ దనుపఁ
బువ్వులసజ్జపై పుండరీకాక్షుఁ
డవ్వేళఁ గృప నంగజాహవకేళి
దాని యభీష్టంబు దయనిచ్చె శౌరి

—: శ్రీకృష్ణుఁడు అక్రూరుని మందిరమునకుఁ జనుట :—

మానుగా నక్రూరుమందిరంబునకుఁ
జనుదేర నెదురుగాఁ జనియు నొండొరుకు
వినతుఁడై చనుదెంచి వేతెఱంగులను
గంధమాల్యాంబరఘనభూషణముల

—: అక్రూరుఁడు శ్రీకృష్ణుని స్తుతియించుట :—

బంధురార్చనలిచ్చి ప్రణుతుఁడై నిలిచి
" మాన్యుఁడనైతిని మత్కులంబెల్ల

ధన్యమై వెలుఁగొందె తామరసాక్ష!
కులముద్ధరించితి కులశైలధైర్య!
నీవె భూతంబుల నెరయఁబుట్టించి
ప్రోవనడపఁగనోపు పురుషుండ వీవ
[1]సకలంబుఁ గనుఁగొను సాక్షివి నీవ
వసుదేవునకును దేవకికుద్భవించి
వసుధభారము మాన్పి వైరుల నడఁచి
యక్షయ! నీచేత నసురసైన్యంబు
లక్షోహిణిశతంబణఁగిపోగలదు;
దేహబంధంబులుఁ దెలియంగ లేక
మోహాంధుఁడైన నామోహపాశములఁ
దెగఁగోసి నాకోర్కి తెఱవానతిమ్ము
సగుణానిర్గుణారూప! సత్యసల్లాప!"
అని వేడుకొనియెడు నక్రూరుఁ జూచి

—: శ్రీకృష్ణుఁడు అక్రూరుని పాండవులసేమము నరయుటకై హస్తినాపురికిఁ బుత్తెంచుట :—

" అనఘ! పితృవ్యుండ వాత్మబంధుఁడవు
సరసవాక్ప్రౌఢిని సౌమ్యచిత్తుఁడవు
పరమాప్తుఁడవు మాకు బంధులలోన
నీయట్టి చెలికాఁడు నీయట్టి సుకృతి
నీయట్టి సుజ్ఞాననిధి యెందుగలఁడు?
మాతండ్రియట్లట్ల మమ్ము శిక్షించి

[1] పద్యపాద మొక్కటి కన్పడకున్నది.

యీ తెఱంగని చెప్పు దేకార్యమైన ;"
ననిపల్కి కమలాక్షుఁడక్రూరుఁ జూచి,
తనరార బాంధవత్వముఁదోఁపఁ బలికె.
"ఆనకదుందుభియనుజ ! ధర్మాత్మ !
మేనత్త మాకు నర్మిలి తల్లికంటె
పెనిమిటి గడచన్న బిడ్డలుఁదాను
మనపట్టు లేక యున్నలికతోఁగొంతి
క్రూరాత్ముఁడగు బావ కుదురునేయున్న
యారాజ పుత్రులు యసమసాహసులు
తమ్మునిపాలుఁ దత్తనయులకిచ్చి
నెమ్మదినుండగ నేరఁడాన్నృపతి
వారికి వీరికి వసుధకై పోర
నీరసంబున మీఁద నెట్లుగాఁగలదో ?
కరిపురికేఁగి యక్కడ పాండుసుతుల
నరసి యిచ్చటి సేమమంతయుఁ జెప్పి
[1]గర్వితుఁడగు కంసుఁ గడపి తజ్జనకు
నుర్వి యేలింపుచున్నారమనుము
ధృతరాష్ట్రుచందంబుఁ దెలిసి
మతులెల్లఁదెలిసి క్రమ్మర వేగరమ్ము
పొమ్మందఱకుఁగట్నములు ప్రణామములు
నిమ్మంచు" దెప్పించి యిచ్చి యాలోన
నుద్ధవుండును దాను నొగియింటి కరిగి
బద్ధానురాగుఁడై పద్మాక్షుఁడుండె.

---

[1] దర్పితుండగు కంసవిద్రుంచి తజ్జనకు.

—: అక్రూరుఁడు హస్తినాపురిఁ బ్రవేసించుట :—

అరుదార నక్రూరుఁడట రేపఁగదలి
యరదంబు వెసనెక్కి హస్తినాపురికి
నరిగి యాధృతరాష్ట్రు నలమొగసాల
నరదంబు డిగిపోవ నటయింద్రులీల
కొలువిచ్చి యున్న యాకురురాజుఁ గాంచి
యలసతఁజని యల్ల నడుగులకెఱఁగ
గద్దియపైనుండి కౌఁగిటఁజేర్చి ;
గద్దియఁ దనగద్దెఁ గదియఁబెట్టించి
యర్ఘ్యపూజలఁదన్ప నక్రూరుడంత
హరియిచ్చు కట్నంబు లారాజుకిచ్చి
సేమంబులడిగి తత్సేమంబుఁజెప్పి
ప్రేమకాలోచితప్రియములుఁ బలుక
విడియంగఁ బంపించి విదురుని యింట

—: అక్రూరుఁడు విదురునియింట విడియుట —

విడియు మట్లని చెప్పి వీదుకొల్పుటయు ;
నతని మందిరమున కరుగంగ విదురుఁ
డతులితగంధపుష్పార్చన లిచ్చి
పొలుపార మజ్జనభోజనవిధులు
సలిపి యిద్దఱు మృదుశయ్యల నుండి
హరి జనించిన మొదలై, వచ్చి మధుర
దొరసి యేలుచునుండఁ దుదియైనలీల
లక్రూరుచే విని హర్షాశ్రులొలుకఁ
జక్రాయుధునిఁ దల్చి సాష్టాంగ మెఱఁగి

పులకలు మైఁగ్రమ్మఁ బుండరీకాక్ష!
జలశాయ! గోవింద! శౌరి! శ్రీకృష్ణ!
అని భక్తిఁ గీర్తించి యతనిఁ దోడ్కొనుచుఁ
జనుదెంచి పాండుని సతి యింటికడకు

—: అక్రూరుఁడు కుంతీదేవినిగాంచి కుశలప్రశ్నఁ గావించుట :—

నరుదేరఁ గొంతియు నక్రూరుఁ జూచి
కరచకితాస్యయై కన్నీరు దొరఁగ
నెలుఁగెత్తి యేడ్చుచు నెడయైన వగలఁ
బలుమారు పలవింపఁ బడఁతి నూరార్చి
ధర్మనందనవృకోదరపార్థకవల
నర్మిలి కౌఁగిట నంతంతఁ జేర్చి
యందఱ మణిభూషణాళిఁ బూజించి
కాందినీసూనుఁడా కమలాక్షి కనియె.
"అమ్మ మీ మేనల్లుఁడమరేంద్రవంద్యుఁ
డమ్మకుందుఁడు మిమ్ము నరయఁ బుత్తెంచె.
పాండుమహీపతి పరలోకమరుగ
నిండిన వగలతో నీవుఁ బుత్రులను
యిచ్చటి కరుదెంచి రెఱిఁగి రమ్మనిన
వచ్చితి, నచ్చట వసుదేవుఁడొంటి
మనవారలెల్ల నెమ్మది నున్నవారు
ఘనపాపకర్ముని గంసునిఁ ద్రుంచి
ధరణిరాజ్యము వాని తండ్రికి నిచ్చి
హరియెల్ల శత్రుల నణఁచుచున్నాఁడు;
తగిన మీకిట్టిదుర్దశ వొందు టెఱిఁగి

వగచుచునుండు నావసుదేవసుతుఁడు;
తనపుత్రులట్ల తాఁదలఁచి నీసుతుల
యనుఁగొప్ప బ్రోచునా యాంబికేయుండు?
దుర్యోధనాదిపుత్రులు వీరితోడఁ
గ్రౌర్యంబు లెడబాసి కలసియుండుదురె?
పండిత సామంత బంధులు మిమ్ముఁ
బాండుఁ గొల్చినయట్ల భజియింతురమ్మ?"

—: అక్రూరునితోఁ గుంతి తనకష్టములను జెప్పుట :—

అనిపల్కుటయుఁ గొంతి యక్రూరుఁ జూచి
యనుకంపతోడ నిట్లని యల్లఁబలికె
"ఆరాజు సముఁడౌను యతని నందనులు
క్రూరులు ప్రజ వీరిఁగొలువంగనీరు.
అదిగాక బిడ్డల నందఱిఁద్రోచి
మదిఁబూని బంధించి మడుగులోపలను
గరళంబు పెట్టించి ఘనసర్పవితతి
పరువడి గరపింపఁ బ్రాణగండములుఁ
దలఁచిన వీరును తప్పఁగాఁగొనరు
వలదని సుతులను వారింపఁడతఁడు
దైవంబుకతన నింతలు బారులడఁగె
గోవిందుతోడ మాకుశలంబుఁ జెప్పు
పుట్టిన యిల్లునుఁ బొరిఁజొచ్చినిల్లు
నిట్టిదె మాభాగ్య మేమంచు వగవ
దేవకి కడుపున దేవేంద్రవంద్యుఁ
డావిష్ణుఁడుదయించునని పెద్దలాడఁ

బలుకులు విందు నా భాగ్యంబు కతనఁ
దలఁచిన తలఁపులు దలకూర్చె దైవ
మ''ని చెప్పుటయు విని యక్రూరుఁడంత
వినయంబుచేఁగొని విదురుఁడుఁ దాను

—: అక్రూరుఁడు కుంభజాదులయిండ్లకుఁ జనుట :—

దుర్యోధనాదిపుత్రుల గుంభజాది
యార్యుల కర్ణాదులగు యోధవరుల
నాపగా[1] దాయాదులగు బంధుజనుల
నేపారఁగని వారియిండ్లకు నరిగి
కుతుకంబుతో నందు కొన్నాళ్లు నిలిచి
ధృతరాష్ట్రుకడ కేఁగి తెంపును దగవు
[2]హితవును ధర్మంబు నేర్పడఁ బలికె

—: అక్రూరుఁడు ధృతరాష్ట్రునికి హితోక్తులనుడువుట :—

"ధరణీశ! నీవును ధర్మచిత్తుఁడవు
భరతవంశాఢ్య! నీ ప్రతియవ్వరెందు!
పాండుభూపతి నీకుఁ బరమభక్తుండు
దండివీరుఁడు నిన్ను ధరణి యేలించె
నాతని పుత్రులకతిబలాఢ్యులకుఁ
బైతృకంబగు రాజ్యభారంబుఁ బంచి
యిచ్చిన నీకుఁ బెంపెక్కు లోకములఁ
[3]బాచ్చంబుఁగల్గఁ బోవుదువధోగతికి

---

[1] తనయాదులగు. [2] ఈపద్యమునకుపాద మొక్కటే కన్పట్టుచున్నది. [3] బాంచంబు గలిగిన బోవధోగతికి.

నీపుత్రమిత్రులు నీశరీరంబు
నీపురి యీరాజ్య మింతయు మిథ్య
మేలుఁగీడను గడ మిమ్మొందుఁ గాని
కాలంబుచేతఁ గ్రాఁగని వారు లేరు
హరి పాండుపుత్రుల కాత్మబాంధవుఁడు
హరిసంతసించుట యదిలెస్స మనకు
చిత్తమేభంగిరో చెప్పితి' 'నంత
నుత్తరంబీఁజూచి యొయ్యనఁ బలికె
“నీవాడినన్నియు నిజమంటి, తెఱఁగుఁ
గావింతు నటదైవగతి యెట్టిదగునో!
అమృతతుల్యములు నీవాడు వాక్యములు
కమలనాభునకు నీక్రమ మెఱిఁగింపు.”
మనిపల్క, హరికుపాయనమిచ్చి యతనిఁ
దనరారఁ బూజించి దయవీడుకొల్ప
నరిగిపాండవులతో నంతయుఁజెప్పి
యరయ సౌఖ్యమునొంది యక్రూరుఁడంత. 510

—. కంసుని భార్యలు మగధేనునివద్ద మొఱయిడుట :—

అస్తియు............ నను కంసుభార్య
లస్తికుండను మగధాధీశు సుతలు
హరిచేతఁ దమభర్త యడఁగిన దుఃఖ
పరవశలై తండ్రిపాలికేతెంచి
యడుగులపైఁబడి యడలూనఁ జెప్పఁ

---

1 సుమిత.

గడురోషభీషణాగ్రహవృత్తిఁ బలికె
“ ఏమేమిరా! కృష్ణుఁడే యింత సేసె!
భూమినయాదవంబుగ సేయవలయు ”

—: మగధేశుఁడు యాదవులపై దండెత్తుట :—

ననిపల్కి, యందంద ననిభేరి వ్రేయ
ఘనభాంకృతుల నబ్ధిగలఁగ సైనికుల
వీక్షించి మొనలేర్చి యిరువదినాల్గు
యక్షోహిణులఁగూడి యటవచ్చి మధుర
వెడలె మైముచ్చుట విడిసిన ప్రజను
వాడకుండ శ్రీకృష్ణుఁడుగ్రసేనాదు
లగువారుఁ దానుఁ గార్యాలోచనంబుఁ
దగఁజేయ వేగ నందఱుఁజూచుచుండ

—: యాదవమాగధుల యుద్ధము :—

దివ్యరథంబులు దివ్యాయుధములు
నవ్యోహాగతివచ్చి హరిప్రోల నిలిచె
నప్పుడు కమలాక్షుఁడన్న వీక్షించి
“ తప్పకచూడు యాదవకోటినెల్ల
మడియఁగాలంబన మనమీఁద నాజి
నడచి వచ్చిరి వీరి నడఁపక నుండ
నొండుపాయంబున నుడుగునే వీఁడు ?
దండిమీరిన యాయుధంబులుఁ బూను ”
మనవుఁడు ముసలము శూలమునుఁ బుచ్చు

కొని దివ్యరథముపైఁ గొమరారె సీరి,
హరి శంఖచక్రగదాదిశార్ఙ్గముల
ధరియించి కరమొప్పఁ దనరథంబెక్కె
మేరుశిఖరముల మెఱుఁగులతోడ
సారమై బహువిధచ్ఛాయలఁ గలిగి
[1]ధారాధరము బంగిఁ దనరారెఁ జూడ;
నాలోన వృష్ణిభోజాంధకాధిపులు
నేలఁబట్టవియించి నిష్ఠురోక్తులను
కరిఘటాబృంహితఘననేమిరావ
తురగఘోషితరావతూర్యముల్ మ్రోయఁ
బురికొని వెడలి యార్పులు నింగి ముట్టఁ
బరవసంబునఁ దాఁకెఁ బరగ సైన్యములు;
నేలయీనిన భంగి నిగిడి "యే మేము
చాలుదుమనివచ్చు" సైనికోత్తముల
యురుపాదహతులను నొర్వర దివికి
నరిగెనో యన ధూళి యర్కునిఁ గప్పె;
నప్పుడు గోవిందుఁడఖిలసైనికులు
నుప్పొంగ నిజశంఖ మొత్తె, నొత్తుటయుఁ
బెదరె దిగ్గజములు, భీతిల్లెదిశలు,
కదలె కులాద్రులు, కలఁగె వారిధులు
వంగె మేరువు ధరావలయంబు దిరిగె,
క్రుంగెఁ గచ్ఛపరాజు, ఘూర్ణిల్లె నభము,
కెరలి సేనలు పెల్లగిలి పారఁజూచె
శరపరంపరలు భీషణముగా నిగిడి

[1] ఒకపాదము కన్పడుచున్నది.

కరములు దునిసి యంగంబులు నాటి
శిరములు వెసఁ ద్రుంచి శిడములు నఱికి
బరులు ప్రక్కలు వాపి పదములు విఱిచి
కత్తిళంబులు చించి కంఠంబు లెడపి
నెత్తురు వెడలించి నెనళ్లు గలఁచి
కండలుఁ దెగఁజెండి గాత్రంబు లడఁచి
గుండెలుఁ గూల్చి ప్రేగులు వెల్వరించి
బొమ్మిడకల్ రాల్చి బొడగలుఁగూల్చి
యెమ్ములు నలిసేసి యెఱచులు చదిపి
పోరి వీరి వారినిఁ బోలింపరాక
బెరసె పీనుగులై పృథివియంతయును ;
హాలికుండు నఱికిన యడవిచందమునఁ
గలసి కాల్వురు చాపకట్టుగాఁ బడిరి
ముండఱ బయలైన మొనసి రావుతులు
యుండఱు నొక్క సాహసకేళి సలిపి
తురగంబు రవుతును దునుకలై పడఁగఁ
దరవలికత్తి నుద్ధతి మొత్తువారు
లవుణిఁ ద్రవేశిన మేను లవుణియై తిరిగి
తివిరి ఖడ్గంబులఁ దెగవ్రేయు వారు
యంతళంబుల మేను లండంద పొడువ
నెత్తురు వఱ్ఱులై నేలఁ గూలువారు
మునిగాళ్లు తెగి వాహములు వ్రొగ్గ సరకు
గొనక మార్తురమ్మని కొనునాశ్వికులును
యమ్ములు తగనాట యావలవెడలి
బొమ్మలక్రియఁ గూలి పోలయు గుఱ్ఱములు

తుండంబు కొమ్మును దునియ రొఁజుచును
గొండలవలె వ్రాలు కుంజరంబులును
నొగలూడి యిరుసులు నులిసి చక్రములు
పగిలి రథంబులు ప్రాణంబు లెడలి
రథికులు మడిసి సారథులుర్విఁ గూలి
రథములు వికలమై రణభూమి నిండె.
కీలాలనదులలోఁ గీలాలకేళి
నోలలాడుచునుండు నోలిభూతములుఁ
గంకగృధ్రాదుల కలకలంబులును
బింకంబుతో నాడు భేతాళములును
గొడుగులచిప్పలు గుబురులై పడిన
పడగలు తుమురైన బహుశస్త్రములును
నాడెడు నట్టలు హతవీరవరుల
నాడకుఁ గొనిపోవు నమరకామినులు
నీభంగి రణభూమి యొసఁగి చూడ్కులకు
బీభత్సరవములు బెరసి యాలోన
సరభసంబున జరాసంధుఁడు తరుమ
భరమంది యాదవబలమోహటించి
[1]విరిసినసేనఁ గవిసి యార్చుచును

—: శ్రీకృష్ణబలరాముల యుద్ధవర్ణన .—

తరమి యుద్ధతలీలఁ దాలాంకుడంత
నరదంబు వరపించి యట్టహాసమున
శరలాఘవమున భీషణవృత్తిఁ గురియ

[1] విరిసినకానపైని.

మ్రగ్గె నేనుఁగలు మడిసెగాల్బలము
మ్రొగ్గె రథములశ్వములుఁ గీటడఁగె.
అక్షీణబలశాలియగు సీరిచేత
నక్షోహిణులు పడి యవనిపైఁగూలె.
గరుడకేతనకాంతి గగనంబుఁ గప్ప
యరదంబు రప్పింప హరి యాజికెుఱఁగి
పటుశౌర్యనిర్ముక్త బాణజాలముల
విటతాటమై కూలె వీరసంఘంబు
హరివజ్రహతిఁ గూలె నటవారణములు
తరిమి కృష్ణుని చక్రధారలచేతఁ
బరివరలై మ్రొగ్గె బహుశతాంగములు
దనుజారి నందకదారుణహతుల
తునకలై ధరవ్రాలె తురగసంఘములు
నడవులనేర్చు దావాగ్ని చందమునఁ
గడువడి శౌరి సంగరకేళీ సల్ప
నతనితోఁబద్నాలుగక్షోహిణులును
హతమయ్యె వెస బ్రహరార్ధమాత్రమున

—. తనసైన్యముయొక్క పాటును జూచి జరాసంధుఁడు విజృంభించుట :—

నంతట మగధేశుఁడాత్మసైన్యంబు
నంతకుకడ కేఁగుటంతయుఁ జూచి
ఘనరోషలయకాలకాలునిభంగి
తనర ధనుర్గుణోద్ధతి సింహనాద

[1] మ్రొగ్గె.

నేమి నిర్ఘోషంబు నెరపంగ రథము
కామపాలుని తేరుఁ గదియించి పలికె.
"చిన్నవాఁడవు మున్ను భీమసంగ్రామ
మెన్నఁడైనను జూచి యెఱుఁగుదే(నీవు)?
పటుశత్రువనదావపావకుండనఁగ
నిటు జరాసంధుని నెఱుఁగవే తొల్లి?
తలఁ గోసి వేసెదఁ దరలక నిలువు
కలఁచి నాయల్లునిఁ గ్రక్కుంతుననుచు;"
యమ్ములు వఱగించ యందంద సీరి
యెమ్ములుఁ గీలింప నెంతయు నలిగి
యేమిటికీరజ్జలిటు ప్రేలెదనుచు
నామహాబలశాలి యరదంబు డిగ్గి
వానకుఁ దలవంచి వచ్చు గోరాజు
పూనికె వాని యమ్ములు లెక్కఁగొనక
ముసలంబుఁగొని హయంబులఁ జావ మోది
యెసఁగి సూతుని తల నిల డొల్లవ్రేసి
కదిసి జరాసంధు కాయంబు మోముఁ
జదియంగ నడిచి నిశ్చలితుగాఁ జేసి
పెడకేలుఁ గట్టి యాభీమవిక్రముఁడు
పెళపెళ నార్చినఁ బేర్చి సైన్యములు
పటహశంఖారావపటుసింహనాద
చటుల ఘోషముల దిక్సంధులు పగిలె.

—:కట్టువడిన జరాసంధుని శ్రీకృష్ణుడు దయచే విడలి పుచ్చుట:—

కడువేగ హరివచ్చి కరుణమై నతని

విడిపించి యనిపిన వెలవెల నగుచు
నసిహేతి హతశేషులగు వారుఁ దాను
మసలకఁ జనియె నమ్మగధభూవిభుఁడు
జయముఁ జేకొని రామజలజాక్షులంత
జయజయధ్వనులును సామగానములు
వందిమాగధభాగవతసంఘనినద
మందంద మ్రోయఁగ నమరేంద్రు లీల
పురము సొత్తెంచి యిమ్ముల రాజ్యభోగ
వరసౌఖ్యలీలల వ్రాలుచు నుండె
నాలో జరాసంధుఁడఖిల బాంధవుల
నాలోచనము సేసి యప్పుడెంతయును
నలువొంద నిరువదినాలుగక్షోహి
ణులుఁ గూర్చి మధురమున్నఁగ వచ్చి ముట్టి
వదలకఁ దొంటికై వడి నొచ్చి పోయి
పదునెనిమిదిమార్లు బవరంబు సేసి
హరితోఁ జరాసంధుఁ (డావహకేళిఁ)
బరిభవంబందుట పరికించి చూచి

—: నారదుని ప్రోత్సాహముచే కాలయవనుఁడు సైన్యముతో జరాసంధునకు సహాయుఁడై వచ్చుట :—

యారూఢుఁడగు కాలయవనునితోడ
నారదుఁడెఱిఁగింప నలివాఁడు కదలి
ఘోరసత్త్వుల మూఁడుకోట్లను నేర్చి
శౌరిపై దండెత్తి చనుదెంచె నంత;

—: జరాసంధకాలయవనుల దాడినిఁ జూచి శ్రీకృష్ణుఁడు
క్రొత్తపట్టణమును నిర్మించుట :—

హరి రాముఁడును దాను నటు విచారించి
"పరఁగ యాదవులకాపద వచ్చెఁ జూడు
డిదె వచ్చె బలవంతుఁడీ కాలయవనుఁ
డదె జరాసంధుఁడు నటవంక వచ్చె
నేదికార్యము ? మనకీ ప్రోలనుండ
రాదు ; నాశమునొందుఁ బ్రజయెందు నున్న
ననిపల్కె ; గోవిందుఁడబ్ధిఁ బ్రార్థించి
చనుదెంచి దేవతాశైలంబుపొంతఁ
గరమొప్ప విశ్వకర్మ రావించి
పురము నిర్మింపఁ బంపుటయు నతండు
బహువప్రగోపురభర్మహర్మ్యముల
బహురత్నకనకవిభ్రమచిత్రితముల
తతి చెలంగగను ద్వాదశయోజనములఁ
జతురశ్రమంబుగా సౌభాగ్యలీల
వలను మీరఁగ ద్వారవతి యనుపేరఁ
గలిగింప నప్పురిఁ గని సంతసిల్లి
తనరారఁ బారిజాతము సుధర్మమును
యనిమిషేంద్రుఁడు శౌరివీథిఁ బుత్తెంచె
ధనదునిఁ దలఁచిన దన మహాద్రవ్య
మెనిమిది కోశంబులిచ్చి పుత్తెంచె.
అధిక యోగారూఢుఁడగు ముకుందుండు
మధురలోపలఁ[1] తన్ను మఱచి నిద్రించు

[1] నాడ

జనుల నెత్తుక రాత్రి చని ద్వారవతినిఁ
దనరు మందిరములఁ దగుభంగి నునిచి
మరలి సీరయుఁదాను మధుర కేతెంచి

—: శ్రీకృష్ణుఁడొంటరిగా కాలయవనునికడకుఁ జనుట :—

హరి నిరాయుధలీల నట కాలయవను
కడకు నిర్భయత నొక్కరుఁడు నే తేరఁ
గడుసోద్యమంది యక్కమలాక్షు నెఱిఁగి
యదరి దిగ్గనలేచి యటఁ గాలయవనుఁ
డదనయ్యె నదె పట్టుదని వెంటఁదగుల
హరి వానిఁ గడపట నందంద పరువ
వెరవేది వాఁడును వెనుకొని పలికె
" వీరధర్మము మాని వెలివారు నగఁగ
నీరీతిఁ బారుట యిది బంటుతనమె?
పగవాఁడు నీవెంటఁ బడ సిగ్గుమాలి
తెగిపారఁ బ్రాణంబు తీపటె కృష్ణ!
పోవకు పోయినఁ బోరిగొందు ననిన "

—: శ్రీకృష్ణుఁడు వెంటఁ దఱుముచున్న కాలయవనుఁడు చూచుచుండగా నొక కొండగుహను బ్రవేసించుట :—

నావిష్ణుఁడదరి మహాద్రిగహ్వరముఁ
జొచ్చిన వాఁడును జొచ్చి తోడ్తోన
నచ్చోట సుఖసుప్తుఁడగు పుణ్యుఁగాంచి
హరి యదృశ్యుఁడైన యట నిద్రనొందు
నరుఁగాంచి యతఁడు నున్నతప్రీతిఁ బలికె

—: శ్రీకృష్ణుఁడను భ్రాంతిచే కాలయవనుఁడు ముచుకుందుని లేపుట :—

" ఓరి ! గోపాలక ! ఓర్వక వెఱచి
దూరించి వెడఁగుసందులుఁ జొచ్చి యచట
నిద్రపోయినఁ బోదునె ? నిన్ను దీర్ఘ
నిద్రఁ బుచ్చెదనంచు నిగుడి తాఁకటయుఁ
బెద్దకాలుము నిద్రఁ బేర్చిన పుణ్యుఁ
డద్దురాత్ముఁడు చావ నట మేలుకాంచి
యీక్షింపఁ గాలాగ్ని యెరఁ గాలయవనుఁ
డాక్షణంబున భస్మమై పోయె ననుఁడు

—: ముచికుందుని వృత్తాంతము :—

" ఎవ్వఁడా పురుషుఁడం దేల నొక్కరుఁడు
నవ్విధి నిద్రితుఁడై యుండఁ గోరె ?
అతని చూపులఁ గాలయవనుఁడు కాల
గతమేమి ? ఆయనకథఁ జెప్పవలయు "
ననుఁడు నాశుకయోగి యారాజచంద్రుఁ
గనుఁగొని విస్మయకలితుఁడై పలికె. 620
కురువిభుఁడిక్ష్వాకుకులవార్ధిచంద్రుఁ
బరహితచంద్రుఁడు ప్రథనసాహసుఁడు
మాంధాతసుతుఁడు నిర్మలమతి సత్య
సంధాస్యుఁడఖిలరాజన్యశేఖరుఁడు
ముచికుందుఁడను వాఁడు మును దేవతార్థ
మచలితస్థితిఁ బోరి యసురులనోర్చె.
అతనిని మెచ్చి యింద్రాదిదేవతలు

యతులితంబగు వరమడ్గవే యనిన
నారాజు పెక్కండ్రు యసురులతోడఁ
బోరాడి తనియకవో నిద్రఁ బోవ
"వరమిందు నన్ను నెవ్వఁడు మేలుకొలుపుఁ
బొరివాఁడు భస్మమై పోయెడు" ననుచు
దివిజుల వీడ్కొని ధృతి నొక్కశైల
వివరంబు సొచ్చి యవ్విధి నిద్రవోంద
హరిమాయఁ బడెఁ గాలయవనుఁడీరీతి.

—: ముచికుందుఁడు శ్రీకృష్ణునిఁ గాంచుట :—

ధరణీశవర్యుఁడంతట లేచి వచ్చి
జలజాక్షు దేహతేజస్స్ఫూర్తి బిలము
వెలుఁగొంది చీఁకటి విఱియుటఁ జూచె.
ఆయతాంబునేత్రు నతిదీర్ఘబాహు
తోయదనీలాంగు తుహినాంశువదను
గనకపీతాంబరుఁ గౌస్తుభోద్భాసి
వనమాలితోరస్కు వారిజనాభు
మకరకుండలదివ్యమకుటకేయూరు
వికసితాలంకారు విష్ణునిఁ గాంచి
వెఱఁగంది యందంద వెఱచి గోవిందు
నెఱుఁగక ముచికుందుఁడిట్లని పలికె.
"హరివహ్ని శశిభానులందొక్కదివ్య
పురుషుఁడవో? కాక భువిఁబుట్టి తేజ
మెవ్వరికున్నదిం దేల విచ్చేసి
తెవ్వరు నీ నామ మెఱిఁగింపు మనిన.

—: శ్రీకృష్ణుఁడు ముచికుందునకుఁ దన వృత్తాంతము
నెఱుఁగఁ జెప్పుట :—

" వసుదేవతనయుఁడ, వాసుదేవుఁడను
నసమసాహసుఁ గంసు నవలీలఁ జంపి
మసలక రాక్షస మథనంబు సేసి
మధురాపురంబు నెమ్మది నేలుచుండ
నధికసత్వుఁడు కాలయవనుఁడే తెంచి
నలిమీఱి మాపట్టణము నిరోధింప
నెలయించి యాతని నిటు తోడి తేర
నీకోపశిఖచేత నీరయ్యె నాతఁ
డేకతంబీ గుహ నేల యున్నాఁడ?
వాదిరాజులకంటె నధికుండవైతి
మేదినీశ్వర! నిన్ను మెచ్చితి వరము
పోఁడిగా నిచ్చెదఁ బోరి నేదియైన
వేఁడుము!" వన్న వినతుఁడై పలికె.
" దివ్యతేజోమయ! దేవేంద్రవంద్య!
అవ్యయాత్మజ! కృష్ణ! అంభోజనయన!
భక్తపరాధీన! భక్తలోకేశ!
భక్తవ్రజత్రాణ! పరమకల్యాణ!
రాజ్యంబు సేసి యారాజులలోన
పూజ్యుఁడనై మని పుత్రులఁ గంటి
ధనధాన్యవస్తుసంతతియందు నాకు
మనమురోయుట సేసి మదికోర్కులుడిగె
నేకర్మములు మాని యీగుహాంతమున
నేకచిత్తుండనై యిట నిద్రవోవ

నామీఁదఁ గృపఁగల్గి నన్ను మన్నింప
నీవిందు విచ్చేసితేఁ గృతార్థుఁడను ;
బ్రహ్మయోగీంద్రులు భావింపలేని
బ్రహ్మమై తోఁచు నీపదపంకజములుఁ
గనుఁగొంటి నీదు లోకముఁ బ్రసాదింపు
వనజాక్ష ! ఏనొండు వర మొల్ల " ననుఁడు

—: శ్రీకృష్ణుఁడు ముచికుందునకు వరము ప్రసాదించుట :—

" రాజవై యుండియు రాజధర్మములు
యోజఁ దప్పక యుండియును మృగహింస
మాని చిత్తమునఁ జిన్మయుఁడగు నన్నుఁ
బూని నిల్పితిగానఁ బొలిసెఁ బాపములు
భావిజన్మమున విప్రత్వంబుఁ దాల్చి
సేవకోత్తమ ! నన్నుఁ జెందెద" వనుచు
ముచికుందు బోధింప మొగి నమ్మహీశుఁ
డచలితంబగుభక్తి నందంద మ్రొక్కి
హరికిఁ బ్రదక్షిణమై వచ్చి నృపతి
గురుతరంబగు శైలకుహరంబు వెడలి
యతిసూక్ష్మతర దేహులగు మనుష్యులను
నతిసూక్ష్మతరువుల నందంద చూచి
కలియుగంబున వెళ్లఁగా నోపు ననుచుఁ
దలఁచుచు గంధమాదనముల కరిగి
బదరికావనభూమిఁ బద్మాక్షు నాత్మ
వదలక ఘనతపోవరనిష్ఠనుండె.
హరి కాలయవనుని యడఁచి యమ్మధుర

కరిగి తత్సేనల నవనిపైఁ గూల్చి
వాని ఘోటకమణి వారణావళుల
మానైన హాటకమణి కడంబముల
ద్వారావతికిఁ బుచ్చి తానుసీరియును
నారూఢజయకాములై యుండిరంత.

—: మరల జరాసంధుఁడు శ్రీకృష్ణునిపై దండెత్తుట :—

నట జరాసంధుఁడు నత్యుగ్రలీల
భటకోటిరథకరిప్రకరంబుఁ గూర్చి
యీక్షింప నదిగాక యిరువదినాల్గు
యక్షోహిణులు దాను నట దండువచ్చి
మధురపై విడిసిన మదిఁజింత వొడమి
మధువైరి హాలియు నమ్మగధేశుకడకు
నల్లనఁ గాల్నడ నరుదేర వీర
లెల్లను జూచి వీరెవ్వరో యనఁగఁ
జని జరాసంధుఁడచ్చటఁ గోపుఁడగుచు
వెనువెంట నడువంగ వెఱచిన భంగిఁ
బరువంగ మగధాధిపతి సేనతోడ
నరిమురిఁ దరుముంగ నతిదూర మరిగి

—: హర్షాచలముపై నెక్కిన బలరామకృష్ణులను జూచి జరాసంధుఁడు కొండకు నిప్పంటించుట :—

హరియు రాముఁడుఁ దాను హర్షాచలంబుఁ
దరమిడి నెక్కి నుద్ధత జరాసంధుఁ
డాకొండ దిరిగిరా ననలంబు వెట్టి

చేకొని కాల్పఁగా సీరియు హరియు
వారుఁ గానక యుండ వడిదిగ నుఱికి
ద్వారకాపురికి నిద్దఱు నేఁగిరంత.

—: బలరామకృష్ణులు నిప్పులోఁ మాఁడిరని తలంచి
జరాసంధుఁడు మఱలిపోవుట :—

నాలో జరాసంధుఁడా గోపవరులఁ
గాలి చచ్చిన వారిగా నిశ్చయించి
యగణితంబగు సేనలన్నియుఁ గొలువ
మగధదేశమునకు మగుడ నేతెంచె.
అక్కడ గోవిందుఁ డఖిలబాంధవులుఁ
దక్కక తనుఁగొల్వ ద్వారకాపురిని
నానకదుందుభి యనుమతి నుగ్ర
సేనుఁడు తనపంపు సేయ సామ్రాజ్య
కలనంబునకుఁ దానె కర్తయై పేర్చి
బలభద్రుఁగూడి నిర్భయవృత్తి నుండె.
మధురలోపల శత్రుమథనంబు సేసి
మధువైరి విహరించు మహనీయకథలఁ
దాత్పర్యమున విన్న ధన్యచిత్తులకు
సత్పుత్రలాభంబు శత్రుజయంబుఁ
గమనీయధర్మార్థకామమోక్షములు
సమకూరి హరిభక్తిసౌఖ్యంబు నొందు
నని చెప్పుటయు వీని ననఘుని చేత
విని కృతార్థుఁడనైతి వివిధసంపదల
హరి యెట్లు విహరించె నట మీఁది కథలఁ

బరిపాటితోడ నేర్పడఁ జెప్పుమనిన 680
నమ్మహీశ్వరునకు నభిమన్యుసుతుకు
నమ్మహాయోగి యిట్లని చెప్పఁదొడఁగె.
అనియిట్లు నయనిర్జరామాత్యు పేర
ధనధాన్యమణిమయదానాఢ్యు పేర
భూభరణక్షమభుజసారు పేర
శౌభళమంత్రి కందామాత్యు పేరఁ
గౌరి భారద్వాజగోత్రసంజాతుఁ
డారూఢమతి నయ్యలార్యనందనుఁడు
శృంగారరసకళాశ్రితవచోధనుఁడు
సింగయామాత్యుఁడు చెలువగ్గలింప
సలలితరసభావశబ్దగుంభనల
వలనొప్ప శ్రీభాగవతపురాణమున
మహనీయమగు దశమస్కంధసరణి
విహితలీలల నొప్పు విష్ణుచరిత్రఁ
బ్రాకటంబగు మధురాకాండ మనిన
నాకల్పమాకల్పమగు భంగిఁ జెప్పె. 688

మధురకాండము సమాప్తము.

శ్రీరస్తు.

శుభమస్తు.

ద్విపదభాగవతము.

కల్యాణకాండము.

—. విదర్భరాజు తనకుమార్తె రుక్మిణిని శిశుపాలునకిచ్చుటకుఁ దీర్మానించుట :—

ఆరూఢయౌవన నాయ్యింతి జనకుఁ
డారాజు తనయున కిత్తు నేననుచుఁ
జింతించి చైద్యుండు శిశుపాలుఁడర్హుఁ
డింతికి నని నిశ్చయించి పెండ్లికిని
సకలదిక్పాలుర సకలభూపతుల
సకలమహీశ్వరసమితి రప్పించి
ధీయుక్తమై నాలు దినములలోన
నాయుతంబగు లగ్నమరుదెంచుటయును
నంత నారుక్మిణి యంతయు నెఱిఁగి

—: రుక్మిణీదేవి తనపురోహితుని శ్రీకృష్ణుని వద్దకు పంపుట :—

చింతించి "నేనింక శిశుపాలు నెట్లు
వరియింతు ? త్రైలోక్యవరుఁడు నావిభుఁడు

హరి నాకుఁ బ్రాణేశుఁడై యున్నవాఁడు
నేనేమి సేయుదు నిటమీఁద నింక!
నానోములన్నియు నన్నుఁ ద్రెక్కొనియె
నెవ్వరు గలరింక నాభారి గడప?
ఎవ్వఁడో పుడు నాకు నీవార్తఁ జెప్పు."
అని పల్కి చింతించి యవ్వరారోహ
తన పురోహితపుత్రు ధర్మచరిత్రుఁ
బిలిపించి యెంతయుఁ బ్రీతి నెమ్మోము
కలఁగఁగఁబలికె గద్గదకంఠియగుచు ;
" అనఘాత్మ! మనవారు లవనీతి సేసి
నను[1] చైద్యపతికి నున్నతిఁ బెండ్లి సేయఁ
దలఁచుచున్నారు నాతలఁపు జీవనము
జలజాక్షుఁడనుచు నిశ్చలవృత్తి నుందు
నీమాటనన్నియు నెఱిఁగింపరాదు
నామీఁదఁ గృపఁగల్గి నన్ను మన్నించి
యరసి తోపుట్టినయట్లుగాఁ జూతు
మొరవు సేయకఁ జిత్త మెఱిఁగి వర్తింతు
వటుగాన నాకైన యక్కఱఁ దీర్ప
నిట నీవె కాక యింకెవ్వరు బంధు
లాయసంబునఁ జని యాద్వారవతికిఁ
బోయి కృష్ణునిఁగాంచి పొసగంగఁ జెప్పి
మరుఁడెత్తుకోల నామానంబు గొనును
పరువెత్తి రాకున్నఁ బరిణయలగ్న
మెడలేదు! తానింక నేతేరకున్న

విడుతుఁ బ్రాణంబులు వేరొండు లేదు.”!
అనిన నావిప్రుఁడు నతివచోధనుఁడు

—: పురోహితుఁడు శ్రీకృష్ణుని వద్దకు వెళ్లి రుక్మిణి ప్రేమను రూపును వర్ణించుట :—

జనియె సత్వరమున శౌరిసన్నిధికి.
అరుదార ద్వారపాలావళిచేత
హరివిని యెదుఱేఁగి యావిప్రవరునిఁ
దోడ్కొనిపోయి సంతుష్టుఁ గావించి
వేడ్క ప్రియంబును వెలయ నిట్లనియె.
“ఎవ్వరు బుత్తెంచి రెందుండి వచ్చి
తెవ్వరు నీనామ మెఱిఁగింపు” మనిన
“అనఘాత్మ! భీష్మకుండను విదర్భేశు
తనయ రుక్మిణియను ధవళాయతాక్షి
[1]తనుమధ్య యుత్ఫుల్లతామరసాక్షి
గరుడకిన్నరయక్షగంధర్వసతులు
దొరయ లేరాయింతితో నీడుఁబోల్ప;
దేవర సౌభాగ్యదివ్యవర్తనలు
వావిరి జనులెల్ల వర్ణింపుచుండ
విని పుష్పధన్వుని విషమబాణములు
యనువొందఁ దనువున నటనాటుటయును
జిత్తంబులో నీదు చెలువైనమూర్తి
చిత్తరువొత్తిన చెలువంబుఁదోఁపఁ
జింతించు వెఱఁగందు చేష్టలు మఱచు

[1]ఒక పాదమున్నది.

నంతకంతకు నిన్ను నభినుతి సేయు
విరహాగ్నిశిఖఁ గ్రాఁగు వెలువెలనగుచు
మరులెత్తినట్లు పల్కురు చిన్నఁబోవు
నీభంగినున్న యీయిభరాజగమనఁ
బ్రాభవంబునఁ జైద్యపతి పెండ్లియాడ
నెల్లుండి చనుదెంచు టెఱిఁగి యాయింతి
యెల్లవిధంబుల నిది నీకుఁ జెప్పఁ
బుత్తేర వచ్చితిఁ బుండరీకాక్ష!
చిత్తంబు నొండు చింతింప నేల?
ఆభామ నిజభార్యయై యుండునట్టి
సౌభాగ్యమెవరికి సమకూరు? నీవు
నారుక్మిణీభృంగి నాసలుఁ సేయు
కారుణ్యమూర్తివి కమలాక్ష! నిన్నుఁ
గదిసి నీదరహాసకౌముదిఁ గ్రోల
ముదితనేత్రచకోరములు చేరఁగోరు
నలవడి నీప్రయాణాంబువులోన
కలకంఠిచాతకి కడు వేడ్క సేయు
నీవెటులైన నను నేచిన వేడ్క
నావెలందుక నేలుటది నీకు నొప్పు;
నినునమ్మియుండిన నెలఁతుక నొకఁడు
కొనిపోవఁగాఁ జూడఁగూడునే నీకు?
పురవరాంగణములఁ బోరి దుర్గఁగొలువ
నరుదేర నాకన్య నాసురలీల
వరియించి చైద్యభూవరుసైన్యములను

---

1 జెప్పు.

సరగున సమయించి జలజాక్షిఁ గొనినఁ
గీర్తియు లాభంబు గెలుపు పౌరుషము
నార్తరక్షణమును నగు నీకు కృష్ణ!
ఈకార్యమెడ్డైన నిందిరారమణ!
ఆకామినీమణి యసువులు విడుచు
నిన్నిమాటలుఁ జెప్ప నెడ లేదు వేగ
నున్నతి పరిణయంబొనరించుటొప్పు."
అనియని చతురోక్తులల్లనఁ బలుక
ననియె విప్రునితోడ నంబుజోదరుఁడు

—: శ్రీకృష్ణుఁడు రుక్మిణినిఁ గాపాడి వరించుట కొప్పుకొనుట :—

"వనజాక్షి రూపులావణ్యసంపదలు
విని చిత్తమునఁ జూడ వేడుక పుట్టి
వచ్చెదమనువేళ వరపుణ్య నీవు
విచ్చేసితివి లెస్స విధమయ్యెఁ దలఁప
నాకన్యకకు నాకు నలరుబంధుఁడవు
గాక యెందును వేరు గలదయ్య మనకు?
ఇదె వచ్చి శిశుపాలు నే గెల్చి నేనఁ
జదిపి యందఱు మెచ్చఁ జపలాక్షిఁ దెత్తు"
అనుచు మజ్జనభోజనాదికృత్యములు
తనరార సలిపి యాతనిఁ బూజసేసి

—: శ్రీకృష్ణుఁడు కుండినపురికిఁ బయనమగుట :—

సైన్యసుగ్రీవాదిచటులాశ్వపాంచ
జన్యచక్రస్ఫూర్తి చదలెల్లఁగప్ప

గరుడకేతన కాంతి కరమొప్పుచున్న
యరదంబు సన్నాహమై ప్రోల నిలుప
దారకుఁడును విప్రతనయుఁడుఁ దాను
నారూఢశుభవేళ నరదంబు నెక్కి
గగనంబునను దివాకరబింబమోయ
నఁగఁ జనియె విదర్భ నలినాక్షురథము ;
పోవుటయును సీరి బుద్ధిఁ జింతించి
" యావిష్ణుఁడొంటిమై నరిగెఁ బెండ్లికిని
బలియురు మాగధప్రముఖభూపతులు
కలహంబు పుట్టు నేగదిసెద ననుచు
బలువొప్పఁ జదురంగ బలసైన్యపతులుఁ
గొలువంగ హలివచ్చె కుండినపురికి.

—: పౌండ్రకదంతవక్త్రాదులు కుండినపురికేతెంచుట :—

అంతట శిశుపాలుఁడతి వైభవమున
దంతితురగసద్భటపదావళియు
వలనొప్ప పటహాదివాద్యముల్ మొరయ
బలియుఁడై చనుదెంచెఁ బరిణయంబునకు
హరితో విరోధాత్ములగు సాల్వమగధ
ధరణిఁ బౌండ్రకవరదంతవక్త్రులును
గొమరార శిశుపాలుఁగూడి యేతేర
నప్పుడు భీష్మకుండధిక వైభవము
లొప్పారఁ బురమున నుత్సవంబొదవ
కలువడంబులు మేలుకట్లు తోరణము
లలవడ నేతెంచి యధికవైభవము

కలయఁ గుంకుమనీటఁ గలయాపులలికి
మెలుపార కస్తూరి మేడలఁ బూసి
మొనసిన కప్పురమున ముగ్గు వెట్టి
తనరారఁ గదలికాస్తంభంబు లెత్తి
రము సింగారించి పురుహూతులీలఁ
లు గొలిచిరా తరుణులుఁ దాను
సన్నుత గీతవాద్యముల్ మొరయఁ
పేరంటాండ్రు సేసలుఁ జల్ల
ంపదల నెదుర్కొని తోడి తెచ్చి
శవరుల నంతటి మనోహరము
ోట విడియించి యఖిలసౌఖ్యములఁ
క్తి నొసరించి దత్తులఁ బిలిచి
యారమిడఁగ మంగళతూర్యనినద
పక ప్రోయంగ నెఱిఁగి రుక్మిణియు

—: రుక్మిణి శిశుపాలాదులు వచ్చుట విని హరిరాకకై పరితపించుట :—

కలఁగి ప్రాన్పడి నిల్చి, కళవళంబందుఁ
బెలుకుటులోఁ దాటు పెదవులఁ దడపుఁ
బలుకకూరకనుండుఁ బలుమాటలాడు
నిలువనేరక ప్రాలు నిట్టూర్పువుచ్చు
నంతయు హరిఁ జేర్చు నంతరంగమున
సంతాపమొదవంగఁ జర్చించి చూచు ;
" నక్కట ! యెక్కడి కరిగెనో ! విప్రుఁ
డెక్కడఁబోయెనో ! ఏలకోతడసె !

హరికి యిక్కడివార్తలందెనో! నడుమ
దిరిగెనో! శౌరిఁదోతెచ్చుచున్నాఁడో!
ఈకార్య మెఱిఁగింప నిందిరావిభుఁడు
కైకొనకుండునో! కడువేడ్కతోడ
వచ్చునో! ఎవ్వరే వలదందురొక్కొ!
మచ్చికతో నన్ను మన్నించునొక్కొ!
నెడమకన్నును జన్ను నెడమభుజంబు
వడి నదరెడి హరివచ్చు నిశ్చయము.”
అని యిచ్చ నూహింప నంబుజోదరుఁడు
చనుదెంచి సీరితో సైన్యంబుతోడ
నాపురోద్యానంబు నందొప్ప విడిసి
భూపాలతనయకింపుగఁ దనరాకఁ
జెప్పి పుత్తెంచినఁ జెన్నార విప్రుఁ
డప్పొలంతుకఁ గాంచి హరివచ్చెననుచు
హరుషాశ్రువులు గ్రమ్మ నందంద మేను
గరుపార నవ్విప్రుఁ గని యిట్టులనియె.
“పురుషార్థపరుఁడవు పుణ్యచిత్తుఁడవు
పరమాప్తుఁడవు నాకుఁ బ్రాణంబు నీవ!
ప్రాణవల్లభుఁడైనఁ బద్మాక్షుఁ దెచ్చి
ప్రాణంబుఁ గాచితి పలుకులింకేల!”
అనిపల్కి యతనికి నందంద మ్రొక్కి
కనకాంబరములిచ్చి ఘనతతో ననిచె.

—: రుక్మిణి గౌరియాలయమునకు వెడలుట :—

గౌరికి మ్రొక్కింపఁ గరము సంప్రీతి

నారాజబింబాస్య నటతోడి తేరఁ
గలికి రాయంచల గతుల గీడ్వఱచుఁ
జెలువలు నలుగడఁ జెన్నారి కొలువ
పటహకాహళశంఖపణవాదులొలయ
పటుతరంబగు వీరభటకోటి కొలువ
దేవతనగరికే తెమ్మన్న, శౌరి
కావార్త యెఱింగింప నవ్విప్రుఁబంచె.
ఆమొలఁత కాల్నడ నరుదెంచె నప్పు
డేమని వర్ణింతు! ఇభపురాధీశ!
అడుగడుగిడుచోట నవనియంతయును
గడునొప్పు పద్మరాగశ్రీవహించు;
ఉచ్చిఁతపండ్లతో నుల్లసంబాడు
నచ్చపలాక్షికి నంగుష్ఠచయము;
వదనఖద్యోతులనుపచరించు నెలవుఁ
గదియ మౌక్తికములుఁగట్టి నట్లుండు;
తనరు గచ్ఛపనిధిద్వయమింతిపాద
వనజాతముల మీఁద వ్రాలెనో యనఁగ;
గమనజాడ్యము శుభాకరమును నగుచుఁ
గమనీయలీల మీఁగాళ్లొప్పు సతికి;
పగడంపుఁదీగెలపంక్తులో యనఁగ
మగువకు నొప్పారు మడిమెల తీరు;
తరిసేయు మదనుపుత్త్రికలుఁ దమకు
నెరతనంబంచును నెరసులు వలుకఁ
గనకకాహళకాంతిఁ గడచి చూపరకుఁ
గనుపట్టు కాంతజంఘలు దన్యమగుచు;

కదళీకాయుగళంబు కటిభార మొప్ప
నదనవుఁగరికరయుగళంబు పసిఁడి
తొలచి నిలిపిన భంగిఁ దొలుకాడు రుచులఁ
గలకంఠి కొప్పారుఁ గరభోరుయుగము ;
వెడవిల్తుఁ గల్యాణ వేదికతోడఁ
దడఁబడు కొంత నితంబభారంబుఁ
గరిశిరస్పర్ధియై కనకపుపెట్టై ;
వరసైకతంబనా వలనొప్పు కటియు ;
కటిసూత్రఘంటికా ఘనరత్నకాంతి
పటిమతో నొప్పారు పసిఁడిదువ్వలువ ;
కామునికై పుత్రకామేష్టి వెల్వ
హోమగుండముభంగి నొప్పారునాభి ;
చలదలపల్లవసంకాశమగుచు
పలుచనై కనుపట్టు భామిని కడుపు ;
అలమిన ముష్టిలోనడఁగి చూపరకు
కలదు లేదను వాదుఁ గలిగించు నడుము ;
అపూర్ణకుచవిహారాద్రులకిడిన
సోపానములభంగిఁ జూపట్టు వళులు ;
హరినీలనాళంబులందుద్భవించు
గురుహేమసరసిజకోరకద్వయము
కరణి నూఁగారుపై ఘనకుచద్వయము
కర మొప్పఁ జూడ నా కామినీమణికి ;
పసిఁడి మించుల మించు పణఁతి కక్షములు ;
బిసవల్లికలరోజ బెరయు చేదోయి ;
కెందమ్మిరేకుల గెలిచి కెంపాదపు

నందమై లేమకు నరచేతులమరు ;
విద్రుమలతలతో నీడు దోఁగాడు
విద్రుమద్యుతి చేతివ్రేళ్లు పెంపొదవు ;
కలువరేకుల మించుఁ గరనఖద్యుతులు ;
పొలుచు శంఖముభంగిఁ బొలఁతికంఠంబు
జలజంబుఁ దెలివియుఁ జంద్రకాంతి యును
జలజాస్య నెమ్మోము సరిసేయరాదు ;
చెలువారు పగడంపుజిగురకో ! బింబ
ఫలమకో ! యనసొప్పు భామకెమ్మోవి ;
వెలఁది వెన్నెలనీట వెలసిన కుంజ
కళికలో యనసొప్పు కాంతపల్వరుస ;
దరహాసచంద్రిక ధళధళ వెలుఁగు
కరిదంతరుచి మించు గండపాలికలు ;
పొలుపైన పసిఁడితిలపుష్పమో యనఁగ
నలినాక్షి కొప్పారు నాసాపుటంబు ;
చారు శ్రీవర్ణంబు సరినచ్చులొత్తి
చేరినయట్లొప్పుఁ జెవులు రుక్మిణికి ;
కందర్పుఁడింపుగాఁ గడల నిర్గమము
ముందట విల్లునమ్ములు నిడెననఁగఁ
దరలాక్షి నెమ్మోముతామరమీఁదఁ
గరవంకబొమలతోఁ గనుదోయి వొలుచు ;
శశి యింతినెమ్మోము సవతుగాలేక
యసలార సగమైన యట్లొప్పు నొసలు ;
వదనాంబుజాతంబు వాసనఁగ్రోలఁ
గదియు తేంటులభంగిఁ గాన్పించుగురులు ;

తోయ్యలి పెహముచందురు వెంటఁదగులు
నయ్యహిభంగిఁ జెన్నగు నీలవేణి;
భావజన్మని నెత్తపలకచందమున
నావామలోచనకసలారె వెన్ను;
కటకనూపురహారకంకణరత్న
కటులరోచుల దిశాభాగంబుఁ గప్పఁ
గరిరాజగమనంబుగతి రాజతనయ
యురుదెంచె గౌరినిజాలయంబునకు,
ఈభంగి సౌభాగ్యమెసఁగ నేతెంచి

—: రుక్మిణి కృష్ణుని బతినిఁగాఁ జేయుమని గౌరిని బ్రార్థించుట :—

యాభామినీమణి యంబిక కెఱఁగి
ఘనసారమృగమదగంధమాల్యములు
కనకపుష్పంబుల ఘనధూపదీప
నైవేద్యతాంబూలనవ్యోపచార
భావార్చనలు సేసి ప్రణుతించి మ్రొక్కి, 130
" అంబిక! గౌరి! లోకాంబ! కల్యాణి!
అంబుజాసనవంద్య! ఆత్మసంచారి!
శంకరుమేనిలో సాబాలుఁగొన్న
శంకరి! పావకశశిభానునయన!
ఈలగ్నమెడరుగానీక శ్రీవిభుని
వాలాయమున నాకు వరునిఁగావింపు"
మని ప్రదక్షిణపూర్వమై భక్తివిప్ర
వనితలకును బెక్కువాయనాలిచ్చి
కంకణఝణఝణత్కారంబు లెసఁగ

నంకించి వెసఁబాడియాడి కీర్తించి
కన్నుల మెఱుఁగు లక్కజముగా నిగుడఁ
గ్రన్ననఁ జండికాగారంబు వెడలి

—: చండికాగారము వదలి వచ్చుచు కృష్ణునిఁగానక
రుక్మిణి కలఁగుట :—

జలజాక్షురామికిఁ జంచలంబందుఁ,
దలపోయు, మార్గంబుఁ దప్పక చూచు
"నావల శుభలగ్న మాసన్నమాయె
నావిష్ణుఁడేలకో యరుదేరతడసె!
ఆవిప్రవరునితో నాడినమాట
నేవిధంబున తప్పఁడేలకో! ఇంక
నింతట హరిరాక యెడసేసేనేని
కంతుని పూనిక కడ తేరకున్నె!"
అనివిచారింపుచో నాసీరితోనఁ
జనుదెంచి విమలభీషణవృత్తిఁదోఁప
గరుడకేతనకాంతి గగనంబుగప్ప
నరదంబుపైఁ గృష్ణుఁడడ్డంబు వచ్చి
కనియెఁగోమలి నీలకచఁ గంబుకంఠిఁ
దనుమధ్య నుత్ఫుల్లతామరసాక్షి
నారూఢయవ్వన నమృతాంశుముఖిని
హారకంకణనూపురాలంకృతాంగి
నాదిమలక్ష్మిఁ గన్యాశిరోమణిని
వైదర్భిఁగని యదువరుఁడుత్సహించె.

—: శ్రీకృష్ణుఁడు రుక్మిణిని దనరథముపై నెక్కించుకొని చనుట :—

ఆకన్యయును బ్రేమ నంబుజోదరుని
రాకాశశాంకవిరాజితవదను
మకరకుండలకర్ణమాణిక్యరుచిర
వికచగండస్థలు విభవేంద్రవంద్యుఁ
నారూఢయవ్వను నతులసౌభాగ్యు
నారాయణుని హరిన్నళినాక్షిఁగాంచి
సిగ్గును భయమును జడిముడిపాటు
నగ్గలింపఁగ నిల్చె నంబుజనయన ;
ఆలోనఁగృష్ణుఁడు నవ్వాలుగంటి
నాలింగనముసేసి యర్మిలి నెత్తి
కొనిపోయి రథముపైఁ గూర్చుండఁ బెట్టి
యనునయోక్తులఁ దేర్చి యంగంబు నిమిరి
దారకుఁ జూచి "రథము వేగ పఱపు
ద్వారకాపురిక" నిదైత్యారి కదలె.

—: పౌండ్రకాదులు శ్రీకృష్ణునిఁ దాఁకుట :—

ఆసమయంబున హరి భీష్మతనయ
నాసురంబునఁ గొంచు నరుగుట నెల్ల
వినిచైద్యమాగధవిభులాగ్రహమునఁ
జనిరంతఁ బౌండ్రకసాల్వవైదర్భ
"లెక్కడికృష్ణుడు? ఎక్కడిరాముఁ
డుక్కడంచెదము"ని యురువడిఁగదలి

చటులఘోటకకరిస్యందనవీర
భటపాతహతుల భూభాగంబు వగులఁ
బేర్చినయలుకలఁ బృథులరావముల
నార్చుచు దాఁటిరా యాదవోత్తములఁ
గవిసియుఁగార్చిచ్చుగతిఁ బెచ్చుపెఱిగి
యవిరళంబుగ వెంటనంటఁ దాఁకుటయు
నాయెడ బలభద్రుఁడను జన్మఁజూచి
"యీయింతియును నీవు యిందుండ నేల?
కొని వేగమరుగుమీకూటవ మూఁక
నణఁచి యేనునుఁగూడ నరుదెంతు" ననుచుఁ

—: బలరాముఁడు యుద్ధము చేయుట :—

గమలాక్షు ననిచి యక్షామపాలుండు
సమరసన్నద్ధుఁడై చతురత నిలిచి
యాదవనికరంబు యత్యుగ్రసింహ
నాదంబుతోఁ దూర్యనాదంబులొలియఁ
దలకొని యొండొంటిఁదార్కొని మంట
లొలుక కైదువల సముద్ధతిఁ జూపి
యరదంబునరదంబు నశ్వమశ్వంబు
కరిఁగరి కాల్వురుఁ గాల్వురుఁ దొడరి
యారసంబునముట్టి యిరువాఁగుగిట్టి
పోరాడ సురులకద్భుతముగా నిగుడి
విలుకాండ్లు గవిసి దోర్వీర్యయుంబు మెఱసి
పలునారసములు నిర్భరముగా నేయ
నలువుర నేవుర నలినుచ్చిపాఱఁ

దలలొక్కపెట్టు భూతలముల రాల్చి
రథములఁ జెక్కి సారథుల నుక్కడఁచి
రథరథ్యనివహంబు రణభూమిఁగూల్చి
కరులఁజెండాడి పుష్కరములఁదునిమి
హరుల విదారించి యాశ్వికోత్తములఁ
బ్రాణంబు లెడలించి బాణాసనములఁ
దూణీరములఁద్రుంచి దొరలగీటణఁచి,
వారువీరనకెల్ల వారికాయములఁ
దోరంపురుధిరంబుఁ దోఁగించిరంత ;
దొంకెనపోటులు దూరఁగానాటి
బింకంబులెడలక బెరయు వీరులును
గోరి పెక్కండ్రను గుదులుగాఁగ్రుచ్చి
పేరువారెడునట్టి బిరుదులువారు ;
తలత్రెవ్వపడియు మొండెఱఁడమ్ముఁబొడుచు
బలియులనొప్పించి పడియెడువారు ;
శిరములు వగిలినఁజిందెలఁగట్టి
సరకుసేయకఁబోరుసల్పు లావరులు ;
దొఱసిన వేటాడితునుకలుగాఁగ
యఱిముఱేఁదెగవ్రేసి యార్చురాహుతులు ;
సామజంబులనడుము సరిగ్రుచ్చిపారఁ
దోమరంబులవ్రేసి త్రుళ్లు మావుతులు ;
లవణిసారించి పల్లమును గుజ్జమును
రవుతును జిదియ భోరన మ్రోచువారు ;
ఱోలుచు నెత్తురుఱొంపిలో మునిఁగి
కాలార్ప నేరని కరితురంగములు ;

దారగండులు వడి ధరణిపై వ్రాలు
తేరులు వెసనోళ్లఁదెఱచు పీనుగలుఁ
జదిసిన కండలు జదుపంబులైన
మెదడు మిడమిడమని మిడుకు బొమ్మలును
నవ్వెడి మోములు నలినంగకములు
విఱిగినవిండ్లును విటతాటమైన
పుఱియలతోనొప్పు బొమిడికంబులును ;
కరవాలకంకణకలితమై పడిన
కరములుఁతుమురైన కాండకుంతములు ;
పఱియలై కూలిన పలకలు నాజిఁ
దఱచుగాఁ దెగిపడ్డ ధవళచామరలు ;
నాడాడకుఁజింపులై దూరమెడలి
చూడనక్కజమైన జోడుపక్కెరలు ;
నెత్తురు నెఱచియు నెరి బొట్టకోలఁ
గుత్తుకబంటిగాఁగ్రోలు భూతములుఁ ;
గొడపంపుఁగంకాళి ఘోరనాదముల
వెడయాట లాడెడు వేతాళములును ;
వలనొప్పు భూతేశువటుంబు వోలె
లలితకపాలమాలాయుక్తమగుచు
సమధికదానధ్య సరసంబెవోలె
కమనీయమార్గణఘనఘోషమగుచుఁ
గలగొన వైశాఖకాలంబె వోలె
నలినొప్పు బాణాసనధ్వస్తమగుచు
విహితమహారణ్యవిభవంబె వోలె
బహుఖగనాగసంప్రస్థితంబగుచు

సరభసనైదాఘసమయంబె వోలె
సురుచిర వాహినీశోణితంబగుచు
మహనీయవారాసిమధ్యంబె వోలె
సహజ బాడబఘోష సౌరభ్యమగుచు
నలమి బీభత్సభయానక రౌద్ర
కలితమై యొప్పారి కలనొప్పెఁజూడ ;
దట్టించెనంత యాదవసేనఁదఱచు
నెట్టన నాచైద్యనృపుసేన విఱిగె.
మగధసేనలుఁగూలె మఱిసెవైదర్భ
జగతీశుసైన్యంబు సాల్వుఁడు విఱిగె

—: శిశుపాలుఁడు క్రోధముతో వార్షైఁ గవయుట :—

అంత నాశిశుపాలుఁడంతఱఁ జూచి
యెంతయు దర్పించి యెలుఁగెత్తిపలికె.
“ కడుఁగ్రొవ్వి గొల్లలుఁగానక నన్నుఁ
దొడరి నేనున్నచోఁ దొయ్యలినెత్తి
కొనిపోయిరిద్దఱు కూల్చెద నొండె
చనియాజి వారిచేఁ జచ్చెద నొండె
యిట్టిజీవమునొంది యింటికిఁబోవ
నెట్లోర్తు ? నాశౌర్యమెన్నటికింక ! ”
అనిపల్కి పేర్చి తానటు సేనఁదాఁకి
వనసమూహము నేర్చు వహ్నిచందమున
దరమిడి పటురథదంతియశ్వములఁ
బొరిమార్పఁ దత్బలంబులు పెల్లగిల్లె.
బలము వీఁగుటఁ జూచి బలభద్రుఁడంత

హలముసలోగ్రబాహాగర్భుఁడగుచు
యరదంబు డిగివచ్చి యాసాల్వు తేయు
నరదంబు నుగ్గుగా నడిచిన నతఁడు
గదపుచ్చుకొని సీరి గదియ నాలోన
నదలించి మాగధుఁ డడ్డంబు దాఁకి
శరపరంపర లేయ, జడిసి మాగధుని
హరులను సారథి నవలీలఁ గూల్చె.
తేరిపై నురికి యుద్వృత్తిఁ గరమున
సీరంబుఁ దగిలించి చెచ్చెరఁ దిగిచి
రోఁకట నడపఁగ రుధిరంబుఁ గ్రక్కి
వీఁకరి మాగధవిభుఁడు మూర్ఛిల్లె;
నక్కజంబుగ వాని నరదంబు మీఁద
నెక్కించుకొని సాల్వుఁడేఁగె నాలోన
నతనితోడనె యఖిలసైన్యములు
నాతురఁబడి గుండెలవియంగ బఱచె.

—: రుక్మి కృష్ణుని దూలనాడుచుఁ గవియుట :—

అంతకుమును విదర్భాధీశతనయుఁ
డంతకసముఁడు క్రోధాత్ముఁడై రుక్మి
తనసేనతోడ ముందఱ నేఁగి కృష్ణుఁ
గనుఁగొని భీషణోగ్రస్ఫూర్తిఁ బలికె.
“ ఓరి! గోపాధమ! ఓడక నన్నుఁ
జీరికిఁగొనక నాచెలియలిఁ బట్టి
కొనిపోయెదిక నెందుఁ గొనిపోయెదీవు?
నిను నాశరంబుల నీరుఁ గావింతు;”

నని గుణధ్వనిసేసి యాఱుబాణములుఁ
దనువుఁ గీలింప దానవాంతకుఁడు
నల్లన నవ్వుచు నతని కేతనము
విల్లును ద్రుంచిన వేరొక్క ధనువుఁ
గొని బాణవర్షంబుఁ గురియఁగ శౌరి
కినిసి తేజుల సూతుఁ గీటణఁగించి
దనువుఁ ద్రుంచుటయు, నాతఁడు వమ్మువోక
ఘనమైన ఖేటకఖడ్గంబుఁ గొనుచు
హరి తేరిపైకి రయంబునఁ గదిసి
కరవాలమున వ్రేయఁ గమలాక్షుఁడతని
పలుకయు వాలును బాణాష్టకమునఁ
దృణమాత్రమునఁద్రుంచి ధృతిమూర్ఛ వుచ్చి

—: శ్రీకృష్ణుఁడు రుక్మిని ధ్వజస్తంభమునకుఁగట్టి తల గొరుఁగుట :—

తనపాగఁగొని ధ్వజస్తంభంబుతోడ
మెలివట్టి మెడగట్టి మిడమిడఁ జూడ
నలుకమైఁ బేర్చి పెద్దమ్మున శిరముఁ
బలుపైన జుట్టును బాఱఁగ గొఱిగి
యునిచిన ఖేదంబు నుమ్మలికంబుఁ
బెనుపాటు గదుర నిర్విణ్ణుఁడై యున్న
యన్నను గనుగొని యడలు దీపింపఁ
గన్నుల నీరొల్క గద్గద మగుచు
మొగము వెల్వెలబార ముడమున సిగ్గు
వగయుఁ దోఁపఁగ నిల్చి వైదర్భి పలికె.

—: రుక్మిణి తనయన్నను విడిచిపుచ్చుమని
శ్రీకృష్ణునిఁ బ్రార్థించుట .—

" అక్కటా! ఈతఁడు నీయంతరంబెఱుఁగ
కిక్కడ నీచేత నిటుగట్టు వడియె
వెరగొప్ప నన్నుఁ దావిడిపింతు ననుచు
నరుదెంచినాఁడు నాయగ్రజుఁ డితఁడు
కలనిలోఁ బడువారిఁ గావక యిట్లు
పాలువనేతలు సేయఁ బోలునే యకట!
నన్ను మన్నించి క్రన్ననఁ బ్రాణమెత్తు
మిన్ని దప్పులుఁ గాచి యతనిఁ బోవిడువు; "
మనిపల్కు నంతలో నడరి సీరియును
జనుదెంచె వైదర్భి సైన్యంబు బఱచి.
హరిఁగూడుకొని సీరి యరదంబు మీఁదఁ
దురపిల్లు రుక్మి నుదురుఁ జూచి పలికె.

—: బలరాముఁడు రుక్మిని విడిపించుట :—

" తగువాఁడు వియ్యము ధరణీశసుతుఁడు
తగదిటుసేయ నితని వేగ విడువు
మనిపల్కి బోధించి యతని విడిపించి
మనసుక్లేశము మాన్పి మరి రుక్మి ననిపి
యారామఁ దోడ్కొని యనుజుండు దాను
ద్వారవతికి నేఁగెఁ దాలకేతనుఁడు
పౌరులెదుర్కొని పట్టణంబెల్లఁ
గోరిసింగారింప గురుమూహూర్తమున
రాముఁడు హరియుఁ బురప్రవేశంబుఁ

గావించి సేసిరి కడుసంతసమున.
గురులచేతన ననుజ్ఞఁ గొని శుభలగ్న
మరయించి పెండ్లికి నఖిల వస్తువులు
సమకూర్చి బాంధవసమితి రప్పించి

—: శ్రీరుక్మిణీదేవి వివాహము :—

విమలమణిస్తంభవివిధశిల్పముల 240
వెరవుగాఁ బెండ్లికి వేది దీర్చించి
పరవుగా ముత్యాలపందిలిఁ బెట్టి
ఘంటామృదంగమంగళతూర్యరవము
లింటింట మ్రోయఁగ నెల్ల వీథులను
కనకతోరణములుఁ గలువడంబులును
కనకకుంభంబులుఁ గర మొప్ప నెత్తి
కస్తూరిచందనగంధసారాది
వస్తువిస్తారధూపవాసనలొలయ
నండలంబులును నందండ పంపించి
నందాదిగోపబాంధవుల రప్పించి
దేవతాతిథిగృహదేవతార్చనలు
గావించి రేవతీకాంతయుఁ దాను
తరమిడి యయ్యశోదయును రోహిణియు
హరిపరిణయంబున కాత్మల నలర
శతకోటికందర్పసన్నిభమూర్తి
యతులితశృంగార మంగీకరించె.
కంతుబాణంబునఁ గడిగినభంగి
కాంతమైనార్చి సింగారించి తెచ్చి

తనరారు గృహదేవతలయొద్ద నిలిపి
యనుపమంబగులగ్న మాసన్నమైన
సాందీపనియమిత ద్విజోత్తములుఁ
జెంది పుణ్యాహంబు సేయించి రంత.
ఆనకదుందుభి హలపాణియుగ్ర
సేన నందాదులుఁ జెలులుఁ జుట్టములు
వలనొప్ప విప్రభూవరవైశ్యశూద్రు
లెలమి మహోత్సవం బేపారుచుండఁ
గొమరారు నప్పసిఁడికుడుక నక్షతలు
నమరఁగఁ దలఁబ్రాలు నఖిలవస్తువులుఁ
బసిఁడిపళ్లెరముల బహుభంగిఁ బూనిఁ
రసికత మీరి పేరంటాండ్రు పాడ
నాలోన రుక్మిణి నంబుజోదరునిఁ
బ్రాలపోంగుల మీఁదఁ బరగంగ నుంచి
తెరవట్టి సౌభాగ్య దివ్యవస్తువులుఁ
గరముల నునిచి మంగళరావమెలయ
నాయెడ ఘడియార మరసి దైవజ్ఞు
లాయతమాయత యని ప్రీతిఁ బలుక
శుభలగ్నమరుదేర సుముహూర్తమనుచు
నభినుతులొనరించె నమరసంఘంబు;
తెరయెత్త ముఖచంద్రదీప్తులు వొలయ
యిరువురు నొండొరులీక్షించి రంత;
హరిచూడ్కి సతిచెక్కుటద్దంబులందుఁ
గరమొప్పు పత్రరేఖలభంగి నమరె;
వనితచూపులు హరివక్షంబు మీఁదఁ

బెనుపార నీలాలపేరులట్లుండె ;
సురభూరుహము మీఁద సురవల్లి నిగుడి,
విరులు రాల్చినభంగి వెలఁదొప్ప నెక్కి
పరువడిచేఁ దలఁబ్రాలొప్ప బోసె ;
కరమర్థి హరి కరగ్రహణంబు సేయఁ
గలితమౌ వందిమాగధరావములును
జెలువారు సద్విజాశీర్వాదములును
మంగళపాఠకమహితవాక్యములుఁ
నింగి ముట్టగను ఘూర్ణిల్లె నంబుధులు.
అంతహోమాదికృత్యములెల్లఁదీర్చి
సంతోషచిత్తుఁడై శౌరి పెంపొందె.
అనుపమ భక్ష్యభోజ్యాన్నపానములఁ
దనిపి యందఱికిని దగకట్ట నిచ్చి
నందయశోదల నయవాక్యవస్తు
సందోహములఁ బ్రీతి సలిపి వీడ్కొలిపె ;
శోభనదినములు సొంపార దీర్చి
యాభామినియుఁ దాను నంబుజోదరుఁడు
కేళిహర్మ్యములందుఁ గృతకాద్రులందు
శైలసానువులందు సరసులయందు
వైదర్భితో రతివల్లభకేళి
నాదట సుఖలీలలందె మురారి.

—: ప్రద్యుమ్నుని జననము :—

అటనొక్క యేడాది కబల రుక్మిణికిఁ
బటుతరంబైన గర్భశ్రీవహింప

మగువకు ఘృతకశీమంతోత్సవంబు
నెగడింపఁ దొమ్మిదినెలలు నిండుటయు ;
హరఫాలనయనాగ్ని నడఁగిన మరుఁడు
హరికిని రుక్మిణియందు ప్రద్యుమ్నుఁ
డనుపేర హరి యవతారభేదమున
జనియించెనో యన! జన్మించె తనయుఁ
డాపుత్త్రుఁ గనుగొని యతిగౌరవమున
నేపార సంతోషమెసఁగి వర్తిల్ల ;

—: పురిటింటిలోనుండి ప్రద్యుమ్నుని శంబరుఁడపహరించుట :—

" ముప్పొంటుదినమయ్యె! ముద్దులపట్టి
నెవ్వఁడో కొనిపోయె నింటిలోనుండ!"
అని మహారోదన మటుసేయ శౌరి
విని సంభ్రమించి యవ్విధమెల్ల మున్నె
యెఱిఁగిన వాఁడయ్యు నెఱుఁగనియట్లు.
వెఱఁ గంది నలుగడ వెదకంగఁ బనిచె.
వదలకఁ దన పూర్వవైరంబుఁ దలఁచి
యదయుఁడై శంబరుండను దైత్యవరుఁడు
కొనిపోయి జలధి నక్కుమారుని వైచి
చనియె, నాశిశువు మత్స్యముమ్రింగె నంత.

— సముద్రములో వేయఁబడిన బాలకుని
మత్స్యమొకటి మ్రింగుట :—

ఆనావికులు వల నమ్మీను దిగిచి
కానుక యిచ్చినఁ గని శంబరుండు

యడబాల కొప్పింపుమని పంచె, వాఁడు
తడయక యమ్మీను దళనంబు సేయఁ
గడుపులోనున్న చక్కని కుమారకునిఁ
గడువేడ్క నాదైత్యకాంతకొప్పించె ;

—:మాయావతి ప్రద్యుమ్నకుమారుని మక్కువతోఁ బెంచుట:—

నంతమాయావతి యాపుత్రుఁ గాంచి
సంతసంబునఁదేలి సౌమనస్యమునఁ
నాపుత్రు శుభరేఖలంతరంగమున
నాపోకఁ గనుఁగొను నందంద పొక్కు
నక్కున నిడు ముద్దులాడుఁ గన్నిచ్చు
జిక్కకౌఁగిటఁ జేర్చు చేష్టలు మఱచు
నీరీతిఁ బెంచగా నెలమి కందర్పుఁ
డారూఢయవ్వనుఁడై చూడ నొప్పె ;
ఆలోలమదనుని యాకారసరసి
నాలోలనయన మాయావతి మునిఁగి 290

—· మాయావతి ఆరూఢయౌవనుఁడగు ప్రద్యుమ్నుని గాంచి మోహించుట :—

రతికాసచేసి గౌరవము వోనాడి
చతురత గతులను సరసభావమున
నాపడఁతి యొకనాఁడతిరహస్యమున
పైపడి పట్టిన భావజుండలిగి
"కటకటా ! ఈపని గర్హణంబనక
నిటు సేయఁదగునమ్మ ! ఇందీవరాక్షి !
తల్లివి నీవు నీతనయుఁడ నేను

చెల్లునే పాపంబు సేయంగ నీకు?
ఎక్కడ వినఁజూడమిట్టి దుర్నీతి
నెక్కడగలిగె! నీవెవ్వతవ" నుండు;
హరికి రుక్మిణికిని యవతరించుటయు
నెఱిఁగి శంబరుఁడు తానిందుఁ దెచ్చుటయు
జేరిన చందంబుఁ జెప్పి, వెండియును
నారామ భావజు నల్లన పలికె.
"రతి నేను నాపుష్పరతుఁడవు నీవు
ప్రతిలే యాదిదంపతులము గాన
వీండొక గతిగాదు వీని వర్జించి
దండిమై మనము వోదము ద్వారవతికి.
ఇతఁడు మాయావిధం బెఱుఁగు నీతనికిఁ
బ్రతిలేని విద్యలభ్యాసంబు సేయు;"
మనుచు మాయావతి యమ్మహావిద్య
మనసిజునకు నిచ్చె మంత్రయుక్తముగ
ప్రద్యుమ్నుఁ డంత నాపడఁతిచేఁ బెక్కు
విద్యలు నేర్చి యావెలఁదియుఁ దాను
ధృతిఁబూని వర్తింపఁ దెలిసి శంబరుఁడు

—: శంబరప్రద్యుమ్నుల యుద్ధము :—

నతివేగమునను మహోగ్రతం బొదవ
మదనుఁ దెగటార్ప మది విచారించి
గడఁగొని లయకాలకాలుఁడో యనఁగఁ
బటు తెంచి వైచిన భావజుండలిగి
యుఱక యాతని వక్షమురుముష్టిఁ బొడిచె;

వాఁడు మహాశక్తి వైచిన మరుఁడు
పొడిగాఁగ నదిద్రుంచెఁ బ్రచండమున.
అప్పుడయ్యసుర మహాబలంబొదవ
నుప్పరంబెగసి పైనురగమై పడిన
గరుడుఁడై యాపాము ఖండించెమరుఁడు ;
తిరుగక దనుజుఁడు గిరుఁడై పేర్చి
వనదమైఁ పాషాణవరుషంబుఁ గురియ
ననిలుఁడై విరియించె, నద్రియై పడిన
కులిశమై దునుమాడె, కొంకక వాఁడు
కలుషించి కేల ఖడ్గము నెత్తుకొనుచు
బలువిడిఁ గవిసిన భావసంభవుఁడు
తలఁ ద్రెవ్వనేసె నుద్ధతకోపుఁడగుచు,
దేవసంఘములార్చె దివిఁ బుష్పవర్ష
మావిష్ణుతనయుపై నందంద కురిసె.

—: ప్రద్యుమ్నుఁడు సతితోఁగూడ ద్వారవతికి వచ్చుట :—

అసుర నీగతిఁ దెగటార్చి, వానింటి
వసురత్నభూషణావళులెల్లఁ గొనుచు
నంతరిక్షంబున నాద్వారవతికిఁ
గాంతాసమేతుఁడై కంతుఁడేతెంచె.
అంతట బురజనులందఱుఁ జూడ
నతంత శౌరి గృహంబున నిలువ
వైదర్భి దగ్గఱవచ్చి యీక్షించి
యాదవాన్వయజాతు నాజానుబాహు
నీలనీలాంగు నున్నిద్రాంబుజాక్షు

బాలభానుప్రభాప్రతిమానవస్త్రు
హారకుండలకిరీటాకల్పకలితు
నారాయణాత్మజు నారీసమేతుఁ
గనుఁగొని కృష్ణుగానోవు ననుచు
ననుమానమునుఁబొంది యాకాంత పలికె.
"సుందరాంగుండేరి సుతుఁడకో! ఈతఁ
డెందుండి వచ్చెనో! ఎవ్వఁడో! ఇతని
నేయమ కనియనో! ఈ కుమారకుని
యేయింతినో చెనో! ఇతని కౌఁగిటికి!"
అనిపల్కి తనకన్న యర్భకుఁ దలఁచి
స్తనములుఁ జేప బాష్పములుబ్బ నేలఁ
జింద "నేఁ గాంచిన శిశువు ప్రాణంబు
లిందాక నుండిన నింతె కాకున్నె!"
హరియెడ నాతని యంగంబు సొబగు
మెరమెరఁదోఁప నర్మిలిపేర్మిమాన
ధన వసుదేవుఁడు హరియును బలుఁడు
జను దేర దేవకీసతులును దాను
మారుని యాకార మహిమ వీక్షింప;
నారదుండే తెంచి నలినాక్షుఁ గాంచి
యొసఁగ బాలుని పురిటింటిలోనుండి
యసుర యెత్తుకఁబోయినది యాదిగాఁగ
చెప్పి నీపుత్రుఁడు చిత్తజుండీతఁ
డిప్పాలంతుక కోడలిది రతిదేవి
యని చెప్పి నారదుండరుగ నందఱును
మనముల సంతోషమగ్నులైరంత.

కడువేడ్క రుక్మిణి కదియంగ వచ్చి
కొడుకుఁ గోడలి నెత్తుకొని కౌఁగిలించి
వసుదేవ దేవకీవనజాక్షహలుల
కెసలార మ్రొక్కించి యింపులఁ బొదలె.
పురిఁటిలోఁ జెయిదప్పి పోయిన కొడుకు
మరలి యిన్నేండ్లకు మగువయుఁ దాను
నేతెంచె హరిభాగ్య మెట్టిదో! అనఁగఁ
జాతుర్య సుఖలీల సలిపె మురారి.

—: సత్రాజిత్తుని వృత్తాంతము :—

అంత సత్రాజిత్తుఁడను రాజవృషభుఁ
డెంతయు భయమంది యిందిరావిభుని
కాస్యమంతకముతో నమృతాంశుమండ
లాస్యక నిచ్చెదమని చెప్పుటయును
వెఱఁగొంది యారాజు వెన్నుని కేల
వెఱచి యమ్మణిలోన వెలఁది నట్లిచ్చె
నాకథఁ జెప్పవేయని వేఁడ శుకుండు
ప్రాకటంబుగఁ గురుప్రవరుతో ననియె.
అనఘ! సత్రాజిత్తుఁడను ధరాధీశుఁ
డినుగూర్చి తపమాచరింప నాతనికి
మెచ్చి వరంబిచ్చె మిహిరుండు వేఁడ
నిచ్చె స్యమంతాఖ్య నెసఁగు రత్నంబు
నామణి వక్షంబునందొప్పఁ దాల్చి
తామరసాప్తుఁడితండకో! యనఁగ
ధరణి యేలుచునుండి ద్వారకాపురికి

నరుదెంచి యొకనాఁడు హరిఁజూచు వేడ్క
సరసిజసఖుఁడేల చనుదెంచె! ననుచుఁ
బురము వారెల్ల నద్భుతమంది చూడ
శౌరిగేహమునకుఁ జనుదేర, కృష్ణుఁ
డారాజు మన్నించి యర్థిఁ బూజించి
యొకకొన్ని నెలలుండి యొక్కనాఁడతని

—: శ్రీకృష్ణుఁడు సత్రాజిత్తుని స్యమంతకమణిని యాచించుట :—

నకుటిలచిత్తుఁడై యబ్జాక్షుఁడనియె;
"ఈ రత్న మిమ్ము నీకేవస్తువైనఁ
గోర నీకిచ్చెదఁ గొనుమన్న" నృపతి
"కనకంపుమాడలుఁ గడఁగి నిచ్చలును
నెనిమిది బారువులిచ్చు నీరత్న
మెవ్వరిచే నున్న [1]నీతిబాధలును,
జివ్వయు [2]దురితముల్ జెందవు నరుల
నినదత్తమీరత్న మీనోప" ననుచు
ధనలోభమున బల్కెఁ దగువాఁడు దన్ను
నడిగిన వస్తువు లడఁచి యీనేర
కడలిన దుఃఖార్తులగుటెందు నరుదె!

—: సత్రాజిత్తు ప్రసేనునకు మణినిచ్చుటయు, వాఁడు వేటకుఁ బోవుటయు: —

వనజాక్షునకు నీక వంచించి రత్న
మనుజునికిచ్చిన నాప్రసేనుండు

1 నీతిబాధలుడుగు 2 దురితంబు

నామణి ధరియించి యశ్వంబునెక్కి
కామించి యడవి కొక్కఁడు వేఁట వెడలి
మృగముల నొంప నమ్మేదినీవరుని
మృగరాజు చంపి యామిషశంక నతని
మెడనున్న రత్నమర్మిలిఁ గొంచు కొండ
పడలోని కరుగంగ భల్లూకవిభుఁడు
యాకేసరినిఁ ద్రుంచి యామణిఁ గొంచుఁ
బ్రాకటంబుగ మహాభవనంబు సొచ్చె.
అంత సత్రాజిత్తుఁ డనుజుఁడు రామి
కెంతయుఁ జింతించి యిచ్చలో వగచె.

—: సత్రాజిత్తు శ్రీకృష్ణుఁడు మణి నపహరించెనని సందేహించుట :—

"కటకటా! అడవి కొక్కరుఁడునుఁ బోయెఁ
గుటిలత నెవ్వరు కూల్చిరోగాక!
తనకు నమ్మణి యీని తప్పున శౌరి
మనప్రసేనుఁ బట్టి మడియింపఁబోలు!
అతఁడేల లోబడు నన్యులచేత?
ఇతరులీసాహసం బేల కావింత్రు?
అడిగిన యీనేరకనుజన్ముఁ గోలు
పడితినక్కట!" అని పలవింపుచుండ
విని పౌరులెల్లను విష్ణుని దలఁచి
యనుమానపడుచుండ నామాటలెఱిఁగి
యపరిమితజ్ఞాని యగు శౌరి యట్టి
యపకీర్తి నెబ్బంగి నడఁగింతు ననుచు

నడవికిఁ దను బౌరులందఱుఁ గొలువఁ

—: శ్రీకృష్ణుఁడపవాదమును సహింపక మణిని వెతుకుటకై యడవికిఁ బోవుట :—

గడువేగ నరిగి సింగముచేతఁ బడిన
హయముఁ బ్రసేనుని యచ్చోటఁ గాంచి
రయమున సింహనిర్గమనమార్గమునఁ
జని ఋక్షవిభుచేతఁ జచ్చినసింహ
మునుగాంచి పురజనంబుల కెల్లఁ జూపి
యాగుహావాకిట నందఱ నునిచి
వేగ మే కృష్ణుఁడా వివరంబు సొచ్చి

—: శ్రీకృష్ణజాంబవంతుల సమావేశము .—

చనె; జాంబవంతుని సదనంబు నందుఁ
దనరారు సఖి నునుతల్పంబు మీఁదఁ
దనయు నందిడి దాది దానికి రత్న
మనునయంబునఁ జూపి యాడింప, కృష్ణుఁ
డరుదేరఁ బొడగాంచి యదరి యేడ్పుటయుఁ
బరుషత భల్లూకపతి యేఁగుదెంచి

—: శ్రీకృష్ణజాంబవంతుల యుద్ధము :—

యట్టహాసము సేసి హరిఁ గిట్టి ముష్టి
ఘట్టనంబులఁ బాదఘాతల నొంపఁ
గడఁగి మాధవుఁడు నిర్ఘాతంబు వోని
పిడికిటఁ బొడిచిన బెదరక జాంబ

వంతుఁడు మురవైరివక్షంబుఁ బొడువ
నంతకాకారుఁడై హరివానిఁ దాఁకె.
ఇరువురు నీరీతి నిరువదిదినము
లురువడిఁ బోరాడి యొగి కైటభారి
భల్లూకపతిగుండెఁ బగులంగఁ బొడువ
నొల్లనొల్లన నోయి యురుమూర్ఛఁ దెలిసి
యేయుగంబులయందు నీరీతిఁ దొడరి
పాయకిర్వదినాళ్లు బవరంబు సేయ
నెవ్వీరునకుఁ జెల్లు నింతింత సేసె
నెవ్వరోకో! అని యిచ్చలోఁ దలఁచి
యంబుజోదరు నట నాత్మలోఁ దెలిసి
జాంబవంతుఁడు భక్తి సాష్టాంగ మెఱఁగి
చేతులు మొగిడించి శిరసునఁ దాల్చి
యాతతప్రీతి నిట్లని సన్నుతించె.
" దేవ! జగన్నాథ! దేవేంద్రవంద్య!
గోవింద! కృష్ణ! ముకుంద! సర్వేశ!
నీవాదిమూర్తివి నిగమార్థవిదులు
భావించి కనియెడి పరమాత్మవీవ!
పౌరిపౌరి బ్రహ్మవై పుట్టింతు జగము!
హరిమూర్తివై నీవె యనిశంబు బ్రోతు!
హరుఁడవై యడఁగింతు వఖిలభూతములఁ
బరమాత్మ! నీలీలఁ బ్రణుతింప వశమె?
దశరథాత్మజుఁడవై ధరణిఁ బాలించి
దశకంఠు గెలిచి సీతాదేవిఁ దెచ్చు
శ్రీరాముఁడవు నిన్నుఁ జింతింప మఱచి

వైరంబు గొని పోరి వంచితు నైతి
నాతప్పు సైరించి నన్ను మన్నించు
నీ తత్త్వ మెఱుఁగంగ నేర్తునే" యనిన
"నాతోడ నిరువదినాళ్లు పోరాడ
భూతేశునకు నైనఁ బోలునే యందుఁ
బెద్దవు నీవు నాపిడికిళ్లు దాఁకి

—: శ్రీకృష్ణుఁడు జాంబవతీకన్యను బరిగ్రహించుట :—

తద్దయు నొచ్చె నీ తనువంచుఁ" బలుక
[1]సరసిజోదరుఁడు ఋక్షపునకిట్లనియె.
"ధరణిపై నీస్యమంతక నిమిత్తమునఁ
బరపైన యపకీర్తి పాటిల్లె నాకు;
నేపార నీరత్నమిచ్చి సంప్రీతి
వేపంపు" మనుటయు విని భల్లుకేఁడు
నామణి నర్పించి యాత్మసంజాత
వామలోచన జాంబవతినిచ్చి హరికిఁ
బ్రణమిల్లి "ఈకన్యఁ బత్నిగా నేలు
ప్రణవాత్మ!" అనిపల్క పద్మాక్షుఁడతని
మన్నించి కన్యకామణితోడ మణిఁ
గ్రన్ననఁ గైకొని కదలి యేతెంచె.

—: బిలద్వారమందుండిన పౌరులు పురమును జేరి
శ్రీకృష్ణుఁడు మడిసెనని చెప్పుట :—

చెన్నార వెన్నుని సేవించి వచ్చి

1 ఒకపాద మున్నది.

మున్ను బిలద్వారమున నున్న పౌరు
లాకంజలోచనుఁడాపెడ నడఁగి
రాకున్న బెగడి పురంబున కరిగి
యావార్త నెఱిఁగింప నఖిలబాంధవులు
దేవకియును వసుదేవుఁడుఁ గలఁగి
దేవతాగణముల ద్విజలోకతృప్తిఁ
గావించిరంత; నాకమలలోచనుఁడు
ద్వారకాపురి సొచ్చి తగ నుగ్రసేను
నారూఢగతిఁ గాంచి యందఱుఁ జూడఁ
బ్రీతి సత్రాజిత్తుఁ బిలిచి ప్రసేనుఁ
డాతల వని మృతుఁడైన చందంబు
మరి జాంబవంతుఁడు మణి హరించుటయు
నరయ నాతఁడు కయ్యమాడిన తెఱఁగు
నచ్చుగా నెఱిఁగించి యతని కారత్న
మిచ్చి మనోవ్యథ నెడలె మురారి.
ఉత్తములగు వారికొక నింద వొడమ
నుత్తలపడి తీర్పకోర్తురే నిలువ!
అంత సత్రాజిత్తుఁ డమ్మణి దాన
వాంతకుచేఁ గొని యంతరంగమున
సిగ్గును దుఃఖంబుఁ జిడిముడిపాటు
నగ్గలంబొదవ నిట్లని విచారించె.
"అక్కటా! శ్రీనాథు నఖిలలోకేశు
నెక్కటి నిందించి నృపకోటిలోనఁ
బాపంబు సేసితిఁ బద్మాక్షుచిత్త
మేపాటి నొచ్చెనో యేమిగాఁగలదో?

హరిమానసము రోషమడఁగెడు నట్టి
వెరవేదియో యని విన్నఁబాటు నొంది

—. సత్రాజిత్తు సత్యభామను శ్రీకృష్ణునకు భార్యగా నర్పించుట :—

తనకూఁతు సత్య నుత్తమగుణాభరణఁ
దనరార గైసేసి తనవారుఁ దాను
మణితోడఁ గామినీమణి నొప్ప నిచ్చి
యణిమాదిగుణపూర్ణుఁడగు హరి కనియె.
"పరమేశ! నాకూర్మిపట్టి యీకన్యఁ
బరిణయంబై రవిప్రభ నొప్పుమణియు
ధరియింపు" మన్న మాధవుఁడా నరేంద్రుఁ
గరుణించి నెమ్మోముఁ గనుఁగొని పలికె.
"అరులు మిత్రులు నాకు నరయంగ లేరు
పరమాప్తుఁడవు మాకుఁ బావనచరిత!
ఈనాతి నిమ్ము నాకిమ్మహారత్న
మేనొల్ల నేనీకు నిచ్చితి" ననుచు
నాతని కర్పించి యాసత్యభామఁ
బ్రీతిని బెండ్లాడె పీతాంబరుండు,
సత్యభామయుఁ దాను సంప్రీతితోడ
నత్యుదాత్తసుఖంబు లందె మురారి.

—: శ్రీకృష్ణబలభద్రులు కరిపురంబునకు వెడలుట .—

ఆలోనఁ బాండవులటు లక్కయింటఁ
గాలి చచ్చుట విని కాలక నుంట

దెలిసిన వాఁడయ్యుఁ దెలియని యట్లు
బలభద్రుఁడును దాను బయనమై కదలి
కరిపురంబున కేఁగి గాంగేయ విదుర
కురుపుంగవులఁ గనుగొని పాండు సుతులఁ
దలఁచి దుఃఖించి బాంధవులును దాను
కలిసి వర్తింప; నక్కడ నొంటియైన

—: శతధన్వుఁడు సత్రాజిత్తుని వధించి మణిని హరించుట :—

యక్రూరకృతవర్మలా కృష్ణుతోడ
వక్రుఁడౌ శతధన్వు వడిఁ జూచి పలికి
"రడరుచు సత్రాజితను వాఁడు నీకుఁ
గడఁగుచు యీనున్న కన్యయు హరికి 420
నిచ్చె నాతని రత్న మేవెంటనైన
పుచ్చుకొమ్మ" నుటయుఁ బోరి నొక్కరాత్రి
తనయింట నున్న సత్రాజిత్తు నిద్ర
దనిసి యుండఁగ మెడఁ దఱిగి వధించె.
తరుణులందఱు నేడ్వఁ దనరి యామణిని
హరియించె శతధన్వుఁ డఱ యింతలేక
సత్యభామయుఁ దండ్రి చావున కడలి
యత్యంతశోకాన నతని కాయంబుఁ
దైల పక్వముఁ జేసి తగుచోట నునిచి
యాలేమ కరిపురి కరుదెంచె నంత.

—: శ్రీకృష్ణుఁడు శతధన్వునిఁ జంపుట :—

ఆమాట విని కృష్ణుఁ డబల నూరార్చి

రాముఁడుఁ దానును రథ మెక్కి కదలి
తరలాక్షిఁ దోడ్కొని ద్వారకాపురికి
నరుదేర శతధన్వుఁ డాస్యమంతకము
నక్రూరునకు నిచ్చి యతిజవాశ్వంబు
విక్రమంబున నెక్కి, హలియును దాను
పటురయంబున వానిపజ్జఁ దాఁకుటయుఁ
జటులత వాని యశ్వము జవంబెడలి
భరమోర్వకను బడి ప్రాణముల్ విడిచె.
తురగంబు కూలినఁ దోరంపు భీతి
నాతఁడు కాల్నడ నరుగుటఁ జూచి
యాతతరయమున నరదంబు ద్రోలి
ఘనచక్రధారచేఁ గంఠంబు నఱికి
తనువెల్ల నరసి రత్నముఁ గాన లేక
"శతధన్వు నూరకే చంపితి నకట!
ఇతడు మహామణి నెందుంచినాఁడొ?
అరసికొందము గాక" యనిరథంబెక్కి
యరుదేర హలపాణి హరికిట్టులనియె.

—: బలరాముఁడు మిథిలానగరమునకు వెళ్లుట ;
అచ్చట దుర్యోధనుఁడతని వద్ద గదాయుద్ధ మభ్యసించుట :—

"ఈ మిథిలాధీశుఁడితఁడు నాసఖుఁడు
కామించి యారాజుఁ గాంచి వచ్చెదను
నీవు పొమ్మని" పల్కి నీలాంబరుండుఁ
వేవేగ మిథిలకు విచ్చేయ నతఁడు
యెదురేఁగి సీరికి నెంతయు వేడ్కఁ

ఎదురొప్ప దేవోపచారసత్క్రియలు
నతిభక్తిఁ బూజింప నతని గేహమునఁ
జతురత నొకకొన్ని సంవత్సరములు
కలసి వర్తింప నక్కడ సుయోధనుఁడు
హాలితోడఁ జటుగదాభ్యాసంబు సేసె.

—: అక్రూరుని వృత్తాంతము :—

వనజాక్షుఁడును ద్వారవతికి నేతెంచి
తనరారు మణి శతధన్వుని వద్దఁ
గానక యుండుటఁ గాంతకుఁ జెప్పి
పూని సత్రాజిత్తు భూమివర్యునకుఁ
బరలౌకికంబులు భక్తిఁ జేయించె.
అరయ నారత్నంబు యక్రూరుఁడెత్తి
కొనిపోయి వనభూమి కుశలియై యుండె.
అనఘమానసుఁడైన యక్రూరుఁ డరుగ
నాపట్టణంబున నఖిలమంత్రులకు
దూపిల్లె భయకష్టదుష్టరోగములు.
అని చెప్పుటయు విని యక్రూరుఁడెట్లు
ఘనపుణ్యుఁడయ్యె నక్కథఁ జెప్పుమనుఁడు;
మున్నశ్వపాలుఁడు మొగి ననావృష్టి
ఖిన్నుఁడై కాశి కేఁగినఁ గాశిరాజు
హరువరంబునఁ గనె యమ్మృగాంకవదనఁ
దరలాక్షి గాందిని తన కూర్మిపుత్త్రి;
ఈకన్నె చే నన్ని (యీతి) బాధలును
శోకరోగాదులు సోఁకక యడఁగు;

ఆకన్యఁ బ్రీతిమై యశ్వపాలునకుఁ
జేకొని వడిఁ బెండ్లి సేసి పంపుటయు
నానాతి వరియించి యఖిలదుఃఖములు
మాని సుఖించె నమ్మనుజవల్లభుఁడు. 450
అయింతి సుతుఁడైన యక్రూరుఁ డలిగి
పోయినకతమునఁ బుట్టె నీపాప

—: అక్రూరుని శ్రీకృష్ణుఁడు పిలిపించి బుద్ధులు చెప్పి మఱల వానికే మణిని బ్రసాదించుట :—

మనిచూచి శౌరి యక్రూరుఁ బ్రేమఁ
బనివడి దూతలఁ బంచి రప్పించి
యతనితో నొక్కనాఁడ తిరహస్యమున
శతదళనేత్రుఁడు చతురుఁడై పలికె.
" అదరి సత్రాజిత్తు నడఁచి మాణిక్య
మురవడిఁ గొంపోవ నొగి వెంటఁ దగిలి
శతధన్వు నూరకె చంపితి గాని
యతులితంబగు రత్నమతనిచేఁగాన
మక్కటా! శ్రీధనంబది పాడిగాదు
యిక్కువ జ్ఞాతులకిది యహితంబు
నీయింట నతని మానికముండె గాన
యీయధ్వరములు నీకిటు సేయఁగ నై
నిది నాకుఁ బ్రియమన్న " నిందిరావిభుని
పదపంకజములకుఁ బ్రణమిల్లి యతఁడు
" గోవింద! కృష్ణ! ముకుంద! మురారి!
పావనగుణపూర్ణ! పద్మాయతాక్ష!

సర్వాత్మలందును జరియించు నిన్ను
సర్వేశ! ఎఱుఁగంగఁ జనునయ్య నాకు"
అని పల్కి హరిచేతి కక్రూరుఁ డెలమి
తనరార నాస్యమంతక మిచ్చి మ్రొక్క,
శౌరి సంతసమంది జ్ఞాతులు చూడఁ
గోరి యారత్న మక్రూరున కిచ్చె!
"ఈకథవిన్న మీకీప్సితార్థములు
ప్రాకటంబుగ నిచ్చు భవబాధలుడుగు
నపకీర్తులడగించు నఘములఁ జెఱచుఁ
గపటంబులెడలు మంగళములు నిచ్చు"
నని చెప్పి మరియును నంబుజోదరుఁడు

—: శ్రీకృష్ణుఁడు ఇంద్రప్రస్థపురమునకు వెడలుట :—

తనరంగ నింద్రప్రస్థంబున కరిగె.
అఖిలలోకారాధ్యుఁడగు విశ్వగురుఁడు
సుఖతరంబుగఁ బాండుసుతుల నీక్షించి
సుదతి గొంతికి ధర్మసుతునకు మ్రొక్కి
కదియంగ భీమునిఁ గౌఁగిటఁ జేర్చి
నవ్వుచుఁ దనమ్రోల నమ్రులై యున్న
కవ్వడికవల నొక్కట నెత్తి ప్రేమ
నందఱి సేమంబులడుగంగ వార
లందఱుఁ బూజింప నానందమంది
గొంతియుఁ గృష్ణు నక్కునఁ జేర్చి దుఃఖ
మంతకంతకుఁ బేర్చి యార్తియై నేడ్వఁ
గరపల్లవంబునఁ గన్నీరుఁ దుడిచి
నరుడండఁ దన మేనయత్త నూరార్చి

ధర్మనందను గేలు తన కేలఁ బట్టి
యర్మిలి నిగుడ నిట్లనియె నా శౌరి.

—: శ్రీకృష్ణుఁడు పాండవుల క్షేమవార్తల నరయుట :—

" అక్కటా! దుర్మదులగు శత్రువులు
పెక్కుపాటులఁ మిమ్ముఁ బెట్టంగ వినుచు
నొప్పగించిన యట్టులుంటిమి గాని
యుప్పటప్పటికి మిమ్మరయంగ లేక
దైవంబుకతన నింతటి బాధలుడిగె
నేవిధంబునఁ బుణ్యశ్లోకములను ;"
అనవుఁడు ధర్మరాజా కృష్ణుఁ జూచి
వినయబాంధవములు వెలయ నిట్లనియె.
" అనఘాత్మ! నీ మర్మమరయక యున్న
మన నేర్తుమే మేము మర్త్యులలోన?
తల్లియుఁ దండ్రియుఁ దైవంబు గురుఁడు
నెల్ల బాంధవులును గల నీవె మాకు!
ఈరొద్దివాక్కల నిహపరంబులకు
మాకెవ్వరున్నారు? మధుకైటభారి!"
అనుచు మజ్జనభోజనాది సత్కార
వినయోపచారాది విధులఁ బూజింప
హరియుఁ బాండవులును నన్యోన్యమైత్రి
నురుతరంబుగ నుండ నొకయేఁడు చనియె.

—: శ్రీకృష్ణుఁడును బార్థుఁడును వేఁటకై వెడలుట :—

అత్తరి నొకనాఁడు హరియుఁ బార్థుఁడును

జిత్త్వాబ్జముల వేడ్క చిగురులు వోడమ
వాయువేగములైన వాజులఁ బూని
యాయుధపరిపూర్ణమగు రథంబెక్కి
యగణితసారమేయావళితోడ
మృగయులాయుధరశ్మి మెఱసి తోనడువఁ
గాకోలభీకర కాకోదరంబుఁ
గాకఝిల్లికము భీకరరావకులము
నపరిమితాభీలహర్యక్షకులము
కుపితకోలాంగూలకోలాహలంబు
కరితుండఖండితఘనపిప్పలంబు
వరతపఃపరికీర్ణపల్లవస్థలము
ప్రకటితకుంజరవ్రాతకంటకము
వికృతభల్లవ్యాఘ్రవృకసమూహంబు
నగు మహారణ్యంబు నందండ చొచ్చి
మృగయానురక్తులై మెలఁగి యాలోన
వలలొగ్గి తెరలొత్తి వరభటోత్తములు
బలిసి కొమ్ములనుండి పదిలమై నూఁద
వరఁగఁ గిటివ్యాఘ్రభల్లసారంగ
కరిసింహశరభఖడ్గకలులాయములు
గండభేరుండాది ఘనమృగాదులును
దండిమైఁ బరవఁ, దగిలి వేయుచును
గుక్కలవిడుచుచుఁ గోరి పెన్వాలలు
నెక్కొనఁ జుట్టియు నిబిడాస్త్రసమితిఁ
బొలియించియును మృగంబులఁ గీటణంచి
యలసికృష్ణార్జును లర్కకన్యకకుఁ

జనుదెంచి శీతలజలమాని తీర
మునఁ దరుచ్ఛాయ నిమ్ముల విశ్రమింప ;

—: కాళిందీపరిణయము :—

రక్తాబ్జపదతలరాజీవవదన
మౌక్తికమణిదంత ఘనమీననయన
పులిననితంబ కంబుసమానకంఠ
యావర్తనాభ రథాంగవక్షోజ
శైవాలరోమసంచయ బిసపాణి
యననొప్పు కాళిందియను వరారోహ
చనుదెంచి కృష్ణుని సన్నిధి నిలువ ;
వనితసౌభాగ్యలావణ్యచాతుర్య
మహిమింప నేత్రుఁడై హరిచూచెనంత,
నరుఁడింతిఁ గనుఁగొని "నళినాక్షి ! ఏఁటి
కరుదెంచితీ వెవ్వరని పల్కుటయును,
మురిపెంపు సిగ్గును మోమున బెరయఁ
దరలాక్షి రోచులు దనర నిట్లనియె.
"కాలాత్ముఁడగు సూర్యకన్యక నేను
కాళిందియనుదానఁ గమలాక్షుఁ గూర్చి
తపమాచరింతు నీతటమున, వేఁట
నెపమున(నే తెంచు) నీరజోదరుని
కామించి వచ్చిన కార్యమంచనిన ;
ఆమెను మన్నించి హరి తోడుకొనుచు
శరిపురి కేతెంచి కాళిందికన్యఁ
బరిణయంబై యొప్పెఁ బద్మలోచనుఁడు.

అర్జును రథసూతుఁడై తోడువచ్చి
నిర్జరాధిపునాజ్ఞ నెదరి ఖాండవము
హుతవాహునునికి నాహుతిగా నొనర్చి
యతనిచే గాండీవమనుపేరి ధనువుఁ
దఱుగని యమ్ములుఁ దరుచరధ్వజము
వఱలెడు రథమును వాజులుఁ దెచ్చి
నరునకు నిచ్చె; నానరుచేత మయుఁడు
దరికొను ఖాండవదహనంబుఁ బాసి
బ్రదికి సభామంటపంబును గట్టి
గదయు శంఖమునిచ్చి కడుభక్తి నరిగె.
హరియును రథమెక్కి యతివయుఁ దాను
దరమిడి చనుదెంచె ద్వారకాపురికి;
సాత్యకి నరుతోడ శస్త్రాస్త్రవిద్య
నత్యుదాత్తత నేర్చి హరిఁ గొల్చివచ్చె;
హరియుఁ గాళిందియు నసమాస్త్రకేళి
సరససౌఖ్యక్రీడ సలిపిరింపొంద.

—: మిత్రవిందాపరిణయము :—

వారక నాలో నవంతిభూపతులు
వీరులు విందానువిందులు ప్రేమఁ
దమ ముద్దుచెలియలి ధవళాయతాక్షి
విమలేందువదన సంవ్రీడనిదాన
నారూఢలీల స్వయంవరోత్సవము
గారవంబునఁ జేయగాఁ గృష్ణుఁ డెఱిఁగి
చని భూపతులనెల్ల జడిసిపోఁద్రోలి

వనితఁ దోడ్కొని వచ్చె ద్వారకాపురికి

—: సత్యాపరిణయము :—

అగ్నిజిత్తుండను నారాజుతనయ
నగ్నిజిత్తాఖ్య నాయబ్జలోచనుఁడు
కడువేడ్కతోఁ బెండ్లి గానిచ్చెఁ గోరి
కడఁకఁ గోసలపతికడ కేఁగె నతఁడు.
కొనకొని హరి నెదుర్కొని తోడుకొనుచుఁ
జని యిష్టపూజల సంప్రీతుఁ జేసి
"కారుణ్యగుణపూర్ణ! కల్యాణశీల!
వారిజోదర! లోకవంద్య! శ్రీకృష్ణ!
నాయింటి కరుదెంచి నన్నుమన్నించి
తే, యుగంబులయందు నేఁ గృతార్థుండ
నేమివిచ్చేసితి రెరిగింపు" మనినఁ
దామరసాక్షుఁడాతనికిట్లు జెప్పె.
"నీకూఁతు సత్య నున్నిద్రాంబుజాక్షి
మాకు నిమ్మ"నిన నమ్మనుజేంద్రుఁ డనియె.
"హరి! నీవు మాయింటి యల్లుండవౌట
పరమకౌతుకము మాబంధులకెల్ల
నీపట్టణంబున నేడు శాశ్వతము
నేపారు నురు వృషభేంద్రంబు లిట్లు
శాతశృంగోత్తుంగచటులసత్త్వమున
భూతలాధీశులఁ బొలియించుచుండు
వాని నేడింటిని వసుధపైఁ గూల్చు
వానికిఁ గాని యీవనిత నీననుచు

నాక వెఱ్ఱితనమున నున్నాఁడ గాక
యకలంక ! నీకంటె నధికులు గలరె ?
ఈకొని యుంకువ యిద్ది యెంతొల్ల
నీకసాధ్యంబేది ? నీరజోదరుఁడ !
అనిలోన నాఁబోతు లన్నింటి నడఁచి
పెనుపార నీకన్యఁ బెండ్లిఁగమ్మ''నిన ;
హరి యేడురూపుల నాఁబోతుఁ గమిసి
పరువడి లేఁద్రాటఁ బట్టి బంధించి
ధరఁ గూల్చి పేర్చిన దైత్యారిఁ జూచి
పురజనులద్భుతంబును బొంది చూడ
నాపౌర కామినులంబుజోదరుని
చూపుచెంగలువల సొరిదిఁ బూజింప
నీకృష్ణుఁ డీట దానె యేతెంచి పొందు
నీకన్యసౌభాగ్య మెట్టిదో యనఁగ !
శుభలగ్న మరుదేర సుందరీతిలక
నభినవంబుగఁ బెండ్లియయ్యె మురారి.
అతిసంభ్రమంబున నాకోసలేంద్రుఁ
డతిశయంబుగఁ గన్యకరణంబుగాఁగఁ
బదివేలు గోవులఁ బదివేలు కరుల
విదితంబుగా మూఁడు వేల యింతులను
జటులవాహముల వింశతిసహస్రముల
పటుశతాంగంబులు పదివేలనిచ్చి
యనిచి పుత్తెరంగ నంబుజోదరుఁడు
వనితఁ దోడ్కొని ద్వారవతికేఁగుదెంచి
సత్యయుఁ దానును సౌభాగ్యలీల

సత్యాదాత్తత సుఖంబందె మురారి

—: శ్రీకృష్ణుఁడు భద్రను లక్షణను వివాహమాడుట :—

పూని కేకయరాజపుత్రిని భద్ర
మేనత్తకూఁతు నర్మిలిఁ బెండ్లియయ్యె.
మఱి స్వయంవరమున మద్రదేశతనయ
నరమి లక్షణఁ బెండ్లియయ్యె మురారి.
వఱలు రుక్మిణి జాంబవతి సత్యభామ
మెఱయు కాళిందియు మిత్రవిందయును
సత్యయు భద్రలక్షణయును ననఁగ
సత్యాదాత్తత భామలెనమండ్రును
పట్టపుదేవులై భాసిల్లుచుండ
నెట్టన నరకుని నిర్జించి శౌరి
వెలఁదుల పదియాఱువేలను దెచ్చి
యెలమి బెండ్లయ్యె నంచిట్లు సెప్పుటయు ;
నరకుఁడెవ్వఁడు ? వానినలినాక్షుఁడేలఁ
బరిమార్చె ? నెక్కడి పడఁతులు వారు ?
ఈకథ నెఱుఁగింపుమని వేఁడుటయును
జేకొని శుకయోగి చెప్పంగఁ దొడఁగె.

—: నరకాసురుని వృత్తాంతము :—

ధరణీసుతుఁడు నుద్ధతబాహుబలుఁడు
నరకాహ్వయుండు దానవకులేశ్వరుఁడు
వరశక్తిమహిమ దుర్వారసత్వమున
ధరణిపైఁ గలరాజతతి నెల్ల నోర్చి

తనశాసనంబులఁ దగనిల్పి యంతఁ
దనివోక యతిలోకద్రోహుఁడై నడచి
యమరాధిపతిఁ గెల్చి యగ్ని నోడించి
శమనుని గెల్చి రాక్షసుఁ బారద్రోలి
వరుణుగర్వము మాన్చి వాయువుఁ బఱపి
పోరి కుబేరుని ద్రోలి భూతేశుఁ గిట్టి
వనధీశుపాశంబు వజ్రివజ్రంబు
ధనదుని పెన్నిధుల్ తనసొమ్ముగాఁగ
నదితికుండలములు హరియించి యెందు
నెదురెవ్వరును లేక యేపు దీపించి
ప్రాగ్జ్యోతిషంబుగాఁ బరఁగు (దుర్గాన)
దిగ్జేయశక్తి వర్తింపుచో నంత ;

—: దేవేంద్రాదులచేఁ బ్రార్థింపఁబడి శ్రీకృష్ణుఁడు నరకునిపై దండెత్తుట :—

దేవేంద్రుఁడును సర్వదిక్పాలకులును
గోవిందుతో నర్థిఁ గూడి చెప్పుటయు
విని సత్యభామతో విహగంబు నెక్కి
చనుదెంచి ప్రాగ్జ్యోతిషము మీఁద శౌరి
గిరిదుర్గమంబు నగ్నిపరీతమగుచు
మురమంత్రబహుపాశములఁ జుట్టివచ్చి
పరులకభేద్యమై బరగు నప్పురికి
నరుదెంచి పాంచజన్యధ్వాన మెసఁగ
నార్చిన నతిభీషణార్చులు నిగుడ
పేర్చి మిన్నందిన భేదింపరాక

సత్యాదాత్తత సుఖంబందె మురారి

—: శ్రీకృష్ణుఁడు భద్రనులక్షణను వివాహమాడుట :—

ఘాని కేకయరాజపుత్రిని భద్ర
మేనత్తకూఁతు నర్మిలిఁ బెండ్లియయ్యె.
మరి స్వయంవరమున మద్రదేశతనయ
నరమి లక్షణఁ బెండ్లియయ్యె మురారి.
వఱలు రుక్మిణి జాంబవతి సత్యభామ
మెఱయు కాళిందియు మిత్రవిందయును
సత్యయు భద్రలక్షణయును ననఁగ
సత్యాదాత్తత భామలయ్యెనమండ్రు
పట్టపుదేవులై భాసిల్లుచుండ
నెట్టన నరకుని నిర్జించి శౌరి
వెలఁతుల పదియాఱువేలను దెచ్చి
యెలమి పెండ్లయ్యె నంచిట్లు సెప్పుటయు ;
నరకుఁడెవ్వఁడు ? వానివలినాత్ముఁడేలఁ
బరిమార్చె ? నెక్కడి పడఁతులు వారు ?
ఈకథ నెఱుఁగింపుమని వేఁడుటయును
జేకొని శుకయోగి చెప్పంగఁ దొడఁగె.

—: నరకాసురుని వృత్తాంతము .—

ధరణీసుతుఁడు నుద్ధతబాహుబలుఁడు
నరకాహ్వయుండు దానవకులేశ్వరుఁడు
వరశక్తిమహిమ దుర్వారసత్త్వమున
ధరణిపైఁ గలరాజతతి నెల్ల నోర్చి

తనశాసనంబులఁ దగనిల్పి యంతఁ
దనివోక యతిబలోదగ్రుఁడై నడచి
యమరాధిపతిఁ గెల్చి యగ్ని నోడించి
శమనుని గెల్చి రాక్షసుఁ బారద్రోలి
వరుణుగర్వము మాన్పి వాయువుఁ బఱపి
పోరి కుబేరుని ద్రోలి భూతేశుఁ గిట్టి
వనధీశుపాశంబు వజ్రిశస్త్రంబు
ధనదుని పెన్నిధుల్ తనసొమ్ముగాఁగ
నదితికుండలములు హరియించి యెందు
నెదురెవ్వరును లేక యేపు దీపించి
ప్రాగ్జోతిషంబుగాఁ బరఁగు (దుర్గాన)
దిగ్జేయశక్తి వర్తింపుచో నంత;

—: దేవేంద్రాదులచేఁ బ్రార్థింపఁబడి శ్రీకృష్ణుఁడు నరకునిపై దండెత్తుట :—

దేవేంద్రుఁడును సర్వదిక్పాలకులును
గోవిందుతో నర్థిఁ గూడి చెప్పుటయు
విని సత్యభామతో విహగంబు నెక్కి
చనుదెంచి ప్రాగ్జోతిషము మీఁద శౌరి
గిరిదుర్గమంబు నగ్నిపరీతమగుచు
మురమంత్రబహుపాశములఁ జుట్టివచ్చి
పరులకభేద్యమై బరగు నప్పురికి
నరుదెంచి పాంచజన్యధ్వాన మెసఁగ
నార్చిన నతిభీషణార్పులు నిగుడ
పేర్చి మిన్నందిన భేదింపరాక

హరి శార్ఙ్గమెక్కిడి యయ్యగ్నిఁ జల్లార్చి
కులిశబాణంబునఁ గోటలుఁ గూల్చి
బలువిడి మురయంత్రపాశంబులడఁచి
దానవసేనలు దఱిమి పైనడవ
నానాస్త్రములఁ ద్రుంచె నలినాక్షుఁడంత;

—: మురాసురసంహారము :—

అంతయుఁ గని మురుఁడతిరౌద్రమెసఁగ
నంతకాకారుఁడై యైదుమోములను
ఘనరోషవిస్ఫులింగములుప్పతిల్ల
సునిశిత కీలోగ్రశూలంబుఁ గ్రాలఁ
గలుషించి జగములొక్కట మ్రింగఁజూచు
ప్రళయకాలమునాటి ఫాలాక్షుఁడనఁగ
దట్టించి హుంకారధ్వని దిక్కులగల
నట్టహాసము సేసి హరిమీఁదఁ గవిసె.
జ్వాలాకరాళజిహ్వామగుశూలాన
వ్యాళాహితమను వైచె తాఁగదసి
కడుఁబేర్చి నిసితమార్గణములు మూఁడు
తొడిగి శూలంబుఁ దుత్తునియలు చేసె.
నురుశరాష్టకమున నురమాడ నేయఁ
దిరుగక దైత్యుఁడు తీవ్రకోపమున
హరిపై మహాశక్తి నదరింప శౌరి
శరములు మూఁట జర్ఝరితంబు సేయ
గడఁగొని లయకాలకాలుఁడు వోలె
చదియఁ బక్షీంద్రుదు వక్షము వ్రేయుటయును

హరి నందకంబెత్తి యమ్మురాసురుని
కరమును గదయును ఖండించివైచె.
యాదవోత్తముఁడు చక్రాభీలధార
నైదు శిరంబుల నవలీలఁ దునుమ
బలభేదిచేఁ గూలు పర్వతంబనఁగ
నలవరి మురదైత్యుఁడవనిపైఁగూలె.

—: మురాసురుని పుత్రులు తామ్రాదుల యుద్ధము :—

ఆమురాసురపుత్రులైన తామ్రాదు
లా ముకుందుని మీఁద నందంద కవిసి
కరవాలముసలముద్గరభిండివాల
పరశుతోమరగదాపాశశక్తులను
బలములఁ దారును బాణజాలముల
బలువిడి గురియించి పక్షీంద్రుమేను
హరిమేను నొ (ప్పింపహరియుఁగోపించి)
కరములఁ ద్రెవ్వ యంగంబులఁ దునిమి
బరులు వ్రక్కలు వాపి పథములు మురిసి
శిరములు..................వగిలి
యెమ్ములు చిద్రుపలై యెఱచులు చదిపి
యమ్ములు పొడిపొడియై జోళ్లు విఱిచి
కరుల.......................
.............రవరలై ధాత్రిదొరగ
యందంద మేనులు నన్నిచందములఁ
జిందువందై హతశేషులు వఱవ

—: నరకాసురుని యుద్ధము :—

......చ్చి నరకుండు గ్రస్ఫూర్తి దనర
మకుటకుండలదీప్తి మలయుచు నిగుడ
నగణితకటకహారాది............
...రుకేతః కాంతి దళదళ వెలుఁగ
చరనగాద్రిపైఁ బొల్చు సప్తాశ్వుఁడనఁగ
యరదంబు.................
...............రాధీశు మూఁడ్కి
హరిఁదాకి పెల్లేసె నమరులు దలఁక
శౌరియాతని యంపజడి మాన్పి రెండు
నా....................
....డిసోలి గొబ్బున లేచి
యార్చి మహాశూలమంకించి వైవ
నెదువంశవల్లభుఁడాఱు బాణముల
న...............లుగమ్ములు జొనిపె
గరుడుని రెక్కలు కసరంద నేయ
నురగారి పటునఖోద్ధూతఘట్టలఁ
(గదియుచు) నదియును ఖండించె; శౌరి
త్రిదశులు భీతిల్ల దిక్కులల్లాడ
ప్రళయభానుప్రభాపావకశిఖల
.......................,
(దను) జాధిపుని మేను దారించి శిరము
ఘనతీవ్రధారను ఖండించుటయును
మండితమణిదీప్తి మకు.........,
........................,

(క్రూ)రాత్ముఁడగు నరకుఁడు గూలుటయును
జోరన మందారపుష్పవర్షములు
దివిజులు..................,
...............వినువీధిఁ జాలిచె. 600

—: భూదేవి తనకుమారుఁడు నరకుని చావునకై దుః
ఖించుట :—

తనయుఁడు గూలిన ధారుణి దుఃఖ
వనరాశిలో మున్గి వనమాలి మ్రోల
కటకతాటంకకంకణచారుహార
పటురత్నభూషణప్రభలు శోభిల్ల
వరుణాతపత్రంబు వాసవజనని
యురుతరకుండలయుగళంబుఁ దెచ్చి
హరికి సమర్పించి............,
పరమానురక్తిమైఁ బ్రార్థింపఁ దొడఁగె

—: భూదేవి శ్రీకృష్ణుని బ్రార్థించుట :—

శ్రీనాథ! గోవింద! శ్రీవత్సచిహ్న!
భానువత్సంకాశ! భక్తలోకేశ!
కంబుచక్రగదాశిఘనశార్ఙ్గహస్త!
అంబుజనాభ! పీతాంబరాభరణ!
విశ్వవిశ్వంభర! విశ్వైకజనక!
శాశ్వత! సర్వజ్ఞ! సర్వలోకేశ!
[1]నీలామనోనాథ! నిఖిలాండనాథ!

---

[1] ఒకపాదమున్నది,

ఉరురజోరూపుమైఁ బుట్టింతు జగముఁ
బరమ! సత్త్వస్థితిఁ బాలింతు వీవ
తామసరూపుమై దండింతు వీవ
నీమేన జనియించు నిఖిలభూతములు
నవని యప్పులునభమగ్ని వాయువులు
రవిసుధాకరులాత్మ రాజీవభవుఁలు
సకలేంద్రియంబులు సకలశక్తులును
సకలంబు నీరూపు చర్చించి చూడ!
పూతాత్మ! శ్రీకృష్ణ! పురుహూతవంద్య!
నీతత్త్వ మెఱుఁగంగ నేనెంతదాన?
నరకుండు నీదయ నాకుద్భవించు
వరపుత్రుఁడీతఁడు వరశక్తి పేర్మి
దేవతాద్రోహియై తెగియె నీచేత
దైవీక మెవరికిఁ దప్పింపరాదు!
కావున నితనికి గలిగె నీలోక
మేవిధంబున ధన్యుఁడిది లెస్సయయ్యె!
దురితారి! వానిపుత్రుఁడు భగదత్తుఁ
గరుణించి నీవ యిక్కడ ప్రతిష్ఠింపు''.
మని మ్రొక్కి ధరణి జయాంకమై బఱఁగు
వనమాల మురవైరి వక్షంబునందు
పూజించి వీడ్కొని భూదేవి చనియె.

—: పదియాఱువేల గోపికలను శ్రీకృష్ణుఁడు
పెండ్లియాడుట :—

రాజీవనేత్రుఁడు రమణీయమూర్తి

నరకునింటికి నేఁగి నరసిద్ధసాధ్య
సురయక్షగంధర్వసుదతులఁ దెచ్చి
యతఁడొకపరి పెండ్లియాడెడు వేడ్క
జతనంబు సేసిన జలజాతముఖుల
వెలఁదులఁ బదియాఱువేలనూఱ్వురను
జలజోదరుఁడు జూచి సంతసంబందె.
ఆకన్యకలచూపు లబ్జాక్షుమీన
దాఁకొని చెంగల్వదండలై యొప్పె;
జలజాక్షురూప మాజలజాతముఖులు
తలయెత్తి యందంద తమకించి చూడ
దినకరోదయబింబదీప్తమౌ కంజ
వనము చందంబున వదనంబులొప్పె;
పొలఁతుల నందలంబులఁ బెట్టి శౌరి
పొలుపార ద్వారకాపురికిఁ బుత్తెంచె.
వరుణుని ఛత్రంబు వరుణునికిచ్చె;
సురదంతి హయమును సురపతికిచ్చె;
ధనపతి నిధుల నాతనికిచ్చి వుచ్చె;
వనజోదరుఁడు భక్తవత్సలుఁ డంత
నగణితప్రీతిమై నభయంబు లిచ్చి
భగదత్తు నప్పురి పట్టంబుగట్టి

—: శ్రీకృష్ణుని యమరావతీప్రవేశము :—

ప్రమదంబుతో సత్యభామయుఁ దాను
నమరావతికి వచ్చె నమరారివైరి.
హరిఁజూచు వేడుక నా పట్టణంపు

తటుకు లొందురులకుఁ దమకంబు లొదవ
పలకారిచూపు నీవాళ్లుగాఁ జేసి
యాలోకగురుఁ జూచి రందంద వచ్చి;
పొలఁతుల చూపు లప్పౌరవీథులందుఁ
గలువతోరణములు గట్టినట్లొప్పె;
భామల కన్నులపండువై సత్య
భామయుఁ దానును బక్షీంద్రు నెక్కి
గో తేర నింద్రుఁడు యెదు రేఁగి శౌరిఁ
దోతెంచి పూజలఁ దృప్తిగావించె;
హరి కుండలంబులయ్యదితికి నిచ్చి
పరమానురక్తి సంభావించి మ్రొక్కె;
నా దేవమాతయు నంబుజోదరుని
నాదట దీవించి యక్కునఁ జేర్చి
శచియు నింద్రుఁడు పరిచర్యలు సేయ
నచలితసౌఖ్యాత్ముఁడై యుండె నంత.

—: పారిజాతాపహరణము :—

సత్యభామయుఁ బారిజాతంబుఁ జూచి
నత్యుదాత్తతఁ బ్రీతి హరి వేఁడుటయును;
వేగంబె శౌరి యావృక్షంబుఁ బెఱికి
నాగారిపై నిడి నాతియుఁ దాను
ద్వారకాపురికేఁగ వాసవుఁ డెఱిఁగి
యైరావతారూఢుఁడై దేవకోటి
గొలువంగ వలచేతఁ గులిశంబుఁ దాల్చి
బలువిడి నార్చుచుఁ బద్మాక్షుఁ దాఁకె.

—: ఇంద్రుఁడు శ్రీకృష్ణునితో యుద్ధముఁ జేయుట :—

అనలకృతాంతదైత్యాధీశవరుణ
యనిలకుబేరభూతాధీశవరులు
తమవాహనముల నుద్ధతి నెక్కి పేర్చి
కమలాక్షుఁ దాఁకిరి కరముగ్రవృత్తి;
నార్పుల బొబ్బల నట్టహాసముల
దర్పించి కవిసిరా దనుజారి మీఁద
వ్రేసియుఁ బొడిచియు వివిధబాణముల
చేసియు నొప్పింప నిందిరావిభుఁడు
పారిజాతముతోడఁ బక్షీంద్రుతోడ
వారిజాననతోడ వరశక్తి దిరిగి
పటుశార్ఙ్గనిర్ముక్తబాణజాలముల
చటులతఁ జూపి నిర్జరసేనఁ బఱపి
యమరాధిపతి నొంచి యనలుఁ జల్లార్చి
సమవర్తి గెలిచి రాక్షసుని నిర్జించి
వరుణకుబేరుల నొప్పి వాయువుఁ బఱపి
నరవాహు గెలిచి పినాకి శిక్షించి
బృందారకశ్రేణిఁ బెట్టికి యందంద
యందఱి గెలిచి తా రేఁగె ద్వారకకు.
పారిజాతము సత్యభామగేహమున
నారూఢగతి నిల్పి యతిసౌఖ్యమైన
శుభముహూర్తమున భూసురులు సేవింప
నభినుతులొనరింప నబ్జోదరుఁడు
పదియాఱువేవురు పంకజాననల
వదలని వేడ్క వివాహమై పేర్చి

యందఱకును నిండ్లు నారామములును
జెందిన దాసదాసీజనంబులను
గంధమాల్యాంబరఘనభూషణములు
బంధురమైన సంపదలును నొసఁగి

—ః శ్రీకృష్ణుని లీలావిహారములు ః—

హరి పెక్కురూపంబులై సౌఖ్యలీల
పరిణమింపఁగఁ జేసి పడఁతుల నెల్ల
నేయింటఁ జూచిన నిందిరాధీశుఁ
డాయింటి రమణిని నవఁగి వర్తింప
పడఁతులు కృష్ణుతోఁ బాయని వేడ్క
నడరి వర్తింపుదు రహమును రేయి.
హరియోగవిద్యామహత్త్వకౌశలము
సరసిజాసనుఁడైనఁ జర్చింపఁగలఁడె! 660

—: రుక్మిణీదేవి సౌధవర్ణనము :—

ఈభంగి నొకనాఁడు యిందిరావిభుఁడు
సౌభాగ్యరుక్మిణీసదనంబులోనఁ
జూపట్టువైడూర్యసోపానములును
నేపార నీలాలనెనయు కరుంగుఁ
బసిఁడికంభంబులపట్టుపుసాల
లసమానబహుదీప్తి నడుకు పుత్తళులు
మరకతరుచిఁ బోల్చు మదురుల నొప్పు
సిరి[illegible] గచ్చు సేసిన కుడ్యములును
గరమొప్పు నవచంద్రకాంతజాలములు

కరిదంతముల నవకంబైన తలుపు
సగడంపు గడపలు పసిఁడిబోదెలును
నిగిడిన వజ్రాల నెగడిన గడియ
మేలైనకెంబట్టు మేల్కట్టు మెఱయు
నాలవట్టంబును నడపసంబెళయుఁ
కస్తూరిగంధమంగళధూపములును
శస్తమై తగు మల్లసాలలు నొప్పె.

—: శ్రీకృష్ణునికి రుక్మిణి రాజోపచారములు గావించుట :—

సంసారసౌఖ్యరసాయనంబైన
హంసతూలికపాన్పునందున్నయట్టి
శౌరికి రాజోపచారకృత్యములు
వారకఁ గావించి వైదర్భి వేడ్క 670
కర్పూరమిశ్రితక్రముకభాగముల
నేర్పార వాసించి నిండారు వేడ్క
కంకణస్వనములు గలయంగఁ గులికి
యంకించి చేచాఁచి యఱచేతికిచ్చి
ధవళతాంబూలపత్రముఁ గొనగోర
సవరించి చూర్ణమిశ్రము సేసి మడిచి
చిటపొటు మేళంబుసేసి యొప్పుచును
జిటిక పెట్టినమాత్రఁ జేతికందించు;
స్తనకుంభములను మాధవు పాదతలముఁ
దనకారనొత్తు మెత్తని కేల లీలఁ
గరకంకణంబులు ఘల్లుఘల్లనఁగ

గరమూలరుచులు దగద్ధగ మెఱయ
గుబ్బకుచములు రాయఁ గురులు ఫాలమున
నోరయ హారావలులుయ్యాలలూఁగ
పయ్యెద వడిజారఁ బాలిండ్లు తళుకు
లెయ్యెడఁ దా మెఱ్ఱై యిరువంకఁ బొడమ
కన్నుల మెఱుఁగు లక్కజముగాఁ బొలయ
చిన్ని చెక్కుల చెంతఁ జెమటలు వొడమ
దంతమరీచులఁ దఱమిల్లు నవ్వు
వింతయై మోమున వెన్నెలఁ గాయ
లీలఁ దాటంకపాళికి వెల్లఁ గదియ
తాలవృంతంబు మొత్తని కేల బూని
యల్లల్లఁ జూచుచు హరిచూపుగముల

—: శ్రీకృష్ణుఁడు రుక్మిణిచిత్తమును శోధించుట :—

కెల్ల నింపొదవించు నింతి నెమ్మనముఁ
గనుఁగొను వేడుకఁ గలుషించినట్లు
వనజాతనేత్రుఁ డవ్వనిత కిట్లనియె.
“ రాజన్యుని విదర్భరాజు కూఁతురవు!
భూజనులెల్లర పొగడొందునట్టి
లావణ్యభాగ్యవిలాసచాతుర్య
వీ వసుంధర నీకు నీడు లేదెందు!
వంగ మాగధచైద్యపౌండ్రాదినృపులు
వరరూపభాగ్యలావణ్యసంపన్ను
లారూఢసామ్రాజ్యులతులవిక్రములు
వారలు నినుఁగోరి వచ్చిన చోట

నందఱ నొల్లక యతిహీనకులుని
మందలోఁ బెఱిగిన మలినాంగు భీరు
నాచారదూరుని ననృతవర్తనుని
నేచూపుఁ జూచి నన్నేల కామించి
తాదిగర్భేశ్వరి వక్కటా! పుట్టు
బీదను! ననునీవు పెండ్లిగాఁ దగునె?
మీయన్న రుక్మి మామీఁది క్రౌర్యంబుఁ
బాయఁడు; మాతండ్రి పగవాఁడు నాకు;
నీవును నామీఁద నెయ్యంబు లేవు
కావున నీయింటి కడకు నీ వరిగి
వలనొప్పఁ గన్నిచ్చు వచ్చినవారిఁ
గలసి భోగించుము కమలాస్య!'' అనిన
నామాఁట తనకు నమ్మె తాఁకుటయును
భామినీమణి డిల్లపడి మూర్ఛ మునిఁగె!
సుడివడి చేనున్న సురటల్ల జాఱఁ
దొడిగిన సొమ్ములు తొడుసూడి పడఁగఁ
దన్ను దానెఱుఁగక ధరవ్రాలియున్న

—: మూర్ఛపోయిన రుక్మిణిని శ్రీకృష్ణుఁడోదార్చుట :—

యన్నాతిఁగను గొని యంబుజోదరుఁడు
సరభసంబున లేచి సతినల్లనెత్తి
కరముఁ గౌఁగిటఁ జేర్చి కన్నీరుఁ దుడిచి
చెక్కిలి నొక్కొత్తి చికురముల్ దుఱిమి
యక్కటికముతో నక్కాంత కనియె.
"నవ్వులాటలకు నన్న నామాట కింత

నివ్వెరపడి వ్రాల నీకేల యింతి?
ఎలనాగ! నీచిత్త మెఱిఁగెడి కొఱకు
పలికితిగాని నాప్రాణంబు నీవ!
పరమసాధ్వివి నీవు భయభక్తులందు
సరసులేకున్కి నే (నెఱిభాగ్యశాలి)
ఇమ్ముల ననుఁబాయ కెప్రొద్దు నుండు
నమ్మహాలక్ష్మి నీవంభోజనయన!
అని పర్యంక శయ్యపై నల్లనఁ జేర్చి.
యనునయంబున దేర్చి యబలకుఁ దార్చి
సరసరతిక్రీడ సంతుష్టఁ జేసి
పరమపావనమూర్తి పంకజోదరుఁడు
కందర్పకోటి సంకాశలావణ్యుఁ
డిందిరా విభుఁడు లోకైకశరణ్యుఁ
డారసి యందఱి కన్నిరూపముల
నారతిక్రీడల సతతంబుఁ దేల్చె.

— ప్రద్యుమ్నాదికుమారజననవృత్తాంతము :—

హరికి రుక్మిణికిని నగ్రనందనుఁడు
పరమానురక్తుఁడై ప్రద్యుమ్నుఁ డట్టి
వీరుఁడు మొదలుగా వినుస మేష్టుఁడును
జారువేష్టుండును జారుదేహుండు
జారుతృప్తుండును జారుచంద్రుండు
జారుహస్తుండును జారువీర్యుండు
[1]జారుధీమణి విచారుఁడు బదురు;

[1] ఒకేపాదమున్నది

జాంబవతీకాంత చతురతఁ గాంచె
సాంబాది దశకంబు సత్పుత్రవరుల;
భానుమంతాదులఁ బదురు కుమాళ్ల
మానుగా సత్యభామకుఁ బుట్టిరెలమి;
భానుచంద్రాదులు పదురు కుమాళ్లు
శ్రీనిత్యయగు నాగ్నజితి కుద్భవిలిరి;
మిత్రవిందకు ప్రభామిత్రులు సుతులు
గాత్రవంతాదులు గలిగిరి పదురు;
కాళిందికామిని కనియెఁ బెంపొంద
బాలశ్రుతాదులఁ బుత్రులఁ బదుర;
భద్రకుఁ బుట్టిరి భద్రాదిసుతులు
భద్రమూర్తులు మహాభాగులు పదురు;
సత్యభాషిణి గాంచె సంతతిఁ బదుర
సాత్యకి మొదలైన సత్పుత్ర వరుల;
వెలఁదులు పదియాఱు వేలునూటుర్వురును
తలతలఁ బదిరేసి తనయులఁ గనిరి.
వినుతింపఁ బదియాఱు వేలును నూట
యెనమండ్రుభార్యల కేపారుపుత్రు
లాయెడ లక్షయు నఱువదియొక్క
వేయును నెనమండ్రు విష్ణునందనులు. 720
కన్యలు నండఱు గల్యాణమతులు
ధన్యమై కృష్ణు సంతానంబు నిగుడ
వారలసుతపౌత్రవర్గంబు సంఖ్య
వారిజాసనుఁడైన వర్ణింపనేర
డట రుక్మపుత్రిక యగు రుక్మవతికిఁ

బటుతరంబగు వేడ్క ద్యూతము వలన
ననిరుద్ధుఁడుదయించె నని చెప్పుటయును
మునినాథ! ఈరుక్మి మురవైరితోడ
వైరంబు మానఁడు నరపుత్రి నెట్లు
శౌరిపుత్రునకిచ్చి సాజన్యుఁడయ్యె?
నీవెఱుఁగని దేమి? నిఖిల లోకముల
లేవెలిఁగింపు లాలితపుణ్య యనుఁడు;
శుకుఁడు పరీక్షిత్తుఁజూచి యాయర్థ
మకలంకగతి వినుమని చెప్పదొడఁగె.
ఆకృష్ణుతో వైరమయ్యును రుక్మి
తూకొని చెలియలితోడి నెయ్యమున

—: అనిరుద్ధుని వివాహము - కలహము :—

మేనల్లుఁడనుచు నర్మిలి కూఁతు నిచ్చె
గాని నెమ్మనములు గలయ వెన్నండు;
ఆరామనందను కనిరుద్ధునకును
నారూఢిఁ దన పౌత్రియగు లోలనేత్రి 730
లోచనయను కన్య రుక్మి యిచ్చుటయు;
ఆచెలి పెండ్లికినై విదర్భకును
యానకదుందుభిహలికృష్ణమదన
సైనేయకృతవర్మసాంబాదులైన
బంధులతో వచ్చి బహువైభవమున
బంధురప్రీతి శోభనమొప్పఁజేసె.
కుడిచి కూర్చుండి పెక్కులు వినోదములు
గడువేడ్క జూచుచోఁ గాళిందివిభుఁడు

నారుక్మియును గూడ హలపాణితోడఁ
గోరిజూజము సమకొలిపి యాడించి
భాగంబు దానయై పణముగా నొడ్డి
వేగంబె మాడలు వేయేసి గెలిచి
కైలాటములు జేసి కల్లలు పెనచి
తాలాంకుఁ గెలిచిరండఱుఁ దచ్చు సేసి.
ఓడియు బలభద్రుఁడుడుగక లక్ష
మాడలు పణమొడ్డి మరిగెల్చుటయును;
ఆవిదర్భుఁడు గెల్చె ననుచు నొండొరులు
చేవేసి నవ్వుచు సీరి నీక్షింపఁ
దాలాంకుఁ డదరి యుత్తాలరోషమునఁ
గాళిందిపతి మోముఁ గనుఁగొని పలికె
"పాపాత్ములార! ఈపలుక నాగెలుపా?
ఏపార వైదర్భుఁ డిటు గెల్చినాఁడా?
ఉన్న రూపెఱుఁగింపుఁడొక పక్షమేల?"
అన్న ప్రలంబారి కనియె నారుక్మి.
"గోపాలకులు మీరు! గొల్ల జూదములు
నేపార నొండురు లెగ్గులాడుటయుఁ
గాక! ఈరాచ యోగ్యంబైన యాట
మీకేల? వడిలేచి మిన్నక పొమ్ము!
మాడలోడితిమని మాటిమాటికిని
గాడఁ నాడిన నీకుఁ గలదయ్య గెలుపు?
కడపి యాడుటగాదు కాక యేమేని
నడుగరాదే మమ్ము నక్కఱయేని?"

—: బలరాముఁడు రుక్మిని జూదపుఁబలకనెత్తి కొట్టి చంపుట :—

అనిపల్కి ప్రహసించి యార్చు వైదర్భుఁ
గని సీరి మిడుగులు కన్నులఁదొరుఁగఁ
బటుకోపమున నెత్తి పలక వేత్రిప్పి
నిటలంబు వ్రేయఁ బెన్నెత్తురు దొఱఁగి
వెడవెడ మిడిగ్రుడ్లు వెడలి రోఁజుచును
పడితన్నుకొని రుక్మి ప్రాణంబు విడిచె!
కాళింగుఁ జంపి యక్కడి ధూర్తసమితిఁ
ద్రోలిన నందఱుఁ దుప్పలఁ దూలి
పులిగన్న పసులను బోలి వైదర్భ
బలము భీతిల్ల సంభ్రమమేచఁ బఱచె;
హరివచ్చి దేమి దేమని చూచుచుండ
నరదంబు వెసనెక్కి హలధరుఁడంత
లోచనతోననిరుద్ధు నెక్కించి
వేచని యావురి వెలవెల నున్న
నారుక్మి మడియుట నెంతయు నెఱిఁగి
శౌరి సీరినిగూడి చనియె ద్వారకకు;
అరసి దుఃఖాక్రాంతయైన రుక్మిణిని
గరమర్థిఁ గుందార్చెఁ గమలలోచనుఁడు.

—: బాణాసురవృత్తాంతము :—

ఆలోన బలిదానవాధీశసుతుఁడు
వ్యాళేంద్రసదృశుఁడు వేచేతివాఁడు
నారూఢజయశాలి యరిశైలవజ్రి

భూరిప్రతాపుఁడద్భుత బలోన్నతుఁడు
బాణాసురుఁడు తపోబలముల పేర్మి
స్థాణుని మెప్పించి తనపురంబునకుఁ
దననివాసమున కాతని రక్షసేసి
యనుపమజయకీర్తులంది పెంపొందె.

—: బాణాసురుఁడు శ్రీశంకరునికిఁ దనయుద్ధకాంక్షఁదెలిపి ప్రార్థించుట :—

ఆతఁడు గర్వాంధుఁడై యొక్కనాఁడు
భూతేశుపాదాబ్జముల మీఁద వ్రాలి
వినతుఁడై చేతులు వేయును మొగిచి
యనుకంపఁ దోఁప నిట్లని విన్నవించె.
" దేవ! మహాదేవ! దేవతారాధ్య!
భావజసంహార! భక్తమందార!
నీవు ప్రసాదింప నిఖిలరాజ్యములు
నీ వేయిచేతులు నివినాకుఁగలిగె!
అవనిలో నాకంటె నధికుఁడు లేమి
నివి వృథాకథలయ్యె నిభచర్మవసన!
తురగఖురోద్ధూతధూళి పెల్లగయు
దురములోఁ దురగంబుఁ ద్రోలంగ లేదు;
మండితదోర్దండమండలాగ్రమునఁ
జెండాడి పగతులఁ జిక్కింప లేదు;
చటులకార్ముకముక్తశరపరంపరలఁ
బటుమాంస ముర్వికి బలిసేయ లేదు;
దంతికోదండ! గదాతాటనముల

దంతికుంభముల విదారింపలేదు ;
వీరరక్తంబుల వేతాళసమితి
నారూఢగతి నోలలాడింపలేదు ;
యొఱపైన నృపలోకమురుశరీరముల
మెఱసి ఢాకినులకు మేపంగలేదు ;
నీయాన ! రణకేళి నెరపంగలేదు !
వేయిచేతులు మోవ విసమయ్యె నాకు
కలన మీఱెడుశక్తి కలిగియు లేని
ఫలమయ్యె ముచ్చటబాపవే తండ్రి !"
అని గబ్బుమైనాడ నసురమాటలకుఁ
గినిసి యల్లననవ్వి గిరిజేశుఁడనియె.
"నీవేమిసేయుదు నీపాలిదైవ
మీవిధిఁ బ్రేరింప నిట్లుంటిగాక !
దురములోపల నిన్నుఁ దొడరి నీవేయి
కరముల వ్రేఁగు నొక్కట మాన్పనోపు
అలఘువిక్రమశౌరి యే తేరగలఁడు ;
తలఁచిన నీకోర్కి తలకూడగలదు.
తప్పక నీకేతుదండంబు విఱిగి
యెప్పుడు ధరఁ గూలు నెఱుఁగు మద్దినము
నను మోచునట్టి రణంబుగాగలదు.
మనములో నెఱిఁగి యేమఱక వర్తింపు"
మని వీడుకొలిపిన హరునకు మ్రొక్కి
చని సంగరోద్యోగచతురుఁడై యుండె.

—: బాణాసురపుత్రి ఉషాకన్య స్వప్నములో ననిరుద్ధునిఁ గూడుట :—

ఆ బాణనందన యతిరూప హారిణ
శాబాక్షి కలకంఠి సమదేభగమన
కమలకోమలనేత్రి కరివైరి మధ్య
భ్రమరసన్నిభ వేణి పంకేరుహాస్య
కంబుకంధర మౌక్తికాకుందదంత
బింబఫలాధరి బిసలతాపాణి
యననొప్పి కందర్పునసిపుత్రివోలె
తనరు యుషాకన్య దానొక్కనాఁడు
పాలుపారు మేడపై పువ్వుపానుపున
నలవడి నిద్రితయై యున్నచోట ;
కలలోన నొక్కచక్కని రాచకొడుకు
జలజాతనేత్రుఁడు సౌభాగ్యమూర్తి
తను డాయవచ్చి మెత్తని కేలుఁగేల
ననువొప్పఁ గీలించి యంగంబు నిమిరి
యల్లనఁ గౌఁగిట నందందచేర్చి
యుల్లాసరసవార్ధి నోలలాడింప
నంతట మేల్కాంచి యబలచిత్తమున
సంతోషమును సిగ్గు జళుకును బొడమ ;

—: ఉషాకన్య విరహము :—

కలలోని సేఁత నిక్కముగాఁగ దలఁచి
కళవళపడు మేను గరుపార నిలుచు ;

దిక్కులుపరికింపుఁ దెసిలియారూప
మెక్కడఁబొడగాన కెంతయు వగచి ;
కోలఁదినై ప్రహ్లాదకులపయోరాశి
కలఁపఁగాఁబుట్టిన కట్టడినైతి ;
ఏమని యెఱిఁగింతు నీమాటలోరుల
కేమిగాఁగలదకో : ఇటమీఁద'' ననుచుఁ
గలఁగుఁ జేట్పాటున కడు చిన్నబోవు ;
పలుకనేరక డిల్లపడు ; మారుమాటఁ
బొరిపొరి నాలించుఁ బువ్వుపాన్పునను
బొరలు గ్రమ్మఱ నిద్రవోఁచూచు లేచు ;
ఎలుఁగెత్తి యిందురావే యని పిలుచు ;
తలుపులోనున్న యాతని రమ్యమూర్తిఁ
దలపోయుఁ దలయూఁచుఁ దన్నుఁదా మఱచు ;
వలరాజుచెలిమికి వంతలోఁగుందుఁ
జెక్కునఁజెయిఁజేర్చి చింతించునంత
నెక్కొన్నఁదగ వేఁడి నిట్టూర్పు వుచ్చు;
నొగలు ; హాయనుచుఁ గన్నుల నీరునించు ;
మొగమెత్తకంగుటంబున నేలవ్రాయు ;
పులకించు ; చమరించుఁ బొరిమూర్ఛఁబోవు ;
అలుగు ; నాతని యొప్పు నంతంత పొగడు ;
పొరి కాముఁడాడించు బొమ్మచందమునఁ
బరవశయై పంచబాణాగ్నిశిఖల
కగ్గమై యందంద యాఱడిపొందు ;
దిగ్గనలేచి భీతిల్లి శయ్యవ్రాలు ;
గోరికలాతనిఁ గోరి రేకెత్తఁ

గూరుకుఁ గానక కొండలమందు.
ఈభంగి మదనాగ్ని నెరియుచు నున్న
నాభామ చెలియు కుంభాండునిపుత్రి
చిత్రరేఖనుపేరఁ జెన్నారు లేమ
మైత్రివాటించి యమ్మగువకిట్లనియె.

—: చిత్రరేఖ ఉషాకన్యను నూరార్చుట :—

" ఇదియేమి నీచంద మెలదీగబోఁడి?
మదిలోన నీకింత మరుఁగనేమిటికి?
ఏల చింతించెదవేల మూర్ఛిల్లి
యేలనారటఁ బొందెదిభరాజగమన?
పురుషుఁడు నీతోడ భోగించినట్టి
మురిపంబుదోఁచె నీమోముదామెరను
బోరిఁ బోతుటీఁగకుఁ బొలియంగ రాని
వరహార్మ్యమునకు నెవ్వఁడు వచ్చెనబల?
పడుచుకూఁతుర! ఇట్టిపని యెట్లువుట్టె?
ఎడసేసి నాకేల యెఱిఁగింపవైతి?
ఎవ్వనిఁగనుఁగొంటి వెవ్వనిఁబొంది
తెవ్వఁడు సేసె నేఁడీసాహసంబు?
వనిత! నీమదిలోని వగపెల్లఁదీర్తు
నను వింతసేయక నాకెఱిఁగింపు
మనిన నెచ్చెలిఁజూచి హరుషంబు సిగ్గు
ననుకంపయును దోప నయ్యంతిపలికె.

—: ఉషాకన్య చిత్రరేఖతోఁ దనస్వప్న
వృత్తాంతముఁ జెప్పుట :—

"ఈ మేడపై నుండి యేనిద్రవోవ
యేమి చెప్పుదు నీకు నిగురాకుఁబోఁడి !
నీలవర్ణమువాఁడు నిడు గేలువాఁడు
వాలారు చూపుల వలనొప్పువాఁడు
రతినాయకునకు నౌరసపుత్రుఁడొక్కొ !
ఇతఁడు నాసౌభాగ్య మేపారుఁవాఁడు
కలలోననే తెంచి కౌఁగిటఁ జేర్చి
చెలఁగి చిత్తజుకేళిఁ జిక్కించె నన్ను !
ఇతనితోఁ గలసి పేరడిగి మాటాడు
తతి పాపి నాసిగ్గు దాఁపురంబయ్యె
నంత మేల్కంటిని యతఁడంతఁ బోక
నంతరంగములోన నడఁగి యున్నాఁడు ;
కూడిపాయుట సమకొనెగాని వానిఁ
గూడియుండెడు వేడ్క కొనసాగదయ్యె ;
నతనిఁ దోతేకున్న నంగజాస్త్రముల
ధృతిదూలి ప్రాణంబు తెగిపోవఁ గలదు
యేమిసేయుదు" నని యిలవ్రాలి యున్న
యామెలంతనుగని యానాతి పలికె.

—: చిత్రరేఖ చిత్రపటము వ్రాసి ఉషాకన్యకకుఁ జూపుట :—

కటకటా! కలలోనగన్న రాకొమరు
నెటుపట్టి తేవచ్చునే ముద్దరాల !

ఏతరుణులయందు నిట్టివంటి తలఁపు
యే తెఱంగునఁజూచి యెఱుఁగము వినము,
నీకేల ముచ్చట? నీకేల బెగడ?
నీకేల వెనుఁబడ నీరజవదన?
మూఁడు లోకంబుల ముదితయేఁ దొల్లి
వాడిగా నెఱుఁగని పురుషులు లేరు;
నాకౌసలంబున నరవరోత్తముల
నీకుఁ జూపెదఁ జూడు నిఖిలలోకాన!
వచ్చి పొందిన భూపవరుని నీమ్రోలఁ
దెచ్చి పెట్టెద నింత ధృతిఁ జిక్కఁ బట్టు''
మనిపల్కి నవ్వుచు నాచిత్రరేఖ
పనుపడ నొక చిత్రపటము సంధించి
సకలలోకంబుల జననాథసుతుల
నకలంకమతి వ్రాసి యబలతో ననియె.
నీతలఁపుననున్న నృపకులోత్తంసుఁ
డే తెఱంగో వ్రాసితిఁజూడు మనుచు;
పాతాళవాసులఁ బన్నగాధిపులఁ
జాతుర్యగుణుల రాక్షసకుమారకుల
నలకూబరాది యున్నతయక్షవరుల
నల జయంతాదుల నసురాధిపుల
గరుడఖేచరసిద్ధగంధర్వవరుల
వసుసతో వేర్వేర వనితకుఁ జూపి;
భూలోకమున రాజపుత్రులఁ జూపి;
ఆలోనఁ గురుపాండవాదులఁ జూపి;
యాదవవీరుల నందఱఁ జూపి;

ఆదినారాయణుఁడగు కృష్ణుఁ బోలి;
అనుమానపడి చూడ నంత ప్రద్యుమ్నుఁ
గని యాతఁ డాతఁడే కాఁబోలు ననుచు
మనములో శంకించి మరియనిరుద్ధుఁ
డనుకాంతి రూపంబుఁ దప్పకఁ జూచి
తలఁపులోపలి కూర్మి కొట్టుముట్టాడఁ
బులకించి తిలకించి పూఁబోఁడి పలికె.
"కలలోనఁ గన్న చక్కని వాఁడె వీఁడు!
కలయల్ల నాకు నిక్కమమయ్యె నేఁడు!
నీ కౌశలంబును నీ దయాగుణము
నీ కూర్మి పెంపును నీ వచోరతియు
నాకంజసూతికి నలవియే పొగడ?
నాకెవ్వరిక దిక్కు నలినాయతాక్షి!"
అని పల్కి యంతంత యతిశయంబైన
మనసిజానలము పైమలసి మట్టాడఁ
తన్ను దా దెలియఁగక ధరఁ వ్రాలియున్న
యన్నాతి బోధించి యల్లన నెత్తి
కన్నీరు దుడిచి యంగఁబెల్ల నిమిరి
చెన్నార నెయ్యంబుఁ జిలుక నిట్లనియె.

―: చిత్రరేఖ తనమాయచే ననిరుద్ధుని యుపహరించుట :―

"పైదలి! నీదైన భాగ్యంబు కతన
యాదవోత్తముఁడైన హరిపౌత్రుఁడబ్బె!
ఆ సుందరాకారు నర్మిలిఁ దెచ్చి
నీ సమ్ముఖము వేసి నెమ్మి వాటింతు.

వెఱవాయు"మనిపల్కి వెలఁది బోధించి
తెఱవ మాయాగతి దివమునకెగసి
రాజీవనేత్రి సురక్షితంబగుచు
రాజితంబైన ద్వారకకేఁగి యందు
యువిదలతోఁగూడి యుద్యానభూమిఁ
దవిలి రతిక్రీడఁ దనిసి నిద్రించు
యనిరుద్ధుఁ గాంచి మాయలుఁ గొల్పి యెత్తు
కొని వియద్గతి వచ్చి కోర్కులు బొదల
బాణతనూజ మంచముక్రేవఁ బంచ

—: అనిరుద్ధుఁడు ఉషాకన్యతోఁ గ్రీడించుట :—

బాణునందను నుంచి పసుతుక చనియె.
అనిరుద్ధుఁ డంత మాయానిద్రఁ దెలిసి
కనువిచ్చి పరికించి కనకతల్పమునఁ
దనకు బాహులతఁ దలయాపు సేసి
కనుమోడ్చి ముఖచంద్రకాంతులు వొలయ
జక్కవ కవఁగప్పు జలజమో యనఁగ
నొక్కకేలున నురోజంబు లదిమి
కలయఁ గంకణమణిగణమరీచికల
మలయుచు దినద్యుతి మాయంగఁ జేయఁ
దనబోఁటి మాటలఁ దాపంబుఁ దీరి
మనమూరడిలి యాదమఱచి నిద్రించు
నయ్యుషాసతిఁ గాంచి యంతరంగమున
నెయ్యంపురసముబ్బి నీటులు వొడమ
నంతంద కనుఁగొని యంగజాస్త్రములఁ

గంది నెమ్మదిఁ దమకంబగ్గలింపఁ
గదసి కేలునుగేలుఁ గదియించుటయును;
అదరి మేల్కని లేచి యంగంబు వణఁకఁ
గుచభార మొడలంగఁ గొనసియాడఁ
గుచకుంభములఁ జేల కొంగున నదిమి
లక్ష్మీసుతుని రాజ్యలక్ష్మియో యనఁగ
పక్ష్మలలోచన ప్రభలుప్పతిలఁగ
శయ్యపై డిగి నిల్చి జలజాతనేత్రు
నయ్యాదవోత్తము నర్థి నీక్షించె.
ఇరువుర చూపులే యేపారఁ దనకు
శరములుగాఁ బంచశరుఁడేయఁ జొచ్చె!
ఆలోన ననిరుద్ధుఁడా లోలనయనఁ
గేలఁగేలునఁ బట్టి గిలిగింత వుచ్చి
చెక్కులు బుడుకుచు సిగ్గుఁ బోగొట్టి
గ్రక్కున నందంద కౌఁగిఁటఁ జేర్చి
మాటల మఱిగించి మక్కువఁ బెంచి
కూటంబుఁ జవిఁ జూపి కోర్కులు నించి
యిదిరాత్రి యిదిపగలివి సంధ్యప్రొద్దు
లిది వింతతావని యెఱుఁగంగ రాక
యకుటిలక్రీడల నఖిలభోగముల
నొకనాల్గు నెలలుండ నొక్కనాఁ డెఱిఁగి

—: అంతపురవాసులు బాణాసురునకు ననిరుద్ధుని గుఱించి తెలియపర్చుట :—

యంతఃపురజనాళి యరిగి బాణునకు

నంతయు నెఱిఁగింప నతఁడు గోపించి
చనుదెంచుచో లీల సౌధంబు మీఁదఁ
దనకూఁతుతోఁడ నాదట జూద మాడు
వనజాతనేత్రుని వనమాలిపౌత్రు
ననిరుద్ధు విక్రమయనిరుఁద్రు గాంచి;
తన కెలంకుల నున్న దనుజులఁ జూచి
"చని యాదురాత్మునిఁ జంపి రండనిన"
వారలు చనుదెంచి వనజాతనేత్రు
నీరసంబునఁ బట్ట నెంతయు నలిగి
పరిఘంబుఁ ద్రిప్పి యప్పగతుల నెల్ల
ధరణిఁ గూల్చుటయు నుద్ధత బాణుఁడలిగి

—: అనిరుద్ధుని నాగపాశములచే బాణాసురుఁడు బంధించుట :—

యనిరుద్ధు నాగపాశావళిఁ గట్టి
పెనుపరి చెఱసాలఁ బెట్టంగఁ బనిచె.
అనిరుద్ధుఁ డని రుద్ధుఁడై యున్న భంగిఁ
గని యుషాకన్యక కడుఁ జిన్నబోయి
యతిదుఃఖపరవశయై రేయుఁబగలు
నతనితోఁడిదె లోకమై యుండె నంత.

— నారదునిచే ననిరుద్ధుని యునికిఁ దెలిసి శ్రీకృష్ణుఁడు సైన్యముతో శోణితపురిని చుట్టుముట్టుట :—

అక్కడ ననిరుద్ధు నాతోఁటలోన
నెక్కడ పోకయు నెఱుఁగంగ లేక
బలభద్రముర హరిప్రద్యుమ్నముఖ్య

లలమి దిక్కులనెల్ల నందంద వెదకి
కానక యెంతయుఁ గళవళంబంది
మానసంబుల దుఃఖమగ్నులై యుండ;
శౌరి కైలాటంబుఁ గూడుగా మెలఁగు
సూరివంద్యుఁడు బ్రహ్మసుతుఁడు నారదుఁడు
హరి సన్నిధికి వచ్చి యనిరుద్ధు వార్తఁ
గరతలామలకంబుగాఁ జెప్ప శౌరిఁ
విని వృష్ణిభోజాంధవీరులతోడ
ఘనయోధరథవాజికరులతోడుతను
బలభద్రసాత్యకిప్రద్యుమ్నసాంబ
[1]జలసత్యకృతవర్మసారణులాది
ద్వాదశాక్షౌహిణీ దళసంఖ్యతోడ
యాదవరత్నంబు హరి దండువెడలె.
దళములు నడువంగ ధారుణి వడఁకె!
జలధులు కలఁగెనాశాచక్రమగలె!
హరియును నిట్లు నిత్యప్రయాణముల
నరుదెంచి రజతాద్రి యుత్తరభూమి
స్థాణునిచే రక్షితంబై వెలుంగు
శోణితపురము ముచ్చుటు విడియించి
యుపవనంబులు రాల్చి యూళ్ళను గాల్చి
చపలత బహుజలాశయములఁ జెఱచి
పెరయీఁగ నందంద పేర్చినపగిది
పురికోటలగ్గలద్భుతముగాఁ బట్టి

---

[1] "జలసత్య" అర్థము విచార్యము. పేరై యుండు నేమో?

వీరును వారును వెసఁ బోరఁ జూచి
పౌరులందఱు భయభ్రాంతులై నిలువ

—: దొమ్మియుద్ధము :—

పనిగొని రుద్రుడు "బాణుని వీడు
గొనగొని నేఁగాచికొనియుండ నిట్లు
పగతురచే బాధపడుటెట్లు జూతు
నిగిడి సైన్యంబుల నీరుగావింతు"
ననిపల్కి పటుహుమహారావ మొలయ
వినుతలీలల మహావృషభంబు నెక్కి
శూలపినాకాదిసునిసితాయుధము
లాలోన భయదనలార్చులుఁ బర్వ
జ్వాలకరాళవిశాలరావముల
ఫాలనేత్రుఁడు మహాప్రమథులుఁ గొలువ
బహుభూతభేతాళపైశాచకోట్లు
నహితభీకరలీల నలమిఁతో నడువ
గినిసి ముందఱఁ గార్తికేయుఁడే తేరఁ
జనుదెంచి యాదవసైన్యంబుఁ దాకె.
సాత్యకి బాణుతో సమరంబు సేసె ;
నత్యుదగ్రత వీరులందఱు దొరసి
వారువీరన కెల్లవారునుఁ జేర్చి
పోరాడిరమరులద్భుతమంది చూడ
నప్పుడు బహ్మాదులంతరిక్షమునఁ
దప్పక నిల్చి యుద్ధముఁ జూచుచుండ
పరశుతోమరగదాపట్టిసముసల

పరిఘముద్గరశరప్రాశఖడ్గముల
ఘనరోషములతోడ గదిలిశాత్రవులఁ
దునిమియు నలిచియు దూరసేయుచును
బటురౌద్రఘోషనిర్భరలీల మెఱయఁ
జటులత నిరువాగు సరియఁ గాఁబోర
సడలెను హయములు సామజంబులును
పడియె దేరులు వీరభటకోటి గడసె.
కాలువలైన రక్తప్రవాహములఁ
గీలాలములఁ గన్నుఁగిలుపుచు నవ్వ
తలలు తామరలు; నుద్ధతమాంసమడుసు;
తలమెదళ్లు[1] పులినతటప్రదేశములు;
పెనుపారఁ బ్రేవులు బిససమూహములు;
తనరారు కేశసంతతిశైవలంబు;
రాలినమణికోటి రక్తోత్పలంబు;
నీలాబ్జసరములు నెలకొన్న తేంట్లు;
ఘనరథాంగంబులు కమఠసంఘములు;
ఒనరు వింజామరలొగి మరాళములు;
తలకొన్న భూతభేతాళవర్గంబు
జలపక్షి నివహమై జలకేళిఁదేలి
కొలను చందంబునఁ గొమరగ్గలించి
కలను జూడగ భయంకరమయ్యె నపుడు!
ప్రమథబలంబులు పటుశక్తి మెఱసి
కమలనాభుని సేనఁ గారింపఁదొడఁగె

---

[1]తల మెదడు పెండెలు గట్టుపులిన దేశములు

విద్యుత్ప్రభాభాస వివిధబాణములు

—: ప్రద్యుమ్నగుహుల ద్వంద్వయుద్ధము :—

ప్రద్యుమ్నుఁడాగుహుపై నాటనేసె ;
ఆతఁడు కోపించి హరితనూభవుని
కేతుదండకము విల్లు గృత్తము సేయ
వేఱొక్కవిలుగొని విష్ణునందనుఁడు
నూఱుబాణంబులు నొప్పింప గుహుఁడు
ఘనశక్తి వైవ నిర్ఘాతశతంబు
చనుదెంచుగతి వచ్చుచట్టులతఁ జూచి
యరదంబు డిగినిల్వనాతని శక్తి
హరుల సూతుని తేరు నడగించి చనియె ;
రతిపతి యొండొక్క రథ మెక్కి గుహుని
శితశరంబున నేయ శిరమును నురముఁ
బగిలి నెత్తురు గ్రమ్మఁ బ్రబలగాత్రంబు
చిగురొత్తు కింశుకచెల్వు వహించె ; 920
సేనాని పఱచుండఁ జేరి యాప్రమథ
సేన బ్రద్యుమ్నుడు చెండాడఁదొడఁగె ;

—: హలిపుష్పదత్తుల ద్వంద్వయుద్ధము :—

హలి పుష్పదత్తుని నాఱుబాణముల
చెలఁగియేయుఁగ వాఁడు చేయార్చి యార్చి
యిరువది బాణంబులేసి నొప్పింప
పరుషతకోర్చి యాబలభద్రుఁ డలిగి

[1]మేటితూపులు నూఱు మేన గ్రుచ్చుటయు
నాతఁడు గడఁగొని యవనికి దాఁటి
సూతాశ్వరథమును జూర్ణంబు సేసి
తలవ్రేయ నడుమను ధాత్రిపై వ్రాలె
కులిశంబుఁ దాఁకిన కొండ చందమున ;

—: బాణపుత్రుఁడు సాంబునిపైఁ గదియుట :—

బాణపుత్రుఁడు సాంబుపై నార్చియేడు
బాణంబులేసిన బద్మాక్షుసూనుఁ
డాతనిమీఁదఁ బదాఱుబాణంబు
లాతతంబుగ నేయ నతఁడు కోపించి ;
హరుల నాల్గిటిఁజంపి యాఱుబాణముల
నరదంబు సూతుని యవలీలఁగూల్చె.
విలుద్రుంచుటయుఁ బెంపు విడువక వ్రాలుఁ
బలుకయుఁ గొని మీఁదఁ బారుతెంచుటయుఁ 930
గని బాణసూనుఁడు కంపించి తేరి
వెనకకు జాఱియుద్వేగుఁడై పఱచె ;
బాణుఁడు సాత్యకిపై నార్చి వేయి
బాణంబులడరింపఁ బటుశక్తి నతఁడు
కినిసి తచ్ఛరములఁ గృంతముఁజేసి
ఘనశరంబుల మోము గాడంగనేయ
నూనిన ఖిన్నుడై యొకసాయకమున
సైనేయు స్రుక్కించి శౌరిపై నడచె ;

1 ఒకేపాదముకన్పడుచున్నది.

—: శ్రీకృష్ణబాణాసురల ద్వంద్వయుద్ధము :—

చండాంశుదశకరచటులంబులగుచు
మండితదోర్దండమహిమ దీపింప
శ్రీరమ్యతర మేరుశిఖరమో యనఁగ
చారుకిరీటనిశ్చలకాంతి నిగుడ
లలితాంబుధరతటిల్లతికలో యనఁగ
బలిసి యుగ్రాయుధప్రభలుప్పతిలఁగఁ
దాఁకునఁబూర్ణ సుధాంశుచే నైన
ప్రాకటముక్తాతపత్రంబు వెలుఁగఁ
బ్రథమాద్రిఁ దోతెంచు భానుఁడో యనఁగ
రథమెక్కి గర్వదుర్వార వేగమున
హరిమీఁద జనుదేర నని కేతనము
మురిసి కూలుటయును ముదమంది(మదిని)
"కలిగెఁ గదా! నాకుఁ గదనరంగమునఁ
గలుషంబుతోఁ జేతిగమి తీఁటమాన్ప"
నని మురారాతిపై నంబకాష్టకముఁ
జొనుపుటయును శౌరిచూచి కోపించి
పటుశార్ఙనిర్ముక్తబాణజాలముల
విటతాటముగ దైత్యవిభుసేయ నతఁడు;
యేనూఱు చేతుల నేనూఱు విండ్లు
బూని నానాస్త్రముల్ పొరినేర్చి నారిఁ
దొడిగి పల్లేసినఁ దొలఁగక వాని
నడుమనే తునుమాడె నలినలోచనుఁడు
తొడిబడ విండ్లన్ని దునిమి రథములఁ
బొడిసేసి సారథిఁ బొడపడగించి

యరదంబుఁ దునుమాడి యార్చియా శౌరి
శరముల పేను ఝర్ఝరితము చేసె;
కడుఁదుర్లు గుట్టినకరణి మేనెరియ
నొడలు పెన్నెత్తురు లొలుక నయ్యసుర
మరలిచూడక పార మదనారి యంత

—: పినాకి కృష్ణునితోఁ బోరాడుట :—

హరుఁ దాఁకె బహుపిశాచావళితోడ
యాదవవీరులు నసురవీరులును
నాదటఁ బోరాడ నతిభీషణముగఁ
గమలాక్షుసేనలగ్గలికమై తరుమఁ
బ్రమథసేనలు భూతబలమును దిరిగి
జడలు వీడఁగ మేను జళుకంద కాళ్లు
వడవడ వణఁకంగ వా తెరలెండఁ
బెదవులు దడపుచు భీతిఁ బెల్లుఱికి
యదవద పఱచె నాహరుఁడున్న కడకు;
పఱతెంచు సేనల భర్గుఁడు జూచి
వెఱవకుండని నిల్పి వృషభంబు నెక్కె;
గరుడవాహన యక్షగణముల కంత
సరభసంబున మహాసంగ్రామమయ్యె!
దిక్కులొక్కట మ్రోసె దిగిభంబులొరలె;
చుక్కలెల్లడరాలె సురకోటి వెఱచె;
బ్రహ్మాదిసంయమిప్రతతి భీతిల్లె;
బ్రహ్మాండభాండంబు పగిలినట్లయ్యె!
హరుఁడు పినాకమునందేనుశరము

లురముష్టి సంధించి యురమూఁడ నేయ
హరిశార్ఙ్గ నిర్ముక్తమగు శరాష్టకము
హరుమీఁద వెసనేసి యార్చిన గిరిసి
పాశుపతాస్త్రంబుఁ బశుపతి ప్రేయ
నా శౌరి యేసె నారాయణాస్త్రంబు.
ఇరువుర శరములు నెలమి నొండొండఁ
బరుషమై రవికోటి పడిన చందమున
డాయుచుఁ బేర్చి మంటలు మింట నంట
మ్రోయుచు రెండస్త్రములు శాంతమయ్యె.
బ్రహ్మాస్త్రమడరింపఁ బంకజోదరుఁడు
బ్రహ్మాస్త్రమున శాంతపఱచె నాహరుఁడు.
ఆరూఢగతి హరుఁడనలాస్త్రమేయ
వారుణాస్త్రంబున వారించె శౌరి.
జలద బాణమునఁ బాషాణవర్షంబు
గలగొని యడరింపగాఁ గృష్ణుఁ, డలిగి
యురగ బాణంబేయ నురక మురారి
గరుడాస్త్రమున దానిఖండించివైచె.
వారణోజ్వలబాణవహనసత్వమున
నారుద్రుఁడడరింప నద్రులఁ బగిది
దారుణంబుగ మత్తదంతులు గవియ
నారసింహాస్త్ర మున్నతిఁ బ్రయోగించి
ఘోరకంఠీరవ కోటులచేతఁ
గోరి యాకరికోటిఁ గూల్చె నాశౌరి.
అంతట హరుఁడు కాలాంతకమూర్తి
యెంతయు హరిఁజూచి యెసఁగు రోషమున

దాపజ్వరంబు నుద్ధతిఁ గూర్చి వేయ
నేపార నదిసేన నెరియింపఁ జొచ్చె.
ఉష్ణజ్వరమువచ్చు నురువడిఁ జూచి
వైష్ణవాస్త్రముఁదొడ్గి వారిజోదరుఁడు

—: శీతజ్వరపీడితమై తాపజ్వరము శ్రీకృష్ణుని శరణు వేఁడుట :—

శీతజ్వరంబుఁ జెచ్చెర నేయుటయును
భూతకోటులు భయభ్రాంతిఁ గంపింప
తాపజ్వరంబు మేనుఁదప్పక కదియ
వాపోవుచును వచ్చి వారిజోదరుని
బదములపై వ్రాలి ప్రణుతింపఁ దొడఁగె.
"యదువంశవల్లభ! అఖిలలోకేశ!
కారుణ్యమూర్తివి కంజాతనేత్ర!
వారిజోదర! భక్తవత్సల! కృష్ణ!
నెట్టున నీశక్తి నిఖిలజంతువులఁ
బుట్టింతు రక్షింతు పొలియింతు వీవ!
ప్రకృతియుఁ బురుషుఁడు పరమశాంతియును
వికృతులనానీవ విశ్వలోకేశ!"
అని సన్నుతించెడు నమ్మహాజ్వరముఁ
గనుఁగొని పలికె నాకమలనాభుండు.
"నీవేల వెఱచెదు! నీ వున్న యెడల
సేవ నపథ్యంబు సేసిన వారిఁ
గారింపు మర్థి నీకథ విన్నయట్టి
వారిఁ బొందక నీవు వర్తింపుచుండు."
శీతజ్వరంబంత శివుమేను సోఁకి

యాతతజాడ్యంబు నావలింతయును
ఘనమైన యాతన గంపంబుఁ గదిసి
కనుమోడ్చి నిద్రించుగతి నుండె నంత;

—: అంబిక శ్రీకృష్ణునిఁ బ్రార్థించుట :—

అంబరకేశాంగమర్థంబుఁ గొన్న
యంబరాంబర జగదంబ యేతెంచి
కరకరిఁ బోరు శంకరశార్ఙ్గధరుల
నిరువురకడఁజొచ్చి యోపార నిలిచి
హరిమోముఁజూచి యిట్లని నుతియించె.
"వరద! జగన్నాథ! వసుదేవపుత్ర!
దేవదేవారాధ్య! దివ్యస్వరూప!
గోవింద! మధువైరి! గోపాలవంద్య!
నీవు మేల్కని చూడ నిఖిలంబుఁ బుట్టు
నీవు నిద్రించిన నిఖిలంబు నడఁగు!
మాయచే నఖిలంబు మాయగావించు
మాయస్వరూప! చిన్మయ! హృషీకేశ!
మూఁడుమూర్తులు నీవ మొగివానిమీఁద
పోఁడిగాఁ బెరిగెడి పోడవవు నీవ
బాణుఁడు తఁకు సద్భక్తుఁడుగాన
స్థాణుఁడాతనికినై సమరంబు సేసె;
భక్తవత్సలుఁడగు పరమాత్మ నీకు
భక్తుఁడుగాని నీపగవాఁడు గాఁడు.
ఇతనికి నీకును నేమి భేదంబు?
హితమతిఁ దలపోయ నేకరూపంబు!

నీనామమే ప్రొద్దు నిష్ఠతో జపము
పూని యనుష్ఠింతుఁ బుండరీకాక్ష!
నను జూచి యైనను నాగకంకణుని
ననుకంప వీక్షింపు" మని సన్నుతింప
నాతతజయశాలి యైన కృష్ణుండు
శీతజ్వరము మాన్చెఁ జెచ్చెర నంత.

—: బాణుని రెండవ యుద్ధము :—

అంతయుఁ గని బాణుఁడట రథంబెక్కి
యంతకాకారుఁడై హరిమీఁదఁ గవిసి
యురుతరకనకపుంఖోజ్జ్వలంబైన
శరపరంపరలు భీషణముగాఁ జొనుప
హరి వాని బాణంబులవలీలఁ దునిమి
యురుబాణ మొక్కట నురమేయుటయును;
క్రమ్మర మూర్ఛిల్లి క్రన్నన దెలిసి
యమ్మురారాతిఁ బెక్కమ్ములు నొంచి 1000
భల్ల మొక్కట వామభాగంబు నొంప
విల్లూడి పడుటయు విష్ణుఁడు కనలి
ధారుణి వడఁక పాతాళంబు బెదర
వారాసి కలఁగ దిగ్వలయంబు పగులఁ
దారలు డుల్ల నుత్తానచక్రంబు
దారుణశక్తిచే దనుజుని వైచె!
అరమంట లందంద యెగసి మిన్నంద
నురుముచందంబున నురుఘోష మెసఁగ
గుజి మానికొమ్ములు కుప్పలై పడఁగ

సటికిన క్రియ భీషణ స్ఫూర్తి మెఱయఁ
గటక కేయూరకంకణ హేతిరుచులఁ
బటుతరంబుగ బాణుబహులు నఱుకఁ
గని నీలకంఠుఁడు కమలాక్షు కడకుఁ
జనుదెంచి భక్తవాత్సల్యతఁ బలికె
"విశ్వజగన్నాథ! విశ్వరూపాఖ్య!
విశ్వవిశ్వంభర! విశ్వసంహార!
వేదాంగవాహన! వేదాంతవేద్య!
వేదగోచర! సర్వ వేదాంతకృష్ణ!
అవని భారముమాన్ప నసురాళిఁ దునుమ
నవతరించినవాఁడ వంభోజనయన! 1010
నీవాదిమూర్తివి నిఖిలమూర్తులును
నీవేకాకొండక నెఱిఁజూపఁగలఁడె?
బాణాసురుఁడు నాకు భక్తుఁడు వీని
బాహులన్నియుఁ ద్రుంపఁ బంతంబుగాదు.
ననుగృపఁ జూచి మన్నన నాల్గుచేతు
లునుపవే యనుటయు నుగ్రాక్షుఁ జూచి
గరుడుని డిగి వచ్చి కరకంఠు కేలుఁ
గరములఁ గీలించి కమలాక్షుఁ డనియె.
"నీ భక్తుఁడన నేల? నిగిడియే ప్రొద్దు
మాభక్తుఁ డితఁడు మాప్రాంతవాఁడు
మాన్యుఁడు ప్రహ్లాదు మనుమని కొడుకు
ధన్యాత్ముఁడగు బలితనయుఁడు గాన
నితని కరుణించి యిచ్చితినాల్గు
చేతులు; నినుపూజ సేనెడికొఱకు

నీ భక్తులగు వారు నెఱి మాకు ప్రియులు
మా భక్తులగువారు మరి నీకు ప్రియులు
గాక నెందును వేరు గలదయ్య మనకు?
శ్రీకంఠ!'' అని పల్కి శివుని వీడ్కొలిపి
చెలువార నాలుగు చేతులుఁ దక్క
బలితనూభవు వేయి బాహువుల్ ద్రుంచి
వేచి నెత్తురు గ్రమ్మ నేపార మేను
పూచిన మోదుగుఁ బోలుపారు నతఁడు
హరిపాదాంబుజముల కందంద మ్రొక్కి
పరమసదానందభరితుఁడై పలికె
"ఆదినారాయణ! అఖిలసన్మునులు
వేదాంత విదులును వెదకంగ లేని
భవదీయశ్రీపాదపద్మయుగ్మంబుఁ
దవిలి కొలువఁగఁగంటి ధన్యుఁడనైతి!
అన్ని చేతులు నేల యీశానుపూజ
కున్న చేతులె చాలు సురగేంద్రశయన!''
అని పల్క విని బాణు హరి డాయఁబిలిచి
తనువెల్ల నిమిరి ఖేదంబెల్ల మాన్పి
యమరత్వమును బ్రమథాధిపత్యమును
గమలాక్షుఁ డిచ్చిన గడుసంతసిల్లె.

—: ఉషాకల్యాణము :—

బలిపుత్రుఁడును నాత్మభవనంబునకును
బలకృష్ణ సాత్యకి ప్రద్యుమ్నముఖులఁ
గొనిపోయి పూజించి కొమరారు వేడ్క

ననుపమ మణి భూషణాదు లర్పించి
యయ్యుషాంగనతోడ ననిరుద్ధుఁ దెచ్చి
యయ్యాదవాఢ్యుల కర్థి మ్రొక్కించి
సకలవస్తువులును సమకూర్చి తెచ్చి
ప్రకట మంగళమైన బలుమూహూర్తమున
ననిరుద్ధయుషలకల్యాణవైభవముఁ
బెనుపారఁ జేయించి పెండ్లింటిలోన
నందఱ భక్ష్యభోజ్యాది వస్తువుల
నందంద తనిపి యాయసురాధిపుండు
వేయురథంబులు వేయుయేనుఁగులు
వేయువాజులఁ బదివేలు ధేనువుల
బహురత్నభూషణప్రముఖాంబరముల
బహుళదాసీజనప్రముఖసంపదల
నల్లుని కింపార నరణంబు లిచ్చి
యుల్లముల్ చిగురొత్తి యొప్పారు వేళ
ననిపిపుత్తేర నాయాదవోత్తముఁడు;
అనుకంపబాణుఁ గృతార్థునిఁ జేసి
మన్నించివీడ్కొల్పి మహితసంపదల
నన్నయుఁ దానును నరిగె ద్వారకకు.
అనిరుద్ధుఁడునుషయు నిత్యానందలీల
మనసిజక్రీడ నెమ్మది నోలలాడి
రీపుణ్యకథవిన్న నిష్టసౌఖ్యములుఁ
బ్రాపించు భవరోగబాధలు మాను
ధనధాన్యబహుపుత్రదారాభివృద్ధిఁ
దనరారకృష్ణుఁడు దనలోకమిచ్చు

నని చెప్పుటయు విని యభిమన్యసుతుఁడు
వినుతుఁడై శుకయోగివిభునకిట్లనియె.
"ఘనపుణ్యుఁడగు హరికల్యాణకథలు
విని కృతార్థుఁడనైతి విష్ణుఁడు మరియు
ధారుణి పాలించి ధర్మవర్తనల
నేరీతి విహరించె? నెఱిఁగింపుఁడ" నిన
మధువైరికథలవాఙ్మనసగోచరము
లధిప! ఏర్పడ వినుమని చెప్పఁదొడఁగె.
అని యిట్లు నిత్యధర్మారంభు పేర
జనలోకనవపారిజాతంబు పేరఁ
జతురకళాపూర్ణచంద్రుని పేర
నతులవైభవనిర్జరాధీశు పేర
శోభితనవరూపహూనాస్త్రి పేర
నొభళమంత్రికందామాత్యు పేరఁ
గోరి భరద్వాజ గోత్రసంజాతు
డారూఢమతి నయ్యలార్యనందనుఁడు
శృంగారరసకళాశ్రితవచోధనుఁడు
సింగనామాత్యుఁడు చెలువగ్గలింప 1050
సలలితరసభావశబ్దగుంభనల
వలనొప్ప శ్రీభాగవతపురాణమున
మహనీయమగు దశమస్కంధసరణి
విహితలీలలనొప్పు విష్ణుచారిత్ర
మారూఢభక్తి కల్యాణకాండంబు
నారవితారార్కమై యుండఁజెప్పె. 1053

కల్యాణకాండము సమాప్తము.

శ్రీరస్తు.

శుభమస్తు.

ద్విపదభాగవతము.

జగదభిరక్షకాండము.

శ్రీరమ్యుఁడగు పుండరీకలోచనుఁడు
ద్వారకాపురినున్న తఱినొక్కనాఁడు

—: నృగుని శాపవృత్తాంతము :—

సాంబుఁడులోనుగా సకలకుమాళ్లు
నంబుధీతీరవిహారణ్యభూమి
మృగయానురక్తులై మెలఁగుచుఁ దప్పి
తగ నీర్ద్రికందువఁ దడయక వెదకి
యొకనూతిలో నొక్కయూసరవల్లి
వికలమైపడియుండ వెఱఁగంది చూచి
"యెన్నఁడుపోడగాననిట్టిగాత్రంబు
నిన్ని వన్నెలుగల యీనరటంబు
కటకటా! ఈ కూపగతమైనదనుచుఁ
బటుశక్తి నందఱుబట్టి యీడ్వఁగను
వెడలకయుండిన వెన్నునితోడ

కడువేగఁ జెప్ప నక్కడికేఁగుదెంచి
కూపగతంబైన కృకలాసకంబు
శ్రీపతి వీక్షించి చేతను దివియ
నది దివ్యపురుషుఁడై నంబుజోదరుని
పదపంకజములకు భక్తి మ్రొక్కుటయు
హరిజూచిపలికె "పుణ్యాత్మనీకిట్టి
నరటజన్మంబేల సమకూరె"? అనుఁడు
"అనఘాత్మ! నృగుఁడ నిక్ష్వాకువంశజుఁడ
బెనుపడ సంపదఁ బేర్చినవాఁడఁ
దారకంబులు వృష్టిధారలు నిసుక
వారాసితరగలు వడినెన్న వచ్చు
గాని నే విప్రసంఘములకు నిచ్చు
ధేనుసంఖ్యలు గణతింపఁగఁజాల
నొకపుణ్యదినమున నొకవిప్రవరున
కొకగోవునిచ్చిన యురక యాకుఱ్ఱి
క్రమ్మర నామంద గలసిన నెఱుఁగ
కమ్మెడ నొక బ్రాహ్మణాఢ్యుని కొసఁగ
మును ధారకొన్న యాముసలి బ్రాహ్మణుఁడు
తనకుఱ్ఱి తప్పినఁ దడవుచు వచ్చి
యా విప్రునింటిలో నేపారుచున్న
గోవును గొనిపట్టుకొనిపోవ నాపి
"యేమి కాఱులు చెప్పెదీ కుఱ్ఱినాకు
భూమీశ్వరుఁడు ధారవోసినవాఁడు
రాజుచే మును పరిగ్రహముఁగన్నాఁడ
యీజగంబెఱుఁగు నాయిది కుఱ్ఱియగుట

ధరణీశుకడకుఁ బోదము రమ్మటంచు ;"
"నిరువురు నాకడ కేతెంచి నన్ను
దీవించి యిద్దఱుఁ దెలిగెల్లఁ జెప్ప
భావించి రెండవ బ్రహ్మణుఁజూచి
వేవిరపక మీకు వివరింపనేల
యీవిప్రునకు మొన్న యిచ్చిన కుఱ్ఱి
తొలఁగంది వచ్చి నా దొడ్డిలోనున్న
యెఱుఁగక నిచ్చితి యీవిప్పసైచి
వెలయ నీకుఱ్ఱి యీ విప్రునకిమ్ము
నులియుకఁ గొనిపొమ్ము నూఱుధేనువుల"
ననవుఁడు నవ్విప్రుఁడనలంబువోలెఁ
గనలచుఁ బరుషవాక్యముల. నిట్లనియె
"ద్విజునకిచ్చిన సొమ్ము వీడ్పడ నిచ్చు
కుజనుండు దుర్గతిఁ గూలు పెక్కేండ్లు
దరఁ బ్రతిగ్రహధనత్యాగి దుర్ఘటము ;
పరగంగ ధపమీని పతి జంబుకంబు
నగుదురిల్లైటఁగియు నన్యాయమాడఁ
దగదయ్య నాకిచ్చి ధర్మచారిత్ర !"
ఎన్ని చెప్పిన కఱ్ఱి నీనంచు నతఁడు
గ్రన్నన దనయింటికడకుఁ గొంపోవ
యీవిప్రవరుఁజూచి యిట్లంటి "నీకు
యీవట్టి మొండవేల ? ఇదెనీకు లక్ష
గోవుల నిచ్చెదఁగొని నీవుకరుణ
కావవే నన్ను దుర్గతిఁద్రోయ" కనుఁడు
"ధారుణీశ్వర ! నాకుఁ దగ దొంగటాలు

¹ధారవోసెద వేట దానంబు నీవు
కుఱుమట్టు పొడవును కొమ్ములుగలిగి
తెఱగగు చన్నులు తీర్రైన తోఁక
చక్కదనము నొక్కచక్క మేయుటయుఁ
నెక్కడ విడిచిన నిల్లుచేరుటయుఁ
గ్రేపులు బిలుచునర్మిలిని మాశిశువు
శేప్రొద్దు వేడిన నీడనిచ్చుటయు
కడుసాదునై లక్ష్మిగతి నిరటిలోన
నుడుగక నీధేనువుండిన జాలు;
యిదిదప్పిపోయిన నింటివారెల్ల
మదిలోన మలమల మఱుఁగుచున్నారు;
యీకుత్తినాకు నీ వీవోవలేని
రేకాఱులుమ జెప్ప కిట్లొండు మాట
నాడితి కృకలాసమైయుండు" మనుచు
నాడి బ్రాహ్మణుఁడు శాపంబిచ్చె నంత;
వడవడ వణకుచు వడినేఁగి యతని
యడుగులపైఁబడి యతనితోనంటి
"నీకష్టజన్మంబు నేనోర్వజాలఁ
జేకొని నన్ను రక్షింపవే" యనిన
"హరి లోకరక్షార్థమై కృష్ణుఁడనఁగఁ
బరగు నాతని కరస్పర్శమాత్రమున
నీకష్ట శాపంబు నీఁగి నీపుణ్య
లోకంబు నొందు సుశ్లోక! పొమ్మనిన"

---

¹ధారవోసెదవు+ఏట. ఏట=పశుపాతము.

తడయక యీయాకష్టతను బొంది యిందుఁ
బడనిపాటులఁబడి పద్మాయతాక్ష !
వేదాంతవేద్యులు వెదుకంగలేని
నీదివ్యచరణ సన్నిధిగంటి మంటి
పనివినియెదనో కృపారసపూర్ణ !
అని చెప్పి కృష్ణున కండదండ మ్రొక్కి
కనకవిమాన సంకలితుఁడై నృగుఁడు
చనియె దివ్యులుగొల్వ జంభారిపురికి
అతఁడు వోయినఁజూచి యద్భుతంబంది
శతదళనేత్రుఁడచ్చటివారి కనియె.
“ హాలాహలాభీలమగు వహ్నికంటెఁ
గ్రాలును విప్రవర్గపుకోపవహ్ని
వారల సొమ్ములెవ్వరు హరించినను,
దారుణలీల బాధలఁ బెద్దగాల
మలమటఁబొంది కీటాదులై పుట్టి
పొలిసిపోదురు కులంబునుఁ గూలు
నదిగాన విప్రుల యర్థమీభంగి
మదిఁ జూడవలయు నెమ్మదిఁ గోరువారు”
అనుచు పుత్రులు దాను నరిగి మురారి
తనమందిరమున సంతసలీల నుండె.

—: వసంతఋతువర్ణనము :—

అంతట సకలలోకానందమగుచుఁ
గంతుని సామ్రాజ్యఘనలక్ష్మి యనఁగ
పరమానురాగసంపన్నకారణము

విరహిమానసమహావిద్వేషణంబు
శుకకోకిలాలాపసుస్వరప్రదము
ప్రకటితదంపతిప్రాణవల్లభము
మధుపకుటుంబికామందిరాంగణము
మధురసౌరభశైత్యమాంద్యకారణము
[1] ప్రాలేయకులవార్ధి బడబానలంబు
నానొప్పి వనముల నవకంబులెక్క
మానుగానే తెంచె మధుమాసలక్ష్మి.
తరులతావలులకుఁ దమకంబులెక్క
పరిమళంబై మందపవనుఁడు వీచె;
గుమురెక్కి తరులెల్లఁ గొనచిగురాకు
గములు క్రొన్నన నవకపు మొగ్గ మ్రొగ్గ
వలిమొగ్గక్రొవ్విరి వలపులు గులుక
వెలిపూవు నూనూఁగు పిందెలుగాయ
కసుగాయ పులికాయ కడునొప్పు దోర
పసనుపండులు వనిపండులు గలిగి
తరువు లెల్లను గల్పతరువుల భంగి
పరువమై చూపట్టు పరిమళశ్రీల!
వాసంతి వనములు వాసనగలిగి
వాసికి నెక్క చామంతులు పూచె;
గొజ్జంగలలరుల గొమరారు మరుని
సజ్జపట్టులభంగి సౌరభంబొలసె;
కందర్పుటమ్ముల కరణిని వెడలి

ఒకపాదము కన్పట్టుచున్నది.

సింధువారంబులు చెన్నారఁ బూచె ;
మగువలగండూష మధుకేళిఁ దేలి
పొగడలామని వేళఁ బొగడొందఁ బూచె ;
తన్నాసపడి చూడఁ దరుణీజనంబు
తన్నాసపడిపూచె దగనశోకంబు ;
తన్నిన నలరుటే తగవంచు సతుల
కన్నుసన్నలఁ దిలకంబు చూపట్టె ;
సుదతుల కౌఁగిళ్ల జొక్కులఁ జొక్కి
ముదమంది కురవకంబులు మ్రానుపడియె ;
పాటలు చెవివిని పాటలీతరులు
పాటిల్లె సతుల యాపాటల నలరి ;
సంపంగిపూ దేనె చవిఁజొక్కి క్రింద
గుంపులై యలరెడు గొదమతుమ్మెదల
పానాభిరతిఁ జొక్కి పతులును సతులు
గానంబు లొనరించు గతిని జూపట్టె ;
కాయజుఁడదె దండు గదలి యేతెంచె
రాయడి యడలి జోరన గూడుఁ డనుచుఁ
గోయని యెలమావి కొమ్మల మీఁదఁ
గోయిల లెలిగించె కొమరగ్గలింప;
భావజు త్రైలోక్యపట్టంబుగట్ట
దీవించఁ జనుదెంచు ద్విజులచందమునఁ
జెలరేఁగి యెల్లెడఁ జిలుకలు మ్రోసె ;
వెలుఁగొందు చద్రుఁడు వెన్నెలతేట
పరువంపు చిన్నిపూపాటన నమర
మురిపెంపు నవ్వు కెమ్మోవులఁ దనరఁ

దిలకించు చందన తిలకంబు లలర
కలికెలు మేన సత్కాలికలై తనర
వనములు నిత్యయౌవనలక్ష్మిఁ జెంది
వనితలచందమై వలనొప్పఁ జూడ
నీభంగి నామని యేపార సీరి
యాభీరుకాంతల నాత్మలోఁ దలఁచి ;

—: బలరాముఁడు వ్రేపల్లెకు నరుదెంచుట :—

హరికి నెఱిఁగించి యట రథం బెక్కి
యనుదెంచె వ్రేపల్లె కాప్రొద్దె కదలి.
ఏపారఁ జనుదేర నెదురేఁగి యంత
గోపయశోద లక్కునఁ జక్కఁ జేర్చి
"నాతండ్రి! నాయన! నాముద్దుకూన!
ఏతెంచితే మమ్ము నిందఱుఁ జూడ
దేవకియును వసుదేవుఁడు హరియు
నీవు రోహిణి నెమ్మి నెలతలు సుఖులె?"
అని ప్రేమ నడుగుచు నర్మిలి పుత్రుఁ
గనుఁగొని హర్షాశ్రుకణములు దొరగ
సంతసింపుచునుండ సకలగోపికలు
నంతలో నరుదెంచి హలపాణిఁ గాంచి
సేమంబుఁ జెప్పి తత్సేమంబు లడిగి
యామోహరసవార్ధి నందంద తేలి
హలియు మజ్జనఁ భోజనాది కృత్యములు
సలిపి వారునుఁ దాను సంతోషలీలఁ
గలసి వినోదించి కాళిందితీర

ములను బృందావనంబునఁ గ్రీడసలిపె.

—: బలరాముఁడు వ్రేతలతో నెమునాతీరమందుఁ గ్రీడించుట :—

తాను గోపికలును దనపిన్నవాఁడు
వూని క్రీడించుచాడ్పునఁ గ్రీడసలిపి;
పసిఁడి కోరల నుంచి పక్షతులు సీధు
వసలారఁ దనియంగ నందఱుఁ గ్రోలి;
తనివోక కాళిందితటతరుశ్రేణి
తనరారు నీడలఁ దగ విశ్రమించి;
వరుణసంభవమైన వారుణిఁ దేలి
తరమిడి బలభద్రుఁ దలపెల్ల నెఱిఁగి
పరిమళమాధుర్యఁ భరితమై నిండఁ
తరుకోటరమున నుద్భవమొంది నిగుడఁ
గని ప్రలంబారి యక్కాంతలుఁదాను
దనుపారియున్న కాదంబరిఁ గ్రోలి
మానినిగండూషమదిరారసంబు
లాని మన్మథ కేళి నందంద తేలి
మదమెత్తి తన్ను దామఱచి గోపాల
సుదతులింపు నడిమి సూరెల నిలువ
ఘనకరిణులలోని గజము చందమున
ననువార నందవిహారంబు సలుపఁ
జెన్నారు మోవులజిగి జేగుఱింపఁ
జన్నుల కొంగులు జార పయింట
వెన్నులపై నీలవేణులు నెఱయఁ
గన్నులందును సోయగములు వ్రాన్పడఁగఁ

గానులు నులియంగఁ గరతాళగతుల
సానురాగంబుల శౌరిఁ బాడుచును
సన్నలచాయలఁ జతురులాడుచును
నన్నులన్నుల వెడ యాటలాడుచును
సీరితోఁ బలుమారు చెనకి నవ్వుచును
మేరలు మీఱి సమేలంబు లాడి
కలసి వినోదింపగా సీరపాణి
యలసి యంగము సోల నందంద సొక్క
వెలసిన నెరివేణి వ్రేలాడ చమట
కలసి కస్తూరి యెక్క వలువ లెల్ల
గటకాంగుళీయకగ్రైవేయహార
పటుకిరీటప్రభాపటలి శోభిల్ల
మదియించు దివిజసామజము చందమున
నెదురెవ్వరును లేక యేపు దీపింప
తరుణులుఁ దనుగొల్వఁ దరులతావలులఁ
బరికించి చిత్తవిభ్రాంతిమై పలుకు; 110
"ఏలకో! ననుఁజూచి యీరాజశుకము
శీలించి మొగమొఱ్ఱ సేయుచున్నదియ!
నాయంబరంబుల నలుపెల్లఁ గొన్న
దీయలి!" అని కన్ను లెఱ్ఱజేయుచును
దరువులెల్లను నేడుఁ దనుజూచి నవ్వ;
"నరుణించె కింశుకంబదియేమి!" అనుచు
వదనంబు వడువట్లు వట్టి మైదప్పి
గదిమి దిగ్గన లేచి కాళిందిఁ జూచి

—: బలరాముఁడు యమునను నాగలిచే నెత్తుట :—

" ఓ సూర్యకన్యక! ఓ లోకమాత!
ఓసారసల్లాప! ఓసారసాక్షి
నీరువెట్టుము లేక నిలువంగజాల
బోరన నుదకంబుఁ బోయవే! " అనుచుఁ
బలుమారు పిలిచినఁ బలుకక యున్నఁ
గలుషించి పరుషవాక్యముల నిట్లనియె.
" పిలిచిన నామాట పెడచెవిఁ బెట్టి
పలుకవు మదిలోన భయమంది రావు!
మలినాంగి! నీమేని మదమెల్ల నడఁచి
దళనంబు సేసి యుద్ధతమాన్తు" ననుచు
నదలించి హాలమున నమ్మహాతటము
విదళించి తివిసిన వెఱఁగొంది యమున

—: యమున బలరామునిఁ బ్రార్థించుట :—

వడవడ వడఁకుచు వచ్చి తాలాంకు
నడుగులపై వ్రాలి యరుదొందఁ బలికె.
" ఓ సర్వలోకేశ! ఓ సుప్రకాశ!
ఓ సౌమ్యహృద్దేయ! ఓరోహిణేయ!
ధరణిభారముఁ బాప దనుజుల నడఁపఁ
గరమర్థి దేవకీగర్భంబునందుఁ
జెలువారఁ బుట్టిన చెలువుఁడ వీవ!
బలభద్ర! బలప్రలంభధ్వంసరామ!
జడసంగతి బలచంచలచిత్తమలినఁ

దడయక నీ మహాత్వముఁగానఁ గలనె?
నెలతలు సేసిన నేర్పు నేరములుఁ
దలఁకక లోగొంద్రు ధన్యులే ప్రొద్దు"
అని వేడుకొనుచున్న యమున మన్నించి
ఘనదయామతి హాలకర్షంబు విడిచె.
ప్రీతిఁ గాళింది విభేదనుండనుచు
నాతని దీవించి రమరసంఘములు!
బలుఁడు నాఁగట గొల్వ వాపినచోటు
బలతీర్థ మన ధాత్రిఁ బ్రఖ్యాతమయ్యె.
అచట కృతస్నాతులైన మానవుల
కచలిత విష్ణులోకానంద మొదవు!
ఈభంగి బలభద్రుఁ డెంతయు వేడ్క
యాభీరు సతులతో నెమునఁ గ్రీడించి
యేపారు నిబ్భంగి నీయాఱు నెలలు
వ్రేపల్లెలోపల వేడ్కలు సలిపి
హరిఁజూచు తలఁపున నట ద్వారవతికి
నరుదెంచెఁ బ్రజబాలలర్థిఁ దన్నుప

—: పౌండ్రక వాసుదేవుని వృత్తాంతము :—

నాలోన గర్శదేశాధినాయకుఁడు
పాలసచిత్తుఁడు పౌండ్రభూవిభుఁడు
హరితో విరోధియై యతని చిహ్నములు
తరమిడి ధరియించి తానంతఁ బోక
వాసుదేవుండను వలనొప్పఁ బేరు
భాసురంబుగఁ దాల్చి పటుశక్తి మెఱసి

యక్షౌహిణీద్వితయమ్ము తన్నుఁ గొలువ
నక్షతబలశాలియై దండు వెడలె.
ఆరాజునకు మిత్రుఁడై కాశిరాజు
ధీరుఁడక్షౌహిణీ త్రితయంబుతోడఁ
బటుశక్తి నతనికి బాసట యగుచు
భటదంతిహయరథప్రతతితో నడువ
నీరసంబునఁ బౌండ్రుఁడేతెంచి పేర్మి
ద్వారకానగర ముద్దతి డాయవిడిసి

—: పౌండ్రుఁడు దూతను శ్రీకృష్ణుని వద్దకుఁ బనుచుట :—

హరి సన్నిధికిఁ దజ్ఞుఁడను దూతఁబనుప
నరుదెంచి తగ సుధర్మాభ్యంతరమున
వృష్ణిభోజాంధక వీరులు ఁగొలువ
నిష్టవర్తన నున్న యిందిరారమణుఁ
గని మ్రొక్కి తనవచ్చుకార్యమంతయును
వినుపించఁ జొచ్చెను వెఱపింత లేక.
“ఆ పౌండ్ర నృపతి యాహవదండపాణి
భూపాలతిలకంబు పుత్తెంచె నన్ను.
అతఁడు నీతోడ ననుమన్న మాట
లాతతంబుగ విను మంభోజనయన!
వసుధ భారము మాన్ప వైరుల నడఁప
దెసలఁ బెంపఁగ వాసుదేవుఁడ నేను
నాచిహ్నములుఁ దాల్చి నాపేరుఁ దాల్చి
యీచావుఁ దెచ్చుకో నేఁటికి నీకు?
ఘనగదాశంఖచక్రమును శార్ఙ్గమును

గనకాంబరంబును గరుడకేతనము
మకరకుండలములు మణికిరీటంబుఁ
బ్రకటంబగుజలసత్ప్రసవమాలికయు
నివినాకు వేవేగ నిచ్చి ప్రాణముల
సవరించుకొ్గని నన్నుశరణంబుఁ జొరుము;
కాదేని నాతోడ కదనంబు సేయ
నాజటఁ జేర్చి రమ్మని చెప్పె'' ననుఁడు;
విని జనులందఱు వికవిక నగఁగ
ఘనుఁడు కృష్ణుఁడు వానిఁ గనుగొని పలికె.
"కండక్రొవ్వునఁ గన్నుఁ గానకఁ బెక్కు-
డుండగంబులు ప్రేలి త్రుళ్లుగా కేమి!
భండన భూమిలోఁ బరిమార్చి వాని
కండలు భేతాళగణముల కిత్తు.''
అని పల్కి దూతకు నర్ఘ్యవస్తువులఁ
దనిపి వీడ్కొలుప నాతఁడు పౌండ్రుతోడ
హరి వాక్యములు జెప్ప నతఁడు కోపించి
దురమునకేతెంచె దోర్గర్వ మెసఁగ.

—: పౌండ్రుఁడు హరినిఁ దాఁకుట :—

బహుదళంబులతోడఁ బౌండ్రుఁ డేతేర
నహిమాంశు సమతేజుఁడగు వెన్నుఁడెఱిఁగి
పరఁగు సారథ్యదర్పంబు మెఱయఁ
దేరెక్కి శస్త్రాస్త్రదీప్తులు నొలయఁ
బాంచజన్యధ్వని పరిపంథి సేనఁ
జంచలించఁగ వచ్చు శౌరిపై నడరి

పరిఘతోమరగదాప్రాసచక్రములుఁ
గురిసిన, మురవైరి క్రూరబాణములు
నడవుల కేర్చు కాలాగ్ని చందమునఁ
దాడరి సేనలనెల్ల ద్రుంచివైచుటయుఁ
గనుఁగవ కెంపొందఁ గడఁగి పౌండ్రుండు
తనసేనఁబురికొల్పి దళములఁ దాకె.
కృత్రిమ చక్రంబుఁ గినిసి వైచుటయుఁ
శత్రుఁడు బెగడ నాచక్రంబు నఱకె;
గదయును విల్లును ఖండించి తేరు
చిదురుపలుగఁ జేసి సిడముఁద్రుంచుటయు
బఱిగొని వాలును బలుకయుఁ గొనుచు
నఱిమిఱి నార్చుచు నరుదేరఁజూచి
హరి శార్ఙ్గమున భల్లమరివోసి కంఠ
మరుదార లక్షించి యార్చి వైచుటయు
మకరకుండలరత్నమకుటంబు తోడఁ
బ్రకటోల్కముఖము భంగి పడియె తచ్ఛిరము.
కూలిన పౌండ్రుఁ గన్గొని సేనలెల్ల
నాలచందంబున నందంద పఱచె.

—: పౌండ్రుని మరణమునుగాంచి కాశిరాజు శ్రీకృష్ణునిపై గవిసి మడియుట :—

కని కాశిరాజు "నేఁగలుగంగ నేలఁ"
గనుకని పార" నొక్కట నిల్వఁడనుచు
దళములఁ బురికొల్పి దైత్యారితోడఁ
దలపడి బహుబాణతతుల నొప్పింపఁ

గోలవ్రేసిన మ్రోఁగు కోల్పులిభంగి
వాలమ్ములురమున వడిఁగీలు కొలుపఁ
[1]గాలాగ్నిసదృశభీకరచక్రనిహతి
ముడివడు బొమలతోఁ బొలుచు మస్తకముఁ
బడవైచి యార్చె; నీ భంగి శాత్రవుల
నిరువురఁ బొలియించి యిందిరాధీశుఁ
డరుదెంచె ద్వారక కమరాళి పొగడ.

—: కాశిరాజు కుమారుఁడు రుద్రుని వరమును బొంది కృత్తిని బుట్టించుట :—

కాశీశ్వరుని తల ఘనచక్రనిహతిఁ
గాశిగాఁ గూలినఁ గని పౌరులెల్ల
నడరి సోద్యంబంద యాయొక్క శిరము
పడియె కుండలమణిప్రభలతో నపుడు.
అతివలు దుఃఖింప నతని నందనుఁడు
సితకీర్తియగు సుదక్షిణుఁడను వాఁడు
తన తండ్రి తల యాటఁదా నిశ్చయించి
ఘనభక్తి నగ్నిసంస్కారంబు సేసి
యతుల సమాధి నిష్ఠాత్ముఁడై ప్రమథ
పతినాత్మ నిలిపి తపంబాచరింప;
హరుఁడు ప్రత్యక్షమై "యడుగుము నీకు
వరమిత్తు" ననుటయు వాఁడు "మజ్జనకుఁ 1[illegible]
జంపిన పాపాత్ము సమయించు నట్టి

---

[1] ఒకేపాదమున్నది

పెంపు ప్రసాధింపు భీమాక్ష! అనుఁడు
ఆ దేవుఁడును "దక్షిణాగ్ని గుండమున
నాదరంబున విప్రులాభిచారాఖ్య
హోమంబు సేయఁగ నొకకృత్తి పుట్టి
పోమిచ్చి నీ శత్రుఁ జుఱుపుచ్చు" ననుచు
హరుఁడదృశ్యుండయ్యె నంత ఋత్విజుల
నరుదార వేల్పింప నాయగ్ని వలన

—: అగ్నిలో నుండి పుట్టిన కృత్తి శ్రీకృష్ణునిపై వెడలుట :—

నాలోన భయదజిహ్వాలవక్త్రంబు
ఫాలనేత్రంబును బాహాశతంబు
శూలతోమరగదాక్షురికాదిభిండి
వాలచక్రములు దుర్వారాయుధములు
చటులకఠోరదంష్ట్రలు తాడనములు
కుటిలపు బొమ్మలు క్రూరదృష్టులును
దీర్ఘతాభీలత తీవ్రాట్టహాస
గర్ఘరస్వరములు ఘనశరీరంబు
నడర లోకములెల్ల హరుఁడొక్కవేట
మడియింపఁ బుట్టిన మాడ్కియో యనఁగఁ
బదతాడనముల భూభాగంబు వగుల
నదరి [1]లోహితవర్ణ మదరి యుండండ
"ఎవ్వని బరిమార్తు నిట పంపు మనుఁడు"
నవ్వాసుదేవుని నడచిరమ్మ" నిన

---

[1] అర్థము చింత్యము

బహుభూతఢాకినీప్రతతితోడ వచ్చి
దహనార్చు లొలయ నాద్వారకఁ జొరఁగ
కారగ్ని దరికొన్న ఘనసత్వచయము
పారెడుగతి జనప్రతతి రేఁపఱచి
యతివలతో జూదమాడుచు నున్న
శతదళాయతనేత్రు సన్నిధి నిల్చి
"ఇదె యొక్కకృత్తి యహీనాగ్ని శిఖలఁ
గదిసి పట్టణమెల్లఁ గాల్చుచు వచ్చె
నిక్కడ దిక్కు లేదీబారిఁ గడపి
గ్రక్కున మమ్ములఁ గావవే కృష్ణ!"
అని యార్తులై పలుక నాపౌరజనులఁ
గని కేల వారించి కడకంట నగుచు
నది మహేశ్వరకృతియా కృత్తి యగుట
మదిలోన నెఱిఁగి సౌమ్యజ్ఞాన విభుఁడు;

—: శ్రీకృష్ణుఁడు సుదర్శనమును కృత్తిపై పనుచుట :—

తనుఁగొల్చియున్న సుదర్శన పురుషుఁ
గని నల్ల నవ్వుచు కనుసన్నఁ బనుప
నమ్మహాచక్రంబు హరి యాజ్ఞఁ బూని
క్రమ్మన నేతెంచి కాలాగ్ని వోలె
శతయోజనోత్తాల చటుల విగ్రహము
శతభుజసమదోగ్రశస్త్రాస్త్రములును
ఘనసహస్రార్కనిర్గతతీవ్రరుచులఁ
బెనుమంటలెగయ నాభీలమై పేర్చి
హరి చక్రమేతెంచు టాలించి కృత్తి

మఱలె బిట్టొఱలుచు మది విహ్వలింప
పఱగంగ నయ్యేదు ప్రవరసాధనము
యఱిముఱి వెనుకొన నదికాశిఁ జొచ్చె.
చొచ్చిన నిట్టట్టు సురగంగ నీక
నచ్చక్ర మడరి ఘోరానలశిఖల
నాఋత్విజులతోడ నాకృత్తితోడ
నారాజుతోడ జనావళితోడ
ఘనశతాంగక వాజి గజశాలతోడ
ధనధాన్య వస్తు సంతానంబుతోడఁ
[1]బాలుపారుసౌధగోపురములతోడఁ
గాశీపురము చక్కఁగాఁ జేసి కాల్చి
యీశేషి హరి పాలికేతెంచి మ్రొక్కె.
నీకథావర్ణన మెల్ల వారలకు
ప్రాకటకృత్యముల్ బాధలు నడఁగు
పుత్రసంపదలును భోగసంపదలు
శత్రుక్షయంబు మోక్షము నిచ్చుచుండు.
అని చెప్పుటయువిని యభిమన్యు సుతుఁడు
వినతుఁడై శుకయోగివిభునకిట్లనియె.
“ ఆ మందలో నుండి యరుదెంచి యచట
కామపాలుండే మిగతి విశ్రమించె?
ఆతని చరిత్రంబు ననిశంబు వినఁగఁ
గౌతుకంబయ్యె నాకథఁజెప్పు ” మనిన

[1]ఒకే పాదము కన్పట్టు చున్నది

—: ద్వివిదుఁడను వానరుఁడు తన చెలికాఁడగు నరకుని
జంపినందులకుఁ బగఁబూని చెలరేఁగుట :—

వినవయ్య కురునాథ! ద్వివిదుండనంగ
దనరారు మైందుని తమ్ముఁడు ఘనుఁడు
గిరిచరాధిపుఁడు సుగ్రీవుని మఱఁది
నరకుని చెలి మహోన్నత బలాధిపుఁడు
నారాయణునిచేత నరకుఁడు దెగినఁ
గ్రూరవార్తకు మదిఁ గుమిలి మర్కటుఁడు
హరి నడఁచెదనని నద్దేవుఁ డేలు
పురములు నూళ్లను బోరి చిచ్చులిడుచు
కొండలు బెఱికి యుక్కున నూళ్ల మీఁద
మెండుగా వైచి భూమిని పాడుసేయు
వనితలఁ బతులను వడివెంట బెట్టి
కొనిపోయి పర్వత గుహలలో డాఁచు 2
కీర్తి నుండగ నెటేఁగి యాశౌరి
యూరకనుండఁగ నొక్కనాడంత;
వారాసి దాఁటి దైవతకందరమున
కారూఢగతివచ్చి యగచరాధిపుఁడు
మానినీమంజుళమధురగానముల
వీనులకింపార విని యల్ల నచట
కరిగి చేరువ నొక్క యవనిజ మెక్కి
పరికింపుచున్నచోఁ బడఁతుల నడుమ
నారుణితాత్ముఁడై యాసవక్రీడ
నారామలును దాను నలరి పాడుచును
గోవులలోనున్న గోరాజుభంగి

దా వేడ్క విహరించు తాలాంకుఁ జూచి
హరియుకాఁ దలపోసి యాకీశనరుఁడు
తరులెక్కి కిలకిల ధ్వనులు సేయుటయు
తరుణులు నవ్వుచుఁ దను చూడ మేను
పరపి ఝుంకించుచుఁ బండ్లిగిల్చుచును
బొమలార్చి చూచుఁ బోరి మీఁదఁ బోలయు
భ్రమరాళిఁ గని యులిక్కిపడి పట్టుకొనుచు
పెలికిలపడి యాడి వెక్కిరింపుచును
వెలఁదులఁ గని వంగి వెనుకఁ జూపుచును
గోడిగంబులు సేయుఁ గ్రోతి సేఁతలకుఁ
జేడియలందఱుఁ జెలరేఁగి నవ్వ;

—బలరామ ద్వివిదుల ద్వంద్వయుద్ధము:—

తాలాంకుఁ డాకరాత దర్పించి వైన
నాలోనఁ గోపించి యతనిపై కుఱికి
చీరలు జించి యాసీధుభాండంబు
బోరనఁ బగులంగఁ బొడిచి దాఁకుటయు;
కామపాలుఁడు వానిఁ గడకతోఁ బట్టి
వేముష్టిఁ బొడిచిన వికవిక నవ్వి
ప్రళయకాలోత్తాలభైరవుభంగి
బలియుఁడై మైవచ్చి బలున కిట్లనియె.
“ నలినాక్ష! యేరీతి నాఁడు నామిత్రుఁ
దలమీఱి నరకు నుద్దండతఁ జంపి
వచ్చితి నేనేఁడు వచ్చిన వాఁడఁ
జెచ్చెర సమరంబు సేయు నాతోడ!

తనరార మైందుని తమ్ముఁడ ద్వివిదుఁ
డనువాఁడ శూరుఁడ నర్కజు మంత్రి
రామునకై పూని రావణుతోడ
భీమాహవము సేసి పేర్చినవాఁడ
నెలకొన్న రణవీధిని ద్రుంచివైవఁ
గెలసి నా చెలికాని కెలసంబుఁ దీర్తు." 240
అని పల్కి యార్చి మహాశూలమెత్తి
కొని వైచుటయు సీరి క్రుంకి మైఁదప్పి
ముసలంబుఁ గొని బెట్టు మోదిన వాఁడు
వెస మహాతరువెత్తి వేసి యార్చుటయుఁ
దప్పించుకొని సీరి తరుచరుమీఁద
గుప్పించి యుఱికి ముష్కన ముష్టిఁ బొడువ
తెరలక వానరాధిపుఁ డొక్కపెట్టు
తరుణులు బెగ్గిలఁ దరువృష్టిఁ గురిసె
లాంగూలమున ద్రవేసి లలి నఖాగ్రమున
నంగంబుఁ జీరి మేనందంద కఱచి
పిడికిటఁ బొడిచినఁ బెనుమూర్ఛ నొంది
పడిలేచి యాబలభద్రుఁ డాతనిని
గళమున జిక్క నాగలి దగిలించి
యలుకమై రోఁకట నందంద పొడువ
హనువులు పగిలి మైయదరెల్లఁ బొలిసి
కనుమూసి నెత్తురు గ్రక్కి రోఁజుచును
బవిదాఁకి కూలిన పర్వతంబనఁగఁ
బ్లవగేంద్రుఁ డిలఁగూలి ప్రాణంబు విడిచె.
ఉవిదలందఱు వెఱఁగంది కీర్తింప

దివిజసంఘము రాము దీవించిరంత
నలిన నేత్రుండున్న నగరికే తెంచి
హాలి కృష్ణుతోడ నయ్యాగచరువార్త
వినుపింప శౌరియు వివిధ బాంధవులు
వినుతు లొనర్చిరి వెస రామునంత

—: సాంబుఁడు ధుర్యోధనుని కుమార్తె లక్షణ నపహరించుట :—

అంబుజోదరపుత్రుఁ డతిరథోత్తముఁడు
జాంబవతేయుండు సాంబుఁడు ఘనుఁడు
కోరి ధుర్యోధను కూఁతు లక్షణను
వారణపురి స్వయంవరమునందునను
వరియించి కొనిపోవ వారలందఱును
కురుపతి కెఱిఁగింపఁ గోపించి యతఁడు
"ఏమేమిరా! సాంబుఁడే నాతనూజ
నేమని కొనిపోయె నెట్లు జూచితిరి ?
కురువంశజులతోడఁ గూడి యాదవులు
పరిణయప్రాప్తులే పరికించి చూడ ?
పడుచువాఁడీకన్య బలిమిఁ గొంపోవఁ
దడయక జూచుట తగవుగాదతని
బట్టి తెత్తమటంచు బలములతోడ
దట్టుఁడై వడి సుయోధనుఁ డుగ్రవృత్తి
వెడలి యార్పుచుఁ దాఁకి విష్ణునందనుని
దడయక శస్త్రాస్త్రతతుల నొప్పింపఁ
గనిపోయి తిరిగి యగ్గలికమై వేఁచి
తన రథంబఖలవర్తనలఁ గ్రీడింపఁ

బడియార్చి విలుగుణధ్వని చేసి శరము
లడరింపఁ గురుసేన నందొక్కపెట్ట
మురిసె రథంబు లమ్ముల గీటణంగెఁ
గరులు రోఁజుచుఁగూలెఁ గాల్బలం బణఁగెఁ
దరమిడి సాంబు కోల్తల కోహటించి
తిరిగిసేనలు రాజుదిక్కున కొదుఁగ
గినిసి యాతని శల్యకేతుఁడు దాఁకెఁ
గని రాజుతమ్ముఁడు గర్ణ సౌబలులు
వెనుఁబ్రాపుగా బాణవృష్టి వేల్పుటయు
ధనువుసారించి యాదైత్యారి సుతుఁడు
కాఁడగ నేడు మార్గణముల నేసి
యేడు బాణముల మహీశు నొప్పించి
యతని తమ్ముని నాల్గుటమ్ములఁ గ్రుచ్చి
శతసాయకంబులు శకునిపైఁ గప్పి
తొలఁగక శల్యకేతుని విల్లుఁ దునిమి
బలముల శరపరంపరలఁ గూల్చుటయు
నతని విక్రమకేళి కచ్చెరు వంది
యతులితంబగు యోధులందఱుఁ గూడి

—: కురువీరులందఱుఁ గూడి సాంబుని విరథునిగాఁ జేసి పట్టుకొనుట :—

కురపతి విలుద్రుంచెఁ గొసరేది కర్ణుఁ
డరదంబు నుగ్గాడె హరుల గీటణఁచె ;
విరథునిగాఁజేసి వెలఁదుకతోన
యరదంబుపై నిడి యతనిఁ దోతెంచె.

నాకన్య బెగడొంద నాకుమారకునిఁ
జేకొని బంధించి చెరఁబెట్టిరంత'

—: బలరాముఁడు యాదవుల కోపమును జల్లార్చి స్వయముగా హస్తినాపురికి వెడలుట :—

కరిఘోటరథభటోత్కరములతోడఁ
గరిపురిపై దండుగదలుటఁ జూచి
బలభద్రుఁ డది "యెంతపని మీర లేమి
తలఁచి కౌరవులపై దండుపోయెదరు?
యాదవులందు నెన్నడు కౌరవులకు
భేదంబు లేనిచోఁ బ్రీతి నందెఱిఁగి
యేమిసేసిన వార లేమన్న వారొ!
ఆమార్గ మెల్లను నఱసి సామమునఁ
దెలిసి సాంబునిఁ దోడితెచ్చెదఁగాని
కలహంబునకుఁ బోవ కారణం బేమి?"
అని వారి వారించి యట రథంబెక్కి
చనియె నుద్ధవుఁడు తోఁజనుదేర సీరి.
అరిగి వారణపురోద్యానంబులందు
కర ముప్ప విడిసి యక్కామపాలుండు
దనరాకఁ జెప్పి యుద్ధవుఁ బంపుటయును
జని యమ్మహాత్ముఁడాస్థానంబు నందుఁ
గురురాజు సచివు శకుని దుస్ససేనుఁ
గురుభీష్మకృపబాహ్లికులు గొలువంగఁ
గొలువున్న యతనిఁ గన్గొని పొడచూపి
భలభద్రురాక నేర్పడ జెప్పుటయును;

నతిసంభ్రమంబున నందఱుఁగూడి
యతని సన్నిధికేఁగి యర్థిఁబూజించి
నేమంబులడిగి యాసీరి వీక్షించి
"యేమివిచ్చేసితి రెఱిఁగింపుఁడనిన"
ధార్తరాష్ట్రులును బాంధవులును వినఁగ
నార్తరక్షణశీలి హలపాణి పలికె.
"కోరి మామేనత్త కొడుకులు మీరు.
ఆరూఢి మీకు మేనల్లుఁడుగానఁ
దన మేనమఱఁదలిఁ దరళాయతాక్షిఁ
జనవునఁ గొనిపోయె సాంబుఁడు దీనఁ
గలఁగి విరోధింపుట ర్వాంబుగాదు
వెలఁదితో నాతని విడిచి తెండ" నన.
అల్లన నవ్వుచు నాసుయోధనుఁడు
ప్రల్లదంబున బలభద్రుతో నవియె. 290

—: హేళనచేయు సుయోధనునిపై నాగ్రహముచే సీరి హస్తినాపురిని నాగలిమొనచే లేవనెత్తుట :—

"అకట! గురుస్థానమని నిన్నుఁజూడ
మొకమొకపడు మందమేళముల్ తగునె?
[1]ఒకనిఁ గొల్చిన వారలుర్విలో మీరు!
ఆదిగర్భేశ్వరులగు కౌరవులకు
యాదవులకు వియ్యమందంగఁ దగునె?
మిమ్మేలురాజును మీరును నాకు

---

[1] ఒకపాదమున్నది.

నెమ్మి యీడొనరింప నెంతటి వారు!
హరి మంచితనమున నన్నియు నొప్పె
జరగుట సల్లాపసహజభోజనము
సలిపి మన్నించినఁ జనవున మీరు
కలసి వర్తింతురుగాక యేనాఁట
నెక్కడి బాంధవంబిక! మాకు మీకు
ఫక్కి వోనాడఁగఁ బని లేదు వేగ
విచ్చేయుమను కురువిభుఁ జూచి సీరి
చిచ్చులో నెయ్యిఁబోసిన భంగి మండి!
"కాలుఁడు ప్రేరేపఁ గానక యిట్లు
ప్రేలెదవేల? నీపెంపెల్లఁ బొలియ
వరుస నెఱుఁగక వదరెదుగాక
హరికి నీకును నేది యంతర మోరి!
ఎవ్వరు నాకుమీ రెందఱున్నారు?
ఎవ్వరుగలరు నీకీబారి గడప!
నీబలంబులు నిన్ను నీపట్టణంబు
నాబాలవృద్ధమై యమునలో వైతు!"
అనిపేర్చి దర్పించి హలదండ మెత్తి
ఘనరౌద్రలయకాలకాలుఁడో యనఁగ
కరిపురికోట నాఁగటి వాత గ్రుచ్చి
భరమున నుంకించి పట్టుశక్తిఁ దివియ;
నదియొడ్డగిలి పడ నఖిలమానవులు
బెదరి నిల్వఁగ లేకఁ బృథివిపై వ్రాల
భీతిల్లి సంధులు పృథివి వేచఱువ
నాతురారావంబు నండండ చెలఁగ

నాంబికేయుఁడు విని హలిచందమెఱిఁగి
సాంబుని విడిచి లక్షణాసమేతముగఁ
దోకొని సకలబంధులుఁ దన్నుఁ గొలువ
నాకౌరవేశ్వరుఁ డాపగాతనయు
విదురుల మాట నిర్విణ్ణుఁడై వినుచు
బదరుచు నేతెంచి బలభద్రుఁ గాంచి

—: కురుపతి బలరాముని బ్రార్థించుట :—

ముదము తత్తరపాటు మొలవంగ నతని
పదపంకజములకుఁ బ్రణమిల్లి నిల్చి
యాతనిదెస మొగంబై కేలుమొగిచి
యాతురభణితి నిట్లని విన్నవించె.
“ దేవదేవారాధ్య! దివ్యావతార!
భావగమ్యాకార! భక్తలోకేశ!
శ్రీధరణీభర! శేషావతార!
మాధవ! నిగమవాఙ్మయ నిర్వికార!
వెయ్యిపాదంబులు వెయ్యిచేతులను
వెయ్యితలల్ రెండువేలుజిహ్వలును
గలిగి యుండొక ఫణాగ్రమున నీజగతిఁ
గొలఁది నీలముభంగిఁ గొని తాల్చునీవు
భూతాళి బుట్టింప బ్రోవ శిక్షింప
చాతుర్యుఁడవు నీవు సకలలోకేశ!
నీతత్వమెఱుఁగంగ నేరక క్రొవ్వి
యీతఁడాడిన మాటలెల్లను సైఁచు!
రక్షించు! మీయుపద్రవము వారించు!

అక్షయబలరామ!'' అనిసంస్తుతింప
ఘనప్రసన్నాత్ముఁడై కామపాలుండు
తనరార నంబి [illegible]తనయు మన్నించి
హాలముఖ మొదలించె నప్పురికోట
బలరాముచే బాధపడి కొంత యెత్తి
నేఁడును జూపట్టె నెటి [illegible]ము మహిమ!
పోఁడిగా వినుతింపఁ బోల దెవ్వరికి
కురుపతి యల్లునిఁ గూతును ననిచి
యరణంబు పదివేలు హరులును గరులు
మూఁడు వేల్రథములు మొగినాల్గువేలు
పోఁడిగా నిచ్చి యప్పుడు దోడుకొనుచు
ద్వారక కేతెంచెఁ దాలాంకుఁడంత ;
శౌరి యంతయు విని సంతోషమందె.
అని చెప్పుటయు రామునతుల విక్రమము
విని కురుప్రవరుండు విస్మయుంబంది
"పరమయోగీశ్వర! బలభద్రు మహిమ
సరసిజాసనుకైనఁ జర్చింపరాదు
హరియెట్లు విహరించె నటమీఁది కథలు
పరిపాటి నాకు నేర్పడఁ జెప్పుఁడనిన"
బాదరాయణియు నప్పద్మాక్షు మహిమ
నాదరంబున వినుమని చెప్పఁ దొడఁగె.
నరకుని ద్రుంచి యానలిన[illegible]చనుల
వెరవార పదియాఱు వేలనూర్వురను
పరిణయంబయ్యె నాపంకజోదరుఁడు
పరపేది యుండఱఁ బొండనా! ఒకతె

—: నారదుఁడు శ్రీకృష్ణుని లీలలను జూడ నేతెంచుట :—

మఱిగివర్తించునో ! మరి నేర్పుకొలఁది
యరసివచ్చెదఁగాక యనుచు నారదుఁడు
వరభక్తి నేతెంచె వడి ద్వారవతికి.
చనుదెంచుచో సత్య సదనంబునందుఁ
దనుపారఁ బారిజాతమునీడ నొప్పు
విరులచప్పరములో విశదమై పొలుచు
పరువంపు పువ్వులపానుపు మీఁద
పల్లవశ్రీమించి పరగుకెంగేల
నల్లన రుక్మిణీ యడుగులొత్తుచును
కాళిందిసతియు [1]లక్షణయును నిలిచి
తాలవృంతంబులు దనుపార వీవ;
తమ్ములమీయంగఁదగ మిత్రవింద ;
అమ్ముకుందునకు నానందమొదింప
శంబరాంతకు మూలశక్తియో యనఁగఁ
బంబినరాగసంభ్రమచిత్త యగుచు
జాంబవతీదేవి చందనంబలఁద ;
కంబుకంఠలు మదిఁగరము సంతసము
నలి సత్యభామయు నాగ్నజిత్తియును
సలలితంబైన వింజామర లిడఁగఁ; 340
కెంగేలఁగేలును గీలించి భద్ర
యంగుళాగ్రములొత్తి యందంద తివియ ;
లాలితమంగళాలాపంబులొలయఁ

[1] ఒకపాదమున్నది.

గేళిమై నింతులు కెలఁకులఁ గొలువ ;
మండితకోటీరమణికాంతి నిగుడ
కుండలరుచులు చెక్కుల నవ్వులొలయఁ ;
చెనకికౌస్తుభమణి శ్రీవత్సరుచుల
వనమాల యురమున వాసనఁ జూప ;
ఆయత శంఖచక్రాది చిహ్నములఁ
గేయూరకంకణాంకితబాహు లొలయ ;
హాటకరుచిరచేలాంచలద్యుతులఁ
బాటిల్లి బాలాతపస్ఫూర్తి నిగుడ ,
తెల్లదామెరమీఁది తేఁటి చందమున
నల్లనిమేను నున్నతశయ్యఁ జేర్చి
[1]సుదతులతోఁగూడి సుఖగోష్ఠి నున్న
యారూఢయావను నంభోజనయను
నారాయణుని సచ్చిదానందుఁగాంచి
మఱుఁగున నిలుచుండి మహతి మీటుటయు ;
నెఱిఁగి దిగ్గన లేచి యెదురేఁగి మ్రొక్కి-
యమ్మునిఁ దోతెంచి యర్ఘ్యఁ బూజించి
క్రమ్మన నెమ్మోముఁ గనుఁగొని పలికె.
"ఓమునీశ్వరచంద్ర ! యోగీంద్రవంద్య !
నేఁడు మేనీకు ? నీశిష్యులు సుఖులె ?
మామీఁదకృపఁ గల్గి మమ్ము మన్నించి
యేమి విచ్చేసితి రెఱిఁగింపు" మనిన
నల్లననవ్వుచు హరి కేలు పాణి
పల్లవంబులఁ బట్టి పలికె నమ్మౌని.

---
[1] ఒకపాదమున్నది.

“ ఆదినారాయణ ! అఖిలాండనిలయ !
వేదాంగవాహన ! విశ్వప్రకాశ !
విశ్వంభరాంబర ! విశ్వంభరాఖ్య !
విశ్వాత్మ ! నిత్య ! సువిజ్ఞానరూప !
నీపేరు భవదుఃఖనీరధితేప !
నీపాదములఁ బుట్టె నిఖిలతీర్థములు
తీర్థపూతుఁడవీవ తీర్థంబు నీవ
తీర్థఫలంబిచ్చు దేవుఁడ వీవ
నీరజభవుఁడును నీతత్వమెఱుఁగ
నేరఁడు నన్నుఁబోఁటి నేర్చునే కృష్ణ !
నిన్నుఁజూడఁగలేని నీరసాత్మకులఁ
గన్నులు కన్నులే కమలాభిరామ ! 3(
జలజాక్ష ! నీపాదజలజాతయుగముఁ
దలఁపనేరని దుష్టతముల నేమందు !
తప్పక నీమూర్తి దర్శించి మ్రొక్కి
యిప్పుడే పనివింటి నిందిరారమణ !
కన్నులఁ జల్లగాఁ గనుఁగొంటి మంటి
నెన్నిచందంబుల నేకృతార్థుఁడను !”
అనిపల్కి కృష్ణున కందంద మ్రొక్కి
చనియె నారదుఁ డొండు సదనంబు లోని

—: శ్రీకృష్ణలీలలు :—

కక్కడ హరి యుద్ధవాచార్యుల తోడ
నక్కజంబుగ జూడమాడగఁ జూచి
యతనిచేఁ బూజితుఁడై వెరె యొక్క

సతియింటి కరుగుచో శస్త్రాస్త్రలీల
లభ్యసింపుచునున్న హరిఁగాంచి మ్రొక్కి
యభ్యుదయంబని యటవోయి చూడఁ
జిన్నిపాపల బొమ్మపెండ్లిండ్లు సేయు
చున్న వెన్నునిఁగాంచి యుల్లంబులోన
సంతసిల్లుచునుండి మంత్రులుఁదానుఁ
దగుకార్య మూహింప దైత్యారిచేత
నగణితంబుగఁ బూజలంది యావలని
యటపోయి చూచుచో నశ్వరత్నంబుఁ
జటులత నెక్కి బజ్జళ్లఁ ద్రొక్కించు ;
మరియొక్క యింటిలో మగువలు దాను
నరమి దాఁగలి మూఁత లాడంగఁజూచి
యాదట నొకయింట నమలధేనువులు
భూదేవులకు ధారఁబోయఁగఁ జూచి ;
మొండొక్కయింటిలో వెన్నుఁడు సతులు
కుండలీనృత్యంబుఁ గోరి యీక్షింపఁ
గనుఁగొనె, నాయింట కజ్జాలు పంచి
పెనుపార సతులకుఁ బెట్టంగఁజూచె ;
ఇద్ధసన్నాధిభూయిష్ఠుఁడై యొక్క
శుద్ధాంతమున నుండఁజూచి యిబ్బంగి
వెరవార పదియాఱువేవుర యిండ్ల
పరిపరివిధములఁ బంకజోదరుఁడు
కోరి క్రీడింపఁ గన్గొని దేవమౌని
శౌరిసత్యజ్ఞానసంపదలాత్మ
నచ్చెరువందుచు హరిఁబ్రస్తుతించి

యిచ్చ నెంతయుమెచ్చి యిట్లని పలికె.
“సర్వభూతాత్మక! సతతంబు మెలఁగు
సర్వజ్ఞుఁడవు నీవు సకలలోకేశ!
మానుషతను బొంది మహనీయ యిట్టి
జ్ఞానాధికుఁడౌట చర్చింప నరుదు!
యోగమాయారూఢి నొనరిన నిన్ను
యోగీంద్రులును గాన నోపరు కృష్ణ!
ఏయుగంబులయందు నెవ్వరు మున్ను
నాయంత నెఱుఁగరు నలినాక్ష నిన్ను!
నీతత్త్వరూపంబు నేఁడె పెక్కుగతులఁ
జేతోగతంబయ్యెఁ జెన్నార నాకు!
నొక్కఁడ వయ్యును నురుపుణ్యమూర్తి!
పెక్కురూపులుదాల్చి పెంపొందుచుండి;
గురుఁడును దండ్రియుఁ గోరి దైవంబుఁ
బరమాత్ముఁడవు పరబ్రహ్మంబు నీవ!”
అని ప్రదక్షిణపూర్వమై వచ్చి మ్రొక్కి
జననాథ! నవ్వుచుఁ జనియె నారదుఁడు
హరియుఁబదాఱువేలంగనాజనులు
మరిగి వర్తించిన మహనీయకథలు
చదివిన వ్రాసిన సద్భక్తి విన్న
మదిలోఁ దలచిన మనుజోత్తములకుఁ
గరమొప్ప ధర్మార్థకామమోక్షములు
దొరకును భవదుఃఖదోషంబు లణఁగు
నని చెప్పి శుకయోగి యప్పుణ్యచరిత
లనఘ! వెండియు వినుమని చెప్పదొడఁగె.

నారదు దోడ్కొల్పి నళినాక్షుఁడంత
నారులు దాను నున్నతకేళిసలుపఁ
గమలారి యామినీకన్యకఁ బ్రీతిఁ
గ్రమమొప్పఁ బెండ్లికి గానఁగుదేర

—: సాయంకాల వర్ణనము :—

చరమాద్రి యను కలశము నీటిలోన
గురువెట్టిన ఘుడియకుడుకయో యనఁగ !
పరపైన ద్విజవాక్యఫణతులు చెలఁగఁ
గరమొప్పఁ గ్రుంకె భాస్కరమండలంబు;
ఎఱసంజ యడరి కెంపెక్కె నంబరము ;
తఱితఱిఁ బొడఁజూపెఁ దార లందంద,
ఆలోన సకలదిశాక్రాంత మగుచు
మేలైన కృష్ణుని మేచాయఁ బోలె
నెఱినొప్పఁ గాళింది నీరంబువోలె
తఱచైన తేఁటుల దాఁటుల వోలె
పెనుపైన నీలాలపేరులు వోలె
ఘనమైన యేనుఁగ కదుపులు వోలె
నలినొప్పు నీలోత్పలంబులు వోలెఁ
బాలుపైన కస్తూరి ప్రోగులు వోలెఁ
దోలుకారుకాంతులు తుఱుములు వోలెఁ
దలమీరి చీఁకటి దట్టమై పేర్చి
ఘనతమోవారణగర్వంబులణపఁ
గొనకొన్న సింగంపు కొదమకో యనఁగ
రాకావధూమణి రాఁగిల్లి చూచు

ప్రాకట రత్నదర్పణమకో యనఁగ
శార్వరీసతిముఖజలజమో యనఁగఁ
బూర్వపర్వతముపైఁ బొడమెఁ జందురుఁడు ;
తఱిమి దిక్పతుల దంతపుకరాటమున
నెఱయఁ గర్పూరంబె నించిన మాడ్కి
పరపైన బ్రహ్మాండభాండంబు నిండి
కరమొప్పు విలసిల్లె కౌముదీలక్ష్మి ;
అంతట పీడితులై చకోరములు
వింతనైఁ బఱతెంచె వెన్నెలఁ గ్రోల;
వెరవారఁ గృష్ణుఁడు వెన్నెలబైటఁ
దరుణులు దానును దగ వినోదించి
నందఱి యిండ్లను నమరు పాన్పులను
నందఱఁ గ్రీడించె నన్నిరూపములఁ
దెఱవలుఁ దారు మోదిలి యుండిరంతఁ
దఱుచుగా నెలుగించెఁ దామ్రచూడములు. 410

—: శ్రీకృష్ణుఁడు మేల్కని ప్రాతఃకాల కృత్యములఁ దీర్చుకొనుట :—

వందిమాగధ భాగవత నినాదములఁ
గ్రందున శౌరి మేల్కని ధర్మచింతఁ
దలపోయుచును లేచి తల్పంబు డిగ్గి
కలధౌతమయపాదుకలఁ బ్రేమఁ దొడిగి
యువిదలు కైదండలొసఁగి తోనడువ
రవణించు కనకవజ్రపు బిందియలను
జలకములాడి వస్త్రములు మైఁదాల్చి

సలలితంబుగఁ దీర్చి సంధ్యాకృత్యములు.
ఎసగంగ నుదయాచలేంద్రంబు మహాళి
పసిఁడి కోహళియన భానుఁడు పొడువఁ
గలకొన కర్పూరగంధ వాసనల
నలరెడి విరులచే నతిభక్తితోడ
దేవార్చనంబు భూదేవార్చనంబు
దైవపైతృకములు తెఱఁగొప్పఁ జేసి
తిలభూహిరణ్మయధేను దానముల
సలలితంబుగ విప్రసంఘంబుఁ దనిపి
కోరి విద్వజ్జన గోష్ఠి నాలించి
యారూఢగతిని తత్వార్థంబుఁ దెలిసి
యంబరాభరణమాల్యానులేపములు
తాంబూలములు నిచ్చి తగ వీడుకొల్పి
దివ్యమాల్యంబులు దివ్యగంధములు
దివ్యభూషణములు దివ్యాంబరములు
ధరియించి తగ నాజ్యదర్పణద్యుతులు
పరికించి మోసాల బయలికేతెంచి
పటహకాహళశంఖపాటకారావ
పటుతరాశీర్వాదభద్రనాదములు
తరమిడి మ్రోయ నందకశంఖచక్ర
వరగదాశార్ఙ్గదుర్వారశస్త్రములు
పురుషరూపముఁ దాల్చి పొరిడన్నుఁ గొలువ
కరుణాకటాక్షవీక్షణరోచు లోలయు

నల్లన నవ్వుచు నఖిలబాంధవులఁ
జల్లని చూపుల శౌరి వీక్షింపఁ
దేరాయతము సేసి తెచ్చి మ్రొక్కుటయు
దారకుఁ గని నవ్వి తగ రథంబెక్కి
పసిఁడిబ్రద్దఁ బూని పడవాళ్లు మ్రోయ
నెసఁగ సందడి జడియించి శౌ నడువ
నగరి సుధర్మాఖ్యయగు సభాస్థలిని
కరమొప్పు ముత్యాల గద్దియ మీఁద
వీరాసనస్థుఁడై విష్ణుఁ డొప్పారె.
చేరి రసజ్ఞులు సేవకోత్తములు 48
నగణిత నీతివిద్యావిశారదులుఁ
దగ మంత్రి సామంత దండనాయకులు
నల్లుఁడు కొడుకులు నఖిలబాంధవులు
నెల్లసంపదలతో నేపారి కొలువ
అందంద కరకంకణారావ మెలయ
చందనగంధులు చామరల్ వీవఁ
గొలువెల్లఁ దామరకొలను చందమున
నలరి సేవింపఁగ నధికమోదమున
నగ్రజుఁడును దాను నమ్మురారాతి
యుగ్రసేనునిఁ గొల్చియున్న యావేళ
దౌవారికులచేతఁ దగఁ జెప్పి పనిచి
యావాసుదేవుని యనుమతిఁ బడసి
చనుదెంచె నొక్కఁ డాజలజాత నేత్రుఁ
గని మ్రొక్కి పలికె నక్కటికంబుదోఁప.

—: రాజులచేఁ బంపఁబడిన దూత శ్రీకృష్ణుని
యెదుట మొఱపెట్టుట :—

"జగతి భారముమాన్ప శత్రుల నడప
నగణితంబగు సాధులగు వారిఁ బ్రోవ
యాదవాన్వయమున నవతార మొంది
తాదినారాయణ! అమరేంద్ర వంద్య!
మగధ భూపాలుఁడు మది నోట లేక
జగతీశ్వరుల నెల్లఁ జంపుచున్నాఁడు! 440
వెఱవేది యిరువుర వేవుర నృపులఁ
జెఱఁబెట్టి మదిఁ గృపచింత వోవిడిచి
తరమిడి దిన మొక్క ధరణీశవరునిఁ
బొరివుచ్చి భైరవపూజఁ గావించు.
అతనికి లోఁబడ్డ యవనీశు లెందుఁ
గతిలేక యున్న మీకడకుఁ బుత్తేర
నరుదెంచినాఁడ నీ వా జరాసంధుఁ
బరిమార్చి నృపకోటి ప్రాణంబు లెత్తు
మేవిధంబున నైన నీ బారిఁ గడవ
నీ వెకాకొక్కండు నేర్చునే కృష్ణ?
ఇది నీకు విక్రమం బిది నీకుఁ బెంపు!
ఇది నీకు శౌర్యంబు యిందిరాధీశ!
కీర్తియు సుకృతంబు గెలుపు నీకబ్బు!
ఆర్తుల రక్షింపు మంభోజనయన!"

—: నారదుని యాగమనము :—

అని దూత వినుతింప నంత నారదుఁడు

చను దెంచె దివినుండి శౌరిసన్నిధికి.
అమ్ముని కెదురేఁగి యర్ఘ్యపీఠమున
నిమ్ముల నిలిపి మోమీక్షించి పలికె.
"మునినాథ! త్రిభువనంబుల వార్తలెల్ల
ఘనదివ్యదృష్టిని గననివి లేవు!
ఏమి విశేషంబు లెఱిఁగింపు" మనిన:
ఆముని నవ్వుచు హరిఁ జూచి పలికె.
"నీమహత్త్వంబున నిఖిలంబుఁగాంతు
నీమాయకడఁగాన నేరకున్నాఁడ!
కోరి నీ మేనత్తకొడుకు ధర్మజుఁడు
సూరివంద్యుఁడు రాజసూయాధ్వరంబుఁ
జేయనుద్యోగించి చెచ్చెర నిన్ను
శ్రీయుక్తి నాచార్యుఁ జేయనున్నాఁడు!
ఆమఘంబీక్షింప నఖిలదేవతలు
భూమీశ్వరులు వేడ్కఁ బోవుచున్నారు
నీరజాయతనేత్ర నీవువిచ్చేసి
బోరున రిపుకోటిఁ బొరిమార్చు వేగ
నచ్చట. శిశుపాలుఁ డడరి నీచేతఁ
జచ్చు నీపయనంబు సమకూర్పవలయు;
పోరి జరాసంధుఁ బొరిమార్ప నెట్టి
వీరున కెందును వెరవుగాదెందు!
అతఁడు భీమునిచేత నట మల్లయుద్ధ
హతుఁడౌను యన్యుల కతఁడ జేయుండు.
భీమునిచేతను బెరపెట్టి చంపు
నే మీకు నెఱిఁగింప నే తెంచినాఁడ

—: నారదుని మాటలను విని శ్రీకృష్ణుఁడుద్ధవాచార్యుని యభిప్రాయమునడుగుట :—

బని విని యదనం"చుఁ బద్మాక్షు వీడు
కొని నారదుఁడు బోవ గోవిందు డంత
నయ్యుద్ధవునిఁ జూచి యంతరంగమున
నెయ్యంబు లియ్యంబు నెరయ నిట్లనియె.
" నీతియు ధర్మంబు నేర్పును హితవుఁ
జాతుర్యమును గల సత్యసంధుఁడవు;
కడఁకతోఁ గార్యంబుఁ గనుచోట మాకుఁ
గడునొప్పు మీరలె కన్నులు బుద్ధి"
యనుటయు నుద్ధవుఁ డంబుజోదరునిఁ
గనుఁగొని నమ్రుఁడై కడునొప్పఁ బలికె.
" ఇందిరాధీశ! నీ వెఱుఁగని కృత్య
మెందును గలదె నన్నిలఁ బెద్దఁ జేసి
మన్నించి యడిగెద మార్గంబుఁ దెలియ
విన్నవించెద నర్థి విను"మని పలికె.
" పరమబంధుఁడు నీకు పాండవాగ్రజుఁడు
సురుచిరంబుగ రాజసూయంబు సేయఁ
దలఁచినయట్టి యధ్వరకృత్యమునకుఁ
గలఁకువ లేకుండఁ గాచి రక్షింపు!
ప్రాణంబుతోడ జరాసంధుఁడుండ
స్థాణునకును గావ శక్యంబు గాదు!
వాని నేగతినైన వధియింపకున్న
పూను జన్నంబు సంపూర్ణంబు గాదు.
ఘనబలాఢ్యుఁడు గాన కదనంబులోనఁ

జనకి యెవ్వనికి నిర్జింపఁగా నరిది
యనిలజార్జునులతో నాపురి కేఁగి
చని విప్రవరులయాచందమై వేఁడి
మల్లయుద్ధంబున మరి భీముచేత
నెల్లభంగుల వాని నేపడగింపు
మాతఁడు దీరిన నఖిలరాజులకుఁ
"బ్రీతియౌ పగదీరుఁ బెంపొందు నీకుఁ
దగ జరాసంధుచేతను బద్ధులైన
జగతీశ్వరులఁ బ్రోవఁ జనుటయే లెస్స".

—: శ్రీకృష్ణుని ఇంద్రప్రస్థ ప్రయాణము :—

అని యుద్ధవుండిటు లాడువాక్యములు
విని సంతసము నొంది వెన్నుఁ డాప్రొద్దె
యానకదుందుభి హాలపాణి యుగ్ర
సేనాదులనుమతి సేయంగఁ గదలి
భూతలాధీశులు పుత్తెంచినట్టి
దూతకభీష్ట వస్తువులిచ్చి యనిపి
పటుసైన్య మేఘ పుష్పక బలాహకాది
చటులవాజులఁ బూని సన్నద్ధలీల
గరుడకేతనకాంతిఁ గడునొప్పు తేరు
గురుతరంబుగ దారకుఁడు దెచ్చి ద్రొక్క-
నారోహణము సేసి యఖిలబాంధవులుఁ
దోరంపు వేడుకతోఁ గొల్చి రాఁగఁ;
జెలువారు కాంచన శిబిరంబు లెక్క-
యెలమి పట్టపుదేవు లెనమండ్రు నడువ;

[1]వలనొప్ప పటహాదివాద్యంబు లొలయ
వందిబృందములు కైవారంబు సేయ
సందడి పడవాళ్లు జడిసి తోనడువ
నతివైభవముల నిత్యప్రయాణములఁ
జతురతఁ బెక్కు దేశములుత్తరించి
జలజాతనేత్రుఁడు సకలసంపదలఁ
బొలుచునింద్రప్రస్థపురము కేతెంచె.

—: ధర్మజాదులు శ్రీకృష్ణుని సమ్మానించుట :—

అమ్మహాత్మునిరాక యరసి ధర్మజుఁడు
తమ్ములుఁ దాను బాంధవులతో నెదురు.
వచ్చి నమ్రుండైన వసుదేవతనయు
గ్రుచ్చికౌఁగిటఁ జేర్చె; గోవిందుఁ డంత
ననిలనందను భీము నక్కునఁ జేర్చి
తనకు మ్రొక్కిన మాద్రి తనయుల నరుని
ననువార నాలింగనము సేసి వార
లండఱుఁ గొల్చిరా సమరేంద్రులీలఁ
జెంది యప్పురిఁ బ్రవేసించె మురారి.
పౌరుల కన్నులపండువ గాఁగ
భూరిపుణ్యుఁడు పాండవుల నగరికి
నరిగి కుంతికి మ్రొక్క నమ్మహాదేవి
కరమొప్పఁ గృష్ణుని గౌఁగిటఁ జేర్చి
యానందర[2]ముబ్బి యలుగులుఁ బారఁ

---

1 ఒకే పాదమున్నది. 2 ఒకేపాదమున్నది.

బూని యందఱుఁ బ్రేమఁ బూజించి కుంతి
పాంచాలసుతయు సుభద్రయుఁ గృష్ణుఁ
గాంచి సాష్టాంగంబు కరమర్థి నెఱఁగి
హరి కాంతలును దాను నన్యోన్యప్రేమఁ
బరిరంభణముల సంభావన క్రియల
సలిపి యింపార మజ్జనభోజనములఁ
గలసి క్రీడించిరి; కమలాక్షుఁడంత
నాపాండవుల సేమమంతయు నడిగి
యాపార్థు గృహమున కరుగ నన్నరుఁడు
మజ్జనభోజన మహిత సౌఖ్యముల
నజ్జగన్నాథుని నతిభక్తిఁ దనిపి
హంస తూలిక పాన్పునందు సంప్రీతిఁ
గంసారి నునిచి కాల్గడనుండి క్రీడ
నడుగు లొత్తుచు నుచితాలాప లీలఁ
గడఁగి వినోదింపగా ధర్మసుతుఁడు
చనుదెంచుటయు శౌరి చయ్యన లేచి
తనర నానృపు కరస్థలిబట్టి తివియ
నేక శయ్యను వారలిరువురు నుండఁ
జేకొని తమ్ములు సేవించియుండ
“నారగించితే కృష్ణ!” అలసితీ వనుచు

—: ధర్మరాజు రాజసూయయాగ విషయమై శ్రీకృష్ణుని
యెదుట ప్రస్తావించుట :—

శౌరితోడ నజాతశత్రుఁ డిట్లనియె.
లోకబాంధవ చంద్రలోచన! భక్త

లోకరక్షణ! సితశ్లోక! లోకేశ!
నీ వెఱుఁగని యవి నిఖిలంబు లందు
లేవెల్ల యెడల నిర్లేపుండ వీవ
వినము నీ కెఱిఁగించు విన్నప మొకటి.
అనఘాత్మ! రాజసూయము పేరి క్రతువు
సేయుదు నని మదిఁ జింతించినాఁడ
నేయుపాయంబున నిదిసిద్ధి బొందు
నానతిమ్మనుఁడు నా యమతనూభవుని
యాసనంబీక్షించి హరి ప్రీతిఁ బలికె.

—: శ్రీకృష్ణుఁడు రాజసూయయాగము నాచరింప వలసినదిగా ధర్మపుత్రుని ప్రోత్సహించుట :—

కౌరవవృషభ! లోకము రాజులకును
యేరీతి సిద్ధింప దీమహాక్రతువు
ధరణీశ! నీవు నీ తమ్ములు బలిమి
దొరకని కార్య మెందును గలదయ్య?
పితృదేవ సద్విజప్రీతి గావింపు
టతిశయమగుపుణ్య మయ్యధ్వరంబు!
రాజులఁ గెలిచి వారల ధనావళుల
రాజసంబునఁ దెచ్చి రాజసూయంబు
వెలయింపవలయు దిగ్విజయంబు సేయఁ
దలఁచిన వేగ నీ తమ్ములఁ బంపు''
మని చెప్పుటయు విని యమనందనుండు
ననుజుల దిగ్విజయార్థంబు వనుపఁ

—: పాండవులు దిగ్విజయ యాత్రకై వెడలుట :—

జటుల బలాఢ్యుఁడై సహదేవుఁ డెలమి
యట దక్షిణంబున కరిగె పెంపొంది;
నకులుఁడుదగ్రసైన్యము తన్ను గొలువఁ
బ్రకటితంబుగ నేఁగెఁ బడమటి కడకు;
ఘనబలోపేతుఁడై కదలి యర్జునుఁడు
ధనదు దిక్కునకు నుద్ధతవృత్తి నడచె;
సేమంబుతోడుత నెఱిఁ బూర్వదిశకు
భీమబలాఢ్యుఁడై భీముఁడుఁ గదలె;
నీభంగిఁ జని దిక్కులెల్ల సాధించి
యూభీలరణకేళి నహితుల నోర్చి
కరిహయమాణిక్యఘన నిష్కములును
వరరత్నభూషణావలు లొప్పఁ దెచ్చి
ధర్మనందనునకుఁ దగ వేఱువేఱ
నర్మిలి నొప్పించి యనుజు లిట్లనిరి.
"జననాథ! విను జరాసంధుఁడు దక్క
మన కరి వెట్టని మహిపుఁడు లేడు
వాని నిర్జింప కధ్వరకృత్యమునకుఁ
బూనఁగఁ దలఁచుట బుద్ధిగాదెందు."
అని పల్క సర్వేశుఁడగు ధర్మసుతునిఁ
గనుఁగొని బోధించి కంసారి పలికె.

—: శ్రీకృష్ణుఁడు జరాసంధుని మాయించెదనని చెప్పుట :—

"జననాథ! నీ భుజశ్రయశక్తి దలఁప
ననయ జరాసంధుఁ డెంతటి వాఁడు?

మల్లయుద్ధంబున మారుతి చేత
నెల్లుండి చంపింతు నిటు జూడు మమ్ము
బనుపుము నీకింత భయమంద నేల?"
అనిపల్కి భీముఁడు నర్జునుఁ డెలమి
తనుఁగొల్చి రాగ నుద్ధత గిరివ్రజము

—: శ్రీకృష్ణుఁడు భీమార్జునులతో బ్రాహ్మణ వేషములను ధరించి గిరివ్రజము ప్రవేశించుట :—

దనర బ్రాహ్మణ వేషధారులై చొచ్చి 580
యరులకభేద్యుఁడై యలరు మాగధుని
వర మందిరమున కవారణ నరిగి
దేవగురుద్విజ తృప్తిఁ గావించు
సావధానుని జరాసంధునిఁ గాంచి
వామనరూపమై వచ్చి యబ్బలిని
భూమి వేఁడినయట్టి బుద్ధులప్రోగు
యనిలజార్జునులతో నర్థి దీవించి
చనవున నాజరాసంధుతో ననియె.

—: శ్రీకృష్ణుఁడు జరాసంధుని యుద్ధభిక్ష వేఁడుట :—

"అనఘాత్మ! యీలాంటి కథితులు మేము
చనుదెంచినారము సకలవస్తువులు
నడిగిన లేదన కర్థుల కిచ్చు
కడుపుణ్యనిధివి మాగధరాజతనయ!
ఏమిగోరిన యర్థ మిచ్చి నిచ్చలును
భూమిలోఁ బొగడొంది బొంక వెన్నఁడును!

ఘనకపోతమునకై కండలు గోసి
తనువిచ్చి శిబి ధాత్రి ధన్యుఁడు గాఁడె!
మును హరిశ్చంద్రుండు మొగి కౌశికునకుఁ
దనరార పుత్రుసిఁ దగ విక్రయించి
చండాలరూపమై శౌర్యంబుఁ గ్రాఁగి
యుండి తాఁబొందఁడే యూర్ధ్వలోకంబు!
ఒక కపోతము తొల్లి యొక కిరాతునకుఁ
బ్రకటమై తనమేను భక్ష్యంబుఁ జేసి
యెట్టి పుణ్యులకైన నెన్నఁగ రాని
యట్టి లోకము గాంచె నని చెప్ప వినవె!
పడుచును కనకంబుఁ బ్రాయంబు నమ్మి
యడిగిన లేదని యర్థి వర్గంబు
నెడపిన పాపాత్ములిందును నందుఁ
జెడిపోవుదురనుచుఁ జెప్పిన నతఁడు
వారి తేజంబులు వారి సత్వములు
వారి మేనుల రణవ్రణాకిణంబులును
గని మహీనాథులుగా నిశ్చయించి
యనియె వారలతోడ నల్లన నగుచు,
“ భూపాలకులు మీకుఁ బుదుడేది! విప్ర
రూపంబు లొంది మా ప్రోలికి వచ్చి
యడుగుచున్నారు మీ రక్షితులుగారు!
అడుగుఁడు ప్రాణంబులైన మీకిత్తు!
విప్రవేషముఁ దాల్చి వేఁడుట చేత
విప్రోత్తముఁడ స్వయం విష్ణుఁడ నీవ
యని పలుకఁగ శౌరి యతని తెంపునకు

మనములోపల మెచ్చి మగధున కనిరె.
"అనఘ! యుద్ధార్థులమై వచ్చినార
మెనయఁ గృష్ణుండ నేనితఁడు వాయుజుఁడు
వాఁడు కవ్వడి మాకు ద్వందయుద్ధంబు
పోఁడిగా నిమ్మన్న" పొంగి మాగధుఁడు!
"అగుఁగాక మీకోరినట్ల యుద్ధంబుఁ
దగ నిచ్చినాఁడ యుద్ధతఁ జేర్చి రండు
గోపాల! నీవోడి కురుకుమారకుల
వైపునఁ దెచ్చితి! పడుచాల తరమె!
పసదప్పి నీవోడి పారిన నేల
కసువు మొల్వదు నేఁడు! కాన నీతోడ
సమరంబు సేయుట సమయంబు గాదు
కమలాక్ష! నాకీడుగాఁ డర్జునుండు
మల్లయుద్ధంబున మారుతాత్మజుని
ద్రుళ్లడంచెద! మీరు తొలఁగఁగఁ జూడఁ

—: భీమజరాసంధుల మల్లయుద్ధము :—

డనిపల్కి సన్నద్ధుఁడై యూరు వెడలి
చని యొక్కయెడ సమస్థలముఁ గావించి
మారుతాత్మజుఁడును మగధభూపతియు
నీరసంబున డాసి యేపార నంత;
నంతకాకారులై యత్యుగ్ర భద్ర
దంతావళంబులు దగ్గఱు మాడ్కి
పటుతర నిర్ఘాతపాతంబులట్ల
చటులతమై మల్లచఱచి యొండొరులఁ

బట్టుచు విడుచుచు బాహుపాశములఁ
జుట్టి విజ్ఞానముల్ చూపి యార్చుచును
సరియగు సవ్యాపసవ్య మార్గములఁ
దర[illegible]ండి గదిసిమై తాఁకి వైచుచును
గడిం కొమ్మంటులు గ్రమ్మంగఁ జెట్టు
కడఁగి క్రేయుచుఁ జేత గదిమి తప్పుచును
నాశీవిషంబుల ననువున మ్రోసి
యాశుగమును బోలి యందంద వ్రేయ
ముఖమున డగ్గరి ముష్టిఘాతముల
పటుతాడనంబులు పటుశక్తిఁ జూపి
భీముని మగధుండు పిడికిటఁ బొడువ
నామారుతాత్మజుఁడ చలుఁడై నిలిచి
మోకాలఁ గొని గుండె మోవంగఁ బొడువ
వీఁకరి మగధభూవిభుఁడుర్వి వ్రాలె!
క్రమ్మన లేచి భీకర ముష్టి హతుల
సమ్మారుతాత్మజు నందంద నొంప
తఱలక నాతఁడాతని జత్రు దేశ
మఱిమఱి పొడిచిన యంగంబు వడఁక
పడిపడి నిల్చి యాపవమానసుతుఁడు
నడుముఁ బీడించి విజ్ఞానంబు గొనఁగ
జాడించి యిరువురు సమసత్వ లీల
వీడాడి నొప్పింప వెన్నుఁడు గాంచి!

—: జరాసంధవధ :—

వాయుపుత్రుఁడు జూచువగ వృక్షశాఖఁ

చేయార్చి రెండుగాఁ జీరి నవ్వుటయు
నాసన్న దెలిచి మహాబలాత్మజుఁడు
ఆసన్నుఁడగు శత్రు నంటంగఁ బట్టి
పడవైచి కడకాలుఁ బరుసనఁ ద్రొక్కి
వెడవెడ నార్చుచుఁ బ్రిదిలి పోనీక
నటమున్ను జరచేత నంటఁగాఁబడిన
చటులాత్ముఁడగు జరాసంధుని మేను
తరమిడి కదళికాస్తంభంబుఁ జీరు
కరిఁబోలె నుగ్రభీకర లీలఁ జీరి
యిరువ్రక్కలుగఁ జేసి యిరువంక వైచి
పరువడి నార్చిన పవమానసుతుని
హరియును నర్జునుఁ డండంద పొగడ
సురసమూహము ప్రీతిఁ జూచి కీర్తించె.

—: శ్రీకృష్ణుఁడు జరాసంధుని కుమారుఁడగు సహదేవుని రాజ్యమందునిచి, కారాగృహవాసులగు రాజులను విడిచి పుచ్చుట :—

హరియు జరాసంధియగు సహదేవుఁ
బరగ మగధరాజ్య పట్టంబుఁ గట్టి ; 580
యఱిముఱిఁ జరసాలయందున్న నృపుల
వెఱవాపి యందఱ విడిచి పుత్తెంచె.
కారాగృహంబునఁ గడుమాసి సొచ్చి
క్రూర బాధలఁ గంది కుందుచునున్న
యిరువదివేవురు నెచమన్నాటూళ్వ
రురుచయు భ్రాంతులై యొండొండ వెడలి
చనుదెంచి కనిరి వాసవలోకవంద్యు

ననుపముదివ్యభూషాంబరాభరణు
భీమార్జునసమేతుఁ బృథుదీర్ఘబాహు
కామితార్థప్రదుఁ గడు భక్తి మ్రొక్కి ;
"శ్రీనాథ! గోవింద! శ్రీవత్సచిహ్న!
దానవాంతక! కృష్ణ! తామరసాక్ష!
ధారుణి రక్షింప ధర్మంబు నిలుపఁ
గ్రూరదైత్యులఁ ద్రుంపఁ గోరి జన్మించి
యాజనార్దనుఁడ వీవామ్నాయరూప!
ఈజరాసంధుచే నీ బాధ నొంది
నునికియు నిది మహాదుపకారమయ్యె!
ఘనయోగవర్యులు గానఁగ లేని
నినుఁజూడఁ గంటిమి నిఖిలాండ నిలయ!
తలఁపులుఁ దనువులు దయనిచ్చితీవు
జలజాక్ష! ఇది పునర్జన్మంబు మాకు!
ఖలు జరాసంధు నొక్కట జీరివైచి
బలియుఁడై పేర్చినీ బకవైరి లావు!"
అని దీనవదనులై యర్థి కీర్తించు
జననాయకులఁ గృపాజలరాశిఁ దేల్చి
జలజాక్షుఁడంత మజ్జనభోజనముల
నలరించి భూషాంబరాదు లర్పించి
వారల నూరార్చి వలనొప్పఁ బలికె.
"క్రూరాత్ము వరసాలఁ గుంది లోఁగంది
ముచ్చట నున్నారు; మొగిరాజ్య లీల

---

[1] ఒకేపాదమున్నది.

లచ్చుగ భోగించుఁ డరుగుడు వేడ్క
మదమత్సరంబులు మాని యే ప్రొద్దు
మదిలోన నన్ను నేమఱకుండుఁ" డనుచు
రాజుల ననిచి జరాసంధి చేతఁ
బూజలు గొని రథంబులు వేడ్క నెక్కి
యనిలజార్జునులతో నతివైభవమున
దనుజారి వచ్చె నింద్రప్రస్థపురికి.

—: శ్రీకృష్ణుఁడు భీమార్జునులతో నింద్రప్రస్థ పురికి మఱలి వచ్చుట :—

వచ్చి యాపట్టణద్వారంబు నందు
సచ్చరిత్రుఁడు పాంచజన్యమొత్తుటయు 600
నారవమాలించి యరుదెంచి పౌరు
లారూఢమగు మహా హర్షంబుతోడఁ
గామాది రహితు నిష్కాము శ్రీకృష్ణు
రామానుజన్ముఁ బురాణ పూరుషునిఁ
గని మ్రొక్కి సంతోష కలితులై రంత;
అనుజులు కృష్ణుఁడు నరుదెంచి మ్రొక్క
పరమసమ్మదమునఁ బాండవాగ్రజుఁడు
కరమర్థి మువ్వురఁ గౌఁగిటఁ జేర్చి
హరిమోముఁ గని ముదితాత్ముఁడై పలికె
పురుషోత్తమాచ్యుత! పుండరీకాక్ష!
వరద! వామన! భక్తవత్సల! కృష్ణ!
సరసిజాసనవంద్య! సారసనేత్ర!
నీదాసులగు మాకు నిఖిలలోకముల

వేదసాధ్యములగు నిందిరాధీశ!
మఱఁదులు నీవు నమ్మాగధేశు మీఁద
యఱిముఱి నేఁగిన నంతనుండియును
విలసిల్లు నురిగోల వేదనఁ బొందు
పులుగు చందంబునఁ బొరలు చుండితిమి!
చెచ్చెర శత్రునిర్జించి మీరిందు
వచ్చిన ప్రాణంబు వచ్చె గోవింద!"
అని పల్కుటయు పాండవాగ్రజుఁ జూచి
వినయంబుఁ దోఁప నవ్విష్ణుఁ డిట్లనియె.
"నీయాజ్ఞ తలమోచి నెగడిన మాకు
నాయెడ జయలబ్ధులగు టెందు నరుదె?
మూఁడులోకములకు ముల్లైన యట్టి
వాఁడు మగధభూమి వల్లభు నట్టె
వాని నశ్రమమున వధియించె భీముఁ
డేను నాసత్వము నేమనఁ గలను!
బెడిదంపు పగదీరెఁ బెంపొంద నీవుఁ
దోడరి యజాతశత్రుఁడవైతి గాన

—: శ్రీకృష్ణుని ప్రోత్సాహముచే ధర్మరాజు రాజసూయ మునకు గడంగుట :—

రాజుల రక్షింప రాజసూయంబు
నోజముఁ దప్పక నొనరింపు మనిన
హరి వాక్యములకుబ్బి యమసుతనూభవుఁడు
కురుపతి ముఖ్యులఁ గోరి రప్పించి
భాగీరథీతీర పావనస్థలిని

యాగశాలలు గట్టి యఖిల వస్తువులు
సమకూర్చి వ్యాసాది సంయమీశ్వరులఁ
గ్రమ్మ మొప్పు ఋత్విజగణము రావించి
యాగోపకరణంబు లన్నియుఁ దెచ్చి
యాగమోక్తక్రియ నన్ని సంధించి
దక్షుల నియమించి ధర్మనందనుఁడు
దీక్షితుఁడై మహాద్విజకోటితోడ
వేలుచుచుండఁగ విష్ణుఁడంతటికిఁ
జాలి భూసురవర్యసమితితో నిలువ
తమ్ములు సకలబాంధవులును దారుఁ
గ్రమ్మర పరిచర్యఁ గావింపుచుండ
హవ్యభాగమునకు నఖిల దేవతలు
దివ్యయానములతో దివినుండి కూడ

—: యుధిష్ఠిరుఁడు శ్రీకృష్ణున కగ్రపూజ నొసంగుట :

నయ్యుధిష్ఠిరుఁడు ధౌమ్యాదులఁ గూడి
చయ్యన నగ్రపూజలు సేయఁగోరి
యంతట రాజుల నర్థి నీక్షించి
"ఇందెవ్వరికి నర్ఘ్య మిత్తునో" యనఁగ
సహదేవుఁ డన్నకు జలజాక్షుఁ జూపి
"విహితమాయర్ఘ్యంబు విష్ణున కిమ్ము
ద్విజుఁడును గురుఁడు ఋత్విజుఁడును భూమి
భుజుఁడు దైవంబునై పొలుపారు నతఁడు!
అతనిఁ బూజించిన నఖిల దేవతలు
పితరులు మునులు సంప్రీతిగావింతు

ర’’ నవ్వుండు ప్రియమంది యమతనూభవుఁడు
ఘనభక్తి హరికి నర్ఘ్యము సమర్పించె.
బహురత్న భూషణాంబర గంధపుష్ప
విహితభంగుల మంత్ర విధిఁ బూజ సేయ
మునులు రాజులు మనంబుల సంతసిల్ల
ననిమిషావళి వచ్చి యభినుతి సేయ
నాలోన శిశుపాలుఁ డంతయుఁ జూచి
కాలాహిగతి మ్రోసి కరతలంబెత్తి
యొండొండ రోషాగ్ని లోలుకుచుండఁగను
పాండవాగ్రజుఁ జూచి పలికె నుద్వృత్తి

—: శిశుపాలుఁడు శ్రీకృష్ణుని నిందించుట :—

“ కటకటా! ధర్మజ! కడుచిన్నపాపఁ
డిటుజెప్ప నీబుద్ధి యేల నిట్లయ్యె ?
గోపాలకుని జాలికుని సత్వహీను
బాపాత్ముఁబశుకర్ముఁ బరదారగమను
నేమని పూజించి తిండటె నడుమ ?
ఏమటివాఁడు వీఁడీ యర్ఘ్యమునకు
బలపరాక్రముల భూపతుల సన్మనుల
తలవంపు సేయఁగఁ దగునయ్యనీకు ?
ఎఱుగక కూర్మి నీవిచ్చిననైన
తఱిలేచి యర్ఘ్యంబు తానెట్లుగొనియె ?
పూజనీయులగు నీ పురుషులలోన
నేజాతిగలవాఁడు! ఇటుపెద్ద సేయ!”

—: ధర్మరాజు శిశుపాలునకు సమాధాన మిచ్చుట —

అనిపల్కుటయు విని యంతకాత్మజుఁడు
" వినవోయి ! శిశుపాల ! వెఱ్ఱివి గాక
హరికి సమానుఁడు నధికుఁడు గలఁడె?
ఇరవుఁదప్పినమాట నేటికాడెదవు?
యజ్ఞరక్షకుఁడును యజ్ఞభోక్తయును
యజ్ఞఫలంబిచ్చు నతఁడును దానె !
అతని తేజోంశంబు లఖిలదేవతలు
నతని గాదన నీకు నర్హమే యిట్లు ?"
అనిపల్క సభ్యులు నతనిఁ గీర్తించి
కనుఁగొని శిశుపాలుఁ గలుషించి రంత.

—: శిశుపాలవధ :—

ఆమాటలకు దైత్యుఁడాత్మసైన్యంబు
తోమహోగ్రదంబుతోఁ బన్నినిలుచె !
కురుబలంబుల నాఁగఁగొనక వేగదిసి
పరవశంబొనరింప పంపజోదరుఁడు
వారల వారించి జ్వాలనార్చులొలయు
దారుణ చక్రముద్ధతిఁ బ్రయోగింప
నాదిత్యమండలాయతతీవ్రముగుచుఁ
జేదిభూపతి శిరచ్ఛేదంబు సేసె.
ఆహారవంబులు నమరసన్నుతులు
నోహోబలంబుల నులిపు పెల్లడర
నాతని తేజోంశ మండలుఁ జూడ
నాతతంబుగ వచ్చి హరిఁ జొనఁగలసె !

మనులు ఋత్విజులును మురవైరి లావుఁ
గొనియాడి మెచ్చిరి గురుభక్తి నంత
రాజసూయంబుఁ బూర్ణము సేసి ధర్మ
రాజు, పెంపున భగీరథు సుతయందు
నవభృతస్నాతుఁడై యరుదెంచి రాజ
నివహంబుఁ బూజించి నెరవడిఁ గొలిపి
[1] వరదక్షిణాల విప్రవరకోటిఁ దనిపి
యావిభవంబున నఖిలబంధులకు
వావిరి నుత్తమ వస్తువు లొసఁగి
యనుప! సుయోధనుఁడా పట్టణమున
నినుపారఁ గొన్ని నెలలు వర్తించి
యాసంపదల పెంపు నయ్యధ్వరంబు
నాసభావిభవంబు నాగౌరవంబుఁ
బాంచాలిరూపసౌభాగ్యసంపదలుఁ
గాంచి నిర్విణ్ణుఁడై కడుచిన్నపోయి
యమ్మహీపతి పేర్మి యంతరంగమునఁ
గ్రమ్మర దనవీటి కరిగె రారాజు. 660
పౌరిఁ బాండవుల చేతఁ బూజలు వడసి
హరి ద్వారవతి కేఁగె నతివలుఁ దాను.
అని చెప్పటయు కౌరవాధినాయకుఁడు
వినుతుఁడై శుకయోగి విభున కిట్లనియె
వరమునీశ్వర! నీదు వాక్యామృతంబు
గురుభక్తి నేనెంతఁ గ్రోలిననైన

---

[1] ఒకేపాదమున్నది.

తనివొందు చిత్తమాద్దైత్యారి మహిమ
వినుపింపు మటుమీఁది వృత్తాంత మనుఁడు
అమ్మహాయోగీంద్రుఁ డమ్మహాత్మునకుఁ
గ్రమ్మన నప్పుణ్య కథఁ జెప్పఁదొడఁగె.
ఇవియాదిగాఁ బెక్కు లిందిరావిభుఁడు
వివిధవినోదియై విహరింపుచుండె.
మఱియును గృష్ణుఁడు మహనీయగతుల
తెఱవలఁ గూడి వర్తించెఁ బెంపార ;
బహురత్నచిత్రితభర్మ్యహర్మ్యముల
విహరించె సతతము వెలఁదులు దాను ;
వరపుష్పతానేక వనముల యందు
మరియును బెక్కైన మదనతంత్రములఁ
దనిపి యాయింతుల ధన్యులఁ జేసె.
అనియిట్లు విష్ణుని యవతారకథలు
వినుపించు ఘనులకు విన్నపుణ్యులకు
విని మెచ్చియీఁగల వివరమంతులకు
ఘనదోషహరమును గైవల్యసుఖము
ఘనులు యోగీంద్రులు గమనింపలేని
హరిభక్తిఁ గల్గును నరయంగ నిదియ
వెరఁగున మది గల్గు విమలాత్ములకును
అనియిట్లు నిత్యధర్మారంభు పేర
జనలోకనవపారిజాతంబు పేరఁ
జతురకళాపూర్ణచంద్రుని పేర
నతులవైభవ నిర్జరాధీశు పేర
శోభితనవరూపనూనాస్త్రు పేర

నొభళమంత్రి కందామాత్యుపేరఁ
గోరిభరద్వాజగోత్రసంజాతుఁ
ఢారూఢమతి నయ్యలార్యనందనుఁడు
శృంగారరసకళాశ్రితవచోధనుఁడు
సింగనామాత్యుఁడు చెలువగ్గలించి
సలలితరసభావశబ్దగుంభనల
వలనొప్పు శ్రీభాగవతపురాణమున
మహదాదియగు దశనుస్కంధసరణి
విహితలీలలనొప్పు విష్ణుచారిత్రఁ 680
ప్రాకట జగదభిరక్షకాండంబు
నాకల్ప మాకల్ప మగుభంగిఁ జెప్పె.

జగదభిరక్షకాండము సమాప్తము.

శ్రీకృష్ణార్పణమస్తు.

తప్పొప్పుల పట్టిక

పంక్తి.	తప్పు.	ఒప్పు.
8	రాజ్ఞన	రాజ్ఞైన
11	సివి	నీవు
15	విరచుట	విఱుచుట
19	జలనన	జలన
19	చాపమో	శైలమో
23	మేరూ	మేరు
9	వేఁగ	వేగ
19	మఱియును	మరియును.
3	వృంత	వృతం
19	రండండనొలుక	రండండ రొయులుక
25	బెదిదంపు	బెడిదంపు
25	జెఱికి	బెఱికి
8	నండండఁజూడ	నండండ చూడ
22	సౌఖ్వా	సౌఖ్యా
9	నండండఁగాంచి	నండండ కాంచి
5	కృష్ణుల	కృష్ణుల
1	గొచను	గొనుచు
3	విజ్ఞానుదున	విజ్ఞానువున
3	పోరులు	పౌరులు

పుట.	పంక్తి.	తప్పు.	ఒప్పు.
27	7	బాండవుల	బాంధవుల
27	19	దసము	దనము
43	10	అర్హా	అరుహా
44	11	సందండఁ జేర్చి	సండండ చేర్చి
57	7	బెద్ద కాలుము	బెద్ద కాలము
67	2	శిఖ	శిఖ
112	17	నెఱుఁగింపు	నెఱేఁగింపు
114	16	దమను	దమనుని
115	22	యందండ	సందండ
125	23	యక్కటికముతో	యక్కటికము తోడ
135	22	సయ్యంతి	నయ్యింతి
138	4	యనిరుద్దుఁ	యనిరుద్ధుఁ
138	5	తెప్పకఁజూచి	తప్పక చూచి
138	9	కలయుల్ల	కలయొల్ల
139	9	మంచము	తల్పము
161	16	కులంబునుఁగూలు	కులంబులు గూలి పోవు.
163	20	త్రైలోన్య	త్రైలోక్య
163	23	చద్రుఁడు	చంద్రుఁడు.
164	8	నెఱేఁగించి	నెఱింగించి
164	9	యనుదెంచె	యరుదెంచె.
169	17	పుత్తెంచె	పుత్త్రెంచె.
171	8	నఱికె	నఱికె
171	15	కుండలరత్య	కుండలరత్న

పుట.	పంక్తి.	తప్పు.	ఒప్పు.
175	21	చరిత్రంబు	చరితంబు
177	6	చూచుఁబోరి	చూచుచుఁ బోరి
183	12	నెలుగఁక	నెలుంగక
189	12	మూఁత	మ్రూఁత
189	15	మొుండొక్క	వెండొక్క
190	5	జ్ఞానాధికుఁడౌట	జ్ఞానాధికుండౌట
190	21	తలఁచిన	తలంచిన
194	5	బ్రద్దఁబూని	బ్రద్దలఁబూని
198	22	గొల్చిరాఁగ	గొల్చి వేరాఁగ
199	19	నగరికి	నగరికిని
207	8	స్థంభఁబు	స్తంభంబు
211	3	గ్రమ్మమొప్ప	గ్రమమొప్ప
213	6	రక్షకుఁడును	రక్షకుండును
213	10	సభ్యలు	సభ్యులు
213	16	పంపజోదరుఁడు	పంకజోదరుఁడు
214	11	నినుపారఁగొని	నినుపారగాఁగొన్ని
216	6	శ్రీధాగవత	శ్రీభాగవత